
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 8-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 114 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: చవితి రా. 12.37 తదుపరి పంచమి; నక్షత్రం: ఉత్తర రా. 11.37 తదుపరి హస్త; వర్జ్యం: శేషం ఉ. 6.25; దుర్ముహూర్తం: ఉ. 10.13-11.04, మ. 3.18-4.08; అమృతఘడియలు: మ. 3.26-5.15; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 6.41 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రైలు వేగం గంటకు 1000 కి.మీ.

విజయవంతంగా పరీక్షించిన చైనా

అయస్కాంత శక్తితో నడిచే మాగ్లెవ్ రైలు

పట్టాలను తాకకుండా గాల్లో తేలుతూ పరుగు

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో మాగ్లెవ్ టెక్నాలజీని అభివృద్ధి చేసిన డ్రాగన్

2

100 గ్రాములు పతకం దూరం

ఫైనల్ బౌట్‌కు ముందు వినేశ్ ఫొగట్‌పై అనర్హత వేటు



నిర్ణీత బరువు 50 కిలోలకన్నా 100 గ్రాములు ఎక్కువున్నట్లు నిర్ధారణ

నిబంధనల ప్రకారమే పోటీ నుంచి తప్పించారన్న వరల్డ్ రెజ్లింగ్ చీఫ్

స్పందించిన మోదీ.. ఐవోఏ ఎదుట నిరసన తెలపాలని పీటీ ఉషకు సూచన

వినేశ్.. చాంపియన్లలో చాంపియన్‌వి.. దేశమంతా నీవెంటే: ప్రధాని ట్వీట్

సాంకేతిక కారణాలతో పోటీ నుంచి తప్పించడం దురదృష్టకరం: రాహుల్

12 గంటల్లో బరువు తగ్గించడానికి చేయాల్సిందంతా చేశాం: జట్టు వైద్యుడు

వినేశ్ అనర్హతకు గురవడం బాధించింది: బ్రిజ్‌భూషణ్ కుమారుడు కరణ్

పూర్తి విచారణ జరగాలి.. పార్లమెంటు ఉభయసభల్లో విపక్షాల పట్టు

కోచ్‌లు, న్యూట్రిషనిస్ట్, సహాయ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమా?

మంగళవారం ప్రీక్వార్టర్స్‌కు ముందు 49.9 కిలోలున్న ఫొగాట్

అదే రోజు 3 బౌట్లు అయ్యాక ఆమెకు స్వల్పంగా ఆహారం, నీళ్లు

గంటల్లోనే 52.8 కిలోలకు చేరిక.. తగ్గేందుకు రాత్రంతా కసరత్తులు

స్కిప్పింగ్, జాగింగ్, జుత్తు, జెర్సీ కొంతమేర కత్తిరింపు

ఆఖరికి కొంతమేర రక్తమూ తీసివేత.. అయినా తప్పని నిరాశ



నిర్ణీత బరువుకన్నా 50 గ్రాములు, 100 గ్రాముల బరువు అధికంగా ఉన్నా కూడా రెజ్లర్లను గతంలో కొన్ని టోర్నీల్లో అనుమతించారు. ఒలింపిక్స్‌లో నిబంధనలు వేరు. పారిస్ ఒలింపిక్స్‌లో వినేశ్‌కు ఇలా జరిగిందని అభిమానులు నిరాశ చెందొద్దు. ఏదో ఒకరోజు ఆమె కచ్చితంగా పతకం సాధిస్తుంది. తదుపరి ఒలింపిక్స్ కోసం ఆమెను సన్నద్ధం చేస్తా.

- వినేశ్ ఫొగాట్ పెదనాన్న, దిగ్గజ రెజ్లర్ మహావీర్ ఫొగాట్

న్యూఢిల్లీ, ఆగస్టు 7: పారిస్ ఒలింపిక్స్‌లో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ 'ఫైనల్ బౌట్' ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన భారత అభిమానుల గుండెపగిలింది. ఆమెకు స్వర్ణపతకం.. లేకపోతే రజతం ఖాయమని సంబరపడుతున్న వేళ షాక్ తగిలింది. వినేశ్‌పై ఫైనల్ బౌట్ ముంగిట అనర్హత వేటు పడింది. యాభై కిలోల విభాగంలో బరిలోకి దిగిన ఆమె, 50 కిలోలకు మించి 100 గ్రాముల బరువున్నట్లు గుర్తించారు. ఆ వెంటనే.. ఒలింపిక్ కమిటీ ఓ ప్రకటన చేసింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ నిబంధనల మేరకు వినేశ్‌పై అనర్హత వేటు వేస్తున్నట్లు ప్రకటించింది. ఫలితంగా ఆమె ఫైనల్ బౌట్‌లోకి దిగే అవకాశమే లేకుండా పోయింది. వినేశ్‌పై అనర్హత వేటు విషయం తెలిసిన వెంటనే

మిగతా 2వ పేజీలో...

జగన్ అక్రమాస్తుల కేసులో..

ఏమిటీ కాలయాపన?



సుప్రీం ధర్మాసనం అసహనం



డిశ్చార్జ్ పిటిషన్లకు, ట్రయల్‌కు సంబంధం లేదు

మేమూ అనేక వ్యాజ్యాలు విచారించి డిశ్చార్జ్ చేస్తున్నాం

సీబీఐ అఫిడవిట్‌లో విషయమేమీ లేదు

మా మార్గదర్శకాల ప్రకారం ట్రయల్ సాగాలి

సత్వర విచారణకు ఇప్పటికే ఆదేశాలిచ్చాం: ధర్మాసనం

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసుల్లో అసలు విచారణ ప్రారంభం కాకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్ల ఎత్తుగడ సుప్రీంకోర్టులో చిత్తయింది. డిశ్చార్జి పిటిషన్లకూ, అసలు కేసుల విచారణకూ మధ్య సంబంధం లేదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. కేసుల సత్వర విచారణకు ఇదివరకే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని.. కొత్తగా మళ్లీ ఆదేశించాల్సిన అవసరం లేదని తెలిపింది. విచారణలో ఎందుకు జాప్యం జరుగుతోందో తమకు తెలియడంలేదని పేర్కొంది. అదే సమయంలో... జగన్ అక్రమాస్తుల కేసులో సీబీఐ అఫిడవిట్‌లో పొందుపరచిన అంశాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని సుప్రీంకోర్టు పేర్కొంది. ట్రయల్‌కు డిశ్చార్జ్ పిటిషన్లు అడ్డంకి కానేకాదని స్పష్టం చేసింది. సర్వోన్నత న్యాయస్థానం గతంలో ఇచ్చిన

మిగతా 12వ పేజీలో...

జగన్‌కు 'జెడ్ ప్లస్' భద్రత కల్పిస్తున్నాం

బుల్లెట్ ప్రూఫ్ వాహనానికి కొత్త స్పేర్స్ అమరుస్తాం

అప్పటివరకు మరో బుల్లెట్ ప్రూఫ్ వాహనం ఏర్పాటు

హైకోర్టుకు నివేదించిన ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్

కౌంటర్ దాఖలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశం

విచారణ మూడు వారాలకు వాయిదా

12



మళ్లీ పాపులర్ బ్రాండ్లు!

మద్యం కంపెనీలకు ప్రభుత్వ ఆహ్వానం

ఇకపై ఎలాంటి ఒత్తిళ్లు ఉండబోవు..

పాత విధానంలో వ్యాపారానికి భరోసా

ఆదాయాన్ని కొంత వదులుకొని అయినా అన్ని బ్రాండ్ల ధరలు తగ్గించే యోచన

సరిహద్దు రాష్ట్రాల్లో కంటే కొంత తక్కువకే..

అక్టోబరు 1 నాటికి కొత్త మద్యం పాలసీ

'వైసీపీ' బ్రాండ్లకు చెక్ పెట్టే వ్యూహం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో కనుమరుగైన పాపులర్ మద్యం బ్రాండ్లను పూర్తిస్థాయిలో తిరిగి ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. వైసీపీ పెద్దల కమీషన్లకు ససేమిరా అన్న కంపెనీలను మళ్లీ రాష్ట్రానికి ఆహ్వానిస్తోంది. ఇకపై ఎలాంటి ఒత్తిళ్లు ఉండబోవని, పాత విధానంలో వ్యాపారం చేసుకోవచ్చని వాటికి భరోసా ఇచ్చింది. జగన్ ప్రభుత్వంలో తీసుకొచ్చిన అనామక బ్రాండ్లతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్న విషయం వెలుగులోకి రావడంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించని మద్యాన్ని మాత్రమే రాష్ట్రంలో విక్రయించేలా పక్కా ప్రణాళికను

మిగతా 3వ పేజీలో...

చుక్కల భూములకు చెక్

చీకటి దందా తేలేదాకా '22ఏ' భూముల రిజిస్ట్రేషన్లు బంద్



విజయవాడలో చేనేత స్టాల్‌లో చీరలను చూస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం

గ్రామాలవారీగా రెవెన్యూ సభలు

అక్కడే ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ.. 3 నెలల్లో పరిశీలన

డిప్యూటీ కలెక్టర్ల నేతృత్వంలో విచారణ కమిటీలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నిషేధ జాబితా 22ఏ నుంచి తొలగించిన భూముల రిజిస్ట్రేషన్‌పై టీడీపీ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జగన్ సర్కారు హయాంలో అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా నిషేధ జాబితా నుంచి భూములను తొలగించి చేసుకున్న రిజిస్ట్రేషన్ల వ్యవహారం తేల్చేదాకా 22ఏ భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని మంత్రివర్గం బుధవారం తీర్మానించింది. గత ఐదేళ్లలో జరిగిన రిజిస్ట్రేషన్లపైనా విచారణ జరపాలని

మిగతా 11వ పేజీలో...

'జగన్' రాళ్లు, బొమ్మలు బంద్

ప్రభుత్వ ముద్ర, క్యూఆర్ కోడ్‌తో కొత్త పాస్‌పుస్తకాలు

స్థానిక సంస్థల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

మావోయిస్టులపై నిషేధం పొడిగింపు

కొత్త మెడికల్ కాలేజీల్లో పోస్టుల పెంపు

మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసే జీవో 217 రద్దు

రాష్ట్ర కేబినెట్ నిర్ణయాలు.. మంత్రి పార్థసారథి వెల్లడి

నేతన్నలకు అండగా ఉంటాం

ఆదాయం పెంచుతాం.. మగ్గాలకు చేయూత: బాబు

సబ్సిడీల పునరుద్ధరణ.. చేనేతపై జీఎస్టీ రద్దుకు కృషి

12

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రూ.22.95 కోట్ల వ్యయంతో జారీ చేసిన 21.86 లక్షల భూహక్కు సర్వే పత్రాల స్థానంలో ప్రభుత్వ ముద్ర, క్యూఆర్ కోడ్‌తో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. అలాగే ప్రజాధనం దుర్వినియోగం చేసి కొన్ని రూ.వందల కోట్ల ఖర్చుతో నాటి సీఎం జగన్ 77 లక్షల సర్వే రాళ్లపై తన ఫొటోలు వేసుకున్నారు. వాటిని పూర్తిగా ఆపాలని మంత్రివర్గం

మిగతా 11వ పేజీలో...

టీచర్లు, డాక్టర్లకు బదిలీల్లేవ్!

ప్రజా సంబంధ శాఖల్లో త్వరలో బదిలీలు

ఏపీలో నిశ్శబ్ద విప్లవం.. బంగ్లాలో హింసాత్మకం

ఎమ్మెల్యేలు అత్యంత జాగ్రత్తగా ఉండాలి

నియంతృత్వ వైఖరితో వ్యవహరించవద్దు

కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు

మత్స్యకార జీవోలు 217, 144 రద్దు

11



12

జోగి రమేశ్‌ను అదుపులోకి తీసుకోవాలి

ముందస్తు బెయిల్‌కు అనర్హుడు

బాబు ఇంటిపై దాడి వెనుక కుట్ర

ఏం జరిగిందో తేలాలంటే విచారించాల్సిందే

హైకోర్టులో పోలీసుల తరఫున సిద్ధార్థ్ లూథ్రా, పోసాని వాదనలు

దురుద్దేశంతోనే కేసు

జోగి తరఫు న్యాయవాది

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధానిగా

నేడు యూనస్ ప్రమాణం

ఢాకాలో బీఎన్‌పీ భారీ ర్యాలీ

హింసను వీడాలని ఖలీదా పిలుపు

ప్రజలనుద్దేశించి ప్రసంగించిన యూనస్

అవామీ లీగ్ లేకుండా ఎన్నికలు జరగవు..

కార్యకర్తలకు హసీనా కుమారుడి భరోసా

బంగ్లాలో హిందువుల మీద దాడులపై కేంద్రం రంగంలోకి దిగాలి!: జగ్గీ వాసుదేవ్

సనాతన ధర్మ పరిరక్షణకు పోరాడాలి: యోగి

హిందువులపై దాడిని ఖండించిన బంగ్లాదేశ్‌లోని 31 సామాజిక సంస్థలు

భయంలో 40వేల మంది తెలుగు సంతతి ప్రజలు

స్వేచ్ఛ అందరిది.. కొందరిది కాదు

'ఆంధ్రజ్యోతి'తో తెలుగు మూలాలున్న బంగ్లా విద్యార్థి నాయకుడు మిఖా పిరెగు



ఢాకాలో బీఎన్‌పీ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

ఢాకా, ఆగస్టు 7: బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధానిగా మహమ్మద్ యూనస్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఆర్మీ చీఫ్ వకార్-ఉజ్-జమా వెల్లడించారు. గురువారం రాత్రి బంగ్లాదేశ్ కాలమానం ప్రకారం 8 గంటలకు యూనస్ ప్రమాణ స్వీకారం ఉంటుందని పేర్కొన్నారు. తాత్కాలిక ప్రభుత్వంలో 15 మంది

మిగతా 2వ పేజీలో...

బంగ్లా.. ఓ గుణపాఠం!

భారత్‌లో కూడా జరగవచ్చు: సల్మాన్ ఖుర్షీద్

నిరంకుశత్వాలు ఎంతోకాలం కొనసాగవు: మెహబూబా

ప్రజలే సుప్రీం.. వారి ఓపికను పరీక్షించవద్దు: ఉద్ధవ్

ఖుర్షీద్‌పై బీజేపీ ధ్వజం



హోంమంత్రి అనితతో సమావేశమైన సునీత

నా తండ్రి కేసులో న్యాయం చేయండి

నిందితులను గత ప్రభుత్వం కాపాడింది.. అరెస్టు కాకుండా తప్పించుకునేలా చేసింది

సీబీఐకి పోలీసులూ సహకరించలేదు.. నాటి అధికారులపై కఠిన చర్యలు తీసుకోండి

హోం మంత్రి అనితకు వివేకా కుమార్తె సునీత విన్నపం.. సాయానికి మంత్రి హామీ

12

బుధవారం విజయవాడ డిపోలో ప్రారంభించిన కొత్త బస్సులు



ఆర్టీసీకి 400 కొత్త బస్సులు

12

త్వరలో మరో వెయ్యి.. రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి

గ్రేటర్ విశాఖలో

వైసీపీకి షాక్

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి క్లీన్‌స్వీప్

వైసీపీకి పూర్తి మెజారిటీ ఉన్నా అభ్యర్థులు ధమాల్

3

నోటిఫికేషన్ తర్వాత 11 మంది కార్పొరేటర్లు జంప్

పోలింగ్ ముందురోజు క్యాంపునకు మరో నలుగురు డుమ్మా

మిగిలినవారూ క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని నేతల ధ్వజం

విద్యార్థుల సంఖ్యను బట్టే

ఉపాధ్యాయులు



98 మంది పిల్లలు లేకపోతే రెండు గ్రూపులుగా విభజన

1, 2 తరగతులు ఒక గ్రూపు.. 3 నుంచి 8 వరకూ మరొకటి

11 నాటికి ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి

11

పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ

భయంలో 40 వేల మంది తెలుగు సంతతి ప్రజలు



బంగ్లాదేశ్‌లో తెలుగు సంతతి ప్రజలు


(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

బంగ్లాదేశ్‌లో తెలుగు సంతతి ప్రజలు ఉన్నారనే సంగతి మీకు తెలుసా ? బంగ్లా పౌరుల్లో తెలుగు రాష్ట్రాల్లో కుటుంబ మూలాలున్న వారు 40 వేల మంది వరకు ఉన్నారు. దేశంలోని అల్పసంఖ్యాకవర్గాల్లోనూ అత్యంత స్వల్ప జనాభా కలిగిన వర్గంగా ఏళ్లుగా అక్కడే ఉంటున్నారు. తెలుగులో మాట్లాడటమే కాకుండా.. తెలుగు పండుగలను చేసుకుంటూ, సంస్కృతిని కాపాడుకుంటున్నారు. అంతేనా, ఓ తెలుగు పాఠశాలను కూడా నిర్వహించుకుంటున్నారు. బంగ్లాదేశ్ పౌరులైన ఈ తెలుగు సంతతి ప్రజలు ప్రస్తుతం భయాందోళనలో ఉన్నారు. దేశంలో శరవేగంగా మారుతున్న పరిస్థితులతో ఏ క్షణం ఏం జరుగుతుందని భయం భయంగా గడుపుతున్నారు. భారతదేశంలో బ్రిటీష్ పాలన సమయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు చెందిన చాలా మంది ఢాకా వచ్చారు. వీళ్లలో సింహభాగం దళితులు కాగా ఢాకాలో పారిశుధ్య పనులు, రైల్వే స్టేషన్లు, తేయాకు తోటల్లో కార్మికులుగా పని చేసేవారు. క్రమంగా వీరి కుటుంబాలు బంగ్లాదేశ్‌లో స్థిరపడిపోయినా నేటి తరం వారు తెలుగు మూలాలను మరచిపోలేదు. ప్రస్తుతం ఢాకా శివారులోని ధల్పూర్, తికతులీ, గోపిబాగ్ మరియు కళ్యాణ్ పూర్ ప్రాంతాల్లో వీళ్లంతా నివసిస్తున్నారు. వీళ్లలో చాలా మంది నేటికి పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారు. మరుగుదొడ్లు శుభ్రం చేసే మెహెతర్ వృత్తిలో తెలుగు సంతతి ప్రజలే అధికంగా ఉన్నారు. అల్పసంఖ్యాక వర్గంగా బంగ్లాలో ఉన్న వీరంతా ఒకప్పుడు తమ హక్కుల కోసం ఢాకాలో పోరాటం చేశారు. కానీ నేడు దేశంలో నెలకొన్న పరిస్థితులతో ఆత్మరక్షణలో పడ్డారు.

సమన్యాయం కోసమే పోరాటం: మిఖా

దేశ ప్రజలందరికీ సమన్యాయం జరగాలనే షేక్ హసీనాకు వ్యతిరేకంగా పోరాటం చేశామని బంగ్లాదేశ్ స్టూడెంట్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు, జహంగీర్ వర్సిటీ విద్యార్థి సంఘం నేత, తెలుగు సంతతికి చెందిన మిఖా పిరెగు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. మత ఛాందసవాదులను తీసుకొచ్చి దేశాన్ని కొందరి కోసం చేయడానికి మాత్రం కాదని తెలిపారు. స్వేచ్ఛ అందరిదీ అని కొందరిది మాత్రమే కాదని మిఖా పేర్కొన్నారు. హసీనా పలాయనం తర్వాత దేశంలో హిందూ ఆలయాలు, ఆస్తుల పరిరక్షణలో విద్యార్థి సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మిఖా చెప్పారు. గతంలో తెలుగు సంతతి ప్రజలు నివసిస్తున్న ధల్పూర్‌లోని ఔట్పాల్ కాలనీ విస్తరణలో భాగంగా పునరావాసం కోసం జరిగిన పోరాటంలో మిఖాతో పాటు బంగాలోని హక్కుల సంఘాలన్నీ ప్రశ్నించడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

లోకం తీరు



బంగ్లా.. ఓ గుణపాఠం!

- కేంద్రాన్ని హెచ్చరించిన ఇండియా కూటమి నేతలు
- భారత్‌లో కూడా జరగవచ్చు: సల్మాన్ ఖుర్షీద్
- నిరంకుశత్వాలు ఎంతోకాలం కొనసాగవు: మెహబూబా

న్యూఢిల్లీ, శ్రీనగర్, ఆగస్టు 7: పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను ఒక హెచ్చరికలాగా తీసుకోవాలని, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తొలగించేలా చర్యలు చేపట్టాలని కేంద్రప్రభుత్వానికి ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు సూచించారు. విద్యావేత్త ముజిబుర్ రెహ్మాన్ రాసిన 'షిక్వా-ఎ-హింద్: భారతీయ ముస్లింల రాజకీయ భవిష్యత్తు' అనే పుస్తకం ఆవిష్కరణ సందర్భంగా బుధవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ ఈ అంశంపై స్పందించారు. 'బంగ్లాదేశ్‌లో జరుగుతున్నది ఇక్కడా జరగవచ్చు. అయితే, భౌగోళికంగా మన దేశం చాలా పెద్దది కాబట్టి.. బంగ్లాదేశ్‌లో జరిగినట్టుగా ఇక్కడ ప్రజల అసంతృప్తి ఒక్కసారిగా పెల్లుబికటం లేదు' అని పేర్కొన్నారు. ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ, ఢిల్లీలో సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా దీర్ఘకాలంపాటు జరిగిన షహీన్‌బాగ్ ఉద్యమాన్ని గుర్తు చేశారు. పార్లమెంటు నిస్తేజంగా మారినప్పుడు వీధులు చైతన్యంతో వెలుగొందుతాయన్నారు. బంగ్లాదేశ్ పరిణామాలను భారత్ ఒక గుణపాఠంలా తీసుకోవాలని.. నిరంకుశత్వాలు ఎక్కువకాలంపాటు కొనసాగవని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ చెప్పారు. బుధవారం మెహబూబా శ్రీనగర్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగాలు కల్పించకుండా, పెరుగుతున్న ధరలను అరికట్టకుండా యువతను నిరుత్సాహపరుస్తూ.. అణిచివేస్తుంటే ఇలాంటివే సంభవిస్తాయన్నారు. 'ప్రజా వ్యతిరేక విధానాలను, చట్టాలను తెస్తూ ఉంటే ప్రజలు విసిగిపోతారు. అటువంటప్పుడు షేక్ హసీనాలాగా పారిపోయే పరిస్థితి వస్తుంది. జమ్మూకశ్మీర్‌లో కూడా బంగ్లాదేశ్‌లో ఉన్నటువంటి పరిస్థితులే నెలకొని ఉన్నాయి' అని మెహబూబా ముఫ్తీ పేర్కొన్నారు. షేక్‌హసీనా పదవీచ్యుతి పరిణామాలు ప్రపంచానికే ఒక సందేశం ఇచ్చాయని, ప్రజలే సుప్రీం.. వారి సహనాన్ని పరీక్షించవద్దని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే హెచ్చరించారు. ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో ప్రజాకోర్టు తీర్పునిచ్చిందని.. శ్రీలంక, ఇజ్రాయెల్‌లో కూడా ఇటువంటి నిరసనలు సంభవించాయని, ఆయా దేశాల ప్రధానులు ఇల్లు దాటి బయటకు రాలేకపోయారని గుర్తు చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువుల మీద దాడులు జరుగుతున్న అంశాన్ని ప్రస్తావిస్తూ, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపానంటూ ప్రచారం చేసుకున్న మోదీ ఇప్పుడు బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడాలని ఉద్ధవ్ సూచించారు.

ఖండించిన బీజేపీ నేతలు

సల్మాన్ ఖుర్షీద్ వ్యాఖ్యలను బీజేపీ నేతలు ఖండించారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మధ్యప్రదేశ్‌లో మంత్రిగా ఉన్న కైలాశ్ విజయవర్గీయ మాట్లాడుతూ, 'ఇది మోదీ దేశం. భారత్. నిరాశతో కూడిన కొందరు నేతలు అరాచకత్వాన్ని వ్యాప్తి చేయాలని ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇది సిగ్గు చేటు. దీనిని ఖండించాలి. భారత్ శక్తిమంతమైన దేశం. దేశ నాయకుడు మోదీ అత్యంత శక్తిమంతమైన నేత. ఇక్కడ ఇటువంటి అరాచకత్వం కుదరదు' అని హెచ్చరించారు. పాకిస్థాన్‌కు ప్రతినిధుల్లా మాట్లాడుతున్న వారికి ఇప్పుడైనా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో పరిస్థితులేవిటో అర్థమై ఉండాలన్నారు. ఖుర్షీద్ వ్యాఖ్యలు దేశద్రోహం వంటివని బీజేపీకే చెందిన మరో నేత రాజీవ్ ప్రతాప్ రూడీ ఆరోపించారు. ఎన్నికల్లో గెలవలేని కాంగ్రెస్.. దేశంలో బంగ్లాదేశ్ వంటి పరిస్థితులు ఏర్పడాలని కోరుకుంటోందా? అని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా ప్రశ్నించారు.

అసదుద్దీన్ వర్సెస్ తృణమూల్ ఎంపీ జవహర్ సర్కార్

'షిక్వా-ఎ-హింద్: భారతీయ ముస్లింల రాజకీయ భవిష్యత్తు' పుస్తకావిష్కరణ సభలో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ, చట్టసభల్లో ముస్లింల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీయేతర ప్రభుత్వం ఉంటే పరిస్థితిలో తేడా ఉండేదా? అని ప్రశ్నించారు. సమాజంలో ఉన్న భావోద్వేగాల ఆధారంగానే హిందూ మతతత్వం పెరిగిపోయిందని వ్యాఖ్యానించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ జవహర్ సర్కార్.. తమ పార్టీలో పలువురు ముస్లిం ఎంపీలు ఉన్నారని, లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో ఎంఐఎం పోటీ చేసి ఉంటే అన్ని సీట్లూ బీజేపీకే వెళ్లి ఉండేవన్నారు. దీనికి అసదుద్దీన్ స్పందిస్తూ.. సమస్య మీ మానసిక ధోరణి.. అంతేగానీ నేను కాదు అని తిప్పికొట్టారు.

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రధానిగా

నేడు యూనస్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులుగా ఉంటారని, వారి నియామకంపై అన్ని రాజకీయ పార్టీల భేటీలో నిర్ణయం తీసుకుంటామన్నారు. బుధవారం ఆయన ఢాకాలోని ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మరోవైపు ఢాకాలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) భారీ ర్యాలీ నిర్వహించగా.. దేశంలో పరిస్థితులు ఇంకా కుదుటపడలేదు. కొన్నిచోట్ల హత్యలు, లూటీలు కొనసాగగా.. మరో నాలుగు జైళ్ల నుంచి ఖైదీల పరారీ ఘటనలు నమోదయ్యాయి. అధికారుల మార్పులు.. రాజీనామాలు బుధవారం కూడా కొనసాగాయి.

బీఎన్‌పీ భారీ ర్యాలీ


ఢాకాలోని నయాపల్టాన్‌లో బీఎన్‌పీ బుధవారం భారీ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో ప్రజలు, బీఎన్‌పీ నాయకులు, కార్యకర్తలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. బంగ్లాదేశ్ ప్రధాన న్యాయమూర్తి నివాసం మొదలు.. నయాపల్టాన్‌ను దాటుకుని.. ఆరాంబాగ్ వరకు రోడ్లన్నీ కిక్కిరిసిపోయేలా ప్రజలు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా బీఎన్‌పీ చైర్‌పర్సన్, మాజీ ప్రధాని ఖలీదాజియా వీడియో సందేశాన్నిచ్చారు. "చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నేను.. ఇప్పుడు మీ అందరితో మాట్లాడడం సంతోషంగా ఉంది. నేను జైలులో ఉన్నప్పుడు నా విడుదల కోసం పోరాడిన వారు.. నేను అనారోగ్యం నుంచి కోలుకోవాలని ప్రార్థనలు చేసినవారికి కృతజ్ఞతలు" అంటూ ఆమె తన సందేశాన్ని ప్రారంభించారు. విద్యార్థులు, ప్రజలు హింసను వీడాలని పిలుపునిచ్చారు. "విధ్వంసం, ప్రతీకారాన్ని వదిలి.. ప్రేమ, శాంతితో కూడిన సమాజాన్ని నిర్మించుకుందాం. ఈ పోరాటంలో అసువులుబాసిన వందల మంది అమరులకు నా నివాళులు. రక్తం ధారపోసిన యువత కలల సాకారానికి ప్రజాస్వామ్య బంగ్లాదేశ్‌ను నిర్మించాల్సిన అవసరం ఉంది" అని ఆమె వ్యాఖ్యానించారు.

మరో నాలుగు జైళ్ల నుంచి ఖైదీల పరార్!

సోమవారం అర్ధరాత్రి షేర్పూర్, సత్ఖిరా జైళ్లను ఆందోళనకారులు బద్ధలు కొట్టడంతో.. ఖైదీలు పారిపోయిన విషయం తెలిసిందే..! తాజాగా కుష్టియా జిల్లా జైలు మెయిన్‌గేట్‌ను బద్ధలు కొట్టిన 50 మంది ఖైదీలు.. పారిపోయారని అధికారులు చెప్పారు. గాజీపూర్‌లోని కాశీంపూర్ హైసెక్యూరిటీ జైలులో 209 మంది ఖైదీలు పరారయ్యారు. వీరు కొందరు గార్డులను బందీలుగా తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన జరిగినప్పుడు పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు ఖైదీలు మరణించారు. సిరాజ్‌గంజ్ జైలు నుంచి 150 మంది ఖైదీలు తప్పించుకున్నారని బంగ్లాదేశ్ పత్రికలు పేర్కొన్నాయి. అటు చిట్టాగాంగ్ జైలులోనూ ఇలాంటి ఘటనే జరిగిందని బుధవారం సాయంత్రం వరకు కూడా ఇక్కడ ఘర్షణలు జరిగాయని తెలిపాయి. ఈ ఘటనల నేపథ్యంలో దేశంలోని జైళ్లను సైన్యం తమ అధీనంలోకి తీసుకుంది. మరోవైపు దేశవ్యాప్తంగా పలు చోట్ల హింస, లూటీలు కొనసాగాయి. బుధవారం ఢాకాలో 34 మంది అవామీ కార్యకర్తల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. భారత్‌లో ఆశ్రయం పొందేందుకు వేల సంఖ్యలో మైనారిటీలు సరిహద్దుల్లో వేచిఉన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మరోవైపు.. హసీనా రాజీనామాకు దారి తీసిన కోటా ఉద్యమాన్ని విద్యార్థులే నడిపినా.. ఇప్పుడు వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కొన్ని విద్యార్థి సంఘాలు సంయుక్తంగా కలిసి.. సమన్వయకర్త నహీద్ ఇస్లాం నేతృత్వంలో నెలరోజుల పాటు ఉద్యమించాయి. అయితే.. బుధవారం తాజాగా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని వర్సిటీలు.. "విద్యార్థి సంఘాలు ఉండడానికి వీల్లేదు" అని ఆదేశాలు జారీ చేశాయి. దీంతో.. చిట్టాగాంగ్, ఢాకా సహా.. పలు వర్సిటీల విద్యార్థి సంఘాల నాయకులు తమ పదవులకు రాజీనామాలు చేశారు. అటు అధ్యాపక సంఘాలు కూడా ఇదేవిధంగా రాజీనామాల బాట పట్టాయి.



ఢాకాలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ కార్యకర్తలు



తప్పిదాలతో మన విజయాన్ని కోల్పోకూడదు: యూనస్

తాత్కాలిక ప్రభుత్వాధినేతగా నియమితులైన నోబెల్ గ్రహీత, ఆర్థికవేత్త మహమ్మద్ యూనస్ బంగ్లాదేశ్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. "బంగ్లాదేశ్‌కు ఇది రెండో విక్టరీ డే. ఈ ఘనతకు కారణమైన విద్యార్థులను, వారి ధైర్యాన్ని అభినందిస్తున్నాను. విద్యార్థుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలిపిన దేశ ప్రజలకు అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ విజయాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి. ఏమాత్రం తప్పిదాలు చేసినా.. మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. తప్పిదాల వల్ల మన విజయాన్ని కోల్పోకూడదు. ప్రస్తుత పరిస్థితుల్లో అంతా హింసను విడనాడి, విధ్వంసాలకు దూరంగా ఉండాలి. శాంతిని నెలకొల్పాలి" అని పిలుపునిచ్చారు. కాగా.. కార్మిక చట్టాల ఉల్లంఘన కింద యూనస్‌పై గతంలో నమోదైన కేసులను లేబర్‌కోర్టు కొట్టివేసిందని ఆయన తరఫు న్యాయవాది అబ్దుల్లా-అల్-మామూ వెల్లడించారు. ఫ్రాన్స్‌లో ఉన్న యూనస్ బుధవారం సాయంత్రం బంగ్లాదేశ్‌కు తిరిగివచ్చారు. కాగా, బంగ్లాదేశ్ చేరుకున్నాక మహమ్మద్ యూనస్ నేరుగా అధ్యక్షుడు షహబుద్దీన్‌ను కలిశారు. తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు గాను 31 మందితో కూడిన జాబితాను ఆయనకు అందజేశారు. కాగా.. ఇప్పటికే ఆర్మీ చీఫ్ వకార్.. మంత్రుల సంఖ్య 15గా ఉంటుందని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.! మరోవైపు బంగ్లాదేశ్ పరిణామాలపై పాకిస్థాన్ స్పందించింది. దేశప్రజల బలమైన స్ఫూర్తి, ఐక్యత ఆ దేశ సామరస్యపూర్వక భవిష్యత్‌కు దారితీస్తుందని విశ్వసిస్తున్నట్లు పాక్ విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

- హసీనా కుమారుడు

బంగ్లాదేశ్‌లో పరిస్థితులపై షేక్ హసీనా కుమారుడు సజీబ్ వాజిద్ జాయ్ బుధవారం ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "అవామీ లీగ్‌ను అంతం చేయడం ఎవరితరం కాదు. నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా నిలబడాలి. ప్రస్తుతం దేశంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దేశమంతటా విధ్వంసాలు, దోపిడీలు జరుగుతున్నాయి. అవామీ లీగ్ నేతలు, కార్యకర్తలను హతమారుస్తున్నారు. మైనారిటీలకు రక్షణ లేకుండా పోయింది. అవామీ లీగ్ అతి పురాతన, అతి పెద్ద ప్రజాస్వామ్య పార్టీ. అవామీ లీగ్ ఉనికి ఎప్పటికీ ఉంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. తమ కుటుంబం రాజకీయాల్లోకి రాబోదని ఇటీవల ప్రకటించిన ఆయన.. బంగబంధు కుటుంబం ఎక్కడికీ పోదని తాజా వీడియోలో కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. అవామీ లీగ్ లేకుండా బంగ్లాదేశ్‌లో ఎన్నికలు సాధ్యం కాదన్నారు.

హసీనా వెనక్కి రావాలి: అవామీ లీగ్

బంగ్లాదేశ్ క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, ఈ సమయంలో మాజీ ప్రధాని షేక్ హసీనా దేశానికి తిరిగి రావాలని అవామీ లీగ్ నాయకులు కోరారు. బుధవారం వారు గోపాల్‌గంజ్‌లోని తుంగిపారాలో ఉన్న బంగబంధు షేక్ ముజీబుర్ రెహ్మాన్ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలను పెట్టి, నివాళులర్పించారు.

బంగ్లాలో హిందువుల మీద దాడులపై కేంద్రం రంగంలోకి దిగాలి

ఈ దాడులు ఆ దేశ అంతర్గత వ్యవహారం కాదు: జగ్గీ వాసుదేవ్

న్యూఢిల్లీ, ఆగస్టు 7: బంగ్లాదేశ్ వ్యాప్తంగా హిందూ ఆలయాలు, హిందువుల దుకాణాలు, ఇళ్లపై దాడులు, లూటీలు జరిగినట్లుగా బంగ్లాదేశ్ వార్తాసంస్థలు వెల్లడించడం తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. హిందువుల ఇళ్లపై ముష్కరులు మారణాయుధలతో ఎగబడి హత్యలు, లూటీలకు పాల్పడ్డట్టు, దినాజ్‌పూర్‌లోని బోచాగంజ్‌లో హిందువులకు చెందిన 40 దుకాణాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌లోని కనీసం 27 జిల్లాల్లో హిందువుల ఆలయాలు, నివాసాల్లో అల్లరి మూకలు లూటీలకు పాల్పడినట్లు అక్కడి వార్తా సంస్థలు వెల్లడించాయి. ఈ పరిణామాలపై ఈశా ఫౌండేషన్ ఆధ్యాత్మిక నేత సద్గురు జగ్గీ వాసుదేవ్ ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు మద్దతుగా నిలవాలని, ఈ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. బంగ్లాలో హిందువుల పట్ల జరుగుతున్న అరాచకాలు ఆ దేశ అంతర్గత వ్యవహారం కోణంలో చూడటానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఒకప్పుడు మన దేశంలో భాగంగా ఉన్న బంగ్లా దురదృష్టంకొద్దీ మన పొరుగు దేశమైందని.. అక్కడి హిందువులను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని.. ఒకవేళ మనం వారికి మద్దతుగా నిలవకపోతే భారత్ అనేది మహా భారత్ అవ్వలేదని స్పష్టం చేశారు. బంగ్లాలో ముష్కలరులు హిందువులను లక్ష్యంగా చేసుకోవడం, వారిపై దాడులకు పాల్పడటాన్ని యోగా గురు బాబా రామ్‌దేవ్ ఇప్పటికే తీవ్రంగా ఖండించారు. దీన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వెంటనే చేపట్టాలంటూ ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కాగా బంగ్లా నాటోర్కేలో సుమారు 15వేల మంది హిందువులు, 7వేల మంది క్రిస్టియన్లు నివసిస్తున్నారు. సోమవారం రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపామని వారు అంతర్జాతీయ మీడియాకు చెప్పారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై లక్షిత దాడులు జరుగుతున్నాయని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. సనాతన ధర్మానికి ఎదురవుతున్న ముప్పును తిప్పికొట్టడానికి సమైక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కాగా, హిందువులు తదితర మైనారిటీ వర్గాలపై, వారి ప్రార్థన స్థలాలపై జరుగుతున్న దాడులను బంగ్లాదేశ్‌లోని 31 సామాజిక, సాంస్కృతిక సంస్థలు ముక్తకంఠంతో ఖండించాయి.

జాతీయ విపత్తుగా ప్రకటించండి

వయనాడ్ విలయంపై కేంద్రాన్ని కోరిన రాహుల్

న్యూఢిల్లీ, ఆగస్టు 7 : కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి సృష్టించిన విలయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ బుధవారం కోరారు. లోక్‌సభ జీరో అవర్‌లో మాట్లాడిన ఆయన వయనాడ్ విపత్తుతో నష్టపోయిన ప్రజలకు పరిహారం కూడా అధికంగా ఇవ్వాలని కోరారు. "అక్కడ జరిగింది నేను నా కళ్లతో స్వయంగా చూశాను.. అనేక చోట్లకు వెళ్లాను... కుటుంబాలకు కుటుంబాలే అదృశ్యం అయ్యాయి.. కొన్ని కుటుంబాల్లో ఒక్కొక్కరే మిగిలారు.. పిల్లలు లేదా.. పెద్దలు ఇలా ఒక్కరే మిగిలారు" అని రాహుల్ పేర్కొన్నారు. ఈ విపత్తులో 200 మందికి పైగా చనిపోగా ఎంతోమంది కనిపించకుండా పోయారని చెప్పారు. ఈ సందర్భంగా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే కేంద్ర దళాలు, సైన్యం బాధితులకు అందించిన సేవలకు, సహకారానికి అభినందనలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు బాధితులకు అండగా నిలిచిన తీరును కొనియాడారు.

హమాస్ చీఫ్‌గా యహ్యా సిన్వర్?

గాజా, ఆగస్టు 7: పాలస్తీనాకు చెందిన తీవ్రవాద సంస్థ హమాస్ తదుపరి చీఫ్‌గా 61 ఏళ్ల యహ్యా సిన్వర్‌ను ప్రకటించనున్నారు. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై హమాస్ జరిపిన దాడిలో యహ్యానే కీలక సూత్రధారిగా భావిస్తున్నారు. అది ఇజ్రాయిల్ చరిత్రలోనే అతి పెద్ద దాడి. దానికి ప్రతీకారంగా ఇజ్రాయిల్ జరుపుతున్న వైమానిక, భూతల దాడుల్లో ఇప్పటి వరకు 39,653 మంది పాలస్తీనియన్లు మరణించినట్టు హమాస్ ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది. హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా గతవారం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో హత్యకు గురైన విషయం తెలిసిందే. హనియాను తమ భూభాగంలో హత్య చేసినందుకు ఇజ్రాయిల్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని ఇరాన్ రగిలిపోతుండటంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగిపోతున్న వేళ హమాస్ నుంచి తాజా ప్రకటన వెలువడింది.

100 గ్రాములు.. పతకం దూరం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉషతో ఫోన్లో మాట్లాడారు. వినేశ్ విషయంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ముందు భారత్ నిరసనను వ్యక్తం చేయాలని సూచించారు. అయితే వినేశ్ అనర్హతపై పునఃసమీక్షించాలంటూ ఐఓసీని ఐఓఏ కోరినా ఫలితం లేకపోయింది. నిబంధనలు అందరికీ ఒకేలా ఉంటాయని, వినేశ్ విషయంలో ఏమీ చేయలేమంటూ వరల్డ్ రెజ్లింగ్ చీఫ్ నెనాడ్ లలోవిక్ స్పష్టం చేశారు. అనంతరం.. వినేశ్‌ను పోటీల నుంచి తప్పించారన్న వార్తను పంచుకోవడం అత్యంత బాధాకరం అని భారత ఒలింపిక్ సంఘం ప్రకటన విడుదల చేసింది. తర్వాత దేశవ్యాప్తంగా రాజకీయ, సినీ తదితర రంగాల్లోని ప్రముఖులు ఫొగట్‌కు సంఘీభావం ప్రకటించారు. 'వినేశ్.. చాంపియన్లకే చాంపియన్‌వి నువ్వు. దేశానికి నువ్వు గర్వకారణం. ప్రతి ఒక్కరికి స్ఫూర్తి. ఈ సమయంలో మేమంతా నీ వెంటే ఉన్నాం' అని ప్రధాని మోదీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. సాంకేతిక కారణాలతో వినేశ్‌ను తప్పించడం దురదృష్టకరం అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విచారం వ్యక్తం చేశారు. దేశమంతా ఆమె వెంటనే ఉందని, ముందుముందు ఆమె మరింత కసితో బరిలోకి దిగి సత్తా చాటుతారని ఎక్స్‌లో రాహుల్ పేర్కొన్నారు. కాగా షెడ్యూల్ ప్రకారం బుధవారం రాత్రి జరిగిన ఫైనల్లో అమెరికా రెజ్లర్ సారా హిల్డెబ్రాంట్‌తో వినేశ్ పసిడి కోసం పోరాడాల్సి ఉంది. వినేశ్‌పై వేటుపడటంతో సెమీఫైనల్లో ఆమె చేతిలో ఓటమిపాలైన క్యూబా బాక్సర్ గుజ్మన్ లోపెజ్ వినేశ్ స్థానంలో ఫైనల్లో తలపడింది.

కొన్ని గంటల్లోనే 2.8 కిలోలు బరువు పెరుగుదల

వినేశ్ ఫోగట్ 50 కిలోల విభాగంలో బరిలోకి దిగింది. నిబంధనల ప్రకారం బౌట్‌లు మొదలయ్యే రోజు రెజ్లర్ల బరువు కొలుస్తారు. నిర్ణీత బరువు, అంతకన్నా తక్కువ ఉంటేనే బరిలోకి అనుమతిస్తారు. మంగళవారం వినేశ్.. తన విజయ పరంపర కొనసాగిస్తూ మూడు బౌట్లు ఆడింది. తొలి పోటీకి ముందు ఆమె బరువు 49 కిలోల 900 గ్రాములుగా ఉంది. ఆ వెంటనే ఆమె ప్రీక్వార్టర్స్, క్వార్టర్స్, సెమీఫైనల్ ఆడింది. సెమీస్ బౌట్ ముగిశాక. వినేశ్ బలహీనంగా కనిపించడంతో ఆమె మితంగా ఆహారం, నీళ్లు తీసుకుందని తెలిసింది. తర్వాత కొన్ని గంటల్లోనే ఆమె బరువు చెక్ చేసుకుంటే 52 కిలోల 800 గ్రాములుగా వచ్చింది. దీంతో ఆమె బరువు తగ్గించుకునేందుకు తీవ్రంగా శ్రమించింది. రాత్రంతా స్కిప్పింగ్, జాగింగ్ చేసింది. శరీరంలోంచి కొంత రక్తాన్ని కూడా తీసేయించుకుంది. చివరికి జుట్టు కూడా కత్తిరించుకుంది. రెజ్లింగ్ పోటీల్లో వేసుకునే డ్రెస్‌ను కూడా చిన్నగా వేసుకుంది. అయినా ఫలితం లేకపోయింది. ఫైనల్ బౌట్ కోసం బుధవారం ఉదయం ఒలింపిక్ నిర్వాహకులు బరువు తూచగా ఫొగట్ 50 కిలోల 100 గ్రాములు ఉన్నట్లు తేలింది. స్వర్ణ పతక వేటలో ఉన్న వినేశ్‌లాంటి అథ్లెట్ విషయంలో ఎప్పటికప్పుడు బరువు సరిచూడాల్సిన కోచ్‌లు, న్యూట్రిషనిస్ట్, సహాయ సిబ్బంది నిర్లక్ష్యం ఉందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కుట్ర కోణముందా?

వినేశ్ ఫొగట్‌పై కుట్రకోణం ఏమైనా ఉందా? ఆమెను పోటీల నుంచి తప్పించేందుకు ఎవరో కావాలని చేశారా? ఇదే అనుమానాన్ని మాజీబాక్సర్, ఒలింపిక్ పతక విజేత విజేందర్ వ్యక్తం చేశారు. పారిస్ క్రీడల్లో భారత రెజ్లర్లకు వ్యతిరేకంగా పెద్ద కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈఆరోపణలను భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఖండించింది. ఇది కేవలం సాంకేతికకు సంబంధించిన అంశం అని, దీన్ని రాజకీయం చేయొద్దని అథ్లెటిక్ సమాఖ్య కోరింది.

రాజకీయ రగడ...

రెజ్లర్ వినేశ్ ఫొగట్‌పై అనర్హత అంశం రాజకీయ రగడకు దారితీసింది. ఈ అంశంపై పార్లమెంటు ఉభయసభల్లో చర్చకు విపక్షాలు పట్టుబట్టాయి. వినేశ్ అనర్హత ఘటనపై పూర్తి విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో లోక్‌సభలో క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ప్రకటన చేశారు. వినేశ్ అనర్హతపై అంతర్జాతీయ ఒలింపిక్ సంఘాన్ని భారత ఒలింపిక్ సంఘం గట్టిగా ప్రశ్నించిందని.. తన అసంతృప్తిని వ్యక్తం చేసిందని, ఐఓఏ చీఫ్ పీటీ ఉషతో ప్రధాని మోదీ స్వయంగా మాట్లాడారంటూ వివరించారు. ఈ వివరణతో సంతృప్తి చెందని విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. ఇదే విషయంలో రాజ్యసభ నుంచి కూడా విపక్షాలు వాకౌట్ చేశాయి. వినేశ్ అనర్హతకు గురవడం బాధించిందని బ్రిజ్‌భూషణ్ కుమారుడు, ఎంపీ, యూపీ రెజ్లింగ్ అసోసియేషన్ చీఫ్ కరణ్ భూషణ్ పేర్కొన్నారు. ఈ అంశమ్మీద భారత రెజ్లింగ్ సమాఖ్య కచ్చితంగా అప్పీలు చేస్తుందని చెప్పారు.

12 గంటల్లో చేయాల్సిందంతా చేశాం కానీ..

వినేశ్ బరువును నిర్దేశిత పరిమితిలోపు ఉంచేందుకు భారత బృందం అన్ని చర్యలు తీసుకుంది. కోచ్ అన్ని చర్యలు తీసుకున్నారు. వ్యాయామం చేయించాం. నీరు పరిమిత స్థాయిలో ఇచ్చాం. చెమటకోసం వ్యాయామాలు, ఆవిరి స్నానంలాంటి వన్నీ చేయించాం. చివరకు జుట్టు కూడా కత్తిరించాం. అయినప్పటికీ బరువు తూచే సమయానికి 100 గ్రాములు అధికంగా ఉన్నట్టు వెల్లడైంది. ఇది దురదృష్టకరం. బరువు తగ్గించడానికి చాలా సమయం పడుతుంది. మా చేతిలో 12 గంటల సమయమే ఉంది. మరికొంత ఉండుంటే ఆ బరువును కూడా తగ్గించేవాళ్లం

- భారత ఒలింపిక్ సంఘం జారీ చేసిన ప్రకటనలో జట్టు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దిన్షా పార్దీవాలా

ఆమె ఎప్పుడూ 53 కిలోల విభాగంలోనే..

వినేశ్ విషయంలో కుట్ర ఏమీ లేదు. అధిక బరువు ఉన్నట్లు తేలింది అంటే ఎక్కువ బరువు ఉన్నట్టే. ఇది సాంకేతికతకు సంబంధించిన అంశం. ఆమె ఎప్పుడూ 53 కిలోల విభాగంలో పోటీ పడేవారు. తాజాగా 50 కిలోల విభాగంలోకి మారింది. బరువు మారిన పరిస్థితుల్లో ఈ సమస్యకు ఎప్పుడూ అవకాశం ఉంటుంది. అధిక బరువు విషయంలో సడలింపు ఏమీ లేదు

- భారత అథ్లెటిక్ సమాఖ్య అధ్యక్షుడు ఆదిల్ సుమరీవాలా

బీజింగ్ టు షాంఘై.. గంటలోనే!

- గంటకు 1000 కి.మీ వేగంతో దూసుకెళ్లే రైలు
- విజయవంతంగా పరీక్షించిన చైనా

బీజింగ్, ఆగస్టు 7: చైనాలోని ప్రధాన నగరాలైన బీజింగ్, షాంఘై మధ్య దూరం 1000 కిలోమీటర్లు పైనే ఉంటుంది. విమానంలో వెళితేనే రెండు గంటలు పైనే పడుతుంది. అయితే.. ఇంత దూరాన్ని ఒక్క గంటలోనే చేరుకునేలా గంటకు 1000 కి.మీ వేగంతో ప్రయాణించే అల్ట్రా హై స్పీడ్ (యూహెచ్‌ఎస్) రైలుని చైనా రూపొందిస్తోంది. మాగ్లెవ్ టెక్నాలజీతో అభివృద్ధి చేస్తున్న ఈ రైలుకు స్పీడ్ ప్రదర్శన పరీక్షను విజయవంతంగా పూర్తిచేసింది. చైనా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ మాగ్లెవ్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. అయస్కాంత శక్తితో నడిచే మాగ్లెవ్ రైలు పట్టాలను తాకకుండా గాల్లో తేలుతూ మెరుపు వేగంతో దూసుకెళ్తుంది. గ్లోబల్ టైమ్స్ నివేదిక ప్రకారం.. ఈ పరీక్షను రెండు కిలోమీటర్ల పైప్‌లైన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ రైలు వేగం, సస్పెన్షన్ నిర్దేశిత ప్రమాణాలను అనుగుణంగా ఉన్నాయి. గంటకు వెయ్యి కిలోమీటర్ల వేగాన్ని అందుకునే లక్ష్యంతో చేపట్టిన అల్ట్రా హై స్పీడ్ మాగ్లెవ్ రైలు నిర్మాణం 2022 ఏప్రిల్‌లో యాంగ్‌గావ్ కౌంటీలో ప్రారంభమైంది. చైనా ఏరోస్పేస్ సైన్స్ అండ్ ఇండస్ట్రీ కార్పొరేషన్ లిమిటెడ్, సాంగ్జీ సంయుక్తంగా దీన్ని రూపొందిస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన రైలుగా నిలవనుంది.

15న నింగిలోకి ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్

- మరో ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో

సూళ్లూరుపేట, ఆగస్టు 7: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో రాకెట్ ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి ఈ నెల 15న ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ ద్వారా భూ పరిశీలన ఉపగ్రహం ఈవోఎస్-08ను నింగిలోకి పంపనుంది. ఇప్పటికే ఈ ప్రయోగానికి సంబంధించిన ఏర్పాట్లలో శాస్త్రవేత్తలు నిమగ్నమయ్యారు. వాతావరణం అనుకూలిస్తే ఈ నెల 15న ఉదయం 9.17 గంటలకు ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ ఈవోఎస్-08తో నింగిలోకి ఎగరగనుంది. ఇస్రో రూపొందించిన ఈ ఉపగ్రహం బరువు 175.5 కిలోలు. ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ (ఈఓఐఆర్), గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్-రిఫ్లెక్టోమెట్రీ (జీఎన్ఎస్ఎస్-ఆర్), ఎస్ఐసీ యూవీ డోసిమీటర్ అనే మూడు పేలోడ్లను దీనిలో ఏర్పాటు చేశారు. సముద్ర ఉపరితలంపై గాలులు, నేలలో తేమ అంచనా, హిమాలయ ప్రాంతంలో క్రియోస్పియర్ అధ్యయనాలు, వరదలను గుర్తించి ఎప్పటికప్పుడు అందులో పొందుపరిచిన పరికరాల ద్వారా ఫొటోలు తీసి పంపడం లక్ష్యంగా ఈ ప్రయోగాన్ని చేపడుతున్నారు. ఇస్రో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ఈ ఉపగ్రహాన్ని స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ-డీ3) ద్వారా నింగిలోకి పంపనున్నారు. దీనిలో ఏర్పాటు చేసిన మూడు పే లోడ్లు భవిష్యత్‌లో ఇస్రో పంపే ఉపగ్రహాలకు అవసరమైన సాంకేతికను అందిస్తాయి.

వైసీపీకి మాజీ ఎమ్మెల్యే దొరబాబు రాజీనామా



వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న మాజీ ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం, ఆగస్టు 7: అసెంబ్లీ ఎన్నికలకు ముందు తనకు టికెట్ నిరాకరించిన వైసీపీ అధినేత జగన్‌కు కాకినాడ జిల్లాకు చెందిన ఆ పార్టీ సీనియర్ నేత, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఝలక్ ఇచ్చారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో బుధవారం విలేకరుల సమావేశంలో వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న తనకు వైసీపీలో తగిన గుర్తింపు, ప్రాధాన్యం లభించలేదని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీని వీడాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తనతో కూటమి పార్టీ నేతలు టచ్‌లో ఉన్నారని, తన వెన్నంటి ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అందరితో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు. దొరబాబు త్వరలోనే జనసేనలో చేరే అవకాశం ఉందని చెబుతున్నారు.

గైడ్‌కాస్ట్‌లో 2వ ఎపిసోడ్‌ను విడుదల చేసిన నారాయణ

హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మానసిక ఆరోగ్యం మెరుగుదలకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా గైడ్‌కాస్ట్‌లోని రెండవ ఎపిసోడ్‌ను యూట్యూబ్ వేదికగా విడుదల చేసినట్టు నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు శరణి, సింధూర తెలిపారు. ఈ గైడ్‌కాస్ట్‌లో పిల్లల స్నేహాల విషయంలో తల్లిదండ్రుల పాత్ర, గొప్ప స్నేహాలు పెంపొందించటంలో తల్లిదండ్రులు ఎలా సహాయం చేయవచ్చు ? అనే అంశాలపై చర్చించినట్లు వారు చెప్పారు. ఈ గైడ్‌కాస్ట్‌లో ప్రముఖ సైకాలజీ నిపుణురాలు విజయలక్ష్మి తన అభిప్రాయాలను పంచుకున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగనుందని పేర్కొన్నారు.

నేడు టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశం

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం గురువారం జరగనుంది. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభంకానుంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పొలిట్‌బ్యూరో సమావేశం జరగడం ఇదే ప్రథమం. అజెండాలో ఆరు అంశాలు పెట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నియామక పదవులు, శ్వేత పత్రాలు, సంస్థాగత వ్యవహారాలు తదితరాలపై చర్చ ఉంటుందన్నాయి. టీడీపీ తెలంగాణ కమిటీ అధ్యక్షుడి ఎంపికపై కూడా ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

కేఆర్ఎంబీని విజయవాడలో ఏర్పాటు చేయాలి

- బోర్డు చైర్మన్ అతుల్‌జైన్‌కు రాష్ట్ర సాగునీటి సంఘాలు విజ్ఞప్తి

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీయాజమాన్య సంస్థ కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాలు కోరాయి. బోర్డు చైర్మన్ అతుల్ జైన్‌ను హైదరాబాద్ జలసౌధలో బుధవారం ఆళ్లగోపాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సంఘాల నేతలు కలిశారు. 'కేఆర్ఎంబీని విశాఖలో ఏర్పాటు చేయాలని గత జగన్ ప్రభుత్వం అసంబద్ధ నిర్ణయం తీసుకుంది. దానిని సరిదిద్ది రైతుల ప్రయోజనాలు కాపాడండి. కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో అన్ని రకాల పర్యవేక్షణకూ విజయవాడ అనువైనది. విజయవాడలోనే కేఆర్ఎంబీని ఏర్పాటు చేయండి' అని అతుల్ జైన్‌కు వినతిపత్రం అందజేశారు.

మదనపల్లె ఘటనలో ఎవరున్నా వదలం

- పెద్దిరెడ్డి అనుచరుల పాత్రపై ప్రాథమిక సమాచారం : మంత్రి అనగాని

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఘటనలో దోషులు ఎంతటి వారున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం మంత్రి ఓ ప్రకటన చేశారు. 'మదనపల్లె ఫైళ్ల దహనం ఘటన కుట్ర కోణంలోనే జరిగింది. సీఐడీ విచారణలో దోషులను కచ్చితంగా తేలుస్తాం. ప్రాథమిక సమాచారం మేరకు ఈ ఘటనలో పెద్దిరెడ్డి అనుచరుల పాత్ర ఉంది. పాపాలు చేయడం, ఫైళ్లను తగలబెట్టడం వైసీపీ నేతలకు, ముఖ్యంగా పెద్దిరెడ్డి అలవాటుగా చేసుకున్నారు. మదనపల్లె ఘటనకు ముందు.. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఫైళ్లను కూడా తగులబెట్టారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని, ఇష్టానుసారంగా దోపిడీ చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన అనుచరుల పాపాలు తప్పక పండుతాయి. పెద్దిరెడ్డి, అతని అనుచరులు ఎన్ని అక్రమాలకు పాల్పడ్డారనే దానికి.. వారికి వ్యతిరేకంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భూ వివాదాలకు సంబంధించి మాకు అందిన వేలకొద్దీ ఫిర్యాదులే పెద్ద ఉదాహరణ. వారి కుటుంబాన్ని ప్రభుత్వం వేధిస్తోందని పెద్దిరెడ్డి చెప్పడం విచిత్రంగా ఉంది. పెద్దిరెడ్డి కుటుంబమే తమను వేధించిందంటూ వేలాది మంది ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు' అని మంత్రి తెలిపారు.


మేం తలుచుకుంటే వైసీపీ ఖాళీ: మంత్రి అచ్చెన్న

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష హోదా కూడా రాని ఓటమిని చవిచూసినా జగన్‌రెడ్డికి సిగ్గు రావట్లేదని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. నైతిక విలువలు, విశ్వసనీయత అంటూ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. తాము తలుచుకుంటే వైసీపీ ఖాళీ అయిపోతుందని బుధవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. 'పులివెందులకు మాత్రమే ఎమ్మెల్యే అయి ఉండి, ఇంకా మీరే ముఖ్యమంత్రి అనే భ్రమల్లో ఉంటే ఎలా? భ్రమలు వీడి, వాస్తవంలోకి రండి. ప్రజా ప్రభుత్వ పాలన ఎలా ఉందో తెలుస్తుంది. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని పోటీకి పెట్టకూడదనడానికి మీరెవరు? మీకు ఆ అధికారం ఎవరిచ్చారు? నేను తలుచుకుంటే టీడీపీ ప్రభుత్వం కూలిపోతుందని ప్రకటనలు చేసినప్పుడు విలువలు గుర్తుకు రాలేదా?' అని అచ్చెన్న ప్రశ్నించారు.

వైసీపీ అక్రమాలపై ఫిర్యాదుల వెల్లువ

- పెద్దిరెడ్డి అనుచరులతో ఇబ్బందులు పడుతున్నాం
- ఎస్సీ, ఎస్టీ కేసులతో వేధింపులకు గురి చేశారు
- టీడీపీ ప్రధాన కార్యాలయానికి వినతులు
- స్వీకరించిన మంత్రి నారాయణ, మాజీ మంత్రి జవహర్

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులు, భూకబ్జాలు, పింఛన్ల తొలగింపు, మున్సిపల్ షాపుల అద్దె, భూమి ఆన్‌లైన్ సమస్యలు, భవనాల పెండింగ్ బిల్లులు, అక్రమ ఎస్సీ, ఎస్టీ కేసులు.. తదితర అంశాలపై వందల సంఖ్యలో ఫిర్యాదులు టీడీపీ రాష్ట్ర కార్యాలయం గ్రీవెన్స్‌కు అందుతూనే ఉన్నాయి. టీడీపీ ప్రధాన కార్యాలయంలో మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ, మాజీ మంత్రి కేఎస్ జవహర్, టీడీపీ నేత శివప్రసాద్‌లకు బుధవారం పలువురు అర్జీలు ఇచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి అనుచరుల భూబాధితులు రోజుకొకరు బయటకు వస్తున్నారు. పెద్దిరెడ్డి అనుచరుడు మోహన్‌రెడ్డి సాగునీటి కాలువను పూర్తిగా పూడ్చి రోడ్డు వేయడంతో చెరువులోకి పోవాల్సిన వర్షపు నీరు తన పొలంపై పారుతోందని, దీంతో గత ఐదేళ్లుగా పంటను నష్టపోవాల్సి వచ్చిందని రాయవారిపల్లికి చెందిన నరసింహులునాయుడు హరీశ్ వాపోయాడు. గత ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పనిచేయలేదని తనను అక్రమంగా ఏసీబీ కేసులో ఇరికించి సర్వీసు నుంచి తొలగించారని, దీంతో తన భార్యకు మతిస్థిమితం సక్రమంగా లేదని, తన తల్లి క్యాన్సర్‌తో బాధపడుతోందని, తన బిడ్డకు ఆరోగ్యం సరిగా లేదని సెర్ప్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన తిప్పాన గోవిందరావు వాపోయారు. కడప జిల్లా మైలవరం నవాబుపేటకు 2008లో దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ వచ్చిందని, ఆ ఫ్యాక్టరీ సున్నపురాయి కోసం 2300 ఎకరాల భూమిని సర్వే చేసి 2 వేల ఎకరాల భూమి కొనుగోలు చేసిందని.. మిగిలిన 300 ఎకరాల భూమి కొనుగోలు చేయకపోవడంతో తాము నష్టపోతున్నామని అక్కడి భూబాధితులు వాపోయారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుమ్ముతో 300 ఎకరాల్లో పంటలు పండటం లేదని నవాబుపేట గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. తమ కాలనీలో 20 కుటుంబాలు నివసిస్తున్నాయని, మూడేళ్లుగా కరెంట్ లేక చీకట్లో మగ్గుతున్నామని కర్నూలు జిల్లా కల్లూరు మండలం పంచలింగాలకు చెందిన అనుగొండ వెంకటేశ్వర్లు తెలిపారు. తాను నీట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు బదులుగా అరుణాచల్‌ప్రదేశ్ అని పొరపాటున పడిందని, నీట్ పరీక్షల ఫలితాల్లో ఏపీ స్టేట్ ర్యాంకులో తన పేరు చూపించడం లేదని, స్టేట్ ర్యాంకులో తన పేరు వచ్చేట్లు చూడాలని నెల్లూరుకు చెందిన ఎండ్లూరి అభిజ్ఞ శ్రీహర్షిణి కోరారు.



టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి నారాయణ, మాజీ మంత్రి జవహర్

మళ్లీ పాపులర్ బ్రాండ్లు!

(మొదటి పేజీ తరువాయి)

అమలుచేయనుంది. మరోవైపు పేదలు తాగే తక్కువ రకం మద్యం ధరలు తగ్గించాలని ఇప్పటికే నిర్ణయించగా, మీడియం, ప్రీమియం బ్రాండ్ల ధరలూ తగ్గించాలని యోచిస్తోంది. గత ప్రభుత్వంలో ఎడాపెడా పన్నులు వేసి ప్రీమియం బ్రాండ్ల నుంచి చీప్ లిక్కర్ వరకు అన్ని రకాల మద్యం ధరలూ పెంచేశారు. దీంతో పేదల సంపాదనలో ఎక్కువ శాతం తాగుడుకే సరిపోయింది. అలాగే ఎన్‌డీపీఎల్ రూపంలో మీడియం, ప్రీమియం బ్రాండ్లు పొరుగు రాష్ట్రాల నుంచి ఏపీలోకి వస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు ధరలు తగ్గించడానికి కసరత్తు మొదలైంది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని కొంత వదులుకుని అయినా పేదలు తాగే మద్యం మరీ భారం కాకుండా చూడాలని నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వం ఎవరికీ తెలియని బ్రాండ్లను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. అయితే ఎన్ని కొత్త బ్రాండ్లు వచ్చినా వినియోగదారులు వారికి కావాల్సిందే కొనుక్కుంటారు. కానీ వారికి ఆ వెసులుబాటు లేకుండా పాత బ్రాండ్లను తరిమేసి, కేవలం కొత్త బ్రాండ్లు షాపుల్లో ఉంచేరు. ఇందుకోసం ప్రభుత్వ మద్యం షాపులను వినియోగించుకున్నారు. వైసీపీ పెద్దలకు నచ్చిన బ్రాండ్లను మాత్రమే ఆ షాపుల్లో ఉంచడంతో వినియోగదారులకు మరో దారి లేకుండా పోయింది. ఇప్పుడు ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొస్తోంది. ఇందులో షాపులన్నీ ప్రైవేట్‌వి అయితే లైసెన్సీలు వినియోగదారులు ఇష్టపడే బ్రాండ్లను అందుబాటులో ఉంచుతారు. అప్పుడు వారు తమకు నచ్చిన బ్రాండ్‌నే కొనుగోలు చేస్తారు. దీంతో పాత బ్రాండ్లు క్రమంగా వాటంతట అవే కనుమరుగయ్యే పరిస్థితి వస్తుంది.

అందుబాటులోకి ధరలు

కొవిడ్ సమయంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం మద్యం ధరలు రెట్టింపు చేసింది. ఆ తర్వాత కొంతమేర తగ్గించినా మద్యం ధరలు ఏపీలో ఎక్కువగానే ఉన్నాయి. దీంతో వాటిని తగ్గించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 2019కు ముందు చీప్ లిక్కర్ క్వార్టర్ రూ.70కు కూడా దొరికేది. వైసీపీ ప్రభుత్వంలో చీప్ లిక్కర్ క్వార్టర్ ధర రూ.150 దాటింది. మీడియం రకం బ్రాండ్ల ధరలు క్వార్టర్ రూ.200 దాటిపోయాయి. ధరలు పెరిగినా నాణ్యమైన మద్యం విక్రయించకపోవడంతో అటు ఆర్థికంగా, ఇటు అనారోగ్య సమస్యలతో పేదలు ఇంకా నష్టపోయారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని సరిహద్దు రాష్ట్రాల ధరల స్థాయికి మద్యం ధరలు తీసుకురానున్నారు. అవసరమైతే వాటి కంటే కొంతమేర అదనంగా తగ్గించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

కల్తీ బ్రాండ్ల నుంచి విముక్తి: మంత్రి కొల్లు

ప్రైవేట్ మద్యం షాపుల విధానం వస్తే అన్ని కంపెనీలకు న్యాయం జరుగుతుందని అంతర్జాతీయ మద్యం కంపెనీలు అభిప్రాయపడ్డాయి. పన్నులు కొంతమేర తగ్గిస్తే అమ్మకాలు పెరుగుతాయని ప్రభుత్వానికి సూచించాయి. బుధవారం సచివాలయంలో ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర వారితో సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ... కల్తీ మద్యం బ్రాండ్ల నుంచి విముక్తి కలిగేలా మెరుగైన మద్యం పాలసీ తీసుకొస్తున్నామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని ప్రజల ప్రాణాలు హరించిందని ఆరోపించారు. అమ్మకాలకు, కొనుగోళ్లకు సంబంధం లేకుండా రూ.వేల కోట్లు దోచుకున్నారని, మద్యం అక్రమాలను త్వరలోనే బయటపెడతామని పేర్కొన్నారు. అక్టోబరు 1 నాటికి కొత్త మద్యం పాలసీని అమల్లోకి తీసుకొస్తామని తెలిపారు. పాత బ్రాండ్లను తీసుకొచ్చేందుకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు.

అబ్బయ్యచౌదరి గారూ... ఆ 43లక్షలు ఇచ్చేయండి!

- పత్తికోళ్ల లంక గ్రామస్థుల డిమాండ్
- కొల్లేటి గ్రామాల వివాదాలు పరిష్కరిస్తానని మాజీ ఎమ్మెల్యే వసూలు చేశారని ఆరోపణ

ఏలూరు రూరల్, ఆగస్టు 7: కొల్లేటి గ్రామస్థుల మధ్య ఉన్న గత విభేదాలను పెద్దవిగా చేసి, అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఏలూరు జిల్లా ఏలూరు రూరల్ మండలంలోని కొల్లేటి గ్రామాల నుంచి దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొటారు అబ్బయ్య చౌదరి తదితరులు కోట్ల రూపాయలు స్వాహా చేశారని ఏలూరు రూరల్ మండలం పత్తికోళ్లలంక గ్రామానికి చెందిన పలువురు గ్రామస్థులు ఆరోపించారు. గ్రామ కమ్యూనిటీ హాల్లో బుధవారం జరిగిన సమావేశంలో గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న వివాదాలు సరి చేస్తానని.., వివాదం పరిష్కరించే వరకు తన వద్ద గ్రామస్థులు కోటి రూపాయల నగదు, గ్రామస్థుల సంతకాలు చేసిన ఖాళీ కాగితాలు, పట్టాపుస్తకాలు ఉంచాలని చెప్పి అబ్బయ్య చౌదరి, అతని తండ్రి రామచంద్రరావు, మాజీ సర్పంచ్ ఘంటసాల మహాలక్ష్మిరాజు, జానంపేట బాబు, బాపనయ్య తదితరులు డబ్బులు వసూలు చేశారన్నారు. చెరువుల వివాదం పరిష్కరించకుండా కాలయాపన చేశారని ఆరోపించారు. తమకు రావాల్సిన గ్రామం డబ్బు రూ.43 లక్షలు తిరిగి అడిగితే డబ్బు ఇచ్చిన మాట వాస్తవమే, కాకపోతే ఇచ్చేద్దామంటే ఆ డబ్బు మూట ఎక్కడుందో గుర్తుకు రావడం లేదంటూ అబ్బయ్య చౌదరి తండ్రి రామచంద్రరావు చెప్పడం బాధ్యతా రాహిత్యమన్నారు. డబ్బు ప్రస్తావన ఎత్తితే అబ్బయ్య చౌదరి తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. తక్షణం రూ.43 లక్షలు, సంతకాలు పెట్టించుకున్న తెల్లకాగితాలు తిరిగి ఇవ్వాలని, సొమ్ము కాజేసిన ప్రతి ఒక్కరిపై చట్టపరంగా ముందుకు వెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో ఘంటసాల తాతారావు, బలే సోమరాజు, ఉపసర్పంచ్ ముప్పల అశోక్‌బాబు, కొల్లేరు నాయకులు ఘంటసాల సుబ్రహ్మణ్యం, బలే వీర్రాజు, సైదు తిరుపతిరావు, ఎం.వెస్లీ, పాండురంగారావు, ఎస్.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తికోళ్ల లంక గ్రామస్తులు

ప్రైవేటు దేవాలయాల్లో నైవేద్యాలకు 10 వేలు

- జీవో విడుదలపై అర్చక, బ్రాహ్మణ సంఘాల హర్షం

గుంటూరు, ఆగస్టు 7: ప్రైవేటు దేవాలయాల్లో ధూప, దీప, నైవేద్యాలకు రూ.10 వేలు ఇవ్వటం టీడీపీ ప్రభుత్వానికే సాధ్యమని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ అన్నారు. ఆమేరకు జీవో ఇచ్చిన చంద్రబాబుకు ఆయన అర్చక, బ్రాహ్మణ సంఘాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గుంటూరులోని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో శ్రీధర్ శర్మ మాట్లాడారు. 'కనీసం ధూప, దీప, నైవేద్యాలకు కూడా నోచుకోని సుమారు 6,000 దేవాలయాలకు గతంలోనే చంద్రబాబు ప్రభుత్వంలో ఐదు వేలు ఇచ్చారు. ప్రజాగళం పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రభుత్వం ఏర్పడిన 50 రోజుల్లోనే దానిని తాజాగా రూ.10 వేలకు పెంచారు. దీనిపై అర్చక సంఘాలు, అర్చకులు, భక్తులు, బ్రాహ్మణ సమాజం హర్షం వ్యక్తం చేస్తున్నాయి.' అని శ్రీధర్ శర్మ తెలిపారు.

గ్రేటర్ విశాఖలో వైసీపీకి షాక్

- జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి క్లీన్‌స్వీప్
- వైసీపీకి పూర్తి మెజారిటీ ఉన్నా.. అభ్యర్థులు ధమాల్

విశాఖపట్నం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగరపాలకసంస్థ(జీవీఎంసీ) స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. మొత్తం పది స్థానాలనూ కూటమి అభ్యర్థులే కైవశం చేసుకున్నారు. జీవీఎంసీలో పూర్తిస్థాయి మెజారిటీ కలిగిన వైసీపీ నేతలకు ఈ పరిణామం షాక్ ఇచ్చింది. జీవీఎంసీలో మొత్తం 98 మంది కార్పొరేటర్లకు గాను ఒకరు రాజీనామా చేయడంతో ప్రస్తుతం 97 మంది ఉన్నారు. సీపీఎం కార్పొరేటర్ గంగారావు ఓటింగ్‌కు దూరంగా ఉండటంతో 96 మంది మాత్రమే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. కూటమి తరఫున పది మంది, వైసీపీ నుంచి పది మంది పోటీకి దిగారు.

బలాబలాలు ఇలా మారిపోయాయి...

జీవీఎంసీలో వైసీపీకి 58 మంది, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి 37 మంది కార్పొరేటర్ల బలం ఉంది. సీపీఐ, సీపీఎంలకు ఒక్కొక్కరు ఉన్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికకు గతనెల 22న నోటిఫికేషన్ విడుదల చేయగా, ఆ తర్వాత వైసీపీ కార్పొరేటర్లు ఆరుగురు టీడీపీలోనూ, ఐదుగురు జనసేనలోనూ చేరిపోయారు. సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ కూటమి అభ్యర్థులకు మద్దతు ప్రకటించడంతో మంగళవారం నాటికి వైసీపీ బలం 47కి పడిపోగా, కూటమి బలం 49కి పెరిగింది. బుధవారం పోలింగ్ ఉండటంతో ఇరుపక్షాలు మంగళవారం నుంచే తమ కార్పొరేటర్లను ప్రత్యేక శిబిరాల్లో ఉంచారు. అయితే, వైసీపీ క్యాంప్‌కు 43 మంది మాత్రమే హాజరయ్యారు. గైర్హాజరైన నలుగురు బుధవారం పోలింగ్ ప్రారంభయ్యేసరికి కూటమి కార్పొరేటర్లతోపాటు ప్రత్యేక బస్సుల్లో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకోవడంతో వైసీపీ నేతలు అవాక్కయ్యారు. మిగిలిన 43 ఓట్లైనా తమ అభ్యర్థులకు పడతాయని వైసీపీ నేతలు భావించారు. కానీ, ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించారు. వైసీపీ అభ్యర్థుల్లో ఒక్కరికి మాత్రమే గరిష్ఠంగా 42 ఓట్లు పడటం ఆ పార్టీ నేతలను మరింత వేదనకు గురిచేసింది. తమ క్యాంప్‌లో ఉన్న కార్పొరేటర్లు సైతం కూటమి అభ్యర్థులకు క్రాస్‌ఓటింగ్ చేశారంటూ వైసీపీ నేతలు మండిపడ్డారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో గెలవడానికి ఒక్కో అభ్యర్థికి కనీసం 49 ఓట్లు రావాల్సి ఉండగా, వైసీపీలో ఒక్కరికి కూడా అన్ని ఓట్లు రాకపోవడంతో అంతా ఓటమి పాలయ్యారు.



జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులతో కూటమి నేతలు, ఎమ్మెల్యేలు

ఓట్లపై కోడ్‌లు వేసిన వైసీపీ ఏజెంట్లు..

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏజెంట్లుగా వెళ్లిన వైసీపీ అభ్యర్థులు 14 బ్యాలెట్ పేపర్లపై పెన్ను, పెన్సిళ్లతో ప్రత్యేకంగా కోడ్‌లు వేశారని, అది నిబంధనలకు విరుద్ధం కనుక వాటిని చెల్లని ఓట్లుగా ప్రకటించాలని కూటమి అభ్యర్థులు ఆందోళనకు దిగారు. అలా కుదరదని అధికారులు చెప్పడంతో జీవీఎంసీ కమిషనర్ పోర్టికోతోపాటు ప్రవేశద్వారం వద్ద నిరసన తెలిపారు. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించేయడంతో వివాదం సద్దుమణిగింది.

పదవులు వస్తుంటాయ్.. పోతుంటాయ్

- ఐదేళ్లు కళ్లుమూసుకుంటే.. మళ్లీ అధికారంలోకి: బొత్స
- మీడియాపై మాజీ మంత్రి అనుచిత వ్యాఖ్యలు

అనకాపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): 'అధికారం శాశ్వతం కాదు. పదవులు వస్తుంటాయి.. పోతుంటాయ్' అంటూ వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. కళ్లు మూసుకుంటే ఐదేళ్లు అయిపోతాయని, మళ్లీ అధికారంలోకి వచ్చేస్తామని జోస్యం చెప్పారు. అధికారంలో ఉన్నవారు గౌరవ, మర్యాదలతో ప్రవర్తించాలని సూక్తులు వల్లించారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న బొత్స బుధవారం అనకాపల్లిలో వైసీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుచేయకుండా మాయచేస్తారన్నారు. జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడతారని, చంద్రబాబు జిమ్మిక్కులు చేయడంలో దిట్టని విమర్శించారు. ప్రభుత్వ లోపాలపై సంక్రాంతి వరకు ప్రశ్నించకూడదని తాము నిర్ణయించుకున్నట్టు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 858 ఓట్లు ఉండగా, 630కిపైగా ఓటర్లు వైసీపీ వారేనని, టీడీపీకి 228 ఓటర్లు మాత్రమే ఉన్నారని చెప్పారు.



అనకాపల్లిలో వైసీపీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్స

మీడియావారికి పనేమీ ఉండదు.. ఏదో ఒకటి రాస్తుంటారు: బొత్స

అనంతరం విలేకరుల సమావేశంలో మీడియాపై బొత్స అనుచిత వ్యాఖ్యలు చేశారు. తన ముందున్న టీవీ చానళ్ల మైకులను లెక్కపెట్టి.. మొత్తం పది మైకులున్నాయని, వారికి ఏమీ పని ఉండదని వ్యాఖ్యానించారు. అరకు, పాడేరు నుంచి 114 మంది వైసీపీ నేతలు జగన్‌ను కలిసేందుకు అమరావతికి వెళితే, క్యాంపులు పెట్టుకున్నారని రాస్తున్నారని.. పప్పో, ఉప్పో రాసుకోకపోతే వారికి గడవదని ఆక్షేపించారు.

బాబును బొత్స మాత్రమే తట్టుకోగలడు!

- విశాఖ స్థానిక సంస్థల్లో వైసీపీకే మెజారిటీ: జగన్

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధర్మ యుద్ధంలో సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మాత్రమే తట్టుకుని నిలబడగలడని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారమిక్కడ తాడేపల్లి నివాసంలో అరకు, పాడేరు నియోజకవర్గాలకు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో బొత్స సమక్షంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. విశాఖ జిల్లాల్లోని స్థానిక సంస్థల్లో వైసీపీ 600కి పైగా స్థానాల్లో గెలిస్తే.. టీడీపీ కేవలం 200 పైచిలుకే నెగ్గిందన్నారు. రెండు పార్టీల మధ్య 387 స్థానాల తేడా ఉందన్నారు. ఇంత భారీ తేడాలో వైసీపీ గనుక వెనుకబడి ఉంటే.. ఉపఎన్నికలో పోటీ చేసేవాళ్లం కాదని జగన్ చెప్పారు. మెజారిటీ లేనప్పుడు ఎవరైనా పోటీ పెట్టకూడదన్నారు. జగన్ ఈ రోజు ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే.. అవతలి వాళ్లకు మెజారిటీ ఉంటే పోటీ చేసేవాళ్లం కాదన్నారు. అయితే ఇప్పుడు చంద్రబాబు ఉన్నారని.. డబ్బులు ఉన్నాయని కొనుగోళ్లకు సిద్ధమయ్యారని ఆరోపించారు. 2014 ఎన్నికల్లో ఆయనలా అబద్ధపు హామీలు ఇవ్వనందునే ఓడిపోయామన్నారు. ఆ ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచిన 23 మంది టీడీపీకి వెళ్లారని.. తర్వాత వారు వెనక్కి వస్తామన్నా రాజకీయాల్లో ఇది సరికాదని తీసుకోలేదని చెప్పారు. ఇప్పుడు వారంతా రాజకీయంగా కనుమరుగైపోయారని అన్నారు. నాయకుడు విలువలు, విశ్వసనీయతతో కూడిన రాజకీయం చేస్తేనే ఎదుగుతాడని జగన్ చెప్పారు. గురువారం పాయకరావుపేట, అనకాపల్లి, నర్సీపట్నం నియోజకవర్గాల్లోని స్థానిక ప్రజాప్రతినిధులను ఆయన కలుస్తారు.

తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రమాదం

- బైక్‌పై వస్తూ బస్సు కిందపడి ఇద్దరి దుర్మరణం

తిరుమల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో బుధవారం ప్రమాదం చోటుచేసుకుంది. ఎలక్ట్రిక్ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు బస్సు కిందపడి దుర్మరణం చెందారు. తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే మొదటి ఘాట్‌రోడ్డులో చివరి మలుపు వద్ద ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు ఎడమవైపు తిరుగుతున్న క్రమంలో వెనుక వేగంగా వచ్చిన బైక్ ఎడమవైపున్న చిన్న గ్యాప్‌లో ప్రవేశించింది. వేగం అదుపుకాకపోవడంతో బైక్ రోడ్డుపై పడిపోగా దానిపై ప్రయాణిస్తున్న యువతి, యువకుడు బస్సుకింద పడిపోయారు. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల వద్ద లభించిన గుర్తింపుకార్డుల ఆధారంగా బైక్ నడుపుతున్న వ్యక్తి తమిళనాడులోని పల్లిపట్టు తాలూకా వెలియాగరం గ్రామానికి చెందిన ఏఎస్ కార్తీక్(28)గా, వెనుక కూర్చుని మృతి చెందిన మహిళ తిరువణ్ణామలై జిల్లాలోని చెంజాం తాలూకా మషర్ గ్రామానికి చెందిన సౌమ్య(21)గా పోలీసులు గుర్తించారు. అయితే కార్తీక్ బంధువులు మాత్రం ఆమె ఎవరో తమకు తెలియదని చెప్పారు. బస్సు డ్రైవర్ కాంతారావును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



శ్రీవారి ఆలయం ముందు కార్పెట్లు

తిరుమల, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం ముందు భక్తులు జారిపడిపోకుండా టీటీడీ అధికారులు కార్పెట్లు ఏర్పాటు చేశారు. తిరుమలలో మంగళవారం రాత్రి భారీగా కురిసిన వర్షంతో డ్రైనేజ్ నుంచి నెయ్యితో కూడిన మురుగు పొంగి ప్రవహించి పలువురు భక్తులు జారిపడి గాయాలపాలయ్యారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో 'శ్రీవారి భక్తులకు ఎంతకష్టం.. ఎంతకష్టం!' అనే వార్త ప్రచురితం కావడంతో బుధవారం టీటీడీ అధికారులు డ్రైనేజీని పరిశీలించారు. ఎంత వర్షం పడినా డ్రైనేజ్ పొంగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు శ్రీవారి ఆలయం ముందు తాత్కాలికంగా రెడ్ కార్పెట్లు ఏర్పాటు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యోధురాలి విషాదం

ఆటల్లో జయాపజయాలు ఉంటాయి, అనిశ్చితి ఆఖరివరకూ వెంటాడుతుంది. చివరి అంకంలో ఆట ఒక్కసారిగా మలుపు తిరగవచ్చు, అంతవరకూ విజేత అనుకున్నవారిని పరాజితులుగా కిందపడవేయవచ్చు. ఊహకు అందనప్పుడూ, ఉత్సాహాలతో ముంచెత్తినప్పుడు, ఉద్వేగాలు రేపినప్పుడు ఆట నిజానికి మరింత అందంగా ఉంటుంది. పరాజయం బాధించని సందర్భాలూ ఉంటాయి. కానీ, ఇప్పుడు జరిగింది అదికాదు. వినేశ్ ఫోగట్ గుండెబద్దలైందీ, కోట్లాదిమంది భారతీయుల ఆశలు ఆవిరైపోయిందీ ఆమె ఇంకా బరిలోకి దిగకముందే, గురిచూసి ప్రత్యర్థిని కూల్చకముందే. పారిస్‌నుంచి బంగారం తెస్తుందనుకున్న ఈ క్రీడాకారిణి కదనరంగం నుంచి ముందే నిష్క్రమించి ఆశలన్నీ అడియాసలు చేసినా దేశం ఆమె కన్నీరు తుడుస్తున్నది, నిలువెత్తు బంగారం నువ్వు అంటూ హారతులు పడుతున్నది. పసిడి పతకం పోరుకు దూరమైనా, అంతవరకూ రావడానికీ, ఆ ఎత్తుకు చేరడానికీ ఆమె పడిన శ్రమ, చేసిన యుద్ధం అసామాన్యమైనది.

ఆమె కుప్పకూలింది, కన్నీరు పెట్టుకుంది, ఆస్పత్రిపాలైంది కూడా. ఆమె గుండెగట్టిది కనుక, పోరాటం ఆమె రక్తంలో ఉన్నది కనుక అంతటి పెను ఉపద్రవాన్ని తట్టుకోగలిగింది. కొద్ది ఘడియలముందు తన చేతుల్లో ఓడిన ఓ క్రీడాకారిణి ఫైనల్‌కు ఎగబాకడం, తాను మాత్రం అనర్హురాలిగా మిగిలిపోవడం విషాదకరమైన పరిణామం. ఆమెకోసం ప్రత్యేకంగా కొందరు శిక్షకులు, నిపుణులు ఉన్నప్పుడు అతి తక్కువ సమయంలో రెండుకిలోల బరువు పెరగడం ఎలా సాధ్యమైందని కొందరి ప్రశ్న. పెరిగిన బరువును వదిలించుకోవడానికి రాత్రంతా ఆమె చేసిన శ్రమ, మహత్తరమైన ఆ పట్టుదల అపూర్వమైనవి. బరువును నియంత్రణలో ఉంచే విషయంలో సిబ్బంది యావత్తూ శ్రద్ధపెట్టివుంటే బాగుండేది. ఇలా అతివేగంగా బరువులో మార్పులు రావడం వల్ల ఆమెపై కుట్ర జరిగిందన్న అనుమానాలు, విమర్శలు వెల్లువెత్తాయి. ఇది సాంకేతిక అంశమనీ, కుట్రకోణాలు వెతకవద్దనీ, రాజకీయం చేయకూడదనీ ఎందరెందరో హితవులు చెబుతున్నారు కానీ, అనుమానాలు ఆగడం లేదు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ తమను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడనీ, అతడిని పదవినుంచి తప్పించాలని రెజ్లర్లంతా ఏడాదిపాటు రోడ్డునపడి చేసిన పోరాటం, అతడికి ఆఖరువరకూ అండగా నిలిచిన పాలకపక్షపెద్దలు ఈ క్రీడాకారులతో అమానుషంగా వ్యవహరించిన గతం ఇప్పుడు అందరికీ గుర్తుకువస్తున్నది. సాటి మహిళా క్రీడాకారుల పక్షాన వినేశ్ ఫోగట్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆ సందర్భంలో ఎదుర్కొన్న అవమానాలు, ఛీత్కారాలు ఇప్పుడు దేశం గుర్తుచేసుకుంటోంది. నిరసన శిబిరాలనుంచి ఆమెను ఈడ్చివేసిన దృశ్యాలు, గంగలో పతకాలు నిమజ్జనం చేయడానికి సిద్ధపడిన ఘట్టాలు తిరిగి ప్రచారంలోకి వస్తున్నాయి. తమ గోడు ఏమాత్రం పట్టించుకోని పాలకులపట్ల ఆగ్రహంతో, ఆవేదనతో ఆమె అప్పట్లో ఆటలమీద విరక్తిని ప్రదర్శించినప్పటికీ, తరువాత మనసు మార్చుకొని, ఒలింపిక్స్ కోసం సర్వసన్నద్ధమైంది, దేశం కోసం సర్వశక్తులూ ఒడ్డింది. రాష్ట్రపతి, ప్రధాని, విపక్షనేత, విభిన్నరంగాలకు చెందిన ప్రముఖులు ఇచ్చిన సందేశాలు ఈ సమయంలో ఆమెకు ఎంతో ఉపశమనం ఇస్తాయి. పారిస్ ఒలింపిక్స్ శిక్షణ కోసం ఆమెమీద డెబ్బయ్ లక్షలకుపైగా ఖర్చుచేశామని కేంద్ర క్రీడామంత్రి పార్లమెంటులో ప్రకటించడం ఆత్మరక్షణ కోసం కావచ్చునేమో కానీ, ఆమెనూ, అభిమానులనూ గిల్లడమే. గతంలో మోదీకి వ్యతిరేకంగా నిలబడి నినదించినా, ఆమెను ఒలింపిక్స్‌కు పంపి తమ పెద్దలు ఎంతో ఉన్నతంగా వ్యవహరించారన్నట్టుగా మరో నాయకురాలు వ్యాఖ్యానించారు. కానీ, సమస్త వ్యవస్థలు తనకు వ్యతిరేకంగా ఉన్నా తోటి మహిళాక్రీడాకారుల కోసం వినేశ్ ఫోగట్ అప్పట్లో బరికి ఆవల పాలకులతో పోరాడారు, ఇప్పుడు బరిలో కడవరకూ నిలిచి పోరాడి చూపించారు. ఆఖరుక్షణాల్లో ఓ వందగ్రాముల్లో తేడావచ్చి, ఆమె వెండి బంగారాలతో మెరవకపోవచ్చును గానీ, దేశ ప్రజల హృదయాల్లో ఎప్పటికీ విజేతగా నిలిచిపోవడం కంటే గొప్ప అవార్డులూ రివార్డులు ఇంకేమి ఉంటాయి?

ప్రచ్ఛన్న హస్తం కాదు, అది ప్రజల పిడికిలి!



> తమ బెంగాలీ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి పాకిస్థాన్‌తో తెగదెంపులు చేసుకున్నవారు బంగ్లాదేశీయులు. వారి జాతీయ గీతం 'అమర్ సోనార్ బంగ్లా' కర్త రవీంద్రనాథ్ ఠాగోర్. హసీనాకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో ఆందోళనకారులకు ప్రేరణ, ఉత్సాహం ఇచ్చినది ద్విజేంద్రలాల్ రాయ్ 20వ శతాబ్ది తొలిసంవత్సరాలలో రాసిన "ధనో ధాన్యో పుష్పో భరా" అన్న బెంగాలీ గీతం. "ధనధాన్యాలతో, పుష్పాలతో నిండిన మాతృభూమీ, స్వప్నాలలో పుట్టి, స్మృతులతో నిండిన తల్లీ, నీవంటి నేల ఇంకెక్కడన్నా ఉందా; నా మాతృభూమీ, రాజ్యాలన్నిటికీ రాణీ".. అంటూ కీర్తించే ఈ పాటలో మాతృదేశం ఆనాటి ఉమ్మడి భారతదేశం. ఇప్పుడు బంగ్లాదేశ్‌ను ఉద్దేశించి కూడా అక్కడి పోరాటవాదులు అదే పాడుకుంటున్నారు. భాషతో, నేలతో ముడిపడిన ఆ మమకారాన్ని బంగ్లాదేశ్ కొనసాగించి తీరుతుంది!



■ కె. శ్రీనివాస్

సందర్భం

బంగ్లాదేశ్ ఏర్పడిన రోజులు మసకగా అయినా గుర్తున్నవారికి, ఆ దేశపు అర్ధశతాబ్ది స్వతంత్ర ప్రయాణం విచారం కలిగిస్తుంది. బ్రిటిష్ వలసపాలన నాటినుంచి బెంగాల్ మీద ప్రయోగాలు జరుగుతూనే ఉన్నాయి. మొగ్గ తొడుగుతున్న జాతీయోద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి బెంగాల్‌ను చీల్చినప్పుడు తీవ్రంగా ప్రతిఘటించిన ప్రజలు, తరువాత దేశవిభజన సమయంలో తామే మతప్రాతిపదికగా వేరయ్యారు, నెత్తుటి వరదలుగా కలహించుకున్నారు. పాకిస్థాన్ దుష్పరిపాలన, వివక్షలతో విసిగిపోయిన తూర్పు పాకిస్థాన్ భాషా ప్రాతిపదికన తిరుగుబాటు చేసి బంగ్లాదేశ్ అయింది. ఆ పరిణామంలో భారత్ సైనికపాత్ర కీలకమయినది. అంతర్జాతీయ రాజకీయాలు ఆ సమయంలో ఉపఖండంలో మోహరించాయి. అవి ప్రాంతీయ, స్థానిక పరిణామాలైనా ప్రత్యక్ష పాత్రధారులతో పాటు, పరోక్ష సూత్రధారులు లేకుండా జరగలేవు.

అభ్యుదయ, లౌకికవాది అయిన ముజిబుర్ రెహ్మాన్ సారథ్యంలో బంగ్లాదేశ్ ముందుకు వెడుతుందనుకుంటే, దేశం ఏర్పడిన నాలుగేళ్లకే ఆయన సైన్యం చేతిలో హత్యకు గురి అయ్యారు. నాటి నుంచి సైనిక పాలనలు, హత్యలు, అడపాదడపా ఎన్నికలు, తిరిగి కూల్చివేతలతో సంక్షోభంలోనే బంగ్లాదేశ్ ప్రయాణిస్తూ వచ్చింది. వీటన్నిటి మధ్యనే అనేక తరాల ప్రజలు జీవనం సాగించారు, కొంత పురోగతి పొందారు, అప్పుడప్పుడు నిస్పృహ చెందారు, పోరాడారు, అణచివేతలు ఎదుర్కొన్నారు. తాజాగా ఇప్పుడు అక్కడ జరిగిన పరిణామంలో, మొదటిసారిగా, జనసామాన్యం తమ గొంతు బలంగా వినిపించే, తమ అభీష్టాన్ని నెరవేర్చుకునే ప్రయత్నం చేసింది. క్రూరమైన నియంతృత్వాన్ని చెలాయించి, బతుకుజీవుడా అంటూ భారత్‌కు పారిపోయిన షేక్ హసీనా, బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు, బంగబంధు ముజిబుర్ రెహమాన్ కుమార్తె కావడం విషాదం. ఈమె సమకూర్చుకున్న అప్రదిష్ట, తండ్రి స్మారకాల మీద కూడా దాడులకు కారణమయింది.

పొరుగింటికి నిప్పు అంటుకున్నప్పుడు, అందులోని మనుషులకు ఏమి జరిగిందో అన్న ఆవేదనతో పాటు, అది తమ ఇంటిని కూడా కాలుస్తుందేమోనన్న భయం కూడా ఇరుగింటివారికి కలుగుతుంది. బంగ్లాదేశ్ పరిణామాల విషయంలో భారత్ కలవరానికి అర్థం ఉంది. హింసా విధ్వంసాలు ఎటు మలుపు తిరుగుతాయో, ఆ దేశంలో మైనారిటీల మీద దాడులు జరుగుతాయో, ఫలితంగా దేశంలోకి శరణార్థులు వెల్లువలా వచ్చిపడతారేమో, అన్న ఆందోళనలు కలగడంలో ఆశ్చర్యం లేదు. ఇక, దక్షిణాసియా, గ్లోబల్ రాజకీయాల నేపథ్యంలో అర్థం చేసుకోవలసిన అంశాలు మరికొన్ని ఉన్నాయి. షేక్ హసీనా భారత్‌తో స్నేహసంబంధాలలో ఉండేవారు. ఆమె చిరకాల ప్రత్యర్థి ఖలీదా జియా భారత్ వ్యతిరేక ధోరణిలో ఉండేవారు. ఈశాన్య భారతంలోని తిరుగుబాటుదారులకు ఖలీదా ఆశ్రయం ఇచ్చి ప్రోత్సహించేవారు. పాకిస్థాన్, చైనా, అమెరికాలతో స్నేహంగా ఉండేవారు. మిలిటెంట్ ఇస్లామ్ వాదం ప్రభావం బంగ్లాదేశ్ మీద కూడా పడింది. ఆ వైపు నుంచి కూడా భారతదేశానికి సమస్య ఏర్పడింది. మిలిటెంట్లను హసీనా అదుపు చేసినంతగా, ఖలీదా చేయలేదు.

బలహీనంగా ఉన్న బంగ్లాదేశ్‌ను తమ అదుపులోకి తెచ్చుకోవడానికి చైనా చిరకాలంగా ప్రయత్నిస్తోంది. తానే బలహీనపడిపోయి ఉన్న పాకిస్థాన్ ఇంకా పాత పరాభవాన్ని మరచిపోలేక, సైన్యం ద్వారా, కొన్ని రాజకీయ మత సంస్థల ద్వారా తన ప్రభావాన్ని వేస్తోంది. చైనా, పాక్ ఈ విషయంలో పరస్పరం సహకరించుకుంటున్నాయని భారత్ భావిస్తోంది. సుదూరాన ఉన్న అమెరికాకు, దక్షిణాసియా ఎంతో కీలకమయిన ప్రాంతం. చైనాను అదుపు చేసే స్నేహాల కోసం, స్థావరాల కోసం వెదుకుతూ వస్తోంది. తమ సైనిక కేంద్రం పెడతామని అమెరికా అడిగిందని, అందుకు తాను అంగీకరించలేదని హసీనా ఈ మధ్య అన్నారు. చైనాను బలహీనపరచాలనే అమెరికా ప్రాజెక్టులో చేతులు కలపడానికి ఉత్సాహపడుతున్నప్పటికీ, ఉపఖండ భూభాగం మీద అమెరికాకు చోటు ఇచ్చే ప్రతిపాదనకు మాత్రం భారత్ అంగీకరించదు.

మరి బంగ్లాదేశ్ విషయంలో భారత్ ఏమి కోరుకుంటోంది? అక్కడి ప్రజలకు రుచించని సాహస నిర్ణయాలేవీ తీసుకోవాలనుకోదు. హసీనాకు తాత్కాలిక ప్రాతిపదికన ఆశ్రయం ఇచ్చాము కానీ, ఆమెను ఇక్కడే కొనసాగించే ఉద్దేశం లేదని భారత విదేశాంగ మంత్రి సూచిస్తూనే ఉన్నారు. అక్కడి పరిస్థితులు చక్కబడాలని కోరుకోవడంతో పాటు, కొత్తగా ఏర్పడే తాత్కాలిక ప్రభుత్వంలో భారత వ్యతిరేక శక్తులది పైచేయి కాగూడదని ఆశిస్తోంది, బహుశా అందుకు ప్రయత్నం కూడా చేస్తూ ఉండవచ్చు. ఇక్కడ భారత వ్యతిరేక శక్తులంటే, జమాతే ఇస్లామీ, ఖలీదాజియా నాయకత్వంలోని బిఎన్‌పి, అక్కడి సైన్యంలోని చైనా, పాకిస్థాన్ అనుకూల అధికారులు!

బంగ్లాదేశ్ పరిణామాలను భారత ప్రభుత్వ విదేశాంగ దృక్పథం నుంచి మాత్రమే అర్థం చేసుకోవడం సరి అయినదేనా? ఒక ప్రజావ్యతిరేక పాలన మీద అపూర్వమైన తిరుగుబాటుగా గుర్తించడంలో సంకోచం ఎందుకు? భారతీయ మీడియా, ముఖ్యంగా అధికార పీఠాల ఆలింగనంలో ఉన్నదనుకుంటున్న జాతీయ ఆంగ్ల, హిందీ మీడియా, ఎందుకు బంగ్లా పరిణామాలలో కొంత కుట్రకోణాన్ని, కొంత టెర్రరిజాన్ని, మరికొంత హిందూ వ్యతిరేకతను మాత్రమే చూస్తున్నది? రాజకీయకారణాలతోనే తిరుగుబాటు జరిగినా, బంగ్లాదేశ్‌లో కల్లోలం అక్కడి మైనారిటీలలో ఎంతో కొంత భయాందోళనలను కలిగించింది. పెద్దసంఖ్యలో ప్రజలు, ఒక సంస్థాగత నిర్మాణంలో కాకుండా, యథేచ్ఛగా ఆందోళనలకు దిగినప్పుడు, విద్యార్థులు, ప్రవాస బంగ్లాదేశీయులు మాత్రమే కాక, విస్తృత ప్రజాశ్రేణులు అందులో భాగం అయినప్పుడు, అక్కడక్కడ అరాచకం, హింసాధోరణి కనిపించడం సహజం! ప్రతిఘటించలేక చతికిలపడిన పాత ప్రతిపక్షం కూడా ప్రజల ఉద్యమానికి మద్దతు ఇచ్చింది. ప్రస్తుత సందర్భంలో హసీనా పార్టీ 'అవామీలీగ్' కార్యాలయాల మీద, కార్యకర్తల వ్యాపారాల మీద దాడులు ఎక్కువగా జరిగాయి. దహనకాండలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు కూడా. కానీ, ఆ దేశంలో జరిగిన పరిణామాల తీవ్రతను దృష్టిలో పెట్టుకుంటే, ప్రాణనష్టం తక్కువేనని చెప్పాలి. హిందూ మైనారిటీల ఆస్తులపై, దైవస్థలాలపై జరిగిన దాడులు కూడా తొందరలోనే తగ్గుముఖం పట్టాయి. అవామీలీగ్ కార్యకర్తలుగా, నాయకులుగా ఉన్న హిందువులు రాజకీయ కారణాల వల్లే లక్ష్యంగా మారారు. హింసను విరమించుకోవాలని ఉద్యమనాయకులు, వివిధ రాజకీయనేతలు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నారు. హసీనా వ్యతిరేక పోరాటంలో ముందుభాగాన ఉన్న విద్యార్థి నాయకులు, సైనిక పాలనకు తాము వ్యతిరేకమని, విశ్వసనీయత ఉన్న ప్రజారంగ వ్యక్తి అధ్వర్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరడం విశేషం. వారు కోరినట్టుగానే నోబెల్ బహుమతి గ్రహీత, సూక్ష్మపొదుపు ఉద్యమాన్ని నిర్వహించిన మహమ్మద్ యూనస్ బంగ్లా ప్రభుత్వ బాధ్యతలు చేపట్టబోతున్నారు. హసీనా ప్రభుత్వం వల్ల తీవ్రమైన వేధింపులను ఎదుర్కొన్న యూనస్ పశ్చిమదేశాలకు అనుకూలుడని చెబుతారు. భారత్‌తో సత్సంబంధాలు ఎంతటి కీలకమైనవో యూనస్‌కు తెలుసును కాబట్టి, ఆయన వైఖరి సానుకూలంగా ఉండవచ్చునని భారత్ ఆశిస్తోంది.

భారత్‌తో స్నేహంగా ఉండడంతో పాటు, షేక్ హసీనా హయాం లౌకిక విధానాలతో కొనసాగింది. మత ఉద్రిక్తతలు చాలా తక్కువ. వస్త్ర పరిశ్రమకు ప్రపంచంలో మార్కెట్‌ను విస్తరింపజేసి, దేశంలో ఉపాధిని పెంచారు. దీర్ఘకాలం 'సుస్థిరత' కొనసాగింది. ఇవన్నీ నిజమే కావచ్చు. కానీ, 17 కోట్ల జనాభాలో 3 కోట్లమంది నిరుద్యోగులు. బంగ్లాదేశ్ కరెన్సీ 'టాకా' విలువ 28 శాతం తగ్గింది. మూడేళ్లలో విదేశీ మారక నిల్వలు 44 శాతం తగ్గాయి. 2021లో 5.51 శాతం ఉన్న ద్రవ్యోల్బణం 2024లో 9.73 శాతానికి చేరింది. వీటన్నిటి ప్రతిఫలనాలు జనజీవనంలో వ్యక్తమయ్యాయి. ప్రజలు తమ అవసరాలను, అసమ్మతిని చెప్పుకోవడానికి ఆస్కారం లేకుండా పోయింది. ప్రతిపక్షం అణగారిపోయింది. నిర్బంధం తారస్థాయికి చేరింది. అక్రమనిర్బంధాలు, చట్టవ్యతిరేక కాల్చివేతలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి. తమ అసహనానికి ప్రాతినిధ్యం వహించే రాజకీయ శక్తే లేకపోయిన ప్రజలు తామే వీధుల్లోకి వచ్చారు. ఇందుకు ఏ కుట్రా, ప్రచ్ఛన్నహస్తమూ అవసరం లేదు. హసీనా, బంగ్లా పాలకవర్గాలూ చేజేతులా తెచ్చుకున్న దుస్థితే ఇది. భారత ప్రతిపక్షాలు బుధవారం నాడు పార్లమెంటులో బంగ్లా పరిణామాలు ఇస్తున్న రాజకీయ సందేశాన్ని వక్కాణించాయి. భారతదేశంలోని రాజకీయార్థిక పరిస్థితులను బంగ్లా పరిణామాలతో పోల్చారు. పైపైన అంతా బాగానే కనిపిస్తున్నా, లోలోపల ముదురుతున్న సంక్షోభాన్ని గుర్తించకపోతే, భారత ప్రభుత్వానికి కూడా ముప్పు తప్పదన్నట్టు వారు హెచ్చరించారు. మరి ఎందుకు, ఘనత వహించిన ప్రసార, సమాచార సాధనాలు, బంగ్లాదేశ్‌లో జరుగుతున్నదంతా భారత్‌కు వ్యతిరేకంగానే అన్నట్టుగా, హసీనా అపరాధం ఏమీ లేనట్టుగా చిత్రిస్తున్నాయి? ఇస్లామిస్టు అరాచక శక్తుల ఇష్టారాజ్యం నడుస్తోందని, హిందువుల మీద హత్యాకాండ జరుగుతోందని ఇంటెలిజెన్స్ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ చానెళ్లు ఎందుకు ప్రసారాలు చేస్తూ భయపెడుతున్నాయో తెలియడంలేదు.

> హసీనా వ్యతిరేక పోరాటంలో ముందుభాగాన ఉన్న విద్యార్థి నాయకులు, సైనిక పాలనకు తాము వ్యతిరేకమని, విశ్వసనీయత ఉన్న ప్రజారంగ వ్యక్తి ఆధ్వర్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరడం విశేషం. వారు కోరినట్టుగానే నోబెల్ బహుమతి గ్రహీత, సూక్ష్మపొదుపు ఉద్యమాన్ని నిర్వహించిన మహమ్మద్ యూనస్ బంగ్లా ప్రభుత్వ బాధ్యతలు చేపట్టబోతున్నారు.


యూనస్ చేతికి ప్రభుత్వం వచ్చినంత మాత్రాన, మంత్రం వేసినట్టు పరిస్థితి మారిపోదు. రేపటికి పరిస్థితులు మారి, విచ్ఛిన్న శక్తులు దేశాన్ని అతలాకుతలం చేసే హింసకు పాల్పడవచ్చు, చెప్పలేము. కానీ, ఇప్పటికి అయితే, బంగ్లాదేశ్‌లో చాలా వేగంగా పరిస్థితులు కుదురుకుంటున్నాయి. గురువారం నాడు తాత్కాలిక ప్రభుత్వం ప్రమాణం తరువాత, శాంతిభద్రతలు సాపేక్షంగా మెరుగుపడే ఒక వాతావరణం ఏర్పడుతుంది. మౌలిక జీవన పరిస్థితులు మెరుగుపడితే తప్ప, అశాంతి తగ్గదు. ఆ దిశగా ప్రయాణం మొదలయిందని ఒక సూచన వ్యక్తమైతే ప్రజలు సహనంతో ఎదురుచూస్తారు.

తమ బెంగాలీ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి పాకిస్థాన్‌తో తెగదెంపులు చేసుకున్నవారు బంగ్లాదేశీయులు. వారి జాతీయ గీతం 'అమర్ సోనార్ బంగ్లా' కర్త రవీంద్రనాథ్ ఠాగోర్. హసీనాకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో ఆందోళనకారులకు ప్రేరణ, ఉత్సాహం ఇచ్చిన పద్యం ద్విజేంద్రలాల్ రాయ్ 20వ శతాబ్ది తొలిసంవత్సరాలలో రాసిన "ధనో ధాన్యో పుష్పో భరా" అన్న బెంగాలీ గీతం. "ధనధాన్యాలతో, పుష్పాలతో నిండిన మాతృభూమీ, స్వప్నాలలో పుట్టి, స్మృతులతో నిండిన తల్లీ, నీవంటి నేల ఇంకెక్కడన్నా ఉందా; నా మాతృభూమీ, రాజ్యాలన్నిటికీ రాణీ".. అంటూ కీర్తించే ఈ పాటలో మాతృదేశం ఆనాటి ఉమ్మడి భారతదేశం. ఇప్పుడు బంగ్లాదేశ్‌ను ఉద్దేశించి కూడా అక్కడి పోరాటవాదులు అదే పాడుకుంటున్నారు. భాషతో, నేలతో ముడిపడిన ఆ మమకారాన్ని బంగ్లాదేశ్ కొనసాగించి తీరుతుంది!

'నీట్ వద్దు' సరికాదు!

నీట్ కథ ఈ ఏడాదికి కొలిక్కి వచ్చినట్టే. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కాలేజీల్లో ఎంబీబీఎస్ అలాగే డెంటల్ డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఉద్దేశించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష నీట్. ఒక దేశం – ఒకే పరీక్ష అవసరాన్ని నొక్కి చెప్పిన సుప్రీంకోర్టు మొత్తమ్మీద సమస్యను సముచితంగా పరిష్కరించే ప్రయత్నమే చేసింది. పరీక్షకు ముందే పేపర్ లీక్ కావడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సర్వోన్నత న్యాయస్థానం, రాసిన విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిందని చెప్పాలి. నీట్‌కు హాజరైన ఇరవై నాలుగు లక్షల పైచిలుకు విద్యార్థుల భవితవ్యాన్ని ఇబ్బందుల్లోకి నెట్టకూడదన్న ఒకే ఒక్క లక్ష్యంతో వ్యవహరించినట్లుంది. కొద్దిమంది చేసిన పాపం అందరిపాలిట శాపంగా మారకూడదని భావించింది.

నిజానికి ఈ ఏడాది తలెత్తిన సంక్షోభం మన దేశాన్ని కుదిపేసింది. నీట్ నుంచి తమ రాష్ట్రాన్ని మినహాయించాలని తమిళనాడు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తోంది. తాజాగా ఇప్పుడది మరిన్ని రాష్ట్రాలకు పాకింది. నీట్ రద్దు సమంజసం అనుకుంటే దానికి ముందు మరికొన్ని అంశాలపై దృష్టి సారించడం అవసరం.



> నేషనల్ పూల్‌కు తెలుగు రాష్ట్రాలు సీట్లు ఇవ్వని రోజుల్లో స్థానికంగా ఉన్న సీట్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు నేషనల్ పూల్‌కు ఇచ్చిన సీట్ల కంటే పోటీ పడేందుకు పెరిగినవి ఎక్కువ. నేషనల్ పూల్‌లో చేరడంతో ఒక్క నీట్‌తోనే మన విద్యార్థులకు మెడిసిన్‌లో చేరే సీట్ల సంఖ్య, తదనుగుణంగా అవకాశాలు పెరిగాయి. నీట్ వద్దనుకున్నప్పుడు వీటినీ దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది. నీట్‌ను కాదనుకోవడం ఒక్కటే సమస్యకు పరిష్కారం కూడా కాబోదు.

తెలుగు రాష్ట్రాల్లో కొద్దికాలం క్రితం వరకు ఎంసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా మెడిసిన్, డెంటల్ సీట్లను భర్తీ చేసేవారు. అప్పట్లో ఆ పరీక్ష చుట్టూ నెలకొన్న వివాదాలు తెలిసినవే. ఎప్పుడైతే మెడిసిన్, డెంటల్‌ను దాని నుంచి విడదీశారో ఒక్కసారి ఆ టెస్టు ప్రాముఖ్యం కోల్పోయింది. ఎంసెట్ పేరు మారినప్పటికీ అది పెద్ద చర్చనీయాంశం కాలేదు. అసలా పరీక్ష నిర్వహణ, ఫలితాల ప్రకటన కూడా యథావిధిగా జరిగే తంతుగా మారి చాలాకాలమైంది. తెలుగు రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ సీట్లకు కొద్దిగా అటూయిటూగా అర్హులు లెక్క తేలుతున్నారు. తెలంగాణలో ఇటీవలి కౌన్సెలింగ్ తీరును ఒకసారి పరిశీలిస్తే తొలి వెయ్యి ర్యాంకర్లలో చాలా మంది సదరు ప్రక్రియకే దూరంగా ఉన్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ సహా పలు ప్రసిద్ధ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నత ప్రమాణాలతో ఇంజనీరింగ్ కోర్సులు అందిస్తున్నాయి. తెలివితేటలు ఉంటే మంచి ర్యాంకుతో తాము కోరుకున్న కాలేజీలో సీటు పొందుతున్నారు. లేదంటే మంచి ప్రైవేటు కాలేజీలో తగు రుసుము చెల్లించి సీటు కొనుక్కుంటున్నారు. మరికొంత మంది ఏదో కాలేజీలో వచ్చిన సీటుతో సరిపెట్టుకుంటున్నారు. అంతేతప్ప ఇంజనీరింగ్ చదువుకు మాత్రం దూరం కావడం లేదు. డిమాండ్‌కు మించి సీట్లు అందుబాటులో ఉండటం ఇక్కడ ఉన్న పెద్ద వెసులుబాటు. అదే మెడిసిన్ విషయానికి వస్తే డిమాండ్‌కు తగ్గట్టు సీట్లు అందుబాటులో లేకపోవడం దురదృష్టకరం. ప్రైవేటు మెడికల్ కాలేజీలో సీటు అంటే లక్షలతో వ్యవహారం. అదే నీట్ విషయంలో అడ్డదారులు తొక్కేందుకు దోహదపడుతోంది. ఫలితంగా ఈ దొంక తిరుగుడు మార్గాలను అవలంబిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఎప్పటికప్పుడు కొత్త కుయుక్తులను పన్నుతుండటమూ తెలిసిందే.

నీట్ ఉనికిలో లేనప్పుడు మెడిసిన్‌పై ఆసక్తి ఉన్న అభ్యర్థులు వేర్వేరు నేషనల్ లెవెల్ టెస్టులు రాస్తుండేవారు. ఎంతలేదన్నా రెండు, మూడు ఎంట్రెన్స్ టెస్టులకు హాజరయ్యేవారు. ఢిల్లీలోని ఎయిమ్స్ వార్ధాలోని ఎంజీఐఎంఎస్, పుణెలోని ఏఎఫ్ఎంసీ, రాయవెల్లూరు, లుధియానాల్లోని సీఎంసీ, బెంగళూరులోని సెయింట్ జాన్స్, మణిపాల్ మెడిసిన్‌కు వేర్వేరు టెస్టులు ఉండేవి. ఇది కాకుండా పొరుగున ఉన్న కర్ణాటకలోని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో సీట్ల కోసం కొమెడ్ రాయాల్సి వచ్చేది. బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీకి తోడు మెడికల్ కాలేజీ ప్రమాణాలను అనుసరించి అదనంగా కరెంట్ అఫైర్స్ కూడా ఉండేది. కొన్ని చోట్ల ఇంగ్లీష్ ఒక టాపిక్‌గా ఉండేది. వీటన్నింటికీ ప్రిపరేషన్ కూడా వేర్వేరుగా ఉండేది. అలాగే నేషనల్ పూల్‌కు తెలుగు రాష్ట్రాలు సీట్లు ఇవ్వని రోజుల్లో స్థానికంగా ఉన్న సీట్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు నేషనల్ పూల్‌కు ఇచ్చిన సీట్ల కంటే పోటీ పడేందుకు పెరిగినవి ఎక్కువ. ఈ పరీక్షలు అన్నింటినీ రాయడం ఒక ఎత్తు. వీటికి కట్టాల్సిన ప్రవేశ పరీక్ష ఫీజులు, దరఖాస్తు సమర్పణ మరొక ఎత్తు. అదేవిధంగా నేషనల్ పూల్‌లో చేరడంతో ఒక్క నీట్‌తోనే మన విద్యార్థులకు మెడిసిన్‌లో చేరే సీట్ల సంఖ్య, తదనుగుణంగా అవకాశాలు పెరిగాయి. నీట్ వద్దనుకున్నప్పుడు వీటినీ దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది.

ఈ నేపథ్యంలో నీట్‌ను కాదనుకోవడం ఒక్కటే సమస్యకు పరిష్కారం కూడా కాబోదు. ఒనగూరుతున్న ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుంటే పరిష్కారాలు, ప్రత్యామ్నాయాలు కూడా కనిపిస్తాయి. టోఫెల్, జీఆర్ఈ, జీమ్యాట్ వంటి పరీక్షలు ప్రపంచవ్యాప్తంగా పకడ్బందీగా జరుగుతున్నాయి. అత్యున్నత స్థాయి పరీక్షల నడగ్గ జేఈఈ అడ్వాన్స్‌డ్, క్యాట్ వంటి వాటి నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకావడం లేదు. నిజానికి ఈ పరీక్షలను నిర్వహించే ఐఐటీ లేదంటే ఐఐఎంలు ఏటా మారుతుంటాయి కూడా. అంతవరకు ఎందుకు – నీట్‌ను నిర్వహిస్తున్న ఎన్‌టీఏ ఇటీవలి కాలంలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు ఉద్దేశించిన జేఈఈ మెయిన్ ఎగ్జామ్‌ను ఎంతగానో మెరుగుపర్చింది. కొవిడ్ సమయంలో నాలుగు పర్యాయాలు నిర్వహించి బెస్ట్ స్కోర్ ఆధారంగా ర్యాంకులను నిర్ణయించింది. అలాగే ఇటీవలి కాలంలో జనవరిలో ఒకసారి, ఏప్రిల్‌లో మరోసారి అంటే ఇంటర్ సెకండియర్ పరీక్షలకు ముందు, తదుపరి నిర్వహించి బెస్ట్ స్కోర్ ఆధారంగా ర్యాంకులను నిర్ధారిస్తోంది. అది కూడా కంప్యూటర్ ఆధారిత టెస్ట్‌ను జరుపుతోంది. అంతర్జాతీయ ప్రమాణాలను పాటించి మరీ ర్యాంకులను తేలుస్తోంది. అదే ఒరవడిని నీట్‌కూ నిర్దేశించుకోవచ్చు.

• మద్దిపట్ల మణి

ఏపీ మోడల్ స్కూల్స్ సొసైటీ రద్దు చేయాలి

ఎపీఎంఎస్ సొసైటీని (ఏపీ మోడల్ స్కూల్స్ సొసైటీ) రద్దు చేయవలసిన అవసరం ఉంది. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమం జాబితాలో 2015లో సెంట్రల్ గవర్నమెంట్ నుండి మోడల్ స్కూల్స్ ప్రాజెక్ట్ వేరుపడిన సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ విధానపరమైన నిర్ణయంతో నిధులు కేటాయిస్తూ ఈ పాఠశాలలను ఆధీనంలోకి తీసుకుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఆంగ్ల మాధ్యమంతో 164 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. వీటిని రాష్ట్ర ప్రభుత్వం తన ఆధీనంలో తీసుకుంటూ రెగ్యులర్ ఉపాధ్యాయ సిబ్బందిని పాఠశాల విద్యా శాఖలోకి విలీనం చేసింది. తర్వాత మనుగడలో లేని మోడల్ స్కూల్స్ సొసైటీ రిజిస్ట్రేషన్ సంఖ్య 347/2020 ద్వారా ఉన్న ఎగ్జిక్యూటివ్ కమిటీ సాంకేతికంగా రద్దు అయినట్టే. కాబట్టి టీచింగ్ సిబ్బందికి రీవైజ్డ్ సర్వీస్ రూల్స్, కారుణ్య నియామకాలు విధానం అమలు కొరకు భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా మోడల్ స్కూల్స్ సొసైటీని రద్దు చేసినట్లు అధికారికంగా ప్రకటించాలి. మనుగడలో లేని అనధికార సొసైటీని బైలా ప్రకారం రద్దు చేయకుండా ఉంచితే, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అయ్యే అవకాశాలకు అడ్డంకిగా మారుతుందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్‌లో ప్రస్తుతం ప్రిన్సిపల్స్, పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్స్, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ రెగ్యులర్ విధానంలో పని చేస్తున్నారు. నాన్ టీచింగ్ సిబ్బంది పొరుగు సేవల విధానంలో పనిచేస్తున్నారు.

– బి. సురేష్

సాహిత్య కోర్టులో సామాజిక న్యాయవాది

ఆధునిక తెలుగు నాటక సాహిత్యంలో మోదుకూరి జాన్సన్ అరుదైన అధ్యాయం. ఊరవతలకి నెట్టివేయబడిన అంటరాని ప్రజల కన్నీటి మంటలని రంగస్థలం మీద రగిలించి, సాంఘిక విప్లవ జ్యోతిని వెలిగించిన కళావీరబాహుడు జాన్సన్. తన నటనాలయంలో కళామతల్లిని త్రికరణశుద్ధిగా అర్చించిన హేతువాది ఆయన. మనువాద పెను నిచ్చెనను తునాతునకలు చేసే తాత్విక చైతన్యాన్ని జాతికి అందించిన దళితవాది జాన్సన్. కావ్యరాజ్య మహారాణిగా కాకికి పట్టాభిషేకం చేసిన విలక్షణ కవి. అనుభవ జనితమైన దార్శనిక దృష్టితో, సామాజిక చింతనాభరితమైన దృశ్యకావ్యాలు రచించి తెలుగు నాటకానికి చైతన్యాన్ని అందించాడు. రామ పాదానికీ, రైతు పాదానికీ అభేదం చెప్పి, శ్రమైక జీవనమహత్వాన్ని సమున్నతంగా చాటి చెప్పిన గొప్ప సాహితీవేత్త. "జాన్సన్ బహు ప్రక్రియా దురంధరుడు. పద్యం, గేయం, గానం, నాటకం, సంగీతం, జానపదం, సామాజిక కళాతత్త్వం కాచి వడబోసినవాడు" అని ఎండ్లూరి సుధాకర్ బహుముఖీన జాన్సన్ సాహిత్య వ్యక్తిత్వాన్ని సముచితంగా విశ్లేషించాడు.

మోదుకూరి జాన్సన్ గుంటూరు జిల్లా తెనాలి తాలూకా కొలకలూరు గ్రామంలో రత్నమ్మ, గురవయ్య దంపతులకు 1934 ఆగస్టు 8 జన్మించాడు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యవసాయ కూలి కుటుంబంలో పుట్టిన జాన్సన్, గుంటూరు ఏసీ కళాశాలలో డిగ్రీ అభ్యసించి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో న్యాయవాద విద్య పూర్తిచేశాడు. కొంతకాలం కోర్టులో న్యాయవాదిగా వాదించి, అనంతరం సాహిత్య కోర్టులో ప్రవేశించి సామాజిక న్యాయవాదిలా గర్జించాడు. ప్రభుత్వ అనువాద శాఖలో ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తూనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో వినూత్న కళా రూపకాలను ప్రదర్శించి సమాజాన్ని జాగృతం చేశాడు. ఆలోచనాత్మకమైన సినిమా కథలతో, పదునైన సంభాషణలతో 'నట సామ్రాట్'లకు, 'నటరత్న'లకు జాన్సన్ అత్యంత ప్రీతిపాత్రుడయ్యాడు. సినీ నటుడు కృష్ణ చెప్పినట్లుగా ఆయన పరిపూర్ణ కళాకారుడిగా ప్రఖ్యాతి గాంచాడు. హైదరాబాద్‌లోని సీతారామ్‌బాగ్‌లో చాలాకాలం నివాసమున్న జాన్సన్, 1988 డిసెంబర్ 24న తన జీవితనాటక రంగానికి తెరదించాడు.

తెనాలితో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో నాటకాలను చూస్తూ నటనను శ్వాసిస్తూ, ధ్యానిస్తూ పెరిగిన జాన్సన్.. నిరంతర కృషితో, నిరుపమాన కళాసాధనతో రచయితగా ఎదిగి నాటక, సినీరంగాల్లో రాణించాడు. 'పప్పుకూటి నాట్యమండలి', 'సుఖేలా నికేతన్' వంటి సంస్థలను ఏర్పాటు చేసి తద్వారా సాంస్కృతిక చైతన్యాన్ని కలిగించాడు. ఢిల్లీలో జరిగిన అంతర్ రాష్ట్ర విశ్వవిద్యాలయ స్థాయి నృత్య నాటక పోటీలలో ప్రథమ బహుమతి సాధించి జాతీయస్థాయిలో గుర్తింపు పొందాడు. 1961 ఫిబ్రవరి 5, 6 తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన ఎస్సీ–ఎస్టీ పార్లమెంటు సభ్యుల మహాసభల్లో ప్రజారంజకంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి, ముఖ్య అతిథులైన ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, కేంద్ర మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్‌ల ప్రశంసలందుకున్నారు జాన్సన్.

నటనాలయం, దేవాలయం, నిచ్చెనమెట్లు, మాతంగ సమ్రాట్ అశోక్ మొదలగు నాటకాల ద్వారా జాన్సన్ అపారమైన కీర్తిని సంపాదించుకున్నాడు. నాటక సమాజం, నటుల మధ్య పవిత్రమైన బంధం పరిఢవిల్లాలని 'నటనాలయం' ద్వారా ఉదాత్త సందేశాన్ని అందించాడు.

సినీనటుడు గుమ్మడి సూచనతో తెలుగు సినిమా రంగంలో తెరంగేట్రం చేసిన జాన్సన్, దేశోద్ధారకుడు నుండి నేటిభారతం వరకు ఎన్నో సినిమాలకు కథ, మాటలు అందించి సినిమా రచయితగా కూడా దర్శక, నిర్మాతల, ప్రేక్షకుల అభినందనలు అందుకున్నాడు. "మన జన్మభూమి బంగారు భూమి...", "కదిలింది కరుణరథం...", లాంటి గొప్ప పాటలతో జాన్సన్ కవిగా తాను ఎవరికీ తీసిపోనని నిరూపించుకున్నాడు. జాన్సన్ రాసిన 'కాకి' తెలుగు కవిత్వంలో కవితలో తులనాత్మకంగా జాన్సన్ విశ్లేషించాడు.



> కావ్యరాజ్య నాయికగా కాకికి పట్టాభిషేకం చేసిన విలక్షణ కవి మోదుకూరి జాన్సన్. అనుభవ జనితమైన దార్శనిక దృష్టితో, సామాజిక చింతనాభరితమైన దృశ్యకావ్యాలు రచించి తెలుగు నాటకానికి చైతన్యాన్ని అందించాడు. రామ పాదానికీ, రైతు పాదానికీ అభేదం చెప్పి, శ్రమైక జీవనమహత్వాన్ని సమున్నతంగా చాటి చెప్పిన గొప్ప సాహితీవేత్త అయిన జాన్సన్ "బహు ప్రక్రియా దురంధరుడు. పద్యం, గేయం, గానం, నాటకం, సంగీతం, జానపదం, సామాజిక కళాతత్త్వం కాచి వడబోసినవాడు."

కులనిర్మూలన దృక్పథంతో జాన్సన్ రాసిన 'నిచ్చెన మెట్లు' నాటకం దళిత మేనిఫెస్టో వంటిది. ఆద్యంతం కవితాత్మక శైలిలో సాగే ఈ నాటకంలో బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, శూద్ర పాత్రలతో పంచముడు సాగించే సంభాషణ ఆసక్తి దాయకం. భరతమాత, నెహ్రూ, గాంధీ, అంబేద్కర్‌లను కూడా జాన్సన్ ఈ నాటకంలో పాత్రలుగా ప్రవేశపెట్టి రాజ్యాంగబద్ధమైన సమానత్వ విలువలను ఎరుకపరచాడు. అందుకే జాన్సన్ 'అంబేడ్కర్ జాషువాల ఐక్య రూపానికి' ఈ నాటకాన్ని అంకితం చేశాడు. కారంచేడు మారణకాండ అనంతరం వెల్లువెత్తిన ఆత్మగౌరవ పోరాటం నేపథ్యంలో దళిత, బహుజన తాత్విక స్ఫూర్తితో జాన్సన్ రచించిన 'మాతంగ సమ్రాట్ వీరబాహుడు' నాటకానికి ఎంతో ప్రాసంగికత ఉంది. జాన్సన్ నాటకాల్లోని పాత్రలు కుల, మత, వర్గ, భావ దృక్పథాలకు సంకేతాలుగా కవి సృజనాత్మకశక్తికి విజయ పతాకలుగా నిలుస్తాయని బోయి భీమన్న వివేచించాడు.

ప్రత్యామ్నాయ కవిత. బహుళప్రయోజన ప్రదాత అయిన కాకి ఔన్నత్యాన్ని ఈ కవితలో జాన్సన్ అద్భుతంగా నిరూపించాడు. కల్లబొల్లి కారణాలతో కాకిని అసహ్యించుకొని, కట్టుకథలతో ప్రాచీన పండితులు కోకిలను ఉన్నతీకరించారు. స్వభావాన్ని బట్టి కాకుండా కేవలం స్వరూపాన్ని బట్టి, స్వరాన్ని అనుసరించి కాకి, కోకిలల తీరుతెన్నుల గురించి తీర్పులు చెప్పారు. ఇలాంటి కుహనా తీర్పులను కొట్టిపారేసి కాకిని కావ్యనాయికగా జాన్సన్ తీర్చిదిద్దాడు. "కవుల భావనా ప్రపంచంలో 'కాకులు చీకాకులు'గా, 'కోకిలలు 'షోకిలలు'గా చెలామణీ అవుతున్నాయ"ని ఆయన తీవ్ర విమర్శ చేశాడు. ప్రపంచ తెలుగు మహాసభల వేదిక సాక్షిగా విశ్వనాథ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కవిసమ్మేళనంలో కాకి కవితను పఠించి జాన్సన్ కవి పండితులను గంగవెర్రులెత్తించాడు. కాకి, కోకిల నడుమ ఉన్న వ్యత్యాసాలను ప్రాచీన, ఆధునిక కవుల కవితా దృక్పథాలను ఈ కవితలో తులనాత్మకంగా జాన్సన్ విశ్లేషించాడు.

శ్రమైకజీవులైన అంటరాని ప్రజల త్యాగనిరతిని, ఆధిపత్య వర్గాల దోపిడీ తత్వాన్ని కూడా కాకి కవితలో జాన్సన్ ప్రతీకాత్మకంగా చిత్రించటం విశేషం. గుర్రం జాషువ గబ్బిలం కావ్య స్ఫూర్తి, ప్రగతిశీల కవిత్వప్రభావం కాకి కవితలో స్పష్టంగా కనిపిస్తుంది. జాన్సన్ అందించిన ప్రేరణతో జాలాది 'కాకులమ్మ' అనే అద్భుతమైన దీర్ఘ కవితను రాశాడు. ఈ బాటలోనే మామిండ్ల రామాగౌడు, మద్దూరి నగేశ్‌బాబు, డి.ఎం.ఆర్ శేఖర్ లాంటి కవులు కాకి ఆదర్శజీవితాన్ని మెరుగైన చూపుతో కవిత్వీకరించారు. కాకి కేంద్రంగా అనేకమంది కవులు రాసిన కవితలతో కోయి కోటేశ్వరరావు సంపాదకత్వంలో వెలువడిన 'కృష్ణద్విజ' (2017) సంకలనానికి కూడా సృజనపరమైన ఊతమిచ్చింది జాన్సన్ కవిత్వమే.


మోదుకూరి జాన్సన్‌పై జరగాల్సినంత చర్చ జరగలేదు. "మోదుకూరి జాన్సన్ సాహిత్యం పరిశీలన" అనే అంశంపై డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు పర్యవేక్షణలో నాగార్జున విశ్వవిద్యాలయంలో మూకిరి సుధ పరిశోధన చేసింది. జాన్సన్ సాహిత్య ప్రస్థానాన్ని అర్థం చేసుకోవడానికి ఈ అముద్రిత సిద్ధాంత గ్రంథం కొంతవరకు ఉపయోగపడుతుంది. గుంటూరు కృష్ణ 'చెదరని జ్ఞాపకం' అనే సంకలనం ద్వారా జాన్సన్ సాహిత్య కృషిని వివరించాడు. జాతి గర్వించదగిన మోదుకూరి జాన్సన్ సమగ్ర సాహిత్యాన్ని ఈ తరానికి అందుబాటులోకి తీసుకురావాలి. జాన్సన్ రచనలను పాఠ్యప్రణాళికల్లో పొందుపరచాలి. ఆయన ప్రబోధించిన సామాజిక, నైతిక తత్వాన్ని నవతరానికి బట్వాడా చేయాలి. "ఎంత విప్లవాగ్ని ఎంతటి బడబాగ్ని /ఎంత సింహ గర్జనెంత చురుకు/ ఎంత నూత్నతత్త్వ మెంత భావావేశ/మెంత సరస లీల ఎంత తీవి" అని నూతక్కి అబ్రహాం అన్నట్టుగా మోదుకూరి జాన్సన్ సింహగర్జన తెలుగు సాహిత్యంలో అనునిత్యం ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. ఆ మహనీయుడు మండించిన విప్లవాగ్ని నిరంతరం ప్రజ్వలిస్తూనే ఉంటుంది.

■ కోయి కోటేశ్వరరావు
తెలుగుశాఖ అధ్యక్షులు, ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్

(నేడు మోదుకూరి జాన్సన్ 90వ జయంతి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సాహిత్య సదస్సు.)



పోలీసులే ఇలా వస్తే ఎలా..




నగరం.. నరకం..

అస్తవ్యస్త ట్రాఫిక్‌తో అవస్థలు



బెంజిసర్కిల్ వద్ద ఎవరికి వారు ఇష్టానుసారంగా రాకపోకలు

గజిబిజి మేళం.. గందరగోళం.. ఉరుకులు పరుగుల ప్రయాణం.. ఉదయాస్తమానం అదే ప్రమాదం.. నగరవాసి ఆధునిక జీవన విధానం గురించి నాలుగు ముక్కల్లో చెప్పమంటే ఇదే సమాధానం వస్తుంది. ఉదయం లేచింది మొదలు.. రాత్రి నిద్రపోయే వరకూ జీవన పోరాటం ఒక ఎత్తయితే, రోడ్డెక్కాక చేసే యుద్ధం మరో ఎత్తు. ఎప్పుడు ఏం జరుగుతుందో.. ఎటు నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో.. అనుకుంటూ వెన్నులో వణుకొస్తున్నా.. ప్రయాణం ప్రాణం మీదకు తెస్తున్నా.. తప్పక ముందుకెళ్లాల్సిన పరిస్థితి. ఓవైపు ఓ విధానమంటూ లేని ట్రాఫిక్ ఆంక్షలు.. మరోవైపు వీఐపీల తాకిడి.. ఇంకోవైపు పనిచేయని సిగ్నళ్లు.. అస్తవ్యస్తంగా ఉన్న రహదారులు.. వీటన్నింటినీ దాటుకుని గమ్యస్థానానికి చేరాలంటే రోజుకు రెండు మూడుసార్లు పద్మవ్యూహాన్ని ఛేదించాల్సిందే. అటు ఆటోనగర్ నుంచి బెంజిసర్కిల్, బందరు రోడ్డు నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్, బెంజిసర్కిల్ నుంచి రామవరప్పాడు, రామవరప్పాడు నుంచి ఏలూరు రోడ్డు, ఇటు కాళేశ్వరరావు మార్కెట్ నుంచి లోబ్రిడ్జి, చిట్టినగర్, దుర్గగుడి నుంచి గొల్లపూడి వరకు ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. రాజధాని నగర హోదా దక్కాక ఈ కష్టాలు మరింత కఠినమయ్యాయి. టీడీపీ కూటమి ప్రభుత్వ రాకతో రాజధాని నగరంగా మరింత అభివృద్ధి పథంలో వెళ్తున్న విజయవాడ నగరంలో అస్తవ్యస్త ట్రాఫిక్ సమస్యకు ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉంది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



ఏలూరు రోడ్డులో కూలిన ట్రాఫిక్ సిగ్నల్ పోల్



కార్పొరేషన్ కార్యాలయం వద్ద పనిచేయని సీసీ కెమెరాలు



ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉపయోగంలో లేని ట్రాఫిక్ సిగ్నల్ బాక్సులు



బారికేడ్లు తోసుకుని మరీ..



రమేశ్ హాస్పిటల్ వద్ద ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ట్రాఫిక్‌కు అడ్డుగా..



బెంజిసర్కిల్ వద్ద ఎవరి దారి వారిదే..



నిర్మల కాన్వెంట్ జంక్షన్‌లో గజిబిజిగా..



వైసీపీకి బిగ్ షాక్

విజయవాడ కార్పొరేషన్‌లో మారుతున్న సమీకరణాలు

* వైసీపీకి గుడ్‌బై చెప్పనున్న 20 మంది కార్పొరేటర్లు
* తాజాగా సుజనాను కలిసిన 8 మంది

విజయవాడ కార్పొరేషన్‌లో వైసీపీకి భారీ షాక్ తగిలింది. సుమారు 20 మంది వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే 8 మంది కార్పొరేటర్లు విజయవాడ పశ్చిమ బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరిని కలిసి తాము పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పడం గమనార్హం.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 64 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వారిలో వైసీపీకి 49, టీడీపీకి 14, సీపీఎంకు ఒకరు చొప్పున కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య వైసీపీ వైపు వెళ్లి, ఎన్నికల అనంతరం సొంతగూటికి వచ్చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో 20 మంది కార్పొరేటర్లు వైసీపీని వీడి కూటమి వైపు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వీరిలో 8 మంది వైసీపీ కార్పొరేటర్లు బుధవారం సుజనా చౌదరిని కలిశారు. తాము మర్యాదపూర్వకంగానే కలిశామని చెబుతున్నా పార్టీని వీడేందుకు సిద్ధమయ్యే వారు సుజనాను కలిసినట్లు తెలుస్తోంది. సుజనాను కలిసిన వైసీపీ కార్పొరేటర్లలో మహాదేవు అప్పాజీ, అత్తులూరి ఆదిలక్ష్మి, మరుపిళ్ల రాజేశ్, గుడివాడ నరేంద్ర, మైలవరపు రత్నకుమారి, అర్షద్, ఉమ్మిడిశెట్టి బహదూర్‌తో పాటు గతంలో వైసీపీకి వెళ్లిన మాధురి లావణ్య కూడా ఉన్నట్లు సమాచారం. వైసీపీ కార్పొరేటర్లు సుజనా చౌదరిని కలవడంతో ఆ పార్టీ నాయకుల్లో ఆందోళన నెలకొంది. ఈ సమాచారం తెలిసిన వెంటనే రంగంలోకి దిగిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు.. కార్పొరేటర్లను బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు టీడీపీ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు వైసీపీ కార్పొరేటర్లను కూటమి పార్టీల్లో చేర్చేందుకు చాపకింద నీరులా తన ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు ఆయనతో టచ్‌లోకి వచ్చినట్లు సమాచారం.

పశ్చిమ నుంచే ఎక్కువ

మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు 2019లో ఎమ్మెల్యేగా గెలుపొందిన పశ్చిమ నియోజకవర్గంలో అత్యధికంగా 22 డివిజన్లకు 19 స్థానాలను వైసీపీ గెలుచుకుంది. సెంట్రల్, తూర్పు నియోజకవర్గాల్లో టీడీపీ కాస్త పోటీ ఇచ్చింది. సెంట్రల్‌లోని 21 స్థానాలకు వైసీపీ 16 స్థానాల్లో గెలుపు సాధించింది. తూర్పులో 21 స్థానాలకు ఏడు స్థానాల్లో టీడీపీ, 14 స్థానాల్లో వైసీపీ గెలుపొందింది. ప్రస్తుతం పశ్చిమ నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది కార్పొరేటర్లు వైసీపీని వీడి కూటమిలోని పార్టీల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. విజయవాడ సెంట్రల్, తూర్పు నుంచి కూడా పలువురు వైసీపీ కార్పొరేటర్లు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పనున్నారు. అయితే, నిబంధనల ప్రకారం మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలంటే 2025-మార్చి వరకు వేచి చూడాల్సి ఉంటుంది. దీంతో మేయర్ పీఠం కూటమికి దక్కే అవకాశాలు లేవు. కార్పొరేషన్‌లో ఆధిపత్యం చాటుకోవడానికి మాత్రమే మారిన సమీకరణాలు ఉపయోగపడే అవకాశం ఉంది.



డీజీపీకి లయోల ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనం

6లో..

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చే శక్తి యువతదే..

మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై అవగాహనలో డీజీపీ ద్వారకా తిరుమలరావు



తడుస్తూ స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు


జోరున వాన

జిల్లావ్యాప్తంగా భారీగా వర్షాలు



వారధి వద్ద వానలో వాహనాల రాకపోకలు

విజయవాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం తెల్లవారుజాము నుంచి హోరున వర్షం కురిసింది. మొత్తంగా 198.6 మిల్లీమీటర్ల వర్షం కురవగా, సరాసరి 9.93 మిల్లీమీటర్లుగా నమోదైంది. అత్యధికంగా విస్సన్నపేటలో 21.6 మి.మీ, అత్యల్పంగా మైలవరంలో 3.2 మి.మీ వర్షం కురిసింది. ఈ వర్షానికి విజయవాడలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. చిట్టినగర్‌లోని సొరంగం వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు జరుగుతుండడం, మరోపక్క రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కొన్నిచోట్ల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పొంగిపొర్లింది. విస్సన్నపేటలో 21.6, తిరువూరులో 20.6, వీరులపాడులో 16.8, గంపలగూడెంలో 14.2, కంచికచర్లలో 13.2, చందర్లపాడులో 13.2, పెనుగంచిప్రోలులో 12.4, నందిగామలో 12.0, వత్సవాయిలో 11.4, జగ్గయ్యపేటలో 10.6, ఎ.కొండూరులో 6.4, విజయవాడ రూరల్‌లో 6.4, జి.కొండూరులో 5.6, విజయవాడ సెంట్రల్‌లో 5.6, విజయవాడ పశ్చిమలో 5.6, ఇబ్రహీంపట్నంలో 5.2, విజయవాడ తూర్పులో 5.2, విజయవాడ ఉత్తరంలో 5.0, రెడ్డిగూడెంలో 4.4, మైలవరంలో 3.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



ప్రకాశం బ్యారేజీ వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు (ఇన్‌సెట్‌లో) జలదిగ్బంధంలో ముక్త్యాలలోని ముక్తేశ్వరస్వామి ఆలయం



హోరున వరద

ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద

- 70 గేట్లను ఎత్తిన అధికారులు
- నాలుగు రోజుల పాటు ఇదే పరిస్థితి

విజయవాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి వస్తున్న నీటితో ప్రకాశం బ్యారేజీ నిండుకుండలా కనిపిస్తోంది. బ్యారేజీ 50 గేట్లను మూడు అడుగులు, 20 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తారు. పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీకి లక్షా41వేల856 క్యూసెక్కుల నీరు వస్తోంది. వజిలేపల్లి నుంచి లక్షా25వేల544 క్యూసెక్కులు, పాలేరు నుంచి 65, కీసర నుంచి 16,276 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీని నుంచి లక్షా37వేల450 నీటిని బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. కాల్వలకు 13,477 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. కేఈబీకి 1,407, బందరు కాల్వకు 1,515, రైవస్ కాల్వకు 4,521, కేడబ్ల్యూకు 6,034 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఏలూరు కాల్వకు నీటి విడుదలను నిలుపుదల చేశారు. మరో నాలుగు రోజుల పాటు బ్యారేజీకి ఇన్‌ఫ్లో ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు భావిస్తున్నారు.

పులిచింతలకు భారీ వరద నీరు

నాగార్జున సాగర్ నుంచి వరద నీరు దిగువకు వదలడంతో పులిచింతల ప్రాజెక్టు నిండుకుంది. బుధవారం 1.50 లక్షల క్యూసెక్కులకుపైగా నీటిని ప్రకాశం బ్యారేజీకి విడుదల చేశారు. గురువారం నాటికి వరద నీరు 3లక్షల క్యూసెక్కులకు చేరుకుంటుందని నీటిపారుదల శాఖ అధికారుల అంచనా వేశారు. వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో కృష్ణానదీ పరివాహక ప్రాంతాలైన తోట్లవల్లూరు, ఘంటసాల, మోపిదేవి, చల్లపల్లి, అవనిగడ్డ మండలాల్లోని లంక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఇక పులిగడ్డ అక్విడెక్టు వద్ద భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు.

రహదారుల విస్తరణకు అనుమతులు ఇవ్వండి

» కేంద్రమంత్రికి ఎంపీ బాలశౌరి వినతి



మచిలీపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో జాతీయరహదారుల విస్తరణ, అనుసంధానానికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి బుధవారం వినతిపత్రాలు అందించారు. ఢిల్లీలో కేంద్రమంత్రిని కలసిన ఎంపీ మచిలీపట్నం పోర్టుపనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో సరుకుల రవాణాకోసం పెడన-గుడివాడ మధ్య జాతీయరహదారిని నాలుగులేన్లకు విస్తరించాలని కోరారు. పోర్టు నుంచి పెడనవరకు 4కిలోమీటర్లమేర జాతీయరహదారి 216ను నిర్మాణం చేయాలని కోరారు. మచిలీపట్నం-విజయవాడ జాతీయరహదారి 65ను కలిపేలా పోర్టు ప్రాంతంలోని చిలకలపూడినుంచి రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. గన్నవరం నియోజకవర్గంలోని వీరపనేనిగూడెంవద్ద 200స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో చినపఅవుటపల్లి-కాజగ్రామాల మధ్య జాతీయరహదారికి సర్వీస్‌రోడ్డును వేయాలని కోరారు. రహదారులను అనుసంధానం చేస్తూ రోడ్డును నిర్మాణానికి అనుమతులివ్వాలని కోరారు. ప్రతిపాదనలకు మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ బాలశౌరి తెలిపారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

వైసీపీ నిర్లక్ష్యంతోనే సంక్షోభంలో చేనేత

» ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన, ఆగస్టు 7 : వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ఫలితంగా ఆ పరిశ్రమపై ఆధారపడ్డ కార్మికులు నానా అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. జిల్లా చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలవరపుపేట కళ్యాణ మండపంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, చేనేత కార్మికుల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్టు ఫండ్, యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ, రిబేటు తదితర పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని దుయ్యబట్టారు. రద్దయిన పథకాలను పునరుద్ధరించడంతో పాటు మరిన్ని పథకాలను అమలు చేసి చేనేత కార్మికుల జీవితాలలో వెలుగులు నింపుతామన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, పెడన నుంచే ఇంటర్నెట్ ద్వారా చేనేత వస్త్ర వ్యాపారం చేసుకునేలా ఆలోచనలు చేయాలన్నారు. చేనేత వస్త్రాలకు మంచి డిమాండ్ ఉందన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ, చేనేత రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళలకు కూడా పింఛన్లు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, కలెక్టర్ బాలాజీ, ఆర్డీవో వాణిలు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కృష్ణమ్మ పరవళ్లు

ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు తోడు ఎగువ నుంచి వరద నీరు భారీగా చేరుతుండటంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కింది. దాములూరు కూడలి వద్ద వైరా కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ముక్త్యాల గ్రామం వద్ద కృష్ణా తీరాన ఉన్న భవానీ ముక్తేశ్వరాలయం నీట మునిగింది. పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2.40 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. ప్రాజెక్టు నుంచి 11 గేట్ల నుంచి 2.80 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలకు జలకళ రావడంతో ఎమ్మెల్యే తాతయ్య తదితరులు పంటపొలాలను సస్యశ్యామలం చేయాలని కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, గాజులు, చీర సారె సమర్పించారు. అలాగే పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద వరద ప్రవాహం కొనసాగుతోంది. పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. ఎక్కడికక్కడ టోల్‌ఫ్రీ నెంబర్లను అందుబాటులో ఉంచారు.


ముక్త్యాల వద్ద ఉత్తర వాహినిగా కృష్ణమ్మ





ఉధృతంగా వైరా కట్టలేరు

నందిగామ రూరల్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి వరద నీరు భారీగా చేరుతుండటంతో దాములూరు కూడలి వద్ద వైరాకట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కాజ్‌వే పైనుంచి నాలుగు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుండటంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. కాజ్‌వే పైనుంచి, వీరులపాడు-నందిగామ మండలాల మధ్య రాకపోకలను నిలుపుదల చేశారు.

జలదిగ్బంధంలో ముక్తేశ్వరాలయం..

జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 7 : కృష్ణానదికి వరద నీరు పోటెత్తింది. పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు నీరు విడుదల చేయటంతో ముక్త్యాల గ్రామం కృష్ణానది ఒడ్డునున్న భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయం నీటమునిగింది. పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని రెండు వైపులా భారీగా వరద నీరు ప్రవహిస్తుండటంతో నదీ పరీవాహక గ్రామాలైన రావిరాల, వేదాద్రి, ముక్త్యాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజా ప్రతినిధులు, అధికారులు సూచిస్తున్నారు. పులిచింతల పూర్తి సామర్థ్యం 45.77 టీఎంసీలకుగాను ప్రస్తుతం 33 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఎగువ నుంచి 2.40 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి కిందకు 11 గేట్‌ల ద్వారా 2.89 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



వేదాద్రి వద్ద కృష్ణానది వరద పరిస్థితిని మండల ప్రత్యేకాధికారి మహేశ్వరరావు పరిశీలించారు. ఘాట్‌ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

పులిచింతలకు జలహారతి..

జగ్గయ్యపేట/జగ్గయ్యపేట రూరల్ : పులిచింతల ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మకు బుధవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, గుంటూరు జిల్లా పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌లు శాస్త్రోక్తంగా జలహారతి నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణలు, పూజలతో కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, గాజులు, చీరె, సారె సమర్పించారు. బిలబిల ప్రవహిస్తూ పంట పొలాలను సస్యశ్యామలం చేసి, సిరులు కురిపించాలని కృష్ణమ్మ తల్లిని ప్రార్థించినట్టు తాతయ్య చెప్పారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, పంట సమృద్ధిగా పండుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వరదపై ప్రాజెక్టు అధికారులతో సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, టెండర్ ప్రక్రియ ముగిసిందని త్వరలో పనులు చేపడతామని చెప్పారు. ఇరిగేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


జలహారతి కార్యక్రమంలో ఎమ్మెల్యేలు

అధికారులు అప్రమత్తం..

అవనిగడ్డ/ అవనిగడ్డ రూరల్ : కృష్ణానదికి వరదల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచనల మేరకు అవనిగడ్డ నియోజకవర్గంలోని లంక గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిచర్యలు తీసుకున్నామని, బుధవారం ప్రకాశం బ్యారేజీ నుంచి 1.37 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్టు డీఈ రవికిరణ్ తెలిపారు. పులిచింతల నుంచి 2.88 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారని, సాగునీటి అవసరాలు పోనూ సుమారు 2.50 లక్షలు దిగువకు విడుదల చేస్తారని, శుక్రవారం నాటికి పులిగడ్డకు చేరుకుంటుందన్నారు. ఎడ్లంక వద్ద కాజ్‌వే మునిగిపోయే పరిస్థితి ఏర్పడుతుందని లంకల్లో గొర్రెల కాపరులు, వ్యవసాయ పనులు చేసుకునే వారిని హెచ్చరించినట్టు డీఈ తెలిపారు. 5 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చినా కరకట్టలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద వరద ఉధృతి..

ప్రకాశం బ్యారేజీ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు చొచ్చుకు రావటంతో పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో వరద ప్రవాహం తగ్గే అవకాశం లేకపోవటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. చేపల వేట కొనసాగించే అవకాశం లేకపోవటంతో పులిగడ్డ అక్విడెక్ట్ సమీపంలో పడవలను లంగరు వేసి ఒడ్డున నిలిపారు.

పరీవాహక ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలి

ఘంటసాల : ఎగువ నుంచి వరద నీరు వస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.విజయప్రసాద్ ప్రజలకు సూచించారు. బుధవారం సాయంత్రం శ్రీకాకుళం గ్రామంలోని కృష్ణానది తీరప్రాంతాలైన శ్రీకాకుళం, పాపవినాశనం, గోగినేనిపాలెం గ్రామాలను వీఆర్వో తూము శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ప్రజలు అత్యవసర సహాయం కోసం 1070, 112, 18004250101 టోల్ ఫ్రీ నెంబర్‌తోపాటు 9908664645 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పమిడిముక్కలలో కంట్రోల్ రూమ్

పమిడిముక్కల మండలం లంకపల్లి, ఐనపూరు గ్రామాల ప్రజలు అప్రత్తంగా ఉండాలని తహసీల్దార్ కె.నవీన్‌కుమార్ అన్నారు. లంకపల్లి, ఐనపూరులో బుధవారం పర్యటించి నదీపాయలో వరదనీటి ప్రవాహం పరిశీలించారు. వరద పెరుగుతున్న కారణంగా ముంపు ప్రాంతాల్లో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు రావాలని, పశువులను తరలించాలని కెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసామని అత్యవసర సమయంలో 9908664623, 8639382235 నెంబర్లకు ఫోన్‌చేయాలని తెలిపారు.


పులిగడ్డ వద్ద నిలిచిన పడవలు

కృష్ణావర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్‌గా జయశంకరప్రసాద్


వీసీ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న జయశంకరప్రసాద్


మచిలీపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాయూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్‌గా చెరుకూరి జయశంకరప్రసాద్‌ను నియమిస్తూ యూనివర్సిటీ వీసీ ఆర్.శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ శోభన్‌బాబు ఉత్తర్వులను జయశంకరప్రసాద్‌కు అందజేశారు. ప్రస్తుతం జయశంకరప్రసాద్ కృష్ణాయూనివర్సిటీలో ఎంబీఏ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ఎంబీఏ విభాగం హెచ్‌వోడీగా పనిచేస్తున్నారు. ఇటీవలికాలంలో యూనివర్సిటీలోని రీసెర్చ్‌అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో పరిపాలనాపరమైన అంశాలపై పలు ఆరోపణలు వచ్చాయి. రీసెర్చ్ స్కాలర్స్‌కు పీహెచ్‌డీల ప్రదానంలో తీవ్రజాప్యం చేయడం, కొంతమంది స్కాలర్లు పత్రాలు సక్రమంగా సమర్పించకున్నా పీహెచ్‌డీ డిగ్రీలను ప్రదానం చేయడంతో ఈ విభాగం వివాదాల్లో చిక్కుకుంది. దీంతో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాన్ని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా జయశంకరప్రసాద్‌కు బాధ్యతలను అప్పగించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ పీవీ రామారావు తదితరులు

ఆంధ్రా హాస్పిటల్స్‌లో మదర్స్ మిల్క్ బ్యాంక్

మాచవరం, ఆగస్టు 7 : నవజాత శిశువుకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని ఆంధ్రా హాస్పిటల్స్ చీఫ్ ఆఫ్ చిల్డ్రన్స్ సర్వీసెస్ డాక్టర్, డైరెక్టర్ పీవీ రామారావు అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆసుపత్రిలో 'మదర్స్ మిల్క్ బ్యాంక్‌ను ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నెలలు నిండకుండా పుట్టిన నవజాత శిశువుకు, బరువు తక్కువ పుట్టిన శిశువుకు తల్లిపాలు సరిగా రానప్పుడు ఈ మిల్క్ బ్యాంకులోని పాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. తల్లిపాలు తీసుకున్న నవజాత శిశు మరణాలు చాలా తక్కువగా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయన్నారు. పాలు ఎక్కువగా ఉన్న తల్లుల నుంచి సేకరించి బ్యాంకులో నిల్వ ఉంచితే ఆరు నెలల వరకు ఉపయోగించవచ్చన్నారు. రాష్ట్రంలోనే మొదటిగా ఆంధ్రా హాస్పిటల్స్‌లో రోటరీ క్లబ్ విజయవాడ సహకారంతో 'మదర్స్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు చేస్తున్నందుకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో నవజాత శిశు వైద్య నిపుణులు డాక్టర్లు సుజాత, గౌతమి, అశ్రితలు పాల్గొన్నారు.


వైద్యులను సత్కరిస్తున్న డాక్టర్ రాంప్రసాద్

తల్లిపాలకు ప్రత్యామ్నాయం లేదు : డాక్టర్ రాంప్రసాద్

పాయకాపురం : తల్లిపాలు నవజాత శిశువులకు ప్రాణదాతగా నిలుస్తుందని రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్ క్లినికల్ డైరెక్టర్, డాక్టర్ రాంప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని బుధవారం కరెన్సీ నగర్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా తల్లిపాలను దానం చేసిన మాతృమూర్తులను సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ, తల్లిపాలు బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్‌ల నుంచి, ముఖ్యంగా తీవ్రమైన పేగు ఇన్‌ఫెక్షన్ నుంచి శిశువును కాపాడతాయన్నారు. నెలలు నిండకుండా జన్మించిన శిశువులు తల్లిపాలను పొందలేరని ఆ శిశువులకు దాత పాలు ఇవ్వడం ఉత్తమమైన మార్గం అని తెలిపారు. డాక్టర్ బీఎస్‌సీపీ రాజు మాట్లాడుతూ, తల్లి పాలను దానం చేసిన తల్లులందరికీ అభినందనలు తెలిపారు. ఇతర తల్లులకు ఆదర్శంగా నిలిచేందుకు తల్లిపాలను సేకరించి అందించిన వైద్యులు సౌమ్య శ్రీలతలను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీ శివరామరాజు, డాక్టర్ పి.బ్రాజిష్ణ ఉమ మిక్కిలినేని, స్నేహ మద్దుకూరి, ఎం.విజయ, రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్ యూనిట్ హెడ్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కలిసిరండి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 7 : గ్రామాలను అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి ఆలోచనను ఆచరణలో పెట్టేందుకు భవిష్యత్ అవసరాలు, ప్రజల సామాజిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని గ్రామ సమగ్రాభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి చేపట్టవలసిన ప్రణాళికలపై బుధవారం జిల్లా కలెక్టర్ సృజన కలెక్టరేట్‌లో పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామాలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటీవల ముఖ్యమంత్రి నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. గ్రామాల అభివృద్ధిలో అధికారుల ఆలోచన విధానంలో మార్పు రావాలన్నారు. ప్రజల ప్రస్తుత సామాజిక అవసరాలతో పాటు భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలను రూపొందించుకోవాల్సిన అవసరం వుందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి రాబోయే మూడేళ్లలో చేపట్టి పూర్తి చేయాల్సిన పనుల నివేదికను రూపొందించాలన్నారు. మౌలిక వసతులైన రహదారులు, డ్రెయిన్లు, వీధి లైట్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి దశల వారీగా కలర్ కోడ్‌లతో ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ప్రస్తుతం చేపట్టి పూర్తి చేయాల్సిన పనులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రాధాన్యత క్రమంలో ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. 2025 మార్చి నాటికి ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిల ఏర్పాటు లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఉపాధి పథకం కింద ఈ ఏడాది లక్ష్యాన్ని సాధించేందుకు నెలకు 3 లక్షల పనిదినాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలానికి కేటాయించే నిధులతో పాటు, డీఎంఎఫ్ నిధులను కూడా వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ జె.సునీత, పంచాయతీ రాజ్ ఎస్ఈ అక్కినేని వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ డీవీ రమణ, జిల్లా పంచాయతీ అధికారి ఎన్.వి.శివప్రసాద్ యాదవ్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, రూరల్ డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.



బస్సు బోల్తా

డ్రైవర్ సహా ప్రయాణికులకు స్వల్ప గాయాలు

- లారీని ఓవర్‌టేక్ చేయబోయి బస్సును ఢీకొన్న కారు
- కారు డ్రైవర్, ప్రయాణికులకు కూడా గాయాలు
- బస్సులో ఏడాదిలోపు చిన్నారులు నలుగురు.. సురక్షితం

కృత్తివెన్ను, ఆగస్టు 7 : ట్రావెల్స్ బస్సు, కారు ఢీకొన్న ఘటనలో అనేకమందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం రాత్రి కృత్తివెన్ను మండల పరిధిలోని యండపల్లి గ్రామం వద్ద చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి రాజోలు వెళ్తున్న కారు ఎదురుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయింది. ఈ సమయంలో వ్యతిరేక మార్గంలో.. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు నుంచి కృత్తివెన్ను మీదుగా హైదరాబాద్ వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును కారు బలంగా ఢీకొంది. దీంతో బస్సు పక్కనే ఉన్న గోతులోకి పల్టీ కొట్టింది. ఆ సమయంలో బస్సులో 25 మంది ప్రయాణిస్తున్నారు. డ్రైవర్, క్లీనర్‌తో పాటు మరో నలుగురు చిన్నారులు ఉన్నారు. కాగా, చిన్నారులు ఏడాదిలోపు వారైనా చిన్నగాయం కూడా కాకుండా బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కారులో డ్రైవర్‌తో కలిపి నలుగురు ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో కారు, బస్సు నుజ్జునుజ్జయ్యాయి. డ్రైవర్లు ఇద్దరికీ గాయాలు కాగా, ప్రయాణికులందరికీ స్వల్ప గాయాలయ్యాయి. కారులో ఉన్న నలుగురిని హైవే అంబులెన్స్ సాయంతో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, బస్సు డ్రైవర్, క్లీనర్లను బంటుమిల్లి ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.


నుజ్జునుజ్జయిన కారు


ప్రమాదం నుంచి బయటపడిన ఏడాదిలోపు చిన్నారి

సహకరించిన స్థానికులు

రాత్రి సమయంలో హైవేపై ఒక్కసారిగా పెద్దశబ్దం రావటంతో స్థానికులంతా ఉలిక్కిపడ్డారు. క్షణాల్లో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బస్సు బోల్తా పడటం చూసి, కంగారుపడి అందరూ కలిసి సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో ఉన్న ప్రయాణికులందరినీ ఎత్తుకుని బయటకు తీసుకొచ్చారు. వివరాలు సేకరించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చాలామంది 25 కిలోమీటర్లలోపు వారు కావటంతో కుటుంబ సభ్యులు సంఘటనాస్థలానికి త్వరగా చేరుకున్నారు. పోలీసులు వివరాలు సేకరించి, సహాయక చర్యలు అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చే శక్తి యువతకే ఉంది

» డీజీపీ ద్వారకా తిరుమలరావు

గుణదల, ఆగస్టు 7: డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్పు తీసుకురాగల శక్తి యువతకే ఉందని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. స్థానిక ఆంధ్రా లయోల కళాశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కళాశాల ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీజీపీ విచ్చేశారు. యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, 'సాక్ష్యం స్పష్టంగా ఉంది.. నివారణలో పెట్టుబడి పెట్టండి' అనే అంశాన్ని నొక్కి చెప్పారు. మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని ఎదుర్కోవడంలో క్రియాశీల చర్యల ప్రాముఖ్యతను వివరించారు. అవగాహన కల్పించడంలో చురుకైన పాత్ర పోషించాలని యువతకు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల తీవ్ర పరిణామాల గురించి హెచ్చరించారు. అనంతరం మాదకద్రవ్యాల రహిత దేశం కోసం పని చేస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. లయోల కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ ఎం.సగయరాజ్, ప్రిన్సిపల్ జీఏపీ కిషోర్, అధ్యాపకులు డాక్టర్ ప్రసాదరావు, రవీంద్ర బాస్, డీన్ డాక్టర్ శుభ పాల్గొన్నారు.

మచిలీపట్నం - తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ : ప్రయాణికుల రద్దీ నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే ఈనెల 7, 9 తేదీల్లో (బుధ, శుక్ర) వారాల్లో 07249 మచిలీపట్నం-తిరుపతి మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నది. గురు, శనివారాల్లో (ఈనెల 8, 10 తేదీల్లో) 07250 తిరుపతి-మచిలీపట్నం మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నది. రెండేసి సర్వీసులు నడుస్తాయని దక్షిణ మధ్య రైల్వే బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైళ్లు పెడన, గుడ్లవల్లేరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, నిడుబ్రోలు, బాపట్ల, చీరాల, ఒంగోలు, సింగరాయకొండ, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగనున్నాయి.


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

అల్ట్రాటెక్.. చెక్కు అందజేత

జగ్గయ్యపేట రూరల్ : అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగార ప్రమాద ఘటనలో మృతుడు గుగులోతు గోపీ నాయక్ కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కంపెనీ అందించిన రూ. 50 లక్షల చెక్కును బుధవారం అందజేశారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

15 మందికి రిమాండ్ పొడిగింపు

గన్నవరం : స్థానిక టీడీపీ కార్యాలయంపై దాడిఘటనలో నిందితులకు గన్నవరం కోర్టు రిమాండ్ పొడిగించింది. తొలుత 15 మందిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించి నూజివీడు సబ్ జైలుకు పంపించారు. వారు బుధవారం వాయిదాకు రాగా 14 రోజులు రిమాండ్ పొడిగించారు. కోర్టు నుంచి తీసుకువెళ్లే క్రమంలో ఫొటోలు వీడియోలు చిత్రీకరిస్తున్న విలేకరులపై నిందితులు దురుసుగా ప్రవర్తించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.30

జై సంతోషిమాత ఆలయంలో ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ రేపు

పాయకాపురం, ఆగస్టు 7 : స్థానిక జై సంతోషిమాత ఆలయ ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు ఈ నెల 9న ఉదయం 11.01 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు తెలిపారు. ఆలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నుంచి రెండు రోజుల పాటు వేద పండితులచే విశేష పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆలయ ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవానికి శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతి శివ స్వామి, భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద స్వామి, ప్రముఖ కృష్ణతత్వ ప్రచారకులు రాధా మనోహర్ దాస్ స్వామీ తెలిపారు. అనంతరం ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

తల్లిపాలతోనే రోగ నిరోధక శక్తి పెంపు

తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె



తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దంపతులు

కృష్ణలంక, ఆగస్టు 7: పుట్టిన బిడ్డకు తల్లిపాలకు మించిన ఔషధం మరోటి లేదని, రోగ నిరోధక శక్తికి తల్లిపాలు ఎంతో దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలను అందించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్ర మానికి తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ బిడ్డ పుట్టిన నాటి నుంచి 6 నెలల పాటు కేవలం తల్లిపాలను మాత్రమే అందించా లన్నారు. 6 నెలల అనంతరం తల్లిపాలతో పాటు అదనపు ఆహారాన్ని అందించాలన్నారు. తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమనే విషయంపై మహిళల్లో పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం వుందన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి జి.ఉమాదేవి మాట్లాడు తూ తల్లిపాల విశిష్టతను చాటి చెప్పేందుకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతా లను నిర్వహించారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అను రాధ, కార్పొరేటర్ ప్రసాద్, మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీవో జి.మంగమ్మ, సూపర్‌వైజర్ రెహన బేగం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్బీపేట: మాంటిస్సోరి కళాశాల ఆడిటోరియంలో జరిగిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కృష్ణాజిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధలు హాజరై తమ సొంత నిధులతో గర్భిణులకు సీమంతం నిర్వహించి, చీరలు, కుంకుమ, గాజులు, స్వీట్లు అందజేశారు. మహిళలకు రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో జి.మంగమ్మ, సూపర్ వైజర్స్ శ్యామలత, రెహనాబేగం, హెటన్ తదితరులు పాల్గొన్నారు.



చేనేత వాక్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

చేనేత కార్మికులకు చేయూతనివ్వండి

పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి

వన్‌టౌన్, ఆగస్టు 7: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ఆదరించి వాటిని కొనుగోలు చేయాలని, చేనేత కార్మికులకు చేయూత నివ్వాలని పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. సూర్యారావుపేటలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ఉద్యోగులు తప్పనిసరిగా చేనేత వస్త్రాలను ధరించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చేనేత వాక్‌లో సుజనా చౌదరి పాల్గొన్నారు. అనంతరం ఆప్కోలో చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, బీజేపీ నాయకులు శ్రీనివాసరాజు, షేక్ బాజి, భోగవరపు శ్రీధర్, వి.ఎస్.కె. పట్నాయక్, బుల్లబ్బాయ్, మువ్వల వెంకట సుబ్బయ్య, కె.ఎస్.ఆర్ముగం, పైలా సోమినాయుడు, నరసరాజు, బేసికంటేశుడు, మహిళా మోర్చా అధ్యక్షురాలు ఎర్ర సునీత పాల్గొన్నారు.

లేబర్‌కాలనీకి పోటెత్తిన వర్షపు నీరు

ఇళ్లల్లోకి నీళ్లు రావడంతో మధ్యాహ్నం వరకు ఇబ్బందిపడ్డ ప్రజలు



లేబర్ కాలనీ ఆరంతస్తుల ప్లాట్ల వద్ద ఇళ్లల్లోకి, వీధుల్లోకి చేరిన వర్షపునీరు

భవానీపురం, ఆగస్టు 7 : అల్పపీడన ప్రభావంతో బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి 44వ డివిజన్ లేబర్ కాలనీలోని పలు వీధులు నీట మునిగాయి. మధ్యాహ్నం వరకు వర్షపు నీరు బయటకు వెళ్లకపోవడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. కార్మికశాఖ స్థలంలో వివిధ వర్గాల ప్రజలు కట్టిన ఇళ్లల్లోకి వర్షపునీరు పోటెత్తడంతో ఇబ్బందులు పడ్డారు. స్థానికంగా విద్యాధరపురంను ఆనుకుని లేబర్ కాలనీలో స్టేడియం నిర్మాణం జరుగుతుం డటంతో, ఇటువైపుగా ఉప్పలపాటి రామచంద్రరాజు స్కూల్ వెనుక నుంచి వెళ్లే మేజర్ డ్రెయిన్ చాలా భాగం పూడుకుపోవడంతో వర్షపునీరు బయటకు వెళ్లలేదు. దీంతో మురుగునీరు, వర్షపునీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజల అవస్థలు పడ్డారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. వేణుగోపాల రావు, తన సిబ్బంది డ్రెయిన్‌లో పూడికలు తీయించడంతో ఇళ్లల్లోంచి నీరు బయటకు వచ్చింది. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు వీధుల్లో తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు నివేదించారు.

వర్షానికి జారిపడిన కొండరాళ్లు

●విరిగిపడిన భారీ చెట్టు కొమ్మలు



చిట్టినగర్: ఎడతెరిపి లేకుండా మంగళవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి చిట్టినగర్ సొరంగం ప్రాంతంలో కొండరాళ్లు జారిపడ్డాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎటువంటి ప్రాణ హాని జరగకపోయినప్పటికి ఆ ప్రాంతంలో నివాసితులు కొండరాళ్లు దొర్లి ఎక్కడ తమ ఇళ్లపై పడతాయోనని రాత్రి అంతా కంటిపై కునుకు లేకుండా గడిపారు. చిట్టినగర్ జంక్షన్‌లో భారీ వేప వృక్షం కొమ్మలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వీఎంసీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని విరిగిన చెట్టు కొమ్మలను తొలగించి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా కొమ్మలను తొలగించారు.

బొండా ఉమా ఆర్థిక సహాయం

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 7 : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన 59వ డివిజన్ లూనా సెంటర్‌కు చెందిన జోసెఫ్ బర్మా కుటుంబానికి బుధవారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు రూ. 10 వేల ఆర్థికసాయాన్ని స్థానిక టీడీపీ నేతల ద్వారా అందజేశారు. టీడీపీ నేతలు చల్లగాలి అనిల్, విశ్వనాధపల్లి జోహార్‌బాబు, వేల్పుల రాజేష్, ఆలపర్తి రాజేంద్రప్రసాద్, చింతపల్లి శ్రీనివాసరావు, వేల్పుల చంద్రారావు, కొడాలి వంశీ మృతుడి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయాన్ని అందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గవర్నర్‌పేట: విద్యుత్ మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం జమ్మిచెట్టు ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా బాడవ పేట ఏరియా, కారం మిల్లు రోడ్డు, జాన్ స్ట్రీట్, జక్రయ్య వీధి, ఎల్లాటి అంజనేయులు వీధి, కార్వే ఆఫీసు ఏరియా, స్టేడియం వాటర్ ట్యాంక్ రోడ్డు, వీఎంసీ వాటర్ వర్క్స్, ఆలిండియా రేడియో ఫీడర్ పరిధిలోని గోపాలరెడ్డి రోడ్డు, గిరిపురం రెడ్ సర్కిల్, ఫుడ్ పార్కు స్టేడియం రోడ్డు, బందరు రోడ్డు పున్నమ్మతోట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

వన్‌టౌన్ : గవర్నర్‌పేట, కృష్ణలంక పోలీస్ స్టేషన్లకు సీఐలుగా సత్యనారాయణ, నాగరాజులు బుధవారం ఆయా పోలీస్ స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించారు. ఇబ్రహీంపట్నం సీఐగా విధులు నిర్వహించిన సత్యనారాయణ గవర్నర్‌పేట స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వీఆర్‌లో ఉన్న ఎస్ఎస్ఎస్‌వి నాగరాజును కృష్ణలంక స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది వారికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

రైట్ టు బి ఫర్గాటెన్
గోప్యత హక్కు!

మనసుకు అయ్యే గాయాన్ని మాన్పే శక్తి కాలానికి ఉందంటారు. అయితే ఆ గాయాన్ని పదేపదే జ్ఞప్తికి తెస్తుంటే? ఒకవేళ చేయని నేరానికి బలైనవారిని, ఆ నేరం వారు చేయలేదని రుజువైనప్పటికీ ఒకప్పుడు నేరారోపణ చేయబడ్డాడని నిరంతరం ప్రచారం చేస్తుంటే? సదరు వ్యక్తులకు ఉన్న వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యత స్వేచ్ఛను ఉల్లంఘించినట్లు కాదా?

ఇదే అంశం ఇటీవల ఒక కేసు రూపంలో సుప్రీంకోర్టు ముందుకు వచ్చింది. గతంలో లైంగికదాడి, మోసం కేసులో ఒక వ్యక్తిని దిగువ కోర్టు నేరస్థునిగా పేర్కొంటూ తీర్పుని ఇచ్చింది. అయితే తరువాత కాలంలో అతన్ని ఎగువకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. కానీ లీగల్ సెర్చ్ పోర్టల్ 'ఇండియన్ ఖానూన్'లో దిగువకోర్టు ఇచ్చిన తీర్పు వివరాలు ప్రకటితమవుతుండటంతో సదరు వ్యక్తి దరఖాస్తు చేసుకున్న విదేశీ పౌరసత్వ అప్పీలును తిరస్కరించారు. ఈ ప్రకారం అతడు చేయని నేరానికి మళ్లీ మళ్లీ శిక్షించబడుతున్నట్లే. అదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఆ వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించి రైట్ టు బి ఫర్గాటెన్(మరచిపోవు హక్కు)ను అభ్యర్థించాడు. ఇండియన్ ఖానూన్ పోర్టల్ నుంచి తనకు సంబంధించిన తప్పుడు సమాచారాన్ని తొలగించమని ఆదేశించాల్సిందిగా కోరాడు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఈ నేపథ్యంలో మద్రాసు హైకోర్టు ఇండియన్ ఖానూన్ సంస్థను సదరు వ్యక్తికి సంబంధించిన సమాచారాన్ని తొలగించమని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. ఇండియన్ ఖానూన్ పోర్టల్ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది.

ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అధ్యక్షతన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును విచారణకు స్వీకరించడంతో 'రైట్ టు బి ఫర్గాటెన్' అనే హక్కుకు సంబంధించి కొన్ని నిర్ధారణలు వెలువడనున్నాయి. అసలు రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కు అవుతుందా? ఒకవేళ అయితే, అది రాజ్యాంగం ప్రసాదించిన ఇతర ప్రాథమిక హక్కులతో ఏవిధమైన సంబంధం కలిగి ఉంటుంది? అనే అంశాలను దేశ అత్యున్నత న్యాయస్థానం పరిశీలించనుంది.

అసలు 'రైట్ టు బి ఫర్గాటెన్' అంటే ఏమిటి? ఎవరికి వర్తిస్తుంది? భారతదేశంలో దానికి గల చట్ట, న్యాయపరమైన పునాదులేవి? సదరు హక్కు లాభ - నష్టాలేమిటి? చూద్దాం.

● 'రైట్ టు బి ఫర్గాటెన్' అంటే?

అనవసరమైన లేదా అసందర్భమైన తన వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగ సామాజిక వేదికల నుంచి అంటే ఇంటర్నెట్, సెర్చ్ ఇంజన్లు, డేటాబేస్‌లు, వెబ్‌సైట్లు, ఇతరత్రా ఏదైనా సమాచార మాధ్యమాల నుంచి తీసివేయించడానికి ఒక వ్యక్తికి గల హక్కునే రైట్ టు బి ఫర్గాటెన్ లేదా రైట్ టు బి ఎరేజర్ అంటారు.

ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని ఎటువంటి ఆవశ్యకత, చట్టపర అవసరం లేనప్పటికీ, అందరికీ బహిరంగంగా ఆ సమాచారాన్ని అందుబాటులో ఉంచి, అతని గోప్యతా హక్కును ఉల్లంఘించినప్పుడు ఒక వ్యక్తి రైట్ టు బి ఫర్గాటెన్(రీ) ఎరేజర్‌ను ఆశ్రయించే వీలుంది.

భారత్‌లో ఈ హక్కుకు ఇతిమిద్ధ రూపం లేనప్పటికీ, ఈయూ దేశాల్లో వారు తీసుకువచ్చిన 'జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్(జీడీపీఆర్)' ఈ హక్కును వారికి అందిస్తోంది. అయితే దగ్గర కూడా కొన్ని తీర్పుల్లో, హక్కుల్లో, చట్టాలు, బిల్లుల్లో ఇది ప్రతిఫలిస్తోంది.

● భారతదేశంలో ప్రస్తావనలు

రైట్ టు బి ఫర్గాటెన్ అనే హక్కును, భారత రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కుల్లోని, జీవించే హక్కు(ప్రకరణ 21)లో అంతర్భాగమైన గోప్యతా హక్కు పరిధిలోకి వచ్చే అంశంగా 'కె.ఎస్.పుట్టస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసు (2017) తీర్పులో ప్రస్తావించింది. అంతేకాక కొన్ని హైకోర్టులు(ఢిల్లీ, కర్ణాటక) కూడా వివిధ కేసుల్లో ఇంచుమించు ఇదేవిధమైన తీర్పులు ఇచ్చి ఉన్నప్పటికీ, సుప్రీంకోర్టు కె.ఎస్.పుట్టస్వామి కేసు తీర్పులో ఇచ్చిన ప్రాథమిక నియమావళి రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక ప్రాతిపదికను ఏర్పర్చింది. న్యాయవ్యవస్థకు ఒక మార్గదర్శనం చేసింది.

ఇక చట్టాలపరంగా తీసుకుంటే 'డిజిటల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ (2023)'లో రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక చట్ట ప్రాతిపదిక కనిపిస్తుంది. వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని డిజిటల్ స్పేస్‌లో వారు నియంత్రించు కోగల సౌలభ్య అంశం ఈ చట్టంలో ఉంది. ఏ వ్యక్తి గురించిన వ్యక్తిగత సమాచారం డిజిటల్ స్పేస్‌లో అతడి/ఆమె వ్యక్తిగత గోప్యతకు, ప్రతిష్ఠకు, భద్రతకు నష్టం కలిగించేదిగా ఉన్నప్పుడు దానిని తొలగించమని డేటా నిర్వాహకులను కోరవచ్చు. వారు తొలగించని పక్షంలో రెగ్యులేటరీ అథారిటీ(లేదా) న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. అంతేకాక ప్రతిపాదిత పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు (2019)లో కూడా రైట్ టు బి ఫర్గాటెన్ గురించిన ప్రతిపాదన ఉంది.

● పరిమితులు

సుప్రీంకోర్టు నిర్దేశనల ప్రకారం, ఒక వ్యక్తి వ్యక్తిగత సమాచారం ఎటువంటి చట్టపరమైన ఆవశ్యకతను కలిగి లేనప్పుడు, అవసరత, సంబంధం కానీ ఇతరత్రా లేనప్పుడు, అసత్యమైనప్పుడు దానిని తొలగించుకునే హక్కును సదరు వ్యక్తి పొందుతాడు.

అయితే భావవ్యక్తీకరణ హక్కుతో ముడిపడినప్పుడు, చట్టపరమైన అవసరాలు గల సమాచారమైనప్పుడు, ప్రజా ప్రయోజనాల సంబంధితమైనప్పుడు రైట్ టు బి ఫర్గాటెన్ వర్తించదని కూడా విస్పష్టం చేయడం జరిగింది.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/7js5FoHలో చూడండి.

దిక్సూచి

లాభ నష్టాలు



ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించినట్లు రైట్ టు ప్రైవసీ(గోప్యతా హక్కు) అనేది రైట్ టు ఇన్ఫర్మేషన్(సమాచార హక్కు)తో సమన్వయం కావాలి. రైట్ టు బి ఫర్గాటెన్ ఎంత ఆవశ్యకమో, సమాచార స్వేచ్ఛ కూడా అంతే అవసరమనే వాద ప్రతివాదనలు ఉన్నాయి.

లాభాలు

- నిరపరాధులు తమ గౌరవాన్ని కాపాడుకోవడానికి వీలవుతుంది.
- సమాచారం తీవ్రంగా దుర్వినియోగం అవుతూ, అసత్యాలు, పాక్షిక సత్యాలు (ఉదా: ఫేక్ న్యూస్, రివేంజ్ పోర్న్, మార్ఫ్‌డ్ కంటెంట్) ప్రచారమవుతున్నతః డిజిటల్ యుగంలో రైట్ టు బి ఫర్గాటెన్ వంటి హక్కులు వ్యక్తి గౌరవాన్ని, గోప్యతను, ప్రతిష్ఠను రక్షిస్తాయి.
- వ్యక్తిగత భద్రత, స్వేచ్ఛపరంగా అనవసర సమాచారం అందరికీ సులువుగా అందుబాటులో లేకుండా, మోసాలు, ఐడెంటిటీ తెఫ్ట్ వంటి వాటికి గురవకుండా రక్షణ లభిస్తుంది.

నష్టాలు

- రైట్ టు బి ఫర్గాటెన్ ఒక ప్రాథమిక హక్కుగా లభిస్తు, తరచూ మరికొన్ని చట్టబద్ధ/ ప్రాథమిక హక్కులైన సమాచార హక్కు, భావప్రకటన స్వేచ్ఛ, పరిశోధన, పాత్రికేయ స్వేచ్ఛలతో సంఘర్షణ ఏర్పడుతుంది.
- సాంకేతికంగా డిజిటల్ సంస్థలకు ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. భారీఎత్తున సమాచారం నిరంతరం తొలగించాల్సిన పరిస్థితితో ప్రత్యేక యంత్రాంగం, సాంకేతికతల ఆవశ్యకత ఏర్పడుతుంది.
- సెర్చ్ ఇంజన్లు ఇచ్చే సమాచారం విపరీతంగా కుంచించబడుతుంది. ఒక అంశంతో అనేక ఉప అంశాలు ముడిపడి ఉన్నప్పుడు వ్యక్తిగత స్వేచ్ఛ హక్కు కారణంగా అవి తొలగించాల్సి వస్తే సమాచారం అతుకుల బొంతగా తయారవుతుంది.
- బ్లాక్‌చైన్ టెక్నాలజీ నేపథ్యంలో సమాచారాన్ని పూర్తిగా తొలగించడం, పునరావృతం కాకుండా చూడటం దుర్లభం.

ఇలాంటి వాదోపవాదాల/ లాభ-నష్టాల నేపథ్యంలో ప్రస్తుతం రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కుల పరిధిలోకి వస్తుందా? ఒక హక్కుగా స్థిరీకరించి ప్రజలకు అందుతుందా అనే అంశాలతోపాటు ఇతర ప్రాథమిక హక్కుల పరిధిలోకి వెళ్లి సంఘర్షణ ఏర్పడినప్పుడు ఏమి చేయాలనే అంశాలు సుప్రీంకోర్టు పరిశీలనార్థం ఉన్న ఇండియన్ ఖానూన్ కేసు సముఖంగా తేలాల్సిందే.

నవ్య | చిత్రజ్యోతి



ఇన్ ప్రోగ్రెస్

విష్వక్ వినోదం

విష్వక్‌సేన్ హీరోగా నటించే 14వ చిత్రాన్ని బుధవారం ప్రకటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. 'జాతిరత్నాలు' చిత్ర దర్శకుడు అనుదీప్ కేవీ ఈ సినిమాకు దర్శకుడు. హిలేరియస్ ఎంటర్‌టైనర్స్ అందించడంలో అనుదీప్‌కు మంచి పేరు ఉంది. అందుకే ఈసారి కూడా ఆయన విష్వక్‌సేన్‌తో నవ్వుల వర్షం సృష్టించనున్నారని నిర్మాత చెప్పారు. భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని, సురేశ్ సారంగం ఫొటోగ్రఫీని అందించనున్నారు. సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

థియేటర్లో చూడాల్సిన చిత్రం



నూతన నటులతో తీసిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా దర్శకుడు యదు వంశీ మీడియాతో ముచ్చటించారు. "ఒక ఊరిలో జాతర చుట్టూ జరిగే కథ ఇది. ప్రతీ కుర్రాడు ఈ సినిమాకు రిలేట్ అవుతారు. స్నేహం, రాజకీయాల చుట్టూ తిరిగే ఈ సినిమా అందరినీ అలరిస్తుందనే నమ్మకం ఉంది. అన్ని రకాలుగా ఆకట్టుకునే అంశాలున్న ఈ సినిమాను థియేటర్లో చూస్తేనే బాగుంటుంది" అని చెప్పారు.

నిర్మాత శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి సతీవియోగం

ప్రముఖ నిర్మాత, మల్లెమాల ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత ఎం.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సతీమణి వరలక్ష్మి బుధవారం హైదరాబాద్‌లో కన్ను మూశారు. ఆవిడ వయసు 62 సంవత్సరాలు. క్యాన్సర్ వ్యాధి కారణంగా కన్ను మూసిన వరలక్ష్మి అంత్యక్రియలు గురువారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.



ఆ విషయంలో అమితాబ్ తర్వాత బాలకృష్ణే!

'తాతమ్మ కల' చిత్రంతో తెరంగేట్రం చేసిన నందమూరి బాలకృష్ణ నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 108 వ చిత్రం నిర్మాణంలో ఉంది. ఒక హీరోగా యాభై ఏళ్ల సినీ ప్రయాణం నిజంగా అరుదైన విషయమే. అందుకే బాలకృష్ణ స్వర్ణోత్సవ వేడుకలను సెప్టెంబర్ ఒకటిన తెలుగు చిత్ర పరిశ్రమ భారీ స్థాయిలో నిర్వహించనుంది. బుధవారం జరిగిన ఈ వేడుక సన్నాహక కార్యక్రమంలో నందమూరి మోహనకృష్ణ, రామకృష్ణ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ 'మా తమ్ముడు నటుడిగా యాభై ఏళ్లు పూర్తి చేసుకోవడం చాలా గొప్ప విషయం. నాన్నగారికి వారసుడిగా పరిశ్రమలో నిలబడడమే కాకుండా ఎటువంటి పాత్రనైనా చేయగల నటుడిగా నిరూపించుకున్నారు' అన్నారు. 'ఇండియన్ సినిమా హిస్టరీలో అమితాబ్ బచ్చన్ తర్వాత సుదీర్ఘకాలం నటుడిగా ఉంటూ బాలకృష్ణ తన ప్రత్యేకత చాటుకున్నారు. ఇప్పటికీ కుర్ర హీరోలకు ఏ మాత్రం తగ్గకుండా పోటీ ఇస్తున్నారు. పరిశ్రమ అంతా కలసి చేస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి' అని కోరారు తమ్మారెడ్డి భరద్వాజ. నిర్మాతలమండలి కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'ఈ వేడుక నిర్వహించడానికి మొదట బాలకృష్ణ ఒప్పుకోలేదు. కానీ ఇదొక స్ఫూర్తిదాయక కార్యక్రమంగా ఉంటుందని వివరించడంతో ఆయన అంగీకరించారు' అన్నారు.

రూ.రెండు కోట్ల విరాళం



కేరళలో వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడ్డంతో జరిగిన విషాదం అందరికీ తెలిసిందే. ఈ విపత్తు బారిన పడిన బాధితులకు ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు విరాళాలు అందించి తమ వంతు సాయం చేశారు. బుధవారం ప్రభాస్ కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.రెండు కోట్ల విరాళం అందించి తన గొప్ప మనసును చాటుకున్నారు. ఇప్పటికే ఈ విపత్తు బారిన పడిన వారి కోసం తెలుగు ఇండస్ట్రీ నుంచి చిరంజీవి, రామ్‌చరణ్ సంయుక్తంగా రూ.కోటి.. అల్లు అర్జున్ రూ.25 లక్షలు అందజేశారు.

సంపదను కాపాడేవాడూ సైనికుడే



'సరిహద్దును కాపాడేవాడే సైనికుడు కాదు.. సంపదను కాపాడేవాడూ సైనికుడే' అంటున్నారు రవితేజ. ఆయన కథానాయకుడిగా నటించిన 'మిస్టర్ బచ్చన్' చిత్రంలోనిది ఈ డైలాగ్. హరీశ్ శంకర్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఆగస్టు 15న విడుదలవుతోంది. 'మిస్టర్ బచ్చన్' చిత్రం థియేట్రికల్ ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ బుధవారం నిర్వహించింది. హరీశ్ శంకర్ మాట్లాడుతూ 'అమితాబ్‌బచ్చన్ గారి 'షోలే' చిత్రం విడుదలైన ఆగస్టు 15న మా సినిమా కూడా విడుదలవడం కాకతాళీయమే. ఈ సినిమాకు 'మిస్టర్ బచ్చన్' టైటిల్‌ను రవితేజ గారు నిర్ణయించారు' అని చెప్పారు.

నీ వెంటే మేమంతా
వినేశ్ ఫొగాట్‌కు సినీతారల మద్దతు



పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరిన భారత కుస్తీ క్రీడాకారిణి వినేశ్ ఫొగాట్ పతకం సాధించి మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించడం ఖాయమని భావించిన తరుణంలో ఆమె అనూహ్య నిష్క్రమణ దేశవ్యాప్తంగా క్రీడాభిమానులను నిరాశకు గురిచేసింది. వంద గ్రాముల బరువు పెరిగారనే కారణంతో ఒలింపిక్ కమిటీ, రెజ్లింగ్ కమిటీ ఆమెపై అనర్హత వేటు వేయడం సగటు అభిమానితో పాటు సెలబ్రిటీలను కలచివేసింది. దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు వినేశ్‌కు మద్దతుగా నిలిచారు. ఈ క్రమంలో పలువురు సినీ తారలు సైతం సోషల్ మీడియా ద్వారా వినేశ్‌కు ధైర్య వచనాలు చెప్పారు.

- పతకం గెలిచినా, గెలవకపోయినా మీరు నిజమైన ఛాంపియన్ అని అందరికి చూపించారు. ఫలితాన్ని మీరు స్వీకరించిన తీరు, కష్ట సమయంలో మీరు చూపిన నిబ్బరం మా అందరికీ స్ఫూర్తిదాయకం. మీ స్ఫూర్తి మాలోని ప్రతి ఒక్కరిలో ప్రకాశిస్తోంది. 140 కోట్ల హృదయాలు మీతో ఉన్నాయి.
  - మహేశ్ బాబు
- ఎంత పోరాట పటిమ కనబరిచేవారైనా కొన్నిసార్లు కఠినమైన అడ్డంకులను ఎదుర్కోవాల్సి వస్తుంది. మీరు ఒంటరి కాదు. కష్టసుఖాల్లో మేమంతా మీ వెన్నంటే ఉంటాం. ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి నిలబడిన మీ తీరు ప్రశంసనీయం
  - సమంత
- విజయమనే తూనికలో ఇమిడే ప్రతిభ కాదు నీది. నీ ఆటతీరుతో ఎంతోమందిని ప్రభావితం చేశావు. మా మనసుల్లో గొప్ప స్థానం పొందావు. మా అందరి ప్రేమాభిమానాలు నీతోనే ఉంటాయి. గర్వంగా తలెత్తుకొని నిలబడు.
  - నయనతార
- జాతి యావత్తుకు మీరు స్ఫూర్తిగా నిలిచారు. యోధురాలుగా కొన్ని తరాలు మిమ్మల్ని గుర్తుంచుకుంటాయి. ఇలాంటి అడ్డంకులు ఎన్ని వచ్చినా చరిత్ర సృష్టించకుండా విమ్మల్ని ఆపలేదు. పట్టుదలను, ధైర్యాన్ని, కష్టాన్ని మీ నుంచి దూరం చేయలేవు. మీలాంటి వారు మరొకరు లేరు.
  - అలియాభట్
- వినేశ్ నిష్క్రమణ నిరాశ కలిగించింది. ఆమె మనందరి హృదయాలను గెలుచుకున్నారు.
  - తాప్సీ
- వినేశ్ నువ్వే యోధురాలివి. నిన్ను చూసి గర్విస్తున్నా. నువ్వు సాధించింది పతకాల కంటే ఎక్కువ
  - దర్శకురాలు జోయా అక్తర్
- మీరెప్పుడూ ఛాంపియనే
  - సోనాక్షిసిన్హా



వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు నేపథ్యంలో నటి, బీజేపీ ఎంపీ హేమమాలిని చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. 'వంద గ్రాముల బరువు పెరిగారనే కారణంతో వినేశ్ అనర్హతకు గురవడం ఆశ్చర్యపరిచింది. క్రీడాకారులు, కళాకారులు తమ బరువును అదుపులో ఉంచుకోవడం ఎంత ముఖ్యమో ఈ సందర్భంగా మనం అర్థం చేసుకోవాలి. ఇది మనందరికీ ఒక పాఠం. ఆమె బరువు తగ్గొచ్చు కానీ పోయినా అవకాశం అయితే మళ్లీ రాదుకదా' అని వ్యాఖ్యానించారు హేమమాలిని. ఒక ప్రజా ప్రతినిధి అయి ఉండి, కష్టకాలంలో క్రీడాకారిణిగా ధైర్యం చెప్పాల్సింది పోయి ఇలా కామెంట్ చేయడం తగదని నెటిజన్లు హితవు పలికారు. అనర్హత అంశం గురించి హేమమాలిని మీడియాతో నవ్వుతూ మాట్లాడారని తప్పుపట్టారు.

సమాజానికి ఉపయోగపడే
సినిమాలే చేస్తా



ప్రొడ్యూసర్ టాక్

దర్శకుడు సంపత్ నంది, దాసరి రాజేందర్ రెడ్డి సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'సింబా'. మురళి మనోహర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో జగపతిబాబు, అనసూయ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర నిర్మాతల్లో ఒకరైన రాజేందర్ రెడ్డి మీడియాతో ముచ్చటించారు. 'సంపత్ నంది సమాజానికి ఉపయోగపడేలా ఏదైనా చేద్దాం అనే ఉద్దేశంతో ఈ కథ రాసి నా దగ్గరికి వచ్చారు. ప్రకృతి మీద ప్రేమను పెంచేలా.. పర్యావరణ పరిరక్షణపై అవగాహనను కల్పించేలా ఉంటుందీ చిత్రం. జగపతిబాబు, అనసూయ నటన సినిమాకే హైలైట్. ఆగస్టు 9 అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం కాబట్టి అదే రోజున సినిమాను విడుదల చేస్తున్నాం. ఇకపై నేను చేసే ప్రతీ సినిమాలో ప్రజలకు ఉపయోగపడే అంశాలు ఉంటాయి" అని చెప్పారు.

విజయదశమికి
'కార్తికేయ 3'ను ప్రకటిస్తాం



'కార్తికేయ', 'సుబ్రమణ్యపురం', 'కథలో రాజకుమారి' చిత్రాలతో మంచి అభిరుచి ఉన్న నిర్మాతగా పేరు తెచ్చుకున్నారు వెంకట శ్రీనివాస్ బొగ్గరం. ఆయన ఇటీవలే మీడియాతో ముచ్చటించి.. అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'కార్తికేయ 3' సినిమా గురించి ఓ ఆసక్తికర అప్‌డేట్‌ను అందించారు.

"'కార్తికేయ' మొదటి భాగం విడుదలై పదేళ్లు అవుతున్న సందర్భంగా అక్టోబరులో విజయదశమి రోజున 'కార్తికేయ 3' సినిమాను అధికారికంగా ప్రకటించనున్నాము. ఆ రోజే సినిమా గురించి మరిన్ని వివరాలు వెల్లడిస్తాము. 'కార్తికేయ 2' సంచలన విజయం సాధించడంతో మూడో భాగంపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. అందరి అంచనాలు నిలబెట్టుకోవడానికి స్క్రిప్ట్ విషయంలో చాలా జాగ్రత్తలు పాటిస్తున్నాం. డివోషనల్ టచ్ ఉండేలా హనుమంతుడి స్ఫూర్తితో 'యతి' అనే సినిమాను.. శివుడి స్ఫూర్తితో 'మహాయోగి' అనే మరో సినిమాను నిర్మిస్తున్నాను" అని చెప్పారు.

పారిస్ ఒలింపిక్స్
(జూలై 26 - ఆగస్టు 11)

ఒలింపిక్స్ ముగింపు దశకు వస్తున్నా ఒక్క స్వర్ణ పతకమూ లేదని 140 కోట్ల మంది భారతీయులు ఆవేదన చెందుతున్న తరుణం..అలాంటి సమయంలో అంచనాలను నిలబెట్టుకొంటూ, తన సత్తా, పోరాట పటిమను చాటిచెబుతూ పసిడి పతక పోరుకు దూసుకొచ్చింది..దేశ ప్రజానీకంలో ఆనందోత్సాహాలు నింపింది..వారు గర్వంగా తలెత్తుకొనేలా చేసింది..మరికొద్ది గంటల్లో జరిగే తుది పోరులో కూడా సివంగిలా విజృంభించడం ద్వారా ఈసారి విశ్వక్రీడల్లో స్వర్ణ బోణీ కొడుతుందని దేశ ప్రజలు సంబరపడుతున్న వేళ ఊహించని పరిణామం..100 గ్రాముల బరువు అధికంగా ఉండడంతో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ అనర్హతకు గురైంది. ఈ హఠాత్పరిణామంతో భారతావని మ్రాన్పడిపోయింది..అంతులేని వేదనలో కూరుకు పోయింది..ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సహా దేశం..దేశం..వినేశ్ ఫొగట్‌కు అండగా నిలిచింది..మరోవైపు రెండు కేజీల బరువు తగ్గేందుకు ఆహారం తీసుకోకుండా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు తీవ్ర వ్యాయామాలతో శ్రమించినా వినేశ్‌కు ఫలితం దక్కలేదు. పైగా అతి వ్యాయామంతో డీహైడ్రేషన్‌కు లోనైన వినేశ్ ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది..క్రీడా గ్రామంలోని పాలీ క్లినిక్‌లో చేరిన ఫొగట్‌ను భారత ఒలింపిక్ సంఘం చీఫ్ పీటీ ఉష కలిసి పరామర్శించింది..

వినేశ్ విలాపం

రెజ్లర్‌పై అనర్హత వేటు

పతకానికి దూరం

నిర్దేశిత బరువుకంటే 100 గ్రా. అదనం

రాత్రంతా తీవ్రంగా శ్రమించినా తగ్గని వైనం



ఆటలో భాగం

వినేశ్ వ్యాఖ్య

తన డిస్‌క్వాలిఫికేషన్‌పై వినేశ్ ఫొగట్ స్పందించింది. 'పతకాన్ని కోల్పోవడం దురదృష్టకరం. అయితే ఇవన్నీ ఆటల్లో సహజం' అని తనను కలిసిన రెజ్లింగ్ జాతీయ కోచ్ వీరేందర్ దహియాతో వినేశ్ వ్యాఖ్యానించింది. ఆసుపత్రిలో ఉన్న వినేశ్‌ను పలువురు ఐఓసీ అధికారులు కలిసి అనునయించారు.

కోర్టుకు వినేశ్.. నేడు తీర్పు?

తనపై వేసిన అనర్హత వేటును కొట్టివేయాలని క్రీడల మధ్యవర్తిత్వ న్యాయస్థానాన్ని (సీఏఎస్) వినేశ్ ఫొగట్ కోరింది. అంతేకాదు తనకు రజత పతకం ప్రకటించాలని కూడా విజ్ఞప్తి చేసింది. కాగా..తన తీర్పు ఇచ్చేందుకు న్యాయస్థానం గురువారం వరకు గడువు కోరినట్టు సమాచారం. న్యాయస్థానం కనుక వినేశ్‌కు అనుకూలంగా తీర్పు ఇస్తే..అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ వినేశ్‌కు సంయుక్తంగా రజత పతకం అందజేయాల్సి ఉంటుంది.

'వినేశ్‌పై అనర్హత వేటు నిరాశకలిగిస్తోంది. అయినా కోట్లాది మంది భారతీయుల చాంపియన్ ఆమెనే'

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

పారిస్: రెజ్లర్ వినేశ్ ఫొగట్ పసిడి పతక పోరుకోసం భారతావని అంతా ఉత్కంఠగా ఎదురు చూస్తోంది. ఫైనల్లోనూ ఆమె అద్భుతంగా రాణించి స్వర్ణ పతకం గెలవాలని ప్రార్థించింది. కొద్ది గంటల్లో జరగబోయే మహిళల 50 కిలోల ఫైనల్ బౌట్‌కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్న సమయంలో బుధవారం మధ్యాహ్నం పిడుగులాంటి వార్త వచ్చింది. నిర్ణీత బరువుకంటే వినేశ్ 100 గ్రాములు అదనంగా ఉందని, దాంతో నిబంధనల ప్రకారం నిర్వాహకులు ఆమెపై వేటు వేశారనేది ఆ వార్త. దరిమిలా దేశం మొత్తం షాక్‌కు లోనైంది. బంగారు పతకంతో సగర్వంగా తిరిగొస్తుందని ఆశించిన ప్రజలకు ఆమె రిక్తహస్తాలతో వెనక్కు వస్తోందన్న విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు.

ఎందుకిలా..

ప్రపంచ రెజ్లింగ్ పాలక మండలి..యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) నిబంధనల ప్రకారం..పోటీకి ముందు ప్రతి రెజ్లర్ బరువును పరిశీలిస్తారు. దానిని 'వే ఇన్' అంటారు. పోటీ రోజు ఉదయం.. పాల్గొనే రెజ్లర్లందరికీ వైద్య పరీక్షలతోపాటు వే ఇన్ నిర్వహిస్తారు. ఈ వే ఇన్ సందర్భంగా ఒక్కో రెజ్లర్‌కు 30 నిమిషాల సమయం ఇస్తారు. ఆలోపు ఎన్నిసార్లయినా బరువును పరీక్షించుకోవచ్చు. రెండోరోజు మాత్రం..ఫైనల్స్‌కు, రెపిచేజ్ రౌండ్‌కు అర్హత సాధించిన రెజ్లర్లకే వే ఇన్ ఉంటుంది. రెండోరోజు వే ఇన్ గడువు 15 నిమిషాలు. మొదటిరోజు కానీ, రెండోరోజుకానీ రెజ్లర్ ఎవరైనా వే ఇన్‌కు హాజరుకాకపోతే వారిని పోటీనుంచి బహిష్కరిస్తారు. వారికి చివరి ర్యాంకింగ్ ఇస్తారు.

బరువు తగ్గేందుకు..

రెండు రోజులపాటు బరువును పరిశీలించనున్న నేపథ్యంలో నిర్దేశిత బరువును కొనసాగించడం రెజ్లర్లకు కత్తిమీదసామే. ఒకవేళ బరువు పెరిగినా దానిని తగ్గించడమూ వారికి సవాలే. బరువు తగ్గడంకోసం ఆహారం మానేస్తారు. నీరు ఎక్కువగా తీసుకోరు. జిమ్‌లలో తీవ్రంగా శ్రమిస్తారు. ఇంకా..ఆవిరి స్నానం చేయడం, జుత్తు కత్తిరించుకోవడం వంటి విధానాలనూ ఆచరిస్తారు. వాస్తవానికి..50 కిలోల విభాగం వినేశ్ రెగ్యులర్‌గా పోటీపడేది కాదు. ఆమెది 53 కేజీల కేటగిరీ. కానీ ఈ విభాగంలో ఒలింపిక్ బెర్త్‌ను అంతిమ్ పంగల్ దక్కించుకొంది. ఫలితంగా వినేశ్ ఫొగట్ 50 కిలోల విభాగానికి మారాల్సి వచ్చింది.



ఆసుపత్రిలో వినేశ్

డీహైడ్రేషన్ వల్ల వినేశ్ స్పృహ కోల్పోవడంతో బుధవారం నాడు హుటాహుటిన ఆసుపత్రిలో చేర్చారు. క్రీడా గ్రామంలోని పాలీ క్లినిక్‌లో ఆమెకు చికిత్స అందిస్తున్నారు. భారత బృందం డాక్టర్ పార్థీవాలా, వినేశ్ కోచ్, ఇతర సహాయ సిబ్బంది ఆమెతో ఉన్నారు. చికిత్స పొందుతున్న వినేశ్‌ను ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష కలిసి పరామర్శించింది. ఆమెను అనునయించడంతోపాటు ధైర్యం చెప్పింది.

ఉషకు ప్రధాని మోదీ సూచన

వినేశ్ డిస్‌క్వాలిఫై అయ్యిందని తెలియగానే... ఐఓఏ చీఫ్ పీటీ ఉషతో ప్రధాని మోదీ మాట్లాడారు. వినేశ్‌పై వేటుకు సంబంధించి ఐఓసీ ముందు రివ్యూకు అప్పీల్ చేయాలని సూచించారు. ఆమేరకు బలమైన వాదనలు వినిపించాలని కూడా ఉషను ప్రధాని ఆదేశించారు.

అందుకే బరువు పెరిగింది

పోటీల తర్వాత నిర్దేశిత బరువుకంటే వినేశ్ 2.7 కిలోలు అదనంగా బరువున్నట్టు గుర్తించాం. సాధారణంగా బరువును తగ్గించేందుకు చాలా సమయం పడుతుంది. కానీ మాకు 12 గంటల సమయమే మిగిలింది. వెంటనే కోచ్, సహాయ బృందం అన్ని చర్యలు తీసుకుంది' అని పారిస్‌లో భారత బృందం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. దిన్షా పార్థీవాలా వివరించారు. 'రాత్రికి రాత్రి రెండు కేజీల బరువు తగ్గడం ఆషామాషీకాదు. బరువు తగ్గించే చర్యలు శక్తి కోల్పోయేలా చేస్తాయి. బౌట్లలో పాల్గొన్న తర్వాత బరువు ఒక్కసారిగా పెరిగే అవకాశాలుంటాయి' అని పార్థీవాలా తెలిపారు. 'వినేశ్ విషయంలో ఒక్కసారి బరువు తగ్గడం మరీ..మరీ..కష్టం. ఎందుకంటే ఆమె సహజ శరీర బరువు 56-57 కిలోలు' అని ఆయన గుర్తు చేశారు.



గతంలో ఇలా జరిగిందా?

ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, ఆసియా, వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో ఏ రెజ్లర్‌కైనా నిర్దేశిత బరువుకంటే ఒక్క గ్రాము కన్సెషన్ కూడా ఇవ్వరు. కానీ ర్యాంకింగ్, ఇన్విటేషనల్ ఈవెంట్లకు మాత్రం రెండు కేజీల వరకు మినహాయింపు ఉంటుంది. ఇక..2016 రియో ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ ఈవెంట్ సందర్భంగా వినేశ్ 400 గ్రాములు అధికంగా ఉండడంతో అప్పుడూ ఆమెపై వేటు పడింది.

జుత్తు కత్తిరించుకున్నా..

మంగళవారం జరిగిన తొలి బౌట్‌లో ఒలింపిక్ చాంపియన్ యు యి సుసాకిపై సంచలన విజయం సాధించిన వినేశ్..ఆపై క్వార్టర్స్, సెమీస్‌లోనూ గెలుపొంది పసిడి పతక పోరులో అడుగుపెట్టింది. తొలిరోజు..అంటే మంగళవారం బౌట్లకు ముందు ఆమె 49.9 కిలోలు ఉందని సమాచారం. మూడు బౌట్లతో నీరసించిన ఆమె కొద్దిపాటి ఆహారం తీసుకుంది. సెమీస్ మ్యాచ్ పూర్తయ్యాక వినేశ్ 52.7 కిలోలు ఉందట. దాంతో సెమీఫైనల్ కాగానే వినేశ్ స్కిప్పింగ్ చేస్తున్న దృశ్యాలు ఎక్స్‌లో వైరల్ అయ్యాయి. అలాగే జాగింగ్, సైక్లింగ్, ఆవిరి స్నానం కూడా చేసింది. అంతే కాదు.. ఆహారం తీసుకోకుండా, మంచినీరు తాగకుండా మంగళవారం రాత్రంతా మేల్కొనే ఉంది. ఇంకా జుత్తు కూడా కత్తిరించుకుంది. శరీరంలో కొంత రక్తం కూడా తీయించుకున్నదట. అయితే ఇంతగా కష్టపడినా..బుధవారం ఉదయం వే ఇన్‌కు వెళ్లినప్పుడు ఆమె నిర్ణీత 50 కేజీలకంటే 100 గ్రాముల అదనంగా ఉంది. దరిమిలా వినేశ్‌పై అనర్హత వేటు పడింది.

కుట్ర జరిగిందా?

వినేశ్‌పై వేటు వెనుక కుట్ర కోణం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ..అతడిని బహిష్కరించాలనే డిమాండ్‌తో దేశ రెజ్లర్లంతా ఏడాదికిపైగా ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఉద్యమానికి వినేశ్‌తోపాటు ఇతర స్టార్ రెజ్లర్లు బజ్‌రంగ్ పూనియా, సాక్షి మాలిక్ నేతృత్వం వహించారు. తీవ్ర స్థాయికి చేరిన ఆ ఉద్యమం పార్లమెంట్ ముట్టడికి దారి తీయడం..ఆ క్రమంలో వినేశ్ సహా ఇతర రెజ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు భారత రెజ్లింగ్ సమాఖ్యపై యూడబ్ల్యూడబ్ల్యూ వేటు వేసింది. రెజ్లర్ల ఆందోళన ఫలితంగా డబ్ల్యూఎఫ్ఐకి బ్రిజ్‌భూషణ్ రాజీనామా చేయక తప్పలేదు. అలాగే..బ్రిజ్‌భూషణ్ తదితరులపై కేసులు నమోదై కోర్టు విచారణ వరకు వెళ్లింది. కాగా..డబ్ల్యూఎఫ్ఐకి జరిగిన ఎన్నికల్లో బ్రిజ్‌భూషణ్ ప్రధాన అనుయాయి సంజయ్ సింగ్ అధ్యక్షుడిగా ఎన్నికవడం గమనార్హం. సంజయ్ సింగ్ ఎన్నికపై స్టార్ రెజ్లర్లంతా ఇప్పటికీ అసంతృప్తిగానే ఉన్నారంటారు. మొత్తంగా రెజ్లర్ల ఆందోళన దేశ క్రీడా రంగంలో ప్రకంపనలు సృష్టించింది. నాటి ఆందోళనతో రెజ్లింగ్ సమాఖ్య అప్పటి పెద్దలు, ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు ఇప్పటికీ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు చెబుతున్నారు. ఈనేపథ్యంలో..కీలకమైన ఒలింపిక్స్ 50 కి. ఫైనల్ బౌట్‌కు ముందు వినేశ్ ఫొగట్‌పై వేటు పడడం చర్చకు దారి తీసింది. నాటి ఆందోళనను జీర్ణించుకోలేని సమాఖ్య పెద్దలు కొందరు..ఫొగట్ డిస్‌క్వాలిఫికేషన్ వెనుక ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధిక క్యాలరీలు ఉన్న ఆహారాన్ని సహాయ సిబ్బందితో వినేశ్‌కు ఇవ్వడం ద్వారా ఆమె బరువు పెరిగేలా కుట్ర పన్నారని వారు ఆరోపిస్తున్నారు. దిగ్గజ బాక్సర్ విజేందర్ సింగ్ కూడా కుట్రకోణం ఉందనడాన్ని వారు ప్రస్తావిస్తున్నారు. 'మన రెజ్లర్లపై ఇది పెద్ద కుట్ర. 100 గ్రాముల బరువు తగ్గేందుకు వినేశ్‌కు మరింత సమయం ఇవ్వాల్సింది. గతం లో ఏ అథ్లెట్‌కు ఇలాంటిది జరగలేదు' అని విజేందర్ ఎక్స్‌లో వ్యాఖ్యానించాడు. ఏమైనా..వినేశ్ ఫొగట్‌పై వేట దేశ క్రీడా రంగంలో మరోసారి ప్రకంపనలు సృష్టిస్తోంది.

అలాంటిదేమీ లేదు: వినేశ్ డిస్‌క్వాలిఫై అంశంలో కుట్రలేదని భారత అథ్లెటిక్ సమాఖ్య (ఏఎఫ్ఐ) స్పష్టంజేసింది. ఈమేరకు వస్తున్న వార్తలను తోసిపుచ్చింది. అది సాంకేతిక అంశమని, దానిని రాజకీయం చేయొద్దని సమాఖ్య అధ్యక్షుడు సుమరివాలా కోరారు.

గాయంతో వైదొలగితే పతకం వచ్చేదా?

గాయం కారణం చూపుతూ ఫైనల్ బౌట్‌నుంచి వినేశ్ వైదొలిగితే కనీసం రజత పతకం లభించేదన్న వాదన వినిపిస్తోంది. యూడబ్ల్యూడబ్ల్యూ నిబంధనలు అందుకు అంగీక రించవు. మొదటి రోజు పోటీ సమయంలో రెజ్లర్ గాయపడితే రెండోరోజు వే ఇన్‌కు హాజరు కానవసరంలేదు. అయితే తొలిరోజు పోటీ అనంతరం రెజ్లర్ గాయపడినా లేదా అనారోగ్యంతో వాకోవర్ ఇవ్వడానికి ముందు కూడా వే ఇన్‌కు రావాల్సిందే. ఇక వినేశ్ మొదటిరోజు పోటీ సందర్భంగా గాయపడలేదు. అందువల్ల ఆమె రెండో రోజు వే ఇన్‌కు తప్పక హాజరు కావాల్సిందే.

విచారణ జరగాలి: డబ్ల్యూఎఫ్ఐ

వినేశ్ అనర్హతకు గురవడంలో ఆమె కోచ్, సహాయ సిబ్బందిదే పూర్తి బాధ్యత అని భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు సంజయ్ సింగ్ అన్నాడు. ఈ విషయంలో పూర్తిగా విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరాడు. 'వినేశ్ అదనపు బరువు విషయమై బుధవారం ఉదయం ఫోన్ వచ్చింది. ఆమెకు కొంత సమయం, సడలింపు ఇవ్వాలని అధికారులను అభ్యర్థించినా ఫలితం లేకపోయింది. ఈ విషయంలో వినేశ్ తప్పు ఉందని నేను అనుకోవడం లేదు. మొత్తం బాధ్యతంతా ఆమె కోచ్, సహాయక సిబ్బందిపై ఉంది. ఆమె బరువు ఎలా పెరిగిందనే దానిపై విచారణ జరగాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా' అని సంజయ్ వ్యాఖ్యానించాడు.

ఆశలన్నీ చోప్రాపైనే!

నేడే జావెలిన్ త్రో ఫైనల్ రాత్రి 11.55 నుంచి



పారిస్: సెమీస్‌లో హాకీ జట్టు ఓటమి.. వినేశ్ ఫొగట్‌పై అనర్హత వేటుతో.. కోట్లాది మంది భారతీయులు ఆశగా ఎదురుచూస్తున్నది ఒక్కడివైపు.. అతడే బల్లెం వీరుడు నీరజ్ చోప్రా. గురువారం మధ్య రాత్రి జరిగే జావెలిన్ త్రో ఫైనల్లో చోప్రా ఫేవరెట్లలో ఒకడిగా బరిలోకి దిగనున్నాడు. జావెలిన్ త్రో డిఫెండింగ్ చాంప్‌గా పోటీల్లోకి అడుగుపెట్టిన చోప్రా.. క్వాలిఫయర్స్‌లో ఒకే ఒక్క త్రో నేరుగా ఫైనల్‌కు చేరి సత్తాచాటాడు. 84 మీటర్లు ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ మార్క్‌గా నిర్ణయించగా.. నీరజ్ తొలి త్రోలోనే 89.34 మీటర్లు విసిరాడు. ఫైనల్ చేరుకొన్న 12 మందిలో చోప్రాదే టాప్ త్రో. అయితే, పతక పోరులో జాకబ్ వాల్డెజ్ (చెక్), అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జూలియన్ వెబర్ (జర్మనీ), అర్షద్ నదీమ్ (పాక్) నుంచి నీరజ్‌కు గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. గత క్రీడల్లో స్వర్ణం గెలిచిన చోప్రా.. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించాడు. ఆ తర్వాత డైమండ్ లీగ్ చాంప్‌గా నిలిచి.. నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకొన్నాడు. మరోసారి అతడు దేశానికి పసిడి అందించగలడనే అంచనాలు భారీగా ఉన్నాయి. ఇదే జరిగితే ఒలింపిక్స్ చరిత్రలో జావెలిన్ త్రో టైటిల్ నిలబెట్టుకొన్న ఐదో ఆటగాడిగా.. రెండు ఒలింపిక్ స్వర్ణాలు సాధించిన తొలి భారత అథ్లెట్‌గా నీరజ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించనున్నాడు.

రెపిచేజ్‌లో జ్యోతి



మహిళల 100 మీ. హర్డిల్స్‌లో తెలుగమ్మాయి జ్యోతి యర్రాజి నేరుగా సెమీస్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. అయితే, రెపిచేజ్ రూపంలో ఆమెకు మరో అవకాశం లభించనుంది. క్వాలిఫికేషన్ రౌండ్-1 హీట్-4లో జ్యోతి 13.16 సెకన్ల టైమింగ్‌తో ఏడో స్థానంలో నిలిచింది. గురువారం రెపిచేజ్ రౌండ్ జరగనుంది. ఈ ఈవెంట్‌లో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి భారత్ అథ్లెట్ జ్యోతి.

క్వార్టర్స్‌లో ఓడిన భారత్: టేబుల్ టెన్నిస్‌లో భారత పోరాటం ముగిసింది. మహిళల టీమ్ ఈవెంట్ క్వార్టర్స్‌లో భారత్ 1-3తో జర్మనీ చేతిలో ఓడింది. డబుల్స్‌లో శ్రీజ-అర్చన జోడీ, సింగిల్స్ మ్యాచ్‌ల్లో శ్రీజ, మనికా బాత్రా ఓడగా.. అర్చనా కామత్ మాత్రమే నెగ్గింది.

అంతిమ్ అవుట్..: కచ్చితంగా పతకం తెస్తుందనే భారీ అంచనాలున్న అంతిమ్ పంగల్ రౌండ్-16లోనే నాకౌటైంది. 53 కిలోల విభాగంలో అంతిమ్ 0-10తో యట్గిల్ జెనెప్ (టర్కీ) చేతిలో మట్టికరిచింది. జెనెప్ క్వార్టర్స్‌లో ఓడడంతో పంగల్‌కు రెపిచేజ్ కూడా ఆడే అవకాశం లేకుండా పోయింది. వరల్డ్ చాంపియన్‌షిప్స్ కాంస్య పతక విజేత అయిన అంతిమ్.. రెజ్లింగ్‌లో భారత్‌కు తొలి ఒలింపిక్ బెర్త్ అందించింది.

అన్నూ రాణి విఫలం: మహిళల జావెలిన్ త్రోలో అన్నూ రాణి ఫైనల్‌కు అర్హత సాధించలేక పోయింది. గ్రూప్-ఎలో మూడు ప్రయత్నాల్లో అన్నూ 55.81 మీ., 53.22 మీ., 53.55 మీటర్ల దూరం మాత్రమే విసిరి 15వ స్థానంలో నిలిచింది. ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ మార్క్ 62 మీటర్లు కాగా.. టాప్-12లో నిలిచేలా అన్నూ రాణి అత్యుత్తమ త్రో కూడా చేయలేక పోయింది. హైజంప్‌లో సర్వేష్ కుశాలె కూడా ఫైనల్ చేరడంలో విఫలమయ్యాడు. క్వాలిఫికేషన్ మార్క్ 2.29 మీటర్లు కాగా.. గ్రూప్-బిలో సర్వేష్ 2.15 మీటర్ల ఎత్తు మాత్రమే దూకాడు. మూడు ప్రయత్నాల్లోనూ 2.20 మీటర్ల ఎత్తును లంఘించలేక పోయాడు. దీంతో గ్రూప్-బిలో 13వ స్థానంలో నిలిచాడు. మారథాన్ రేస్ వాక్ మిక్స్‌డ్ రిలేలో సూరజ్ పన్వర్-ప్రియాంక గోస్వామి జోడీ రేస్‌ను ముగించలేక పోయింది. ఫైనల్ లెగ్‌లో గోస్వామి తప్పుకొంది.

పతకాల పట్టిక

దేశం	స్వ	ర	కా	మొ
అమెరికా	25	33	32	90
చైనా	24	22	16	62
ఆస్ట్రేలియా	17	12	10	39
ఫ్రాన్స్	13	16	20	49
బ్రిటన్	12	16	20	48
భారత్	0	0	3	3

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

మోగించాలి.. కంచు మోత

స్పెయిన్‌తో భారత్ కాంస్య పతక పోరు నేడు
సా. 5.30 నుంచి



సెమీస్‌లో ఓడిన భారత హాకీ జట్టు కనీసం పోడియం ఫినిష్ చేయాలని అభిమానులు కోరుకొంటున్నారు. గురువారం జరిగే కాంస్య పోరులో స్పెయిన్‌తో భారత్ తలపడనుంది. టోక్యోలో కంచు పతకం నెగ్గిన టీమిండియా ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా కనిపిస్తోంది. ఇటీవలి కాలంలో స్పెయిన్‌తో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో భారత్ నాలుగింటిలో గెలిచింది. కాగా, జర్మనీతో సెమీస్ పోరులో భారత జట్టు దీటుగా పోరాడినా.. పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచడంలో వైఫల్యం దెబ్బకొట్టింది. డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ ఆటలో సృజనాత్మకత లోపించిందనే విమర్శలు కూడా ఉన్నాయి. మరోవైపు డిఫెండర్ల ఏమరపాటు కారణంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఈ మ్యాచ్‌లోనైనా సత్తాకు తగ్గట్టుగా ఆడినా కనీసం కాంస్యంతో సగర్వంగా వెనుదిరుగుతారు. మరోవైపు నెదర్లాండ్స్ చేతిలో ఓడిన స్పెయిన్ కూడా మెరుగైన ఆటనే ప్రదర్శిస్తోంది. క్వార్టర్స్‌లో డిఫెండింగ్ చాంప్ బెల్జియంను నాకౌట్ చేసింది. ఈ నేపథ్యంలో ప్రత్యర్థిని భారత్ ఏమాత్రం తేలిగ్గా తీసుకోకూడదు.

పారిస్‌లో నేటి భారతం



గోల్ఫ్: మహిళల వ్యక్తిగత రెండో రౌండ్ - అదితి అశోక్, దీక్షా డాగర్ (మ. 12.30).

అథ్లెటిక్స్: మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రెపిఛేజ్ రౌండ్ - జ్యోతి యర్రాజి (మ. 2.05), పురుషుల జావెలిన్ త్రో ఫైనల్ - నీరజ్ చోప్రా (రా. 11.55).

రెజ్లింగ్: పురుషుల 57 కిలోల ఫ్రీస్టయిల్ 1/8 ఫైనల్స్ - అమన్ షెహ్రావత్ (మ. 2.30), మహిళల 57 కిలోల ఫ్రీస్టయిల్ 1/8 ఫైనల్స్ - అన్షు మాలిక్ (మ. 2.30).

హాకీ: పురుషుల కాంస్య పతక పోరు భారత్ X స్పెయిన్ (సా. 5.30)

ఇతర పతకాంశాలు

మహిళల లాంగ్ జంప్ ఫైనల్- రాత్రి: 11.30 గం.
పురుషుల 200 మీటర్ల ఫైనల్- రాత్రి 12.00 గం.
మహిళల 400 మీటర్ల హర్డిల్స్ ఫైనల్-రాత్రి 12.55 గం.
పురుషుల 110మీటర్ల హర్డిల్స్ ఫైనల్-రాత్రి 1.15 గం.
పురుషుల హాకీ స్వర్ణ పతక పోరు- రాత్రి 10.30
మహిళల ఫుట్‌బాల్ కాంస్య పతక పోరు- రాత్రి 8.30.

లంక..27 ఏళ్ల తర్వాత

భారత్‌పై సిరీస్ విజయం
మూడో వన్డేలో గెలుపు



కొలంబో: టీమిండియాపై లంకేయులు 27 ఏళ్ల తర్వాత ద్వైపాక్షిక సిరీస్ నెగ్గి.. జూలు విదిల్చారు. తొలి వన్డే టైగా ముగియగా మిగిలిన రెండు వన్డేల్లో విజయ ఢంకా మోగించిన శ్రీలంక 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో టీమిండియా 110 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. టాస్ గెలిచి, తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టు 50 ఓవర్లలో 7 వికెట్లకు 248 పరుగులు చేసింది. ఓపెనర్లు అవిష్క ఫెర్నాండో (96), పతుం నిస్సంక (45), వికెట్‌కీపర్ కుశాల్ మెండిస్ (59) రాణించారు. భారత బౌలర్లలో రియాన్ పరాగ్ (3/54)కు మూడు, కుల్దీప్, వాషింగ్టన్, అక్షర్, సిరాజ్‌లకు తలో వికెట్ లభించాయి. ఆఫ్‌స్పిన్నర్ దునిత్ వెల్లలగే విజృంభించడంతో (5/27) ఛేదనలో టీమిండియా 26.1 ఓవర్లలో 138 పరుగులకు ఆలౌటై ఓటమి పాలైంది. కెప్టెన్ రోహిత్ శర్మ (35), టెయిలెండర్లలో వాషింగ్టన్ సుందర్ (30) మినహా మరే ఆటగాడు 30 పరుగులు కూడా చేయకపోవడం గమనార్హం. త్రుటిలో సెంచరీ కోల్పోయిన ఓపెనర్ అవిష్క ఫెర్నాండోకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు, సిరీస్‌లో 7 వికెట్లు, 108 పరుగులు సాధించిన దునిత్‌కు మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డు లభించాయి. ఇక, ఈ సిరీస్‌లో స్పిన్నర్ల చేతిలో భారత్ 27 వికెట్లు కోల్పోవడం, టీమిండియా బ్యాటింగ్ లైనప్ బలహీనతలను బయటపెట్టింది. ఇప్పటివరకు ఏ ద్వైపాక్షిక సిరీస్‌లోనూ (3 వన్డేలు) స్పిన్నర్లకు భారత్ ఇన్ని వికెట్లు కోల్పోలేదు.

కౌన్సెలింగ్

డాక్టర్! దోమలు కుట్టకుండా ఉండడం కోసం మస్క్యుటో కాయిల్స్ వెలిగిస్తున్నాం. వీటితో దోమల బెడద వదులుతున్నా, మా మూడేళ్ల అమ్మాయి దగ్గు పెరుగుతోంది. ఇలా ఎందుకు జరుగుతోంది?

– ఓ సోదరి, హైదరాబాద్



కాయిల్స్ పొగ ప్రమాదకరం

దోమలను వదిలించుకోవడం కోసం మస్క్యుటో కాయిల్స్, మ్యాట్స్ వెలిగించినప్పుడు వాటి నుంచి వెలువడే పొగలో విషపూరిత, హానికారక రసాయనాలుంటాయి. వాటిని పీల్చుకోవడం ప్రమాదకరం. మరీ ముఖ్యంగా ఊపిరితిత్తులు బలహీనపడిన వారు, పుట్టినప్పటి నుంచి అలర్జీ తత్వం కలిగి ఉన్న పిల్లలకు ఈ పొగ వల్ల ఆస్తమా, బ్రాంకైటిస్ సమస్యలు తీవ్రమవుతాయి. కాబట్టి దోమలను దూరం చేసుకోవడం కోసం దోమ తెరలు వాడుకోవాలి. లేదంటే దోమల బ్యాట్స్ వాడుకోవాలి. మీ మూడేళ్ల పాప దగ్గుకు మస్క్యుటో కాయిల్స్ నుంచి వెలువడే పొగ ప్రధాన కారణం. కాబట్టి వీటి వాడకం వెంటనే మానేయండి. ఘాటైన వాసనలు, పొగలు వెలువరించే దోమల మందుల వాడకం పూర్తిగా మానేయండి. పాపకు ఉన్న అలర్జీని తగ్గించుకోవడం కోసం వైద్య నిపుణులకు కలిసి ఇన్‌హేలర్స్ వాడుకోండి. అలాగే దోమలు పెరగకుండా ఉండడం కోసం ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ, నీళ్లు నిల్వ ఉండే వీలు లేకుండా చూసుకోవాలి. కొబ్బరి చిప్పలు, టైర్లు, రాలి పడిన చెట్ల ఆకులు, కొమ్మలు, విరిగిపోయిన కుర్చీలు లాంటి పనికిరాని వస్తువులు పరిసరాల్లో లేకుండా చూసుకోవాలి.

- డాక్టర్ రాజు
జనరల్ ఫిజీషియన్,
హైదరాబాద్

పాప్ సింగర్‌గా, ఆధ్యాత్మిక గాయనిగా, నటిగా, సౌందర్య వస్తువుల వాణిజ్యవేత్తగా స్మిత తెలుగువారికి సుపరిచితురాలు. వంటింట్లో దొరికే దినుసులతో తయారు చేసిన... మన అమ్మమ్మల కాలం నాటి అనేక సౌందర్య ఉత్పత్తులను, సేవలను అందించటానికి ఆమె ఒక బ్రాండ్‌ను కూడా ప్రారంభించారు. రకరకాల రాళ్ల (క్రిస్టల్స్)తో కూడిన ఆయిల్స్‌ను ఉపయోగించే 'క్రిస్టల్ ఆయిల్ థెరపీ'ని ప్రత్యేకంగా ప్రవేశపెట్టారు. వీటి గురించి స్మిత మాటల్లోనే..



ఆ వారసత్వాన్ని వదలకూడదని

"ఒకప్పుడు సౌందర్యసాధనాలను ఇళ్లలోనే తయారుచేసుకొనేవారు. వాటి వల్ల ఎటువంటి దుష్ఫలితాలు ఉండేవి కావు. వంటింట్లో దొరికే పసుపు, తేనె, శనగపిండి, శీకకాయ లాంటి వాటితోనే వీటిని తయారుచేసేవారు. కనీసం వారానికి ఒకసారైనా నూనె రాసుకొని.. నలుగు పెట్టుకొని స్నానం చేసేవారు. దీని వల్ల శరీరంలో మలినాలన్నీ తొలగిపోయేవి. కేవలం శారీరక సౌందర్యం పెరగటమే కాదు, ఏవైనా ప్రతికూల ఆలోచనలున్నా తొలగిపోయేవి. దీనికి కారణం- మనం ఉపయోగించే పదార్థాలలో ఉన్న స్వచ్ఛత. ఆ తర్వాత కాలంలో రసాయనాలతో చేసిన సౌందర్యసాధనాలను వాడటం మొదలుపెట్టాం. వీటిని ఉపయోగించటం సులభం కాబట్టి ఎక్కువ మంది వీటివైపే మొగ్గు చూపించటం మొదలుపెట్టారు. కానీ మనకు కొన్ని వేల సంవత్సరాల నుంచి వచ్చి వారసత్వాన్ని వదులుకోకూడదనే ఉద్దేశంతో... సుమారు ఏడు సంవత్సరాల క్రితం నుంచి - 'ఓల్డ్ స్కూల్' అనే బ్రాండ్‌తో సౌందర్యసాధనాలు అమ్ముతున్నాం. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఒకప్పుడు మా అమ్మమ్మ కూడా నాకు నలుగు పెట్టి స్నానం చేయించేది. నా చర్మానికి, జుట్టుకు ఎటువంటి హాని కలగకుండా చూసుకొనేది. అప్పుడు ఆవిడ ఉపయోగించిన దినుసులు, పద్ధతులు నాకు ఇప్పటికీ జ్ఞాపకమే. అవన్నీ నన్ను ఇప్పటికీ వెంటాడుతూనే ఉంటాయి. అందుకే నేను తయారుచేసే ఉత్పత్తులన్నీ సంప్రదాయబద్ధంగానే ఉంటాయి. అయితే అందరికీ వీటిని ఉపయోగించటానికి సమయం లేకపోవచ్చు. అందుకోసం నేను 'డే స్పా బృందావనం' ప్రారంభించాను. మన పూర్వీకుల పద్ధతిలో నలుగు పెట్టి స్నానం చేయించి, చివరగా సాంబ్రాణి పొగతో జుట్టును ఆరబెట్టే విధానాలన్నీ ఇక్కడ ఉంటాయి. అంతేకాకుండా- ఇక్కడ క్రిస్టల్ ఆయిల్ థెరపీ అనే కొత్త పద్ధతిని కూడా ప్రవేశపెట్టాం. ఈ తరహా విధానం ప్రపంచంలో మరెక్కడా లేదు.



రాళ్లతో...

కొన్ని వేల సంవత్సరాల నుంచి మన పూర్వీకులు రకరకాల రాళ్ల (క్రిస్టల్స్) సౌందర్య ఉత్పత్తుల్లో వాడుతూ వస్తున్నారు. ఇక్కడ ఒక విషయాన్ని మనం తెలుసుకోవాలి. ముత్యాలు, పగడాలు, వజ్రాలు, రత్నాలు వంటి వాటిని ఆభరణాలు తయారుచేయటానికి ఉపయోగిస్తారు. వీటి కన్నా తక్కువ విలువ ఉన్న రోజ్ క్వార్ట్జ్, అమెథిస్ట్, క్లియర్ క్వార్ట్జ్ (స్ఫటిక) , బ్లాక్ ఆనెక్స్ వంటి రాళ్లను ఆభరణాలలోను, వస్తువుల తయారీలో మాత్రమే కాకుండా అక్కడక్కడ సౌందర్య సాధనాలలో కూడా వాడతారు. ఈ రాళ్లకు మన చర్మంలో ఉన్న మృతకణాలను తొలగించి కాంతివంతం చేయగలిగిన శక్తి ఉంటుంది. అందువల్ల ఈ రాళ్లను కొన్ని ప్రత్యేకమైన నూనెలలో ఎక్కువ కాలం ఉంచుతాం. దీని వల్ల ఈ రాళ్లలో ఉన్న పోషకాలు ఇతర పదార్థాలు నూనెలోకి చేరతాయి. ఈ నూనెను వాడటం వల్ల శరీరంలో ఉన్న మలినాలు తొలగిపోతాయి. ఇక్కడ మనం ఇంకో విషయాన్ని కూడా చెప్పుకోవాలి. మన దగ్గర అసలు సిసలైన క్రిస్టల్స్ దొరకవు. 90 శాతంపైగా క్రిస్టల్స్‌ను సౌత్ అమెరికా, సౌత్ ఆఫ్రికా, దుబాయ్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకొని విక్రయిస్తారు. వీటి ధర ఎక్కువగా ఉంటుంది. తక్కువ ధరకు లభిస్తే- అవి నకిలీవనే చెప్పాలి."

అవగాహన పెరిగింది...

సౌందర్య పోషణకు సంబంధించిన పరిశ్రమలో నేను 20 ఏళ్లుగా ఉన్నాను. ఒకప్పుడు రసాయనాలు ఎక్కువగా ఉండే ఉత్పత్తుల పట్ల వ్యతిరేకత ఉండేది కాదు. కానీ ప్రస్తుతం వినియోగదారులందరిలో అవగాహన బాగా పెరిగింది. వీరు తమ ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. తమకు ఎటువంటి హాని చేయని ఉత్పత్తులనే వాడుతున్నారు. ఇలాంటి వారికి మన పూర్వీకులు సూచించిన పద్ధతులు ఎంతో ఉపకరిస్తాయి. ఈ తరహా ఉత్పత్తులు మరిన్ని రావాలని, మన పూర్వీకుల పద్ధతులు ప్రపంచవ్యాప్తంగా తెలియాలని కోరుకుంటున్నాను.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

బిజినెస్

కార్వీ స్టాక్ బ్రోకింగ్‌కు సెబీ నోటీసులు

» 15 రోజుల్లో రూ.25 కోట్లు చెల్లించాలని ఆదేశం

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్‌కు (కేఎస్‌బీఎల్), దాని సీఎండీ సీ పార్థ సారథికి సెబీ మరోసారి షాకిచ్చింది. 15 రోజుల్లో కేఎస్‌బీఎల్ రూ.15.21 కోట్లు, పార్థసారథి రూ9.36 కోట్లు చెల్లించాలని నోటీసులు జారీ చేసింది. లేకపోతే కంపెనీ బ్యాంకు ఖాతాలను జప్తు చేసి; స్థిర, చరాస్తులను అమ్మేస్తామని హెచ్చరించింది. కంపెనీ సీఎండీ పార్థసారథినైతే అరెస్టు చేసి జైల్లో కూడా పెడతామని తెలిపింది. ఖాతాదారుల నుంచి తీసుకున్న పవర్ ఆఫ్ అటార్నీని దుర్వినియోగం చేసి, వారి షేర్లను ఆర్థిక సంస్థల వద్ద కుదువ పెట్టి, ఆ నిధులను తమ అనుబంధ సంస్థల్లోకి మళ్లించుకున్నందుకు సెబీ ఈ చర్య తీసుకుంది.

కిమ్స్ హాస్పిటల్ లాభం రూ.95.1 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కిమ్స్ హాస్పిటల్ జూన్ త్రైమాసికంలో రూ.95.1 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది రూ.8.4 కోట్లు ఎక్కువ. ఆదాయం 13.8 శాతం వృద్ధితో రూ.693 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంతో పోల్చినా ఆదాయం 8.7 శాతం పెరిగింది.

సీసీఎల్ ప్రాడక్ట్స్ రూ.2 డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వర్తమాన ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో సీసీఎల్ ప్రాడక్ట్స్ స్టాండ్ అలోన్ ప్రాతిపదికన రూ.25.14 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది రూ.2.79 కోట్లు తక్కువ. గత ఏడాది జూన్ త్రైమాసికంతో పోల్చితే కంపెనీ ఆదాయం రూ.372.31 కోట్ల నుంచి రూ.434.11 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరానికి రూ.2 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై రూ.2 చొప్పున తుది డివిడెండ్‌గా చెల్లించాలని కంపెనీ నిర్ణయించింది. ఇందుకు వచ్చే నెల 13ని రికార్డు తేదీగా పరిగణించాలని డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

దక్షిణాదిలో పెరిగిన బీమా చైతన్యం : పాలసీ బజార్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్షిణాది రాష్ట్రాల్లో బీమా రక్షణపై అవగాహన క్రమంగా పెరుగుతోంది. పెరుగుతున్న ప్రీమియం వసూళ్లే ఇందుకు నిదర్శనం. 2023 సంవత్సరంలో బీమా పాలసీల ప్రీమియం వసూళ్లు తెలంగాణలో 76 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 71 శాతం పెరిగాయని పాలసీబజార్ డైరెక్టర్ సజ్జా ప్రవీణ్ చౌదరి చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం పాలసీబజార్ ద్వారా బీమా కంపెనీలకు రూ..20,000 కోట్ల ప్రీమియం వసూలైంది. ఇందులో ఐదు శాతం తెలుగు రాష్ట్రాల వాటా అని చౌదరి చెప్పారు. ఈ సంవత్సరం వసూళ్లు 60 నుంచి 70 శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ పాలసీబజార్ కేంద్రంలో ప్రస్తుతం 450 మంది పని చేస్తున్నారని, 6 నెలల్లో వీరి సంఖ్యను 800కు పెంచబోతున్నట్టు తెలిపారు.

రియల్టీ.. హైదరాబాద్‌లో కాస్టలీ!

రెండో అత్యంత ఖరీదైన రెసిడెన్షియల్ మార్కెట్: నైట్ ఫ్రాంక్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఈ ఏడాది ప్రథమార్థానికి దేశంలోని అత్యంత ఖరీదైన రెసిడెన్షియల్ మార్కెట్లలో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. అఫర్డబిలిటీ ఇండెక్స్ పేరుతో నైట్ ఫ్రాంక్ బుధవారం విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. గృహ రుణ నెల వారీ కిస్తీ (ఈఎంఐ)- ఆదాయం నిష్పత్తి ఆధారంగా నైట్ ఫ్రాంక్ దేశంలోని 8 ప్రధాన నగరాల వివరాలతో ఈ జాబితాను రూపొందించింది. హైదరాబాద్ రెసిడెన్షియల్ మార్కెట్‌లో ఈ నిష్పత్తి 30 శాతంగా నమోదైంది. 2023, 2022లోనూ నిష్పత్తి 30 శాతంగానే ఉంది. ముంబై 51 శాతం నిష్పత్తితో అత్యంత ఖరీదైన నగరంగా ఉంది. ఇకపోతే, హైదరాబాద్‌లో గృహాల చదరపు అడుగు సగటు ధర 2010లో రూ.2,728 స్థాయిలో ఉండగా.. 2019 నాటికి రూ.4,500 స్థాయికి పెరిగిందని నైట్ ఫ్రాంక్ రిపోర్టు పేర్కొంది. 2024 ప్రథమార్థంలో రూ.5,681కి చేరుకుందని, 2019 నాటి స్థాయితో పోలిస్తే 26 శాతం పెరిగిందని నివేదిక వెల్లడించింది.

'సేవల నాణ్యత'పై రాజీ లేదు

కొత్త నిబంధనల అమలు తథ్యం: ట్రాయ్

టెలిమార్కెటింగ్ కాల్స్‌పైనా దృష్టి



న్యూఢిల్లీ: టెలికం, బ్రాడ్‌బ్యాండ్ సేవల నాణ్యతపై టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) గట్టి పట్టుదలతో ఉంది. ఇందుకోసం ఇటీవల కొత్తగా జారీ చేసిన నిబంధనలపై పునరాలోచన ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. బ్రాడ్‌బ్యాండ్ ఇండియా ఫోరం (బీఐఎఫ్) బుధవారం నిర్వహించిన 'ఇండియా శాట్‌కామ్ 2024' సదస్సులో ట్రాయ్ చైర్మన్ అనిల్ కుమార్ లహోటి ఈ విషయం స్పష్టం చేశారు. టెలికం, బ్రాడ్‌బాండ్ కంపెనీలు ఈ విషయంలో ఏ మాత్రం విఫలమైనా, వినియోగదారులకు నష్ట పరిహారం చెల్లించక తప్పదన్నారు. టెలికం వినియోగదారులను విసిగించే అనధికారిక టెలిమార్కెటింగ్ కాల్స్ కట్టడికీ ట్రాయ్ చర్యలు తీసుకుంటుందన్నారు. దీనికి సంబంధించి గట్టి చర్యలు తీసుకోవాలని ఇప్పటికే టెలికం కంపెనీలను కోరినట్టు తెలిపారు.

మరింత భారం: సీఓఏఐ

మరో వైపు సేవలకు సంబంధించి ట్రాయ్ కొత్త నాణ్యతా ప్రమాణాల నిబంధనలపై టెలికం కంపెనీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఏ అభివృద్ధి చెందుతున్న దేశంలోనూ ఇంత కఠినమైన ప్రమాణాలు లేవని తెలిపాయి. ఈ ప్రమాణాల అమలుతో ఖాతాదారులకు పెద్దగా ఒరిగేది లేకపోయినా, తమపై అదనపు ఆర్థిక భారం పడుతుందని రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) డైరెక్టర్ జనరల్ ఎస్‌పీ కొచార్ తెలిపారు. ట్రాయ్ తాజా నిబంధనలు వాస్తవ పరిస్థితులను విస్మరించేలా ఉన్నాయన్నారు. ట్రాయ్, ప్రభుత్వం ఎన్ని ఆదేశాలు జారీ చేసినా, ఇప్పటికీ తాము సెల్ టవర్లు, ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్ ఏర్పాటులో సమస్యలు ఎదుర్కొంటున్న విషయాన్ని సీఓఏఐ గుర్తు చేసింది. త్వరలోనే ఈ అంశంపై కేంద్ర టెలికమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియాని కలవాలని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

ఇవే కొత్త నాణ్యతా నిబంధనలు

- ఏ జిల్లాలోనూ 24 గంటలకు మించి సేవలకు అంతరాయం ఏర్పడకూడదు.
- 24 గంటలకు మించి అంతరాయం ఏర్పడితే కనీసం రూ.లక్ష నుంచి గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు జరిమానా.
- 24 గంటలకు మించి సేవలకు అంతరాయం ఏర్పడితే కంపెనీలు పోస్ట్ పెయిడ్ ఖాతాదారులకు రెంటల్ చార్జీల్లో తగ్గింపు ఇవ్వాలి.
- ప్రీపెయిడ్ ఖాతాదారులైతే ఎన్ని రోజులు సేవలకు అంతరాయం ఏర్పడితే అన్ని రోజులు వాలిడిటీ గడువు పొడిగించాలి.
- లాండ్‌లైన్ సేవలకు ఏర్పడే అంతరాయాన్ని మూడు రోజుల్లో పరిష్కరించాలి. లేకపోతే ఖాతాదారులకు నష్టపరిహారం చెల్లించాలి.
- వరుస పెట్టి తప్పులు చేసే కొద్దీ జరిమానా భారం పెరుగుతుంది.
- అక్టోబరు 1 నుంచి కొత్త నిబంధనల అమలు జరుగుతాయి.

వ్యాపారంలో తదుపరి స్థాయి వృద్ధికి

రిలయన్స్ రెడీ!

» ఆర్‌ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ



న్యూఢిల్లీ: వ్యాపార వృద్ధి పథంలో తదుపరి స్థాయికి ఎగబాకేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) సంసిద్ధంగా ఉందని కంపెనీ చైర్మన్ ముకేశ్ అంబానీ అన్నారు. ప్రపంచం ఒడుదొడుకులు, అనిశ్చితుల్లో కొట్టుమిట్టాడుతుండగా.. భారత్ సుస్థిరత, శ్రేయస్సు దీపస్తంభంగా ప్రకాశిస్తోందని కంపెనీ వార్షిక నివేదికలో అంబానీ పేర్కొన్నారు. ఆర్‌ఐఎల్ దేశంలోనే అత్యంత విలువైన కంపెనీ. స్టాక్ మార్కెట్లో అత్యధిక వెయిటేజీ ఉన్న కంపెనీ షేరు కూడా. సంప్రదాయ ఆయిల్ అండ్ కెమికల్స్ వ్యాపారం నుంచి టెలికాం, రిటైల్, మీడియా, తాజాగా ఆర్థిక సేవల్లోకీ ప్రవేశించింది. ఇక హరిత ఇంధన రంగంలో భారీ అరంగేట్రానికి బాటలు వేసుకుంటోంది.

2027 నాటికి రూ.118 లక్షల కోట్లకు భారత రిటైల్ మార్కెట్

భారత రిటైల్ మార్కెట్ ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఒకటని ఆర్‌ఐఎల్ పేర్కొంది. 2027 నాటికి దేశీయ రిటైల్ మార్కెట్ 1.4 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.118 లక్షల కోట్లు)కు చేరుకోవచ్చని అంచనా వేసింది. 2030 నాటికి మూడో అతిపెద్ద రిటైల్ మార్కెట్‌గా అవతరించనుందని అంటోంది.

నాలుగోసారీ నిల్ శాలరీ

ముకేశ్ అంబానీ రిలయన్స్ నుంచి వరుసగా నాలుగో ఏడాదీ రూపాయి వేతనం కూడా తీసుకోలేదు. కరోనా సంక్షోభ సమయంలో కంపెనీ వ్యయాలను తగ్గించేందుకు ఆయన తన జీతాన్ని పూర్తిగా వదులుకున్నారు.

డేటా ట్రాఫిక్‌లో జియో వాటా 60 శాతం

గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో నమోదైన మొత్తం డేటా ట్రాఫిక్‌లో రిలయన్స్ జియో వాటా 60 శాతానికి పెరిగిందని ఆర్‌ఐఎల్ వెల్లడించింది. అందరికీ అందుబాటు ధరలో, వేగవంతమైన 4జీ సేవల ద్వారా భారత్‌ను జియో 'డేటా డార్క్' నుంచి 'డేటా సంపన్న' దేశంగా మార్చిందని అంబానీ పేర్కొన్నారు.

మార్కెట్ పునరుజ్జీవం

» సెన్సెక్స్ 875 పాయింట్లు అప్

ముంబై: 3రోజుల వరుస నష్టాల నుంచి ఈక్విటీ మార్కెట్ బయటపడింది. విలువ ఆధారిత కొనుగోళ్లలో బలమైన పునరుజ్జీవం సాధించింది. ఆర్థిక స్థిరత్వం చోటు చేసుకుంటున్న సమయంలో వడ్డీరేట్లు పెంచబోమని బ్యాంక్ ఆఫ్ జపాన్ డిప్యూటీ గవర్నర్ హామీ ఇవ్వడం ప్రపంచ మార్కెట్లను లాభాల బాట పట్టించింది. మెటల్, ఐటీ, ఆయిల్ షేర్లలో విలువ ఆధారిత కొనుగోళ్లు జరిగాయి. దీంతో సెన్సెక్స్ 874.94 పాయింట్లు లాభపడి 79,468.01 వద్ద ముగిసింది. నిఫ్టీ 304.95 పాయింట్లు లాభపడి 24,297.50 వద్ద ముగిసింది. బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.8,97,352.99కోట్లు పెరిగి రూ.4,48,57,306.55 కోట్లకు (5.34లక్షల కోట్ల డాలర్లు) చేరింది.

సరస్వతి శారీ డిపో ఐపీఓ

సోమవారం ఇష్యూకి వస్తున్న సరస్వతి శారీ డిపో తన షేరు ధర పరిధిని రూ.152-160గా ప్రకటించింది. ఇష్యూ ద్వారా రూ.160 కోట్లు సేకరించడం కంపెనీ లక్ష్యం. ఈ ఇష్యూ సోమవారం ప్రారంభమై బుధవారం ముగుస్తుంది.

కోరమాండల్ లాభాలకు గండి

చెన్నై: జూన్ త్రైమాసికంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ ఆర్థిక ఫలితాలు మార్కెట్‌ను నిరాశపరిచాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.494 కోట్ల నుంచి రూ.309.24 కోట్లకు పడిపోయింది. ముడి పదార్థాల ఖర్చులు పెరిగి పోవడం, ప్రభుత్వం నుంచి ఎరువులసబ్సిడీ అందక పోవడం ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. కంపెనీ ఆదాయం కూడా రూ.5,737.89 కోట్ల నుంచి రూ.4,782.93 కోట్లకు పడిపోయింది.



టాటా కర్వ్ ఈవీ వచ్చేసింది

ప్రారంభ ధర రూ.17.49 లక్షలు

ముంబై: దేశీయ వాహన తయారీదారు టాటా మోటార్స్ తన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ కూపే మోడల్ 'కర్వ్.ఈవీ'ని బుధవారం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీని ప్రారంభ ధర రూ.17.49 లక్షలు. గరిష్ఠ ధర రూ.21.99 లక్షలు. ఈ కారు రెండు బ్యాటరీ ప్యాక్ ఆప్షన్స్‌లో లభిస్తుంది. 45 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌తో కూడిన కారు సింగిల్ చార్జ్‌తో 502 కి.మీ వరకు ప్రయాణించగలదు. 55 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌తో కూడిన కారు పూర్తి చార్జింగ్‌లో 585 కి.మీ వరకు ప్రయాణించగలదని కంపెనీ వెల్లడించింది. ఈ కారు సున్నా నుంచి 100 కి.మీ వేగాన్ని కేవలం 8.6 సెకన్లలో అందుకోగలదని, గరిష్ఠంగా గంటకు 160 కి.మీ వేగంతో ప్రయాణించగలదని టాటా మోటార్స్ తెలిపింది. 12.3 అంగుళాల టచ్ స్క్రీన్, 10.25 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, పనోరామిక్ సన్‌రూఫ్, 6 ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీ వ్యూతో కూడిన కెమెరా, 18 అంగుళాల ఏరోడైనమికల్లీ డిజైన్డ్ అల్లాయ్ వీల్స్, ముందుభాగంలో ఎల్ఈడీ డీఆర్ఎల్ స్ట్రిప్, వెనకభాగంలో కనెక్టెడ్ ఎల్ఈడీ టెయిల్ లైట్స్, అడాస్ వంటి ఫీచర్లను ఈ కారులో పొందుపరిచినట్లు సంస్థ వెల్లడించింది. ఈ కారు ఐదు రంగుల్లో లభించనుంది. కాగా, సంప్రదాయ ఇంజన్‌తో నడిచే టాటా కర్వ్‌ను సంస్థ వచ్చేనెలలో మార్కెట్లోకి విడుదల చేయనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,270 ▼	63,500 ▼	87,000 ▼
ముంబై	68,940 ▼	63,150 ▼	79,160 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

8వ తేదీ			
హైదరాబాద్	395	విజయవాడ	430
వరంగల్	397	గోదావరి	426
చిత్తూరు	493	విశాఖపట్నం	430
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	75	విజయవాడ	85
వరంగల్	75	గుంటూరు	85
కరీంనగర్	75	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	75	చిత్తూరు	80
కర్నూలు	75	నెల్లూరు	80
విశాఖపట్నం	81	అనంతపురం	85
గోదావరి	85		

చుక్కల భూములకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించింది. తమ భూములు బలవంతంగా లాక్కున్నారని, రికార్డులు తారుమారు చేశారని, భూకబ్జాలు చేశారని పేదలు, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని గ్రామాలవారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి.. వీటన్నింటిని సమగ్రంగా పరిశీలించాలని.. మూడు నెలల్లో విచారణ పూర్తి చేయాలని.. అప్పటివరకు 22-ఏ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని నిశ్చయించింది. గత ప్రభుత్వంలో 22ఏ భూములను ఫ్రీ హోల్డ్ చేసి దోపిడీకి పాల్పడిన సంగతి తెలిసిందే. ఇందులో 13 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయి. భూ కబ్జాలను, తప్పుడు రిజిస్ట్రేషన్లన్నింటినీ బయటపెట్టాలని.. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్లు జరిగిన 25 వేల ఎకరాలపైనా విచారణ జరపాలని కేబినెట్ ఇప్పుడు నిశ్చయించింది. అక్రమ ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై విచారణ చేపట్టేందుకు డిప్యూటీ కలెక్టర్లతో కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో అసైన్డ్, చుక్కల భూముల పరాధీనం, అక్రమ రిజిస్ట్రేషన్లు, రీ సర్వే అంశాలపై చర్చ జరిగింది. 36 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకుగాను ఇప్పటి వరకు 13 లక్షల ఎకరాలను 20 ఏళ్ల కాలపరిమితి నిబంధన కింద నిషేధ జాబితా 22ఏ నుంచి తొలగించారని రెవెన్యూ శాఖ ఈ సందర్భంగా నివేదించింది. ముందుగానే పేదల నుంచి లాక్కుని, బెదిరించి దౌర్జన్యంగా తీసుకున్న భూములను ఫ్రీ హోల్డ్ కింద 22ఏ నుంచి తొలగించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొంది. ఈ కేసులను పునఃపరిశీలించాలని మంత్రివర్గాన్ని కోరింది. 25 వేల ఎకరాల అసైన్డ్ భూములను గిఫ్ట్ కింద రిజిస్ట్రేషన్ చేశారని, దీనికి కేవలం ఒక శాతం రిజిస్ట్రేషన్ చార్జీ పడిందని.. ఇది కూడా పెద్ద గోల్‌మాల్ వ్యవహారమేనని తెలిపింది. వీటన్నిటినీ పునఃసమీక్షించి విచారణ చేపట్టాలని కోరింది. వీటిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ.. విచారణ చేపడతామని చెప్పారు. పేదల నుంచి ఫిర్యాదులు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించి తేల్చేయాలన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపించాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు. భూముల అక్రమాలపై పరిశీలనను మూడు నెలల్లో పూర్తిచేయాలని.. అప్పటిదాకా అసైన్డ్, చుక్కల భూములను 22ఏ నుంచి తొలగించరాదని.. ఇప్పటికే తొలగించిన వాటిని రిజిస్టర్ చేయకుండా నిలిపివేయాలని స్పష్టం చేశారు.

మళ్లీ రెవెన్యూ సదస్సుల్లోనే పరిష్కారం..

తెలుగుదేశం ప్రభుత్వం గతంలో అధికారంలో ఉన్నప్పుడు భూమి, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఏటా రెవెన్యూ సదస్సులు నిర్వహించేది. ఇందులో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారయంత్రాంగం పాల్గొనేవారు. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుని పరిష్కరించేవారు. జగన్ సర్కారు వచ్చాక వాటిని పక్కనపెట్టారు. ఇప్పుడు మళ్లీ గ్రామాలవారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని సీఎం చంద్రబాబు రెవెన్యూ శాఖను ఆదేశించారు. 'వైసీపీ నేతలు తమ భూములు దౌర్జన్యంగా లాక్కున్నారని ప్రభుత్వానికి తెలియజేసేందుకు ప్రజలు అమరావతికి భారీగా తరలివస్తున్నారు. ఇక్కడిదాకా రావడం వారికి ఖర్చుతో కూడుకున్న పని. కాబట్టి రెవెన్యూ శాఖే ప్రజల వద్దకు వెళ్లాలి. గ్రామగ్రామానా సదస్సులు నిర్వహించండి. వైసీపీ నేతల దౌర్జన్యాల వల్ల భూములు, ఆస్తులు కోల్పోయిన ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకోండి. అందులోని అంశాలను అక్కడే పరిశీలించి సాధ్యమైనంత వరకు పరిష్కారం చూపాలి. ప్రజల వద్ద ఉన్న రెవెన్యూ రికార్డులు, ఇప్పుడు మార్చిన రికార్డులను సరిపోల్చండి. తప్పులు ఎక్కడున్నాయో, దానికి బాధ్యులెవరో కనిపెట్టండి.. అక్రమార్కులపై చట్టప్రకారం చర్యలు తీసుకోండి. ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందన్న భరోసా కల్పించాలి' అని తేల్చిచెప్పారు. మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో 22ఏ భూముల ఫైళ్లను తగులబెట్టిన నేపథ్యంలో ప్రతి జిల్లాలో ఫ్రీహోల్డ్ అనంతరం భారీగా అసైన్డ్, చుక్కల భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయి. అందులో సింహభాగం వైసీపీ నేతలు చేజిక్కించుకున్నవే. వీటిపైన, ఇతర భూ అక్రమాలపైన విచారణకు డిప్యూటీ కలెక్టర్లతో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. రెవెన్యూశాఖ ఇప్పటికే ప్రతిపాదనలు పంపించింది. ప్రభుత్వ ఆమోదం వచ్చిన వెంటనే ఉత్తర్వులు ఇవ్వనుంది.

రాష్ట్రంలో ఏఐ యూనివర్సిటీ

▸▸ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని లోకేశ్ ఆదేశం

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఉన్నత విద్యాశాఖపై బుధవారం సమీక్ష నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ... ఏఐ యూనివర్సిటీని ఎక్కడ ఏర్పాటు చేయాలి? ఎకో సిస్టమ్, ఇతర అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఐ వర్సిటీ ద్వారా విద్య, ఆరోగ్యం, గవర్నెన్స్ లాంటి 16 రంగాల్లో సేవలందించే ఆస్కారం ఏర్పడుతుందన్నారు. కాగా, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వర్సిటీలకు వీసీల నియామక ప్రక్రియ ప్రారంభించాలన్నారు.

ఐదేళ్లలో జగన్ ఒక్క సెల్ టవరూ వేయలేదు!

▸▸ కడప జిల్లా కొట్టాలపల్లె యువకుడి ఆవేదన

▸▸ జగన్ చేయకపోయినా.. మేం ఏర్పాటు చేస్తాం: లోకేశ్ హామీ

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): "మేం 21వ శతాబ్దంలో జీవిస్తున్నాం. 5జీ టెక్నాలజీ కమ్యూనికేషన్‌లో విప్లవాత్మకంగా మారుతోంది. అయినా మా గ్రామానికి బేసిక్ మొబైల్ టవర్ లేదు. కడప జిల్లాకు చెందిన జగన్ సార్ ప్రభుత్వం గత ఐదేళ్లలో మా గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేయలేదు. మేం మిమ్మల్ని నమ్ముతున్నాం' అంటూ కడప జిల్లా కొట్టాలపల్లెకు చెందిన యువకుడు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. దీనిపై మంత్రి నారా లోకేశ్ బుధవారం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. జగన్ చేయలేకపోయినా తాము చేస్తామని, త్వరలోనే కొట్టాలపల్లెలో సెల్ టవర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ఒకే దేశం.. ఒకే పన్ను.. ఒకే జీఎస్టీ నంబరు

▸▸ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు పరిశ్రమల సమాఖ్య లేఖ

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఒకే దేశం.. ఒకే పన్ను విధానం తరహాలో దేశం మొత్తానికి ఒకే జీఎస్టీ నంబరు ఉండాలని రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. వ్యాపార సంస్థలకు వేర్వేరు జీఎస్టీ నంబర్లు ఇవ్వడం వల్ల సులభతర వాణిజ్యానికి ఆటంకంగా మారుతున్నాయని పేర్కొంది. సులభతర వాణిజ్యాన్ని మెరుగుపరిచేందుకు సూచనలు చేస్తూ ఏపీ చాంబర్స్ బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసింది.

ప్రాధాన్య ప్రాజెక్టుల్లో సీమను విస్మరించారు: సీపీఐ

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు జలవనరుల శాఖ ప్రాధాన్య క్రమంలో రూపొందించిన జాబితాలో రాయలసీమలోని గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ, కేసీ కెనాల్ ప్రస్తావన లేకపోవడంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు విచారం వ్యక్తం చేశారు. రూ.8,734 కోట్లతో రాష్ట్రంలోని 5 ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తిచేసే క్రమంలో సీమను విస్మరిస్తే ప్రజా ఉద్యమం తప్పదని బుధవారం హెచ్చరించారు.

నేడు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరగనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే విడుదల చేసింది. అందుకు అనుగుణంగా ఓటర్ల జాబితాలను పాఠశాలల్లో ప్రదర్శించారు. ఎన్నికలు నిర్వహించడంతో పాటు తొలి సమావేశం కూడా నేడే నిర్వహించనున్నారు.

గ్రూప్-1 మెయిన్స్‌లో మీడియం ఎంపికకు గడువు

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు అర్హులైన అభ్యర్థులు మెయిన్స్ పరీక్ష రాసే మీడియంను ఎంపిక చేసుకోవాలని ఏపీపీఎస్సీ సూచించింది. ఈ నెల 16లోగా ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. అలాగే పోస్టు, జోనల్, పరీక్షా కేంద్రాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించింది.

ఎంపీడీవోలంతా వెనక్కి!

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఎంపీడీవోలను తిరిగి వారి మండలాలకు బదిలీ చేసేందుకు అనుమతి ఇస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశాలిచ్చారు. ఎన్నికల నిర్వహణతో ప్రత్యక్ష సంబంధమున్న ఎంపీడీవోలు ఆయా జిల్లాల్లో పని చేయకూడదని ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో ఎంపీడీవోలు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. ఎన్నికలు ముగియడంతో తిరిగి వారిని సొంత స్థానాలకు బదిలీ చేయాలని ఏపీ పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్(గెజిటెడ్) ఆఫీసర్ అసోషియేషన్ కోరింది.

ఈ-క్రాప్‌లో నమోదుతోనే రైతులకు పథకాల వర్తింపు

ఈ-క్రాప్‌లో పంట వివరాలను నమోదు చేసుకుంటే ప్రభుత్వం అందించే అన్ని వ్యవసాయ పథకాలకు రైతులు అర్హులవుతారని వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి. రాజశేఖర్ తెలిపారు. బుధవారం వ్యవసాయ శాఖ అధికారులకు పంటల డిజిటల్ వెబ్‌సైట్‌పై అవగాహన కల్పించారు. రాజశేఖర్ మాట్లాడుతూ.. పంటల బీమా, వడ్డీలేని రుణాలతోపాటు అన్ని పథకాలకు ఈ-క్రాప్‌లో రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.



భావి తరాలకు డొక్కాసీతమ్మ ఆదర్శం

▸▸ మధ్యాహ్న భోజన పథకానికి ఆమె పేరు పెట్టడం సబబే

▸▸ ప్రభుత్వం నిర్వహించే క్యాంటీన్లకు ఎన్టీఆర్ పేరునే కొనసాగించాలి: పవన్

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆగస్టు 15న ప్రారంభించే అన్న క్యాంటీన్లకు పేరు ఖరారు చేసే విషయంలో ఓ సమావేశంలో ఆసక్తికర చర్చ జరిగింది. ఎన్టీఆర్ పేరుతో అన్న క్యాంటీన్లు కొనసాగించాలా? డొక్కా సీతమ్మ పేరు కూడా జోడించాలా? అనే చర్చ వచ్చింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ... 2019 వరకూ ఉన్న విధంగా అన్న క్యాంటీన్లు కొనసాగించాలని సూచించారు. అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి నిర్ణయించిన క్రమంలో క్యాంటీన్లకు ఎన్టీఆర్ పేరును కొనసాగించవచ్చనే ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తాను పాఠశాలలో చదివేటప్పుడు డొక్కా సీతమ్మ గురించి చదివిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. కంబాల కృష్ణమూర్తి రాసిన అమృత వాక్కులు అనే సంకలనాన్ని తన తండ్రి ఇచ్చారని చెప్పారు. అందులో డొక్కా సీతమ్మ దాన గుణాన్ని తెలుసుకున్నానన్నారు. అంతర్వేది దర్శనానికి ఆమె బయలుదేరితే.. దారిలో తన ఇంటికి భోజనానికి యాత్రికులు వస్తున్నారని తెలిసి దైవ దర్శనానికి వెళ్లకుండా వెనక్కి వచ్చి ఆకలి తీర్చారని చదివానని పవన్ కల్యాణ్ వివరించారు.

టీచర్లు, డాక్టర్లకు బదిలీల్లేవ్!

▸▸ ప్రజా సంబంధశాఖల్లో త్వరలో బదిలీలు

▸▸ ఏపీలో నిశ్శబ్ద విప్లవం.. బంగ్లాలో హింసాత్మకం

▸▸ ఎమ్మెల్యేలు అత్యంత జాగ్రత్తగా ఉండాలి

▸▸ కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్ట్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సంబంధ శాఖల్లో త్వరలో ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల్లోని ఇంజనీరింగ్ సిబ్బంది, పోలీసులు.. ఇలా ప్రజలతో నిత్యం సంబంధాలు ఉండే శాఖల్లోని ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కార్యాలయాల్లో కొంత మార్పు కనిపించాలన్న ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నారని మంత్రులు వెల్లడించారు. ప్రజల రోజువారీ వ్యవహారాలతో సంబంధాలు లేని ఉపాధ్యాయులు, వైద్యులు వంటి వారికి ప్రస్తుతం బదిలీలు చేపట్టాల్సిన అవసరం లేదని మంత్రివర్గ సమావేశం అభిప్రాయపడింది.

నాణ్యమైన మద్యం

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మద్యం షాపుల స్థానంలో ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కేబినెట్ సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. గతంలో ప్రైవేటు మద్యం షాపులే ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని తొలగించి ఆ స్థానంలో ప్రభుత్వ మద్యం షాపులు ఏర్పాటు చేసింది. వీటిని ప్రభుత్వం తన చేతిలో పెట్టుకొని తమకు కావాల్సిన బ్రాండ్లు మాత్రమే విక్రయించిందని, ఈ షాపులు భారీ కుంభకోణానికి కేంద్రాలుగా మారాయని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వాటిని తొలగించి పాత పద్ధతిలో ప్రైవేటు షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. సెప్టెంబరులో మద్యం విధానాన్ని అధికారికంగా ప్రకటించాలని, ఈలోపు ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్తరప్రదేశ్‌లో అమలు చేస్తున్న విధానం బాగుందని అంటున్నారని, కొద్ది మంది చేతిలో ఉన్న ఈ వ్యాపారాన్ని ఎక్కువ మంది చేతుల్లోకి అక్కడి ప్రభుత్వం మార్చగలిగిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అక్టోబరు మొదటివారంలో ప్రైవేటు షాపులు ప్రారంభం అయ్యే అవకాశం ఉందన్న సంకేతాలు మంత్రివర్గ సమావేశంలో వెలువడ్డాయి.

బంగ్లాదేశ్ పరిణామాలపై..

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన పరిణామాలు మంత్రివర్గ సమావేశంలో చర్చకు వచ్చాయి. "మన రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో నిశ్శబ్ద విప్లవం వచ్చింది. బంగ్లాదేశ్‌లో హింసాత్మక విప్లవం వచ్చింది. అణిచివేత, నియంతృత్వం వల్లే బంగ్లాదేశ్‌లో ప్రజలు తిరుగుబాటు చేశారు. జగన్‌ను పదకొండు సీట్లకు ప్రజలు పరిమితం చేయడానికి కారణాల్లో ఇవి కూడా ఉన్నాయి. దీనిని మనం గమనంలోకి తీసుకోవాలి. ఎమ్మెల్యేలు, మంత్రులు తమ నియోజకవర్గాల్లో నియంతృత్వ వైఖరి ప్రదర్శించవద్దు. కక్ష సాధింపులకు దిగవద్దు. గతంలో తప్పులు చేసిన వారిని చట్టపరంగా శిక్షిద్దాం. చట్టాన్ని మనమే చేతుల్లోకి తీసుకొని శిక్షించాలనే ప్రయత్నం చేయొద్దు. మన క్యాడర్‌ను కూడా జాగ్రత్తగా ఉండమని చెప్పాలి" అని చంద్రబాబు సూచించారు. ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ ప్రాజెక్టుకు ఉన్న మొత్తం 13 గేట్లు వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల దెబ్బ తిన్నాయని, రూ.తొమ్మిదిన్నర కోట్లతో వాటి మరమ్మతులు చేపట్టి ఒక నెలలో పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నామని మంత్రి గొట్టిపాటి తెలిపారు.

సర్వే రాళ్లపై చర్చ

భూముల సర్వేకోసం జగన్‌ఫొటో, పేరుతో తయారు చేసిన సర్వే రాళ్లను ఏం చేయాలన్నదానిపై మంత్రివర్గం చర్చించింది. ఈ రాళ్ల కోసం రూ.600 కోట్లు ఖర్చు చేశారని, ప్రచార వ్యామోహంతో వందల కోట్లు తగలబెట్టారని మంత్రులు వ్యాఖ్యానించారు. పరికరాలతో ఈ ఫొటోలు, పేర్లను తుడిచివేసే అవకాశం ఉందని చెబుతూ అధికారులు ఈ సమావేశంలో ఒక వీడియోను చూపించారు. ఎక్కువ మంది మంత్రులు వాటిని తుడిచేయాలనే సూచించారు. దేవాలయాలు, పాఠశాలల్లో భవనాల నిర్మాణానికి లేదా ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి వాటిని వినియోగించాలని కొందరు మంత్రులు సూచించారు. వాటిని ఏదో రకంగా వాడుకుందామని, వృథా అయితే చేయబోమని ముఖ్యమంత్రి చెప్పారు. గ్రామాల్లో పనులు చేపట్టే సమయంలో నలుగురినీ కూర్చోబెట్టి ఆ ఊరికి ఏది అవసరమో వారితో చర్చించి నిర్ణయం తీసుకోవాలని, మనమే ఫలానా పని చేయాలని నిర్ణయానికి రావద్దని ఆయన సూచించారు. జనసేన పార్టీ తరఫున 'మన ఊరు-మన నది' పేరుతో నిర్వహించిన కార్యక్రమంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పినప్పుడు దీనిని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే అవకాశాలపై ఆలోచన చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. తిరుమల తర్వాత అంత ప్రాముఖ్యం కలిగిన శ్రీశైలం దేవస్థానాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడంపైనా చర్చించారు. రోడ్ల వెడల్పుతో పాటు మరికొన్ని చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. శ్రీశైలంలో ఉన్న 283 ఎకరాల ఇరిగేషన్ శాఖ భూమిని గతంలో పంచాయితీకి ఇచ్చారని, దానిని వెనక్కు తీసుకుని ఆలయ అభివృద్ధికి వినియోగించాలని నిర్ణయించింది. శ్రీశైలం ఆలయంలో పనిచేసి రిటైరైన అర్చకులు, ఇతర ఉద్యోగులకు అక్కడే అపార్టుమెంట్లు నిర్మించి ఇచ్చే ఆలోచన చేయాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు.

217, 144 జీవోల రద్దు

▸▸ మత్స్యకారులకు మేలు

రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులకు మేలు జరిగేలా మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. మత్స్యకార సంఘాలకు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తూ గత ప్రభుత్వం తెచ్చిన 217, 144 జీవోలను రద్దు చేసేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కేబినెట్ ఆమోదం తెలిపింది. మత్స్యకారుల ఆదాయానికి గండికొట్టేలా జగన్ సర్కార్ తెచ్చిన ఈ జీవోలను రద్దు చేస్తామని సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ జీవోలను మత్స్యకారులు తీవ్రంగా వ్యతిరేకించారు. జీవో 217 ప్రకారం పైలట్ ప్రాజెక్ట్ కింద నెల్లూరు జిల్లాలో 25 వేల హెక్టార్లపైగా విస్తీర్ణమున్న 27 చెరువుల్లో చేపలు పెంచి, మత్స్య సంపదకు బహిరంగ వేలం నిర్వహించగా, ఈ చెరువులపై ఆధారపడిన దాదాపు 6,500 మంది మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. దీనిపై మత్స్యకార సంఘాలు కోర్టులను ఆశ్రయించాయి. కోర్టు జోక్యంతో జీవోల అమలు తాత్కాలికంగా నిలిచిపోయింది.

విద్యార్థుల సంఖ్య ప్రకారమే టీచర్లు

▸▸ 98 మంది పిల్లలు లేకపోతే రెండు గ్రూపులుగా విభజన

▸▸ 1, 2 తరగతులు ఒక గ్రూపు... 3 నుంచి 8 వరకూ మరొకటి

▸▸ 11 నాటికి ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి

▸▸ పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టిన పాఠశాల విద్యాశాఖ ప్రాథమికోన్నత పాఠశాలలకు టీచర్ల కేటాయింపు విషయంలో సంఖ్య ఆధారిత నిర్ణయం తీసుకుంది. ఆయా బడుల్లో 98 మంది కంటే తక్కువ విద్యార్థులుంటే తరగతులను రెండు గ్రూపులుగా విభజించాలని ఆదేశించింది. 1, 2 తరగతులు మొదటి గ్రూపుగాను, 3 నుంచి 8 తరగతుల వరకు రెండో గ్రూపుగా విభజించి ఆ మేరకు టీచర్లను సర్దుబాటు చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ రామరాజు బుధవారం మార్గదర్శకాలు జారీ చేశారు. సర్దుబాటు ప్రక్రియను ఈ నెల 11 నాటికి పూర్తి చేయాలని పేర్కొన్నారు. తాజా మార్గదర్శకాల ప్రకారం... ఈ నెల 7 నాటికి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుంటారు. అవసరం ఆధారంగా స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లను ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో సర్దుబాటు చేస్తారు. సబ్జెక్టు టీచర్లు మిగిలిపోతే అర్హతల ఆధారంగా వారిని వేరే సబ్జెక్టులోకి మారుస్తారు. అర్హతలు కలిగిన ఎస్జీటీలు మిగిలితే వారిని సబ్జెక్టులు బోధించేందుకు కేటాయిస్తారు. ఒకరి కంటే ఎక్కువమంది వ్యాయమ టీచర్లు ఉంటే వారిని అవసరమైన పాఠశాలలకు సర్దుబాటు చేస్తారు. ఇంకా మిగిలిన వారిని ఏకోపాధ్యాయ పాఠశాలలకు కేటాయిస్తారు. ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు మిగులు టీచర్లను పంపకూడదు. 2025 ఏప్రిల్ 30లోగా రిటైరయ్యే టీచర్లు, వంద శాతం దృష్టి లోపం ఉన్నవారికి సర్దుబాటు నుంచి మినహాయింపు ఉంటుంది. వితంతు, పెళ్లికాని, వేరుగా ఉండే, జీవిత భాగస్వామి గ్రౌండ్స్ ఉండే టీచర్లకు కూడా మినహాయింపు వర్తిస్తుంది. ఒకవేళ వారు కోరుకుంటే రెండో దశలో డివిజన్ స్థాయిలో సర్దుబాటు చేయవచ్చు. మండల స్థాయిలో ఎంఈవో, డివిజన్ స్థాయిలో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్, జిల్లా స్థాయిలో డీఈవో నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు. వారు ఆన్‌లైన్ నుంచి మిగులు టీచర్ల జాబితాలను డౌన్‌లోడ్ చేసుకుని, నిబంధనల ప్రకారం సర్దుబాటు చేయాలి. అప్పటికీ టీచర్లు మిగిలితే పొరుగు మండలం, డివిజన్‌కు సర్దుబాటు చేయాలి. సర్దుబాటులో తప్పులు జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహిస్తారు.

'జగన్' రాళ్లు, బొమ్మలు బంద్!

(మొదటి పేజీ తరువాయి)



నిశ్చయించింది. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయకుండా అనర్హత వేటు నిబంధనను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. బుధవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ నిర్ణయాలను సమాచార, పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు వెల్లడించారు. ఇంకా జగన్ బొమ్మలు ఉన్న రాళ్లు ఉన్నాయని.. వాటిని వాడబోమని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ రికార్డులను, పాస్‌బుక్‌లను తయారు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రెవెన్యూ రికార్డుల తారుమారు, భూకబ్జాలు జరిగాయన్న వార్తల నేపథ్యంలో ఉన్నతాధికారులు జిల్లాల్లో పర్యటించి భూముల బదిలీలో జరిగిన మోసాలు, దోపిడీలు, కబ్జాలు గుర్తించి.. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరినట్లు తెలిపారు.

మంత్రివర్గ నిర్ణయాలివీ..

- ఇద్దరు పిల్లలకు మించి ఉన్న వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయకుండా నిషేధించే పంచాయతీరాజ్, మున్సిపల్ చట్ట సవరణల రద్దుకు ఆమోదం.
- ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్-1092, సెక్షన్ 3 ప్రకారం.. సీపీఐ (మావోయిస్టు) పార్టీ, రివల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఆర్‌డీఎఫ్) సంస్థలపై ప్రస్తుతం ఉన్న నిషేధం మరో ఏడాదిపాటు పొడిగింపు.
- మత్స్యకార హక్కులకు భంగం కలిగించేలా గత ప్రభుత్వం జారీచేసిన 144, 217 నంబరు జీవోల రద్దుకు ఆమోదం. పైలట్ ప్రాజెక్టు కింద నెల్లూరు జిల్లాలో 25,380 హెక్టార్ల నీటి విస్తీర్ణంతో ఎంపిక చేసిన 27 ప్రభుత్వ చెరువులను 6,592 మత్స్యకార కుటుంబాలకు చెందిన 27 మత్స్యకార సహకార సంఘాలకు కేటాయించకుండా బహిరంగ వేలం వేసేందుకు అనుమతిస్తూ 2021లో జీవో 217 ఇచ్చారు. దీనిని సవాల్ చేస్తూ అనేక మంది మత్స్యకారులు, సంఘాలు న్యాయస్థానాల్లో 7 రిట్ పిటిషన్లు, 4 రిట్ అప్పీల్స్ వేశారు. మత్స్యకార సంఘాలకు చెరువులు కేటాయించని కారణంగా వారి జీవనోపాధికి ఆటంకం ఏర్పడింది. అక్రమార్కులు లబ్ధి పొందుతున్నారు. దీనికి చెక్ పెట్టేందుకు చేప పిల్లల పెంపకం నుంచి మార్కెటింగ్ వరకు మధ్య దళారీ వ్యవస్థ లేకుండా మత్స్యకారుల కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా ఒక సమగ్రమైన యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కేబినెట్‌కు సీఎం చంద్రబాబు సూచించారు. పర్యాటక అభివృద్ధి కోణంలో కూడా ఆలోచించాలని.. తద్వారా ఉపాధి, ఆర్థిక ప్రగతి కలుగుతాయని సీఎం పేర్కొన్నారు. మత్స్యకారుల ఆర్థిక పరిస్థితి, జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా తర్వాతి కేబినెట్ భేటీలో ఆ ప్లాన్‌ను అందించాలని సూచించారు. దీంతో సదరు 27 మత్స్యకార సంఘాలకు మేలు కలిగేలా.. ఆ 11 కేసులను పరిష్కరించాలనే సదుద్దేశంతో సంబంధిత జీవోల రద్దుకు కేబినెట్ ఆమోదం. తద్వారా రాష్ట్రంలోని లక్షలాది మత్స్యకారులకు మేలు.
- రాష్ట్రంలో ఫేజ్-1 కింద నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలల్లో 150 సీట్లతో నిర్మించిన నూతన వైద్య కళాశాలలకు సంబంధించి గతంలో మంజూరైన పోస్టులకు అదనంగా 380 పోస్టుల భర్తీకి ఆమోదం. ఫేజ్-2 కింద పాడేరు, మార్కాపురం, పులివెందుల, ఆదోని, మదనపల్లెలలో నిర్మించిన నూతన వైద్య కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 100 సీట్లతో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ కోర్సును ప్రారంభించడానికి అనుమతి కోరుతూ చేసిన ప్రతిపాదనకు ఆమోదం.
- జీవో 40 రద్దు కోసం జలవనరుల శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం. ఈ జీవో కింద నిరుడు నంద్యాల జిల్లా సున్నిపెంట (శ్రీశైలం ప్రాజెక్టు) గ్రామ పంచాయతీకి కేటాయించిన భూమిని రద్దు చేస్తూ నీటిపారుదల శాఖకు బదలాయించేలా ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం. బదిలీ చేసిన 208.74 ఎకరాల భూమిలో చేపట్టిన నిర్మాణాలను భవిష్యత్ అవసరాల దృష్ట్యా యథాతథంగా ఉంచేందుకు అంగీకారం. ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ.. తిరుపతి తర్వాత రాష్ట్రంలో అత్యధికంగా టెంపుల్ టూరిజం, రెవెన్యూ ఉన్న దేవాలయం శ్రీశైలం అని.. ఈ శ్రీశైలం ప్రాజెక్టు నీటి విడుదల సందర్భంగా అత్యధిక భక్తులు పర్యాటకులు సున్నిపెంట, శ్రీశైలం ప్రాజెక్టుకు, దేవాలయానికి వస్తున్న తరుణంలో ఆదాయం పెంచేందుకు ఈ స్థలాన్ని భవిష్యత్‌లో బదలాయించాలని సూచన.
- అక్టోబరు 1 నుంచి రాష్ట్రంలో కొత్త మద్యం విధానం అమలుకు కేబినెట్ ఆమోదం. మద్యం రిటైల్ అమ్మకాలు, ప్రొక్యూర్‌మెంట్, క్వాలిటీ కంట్రోల్, ధరల నిర్ధారణ విధానాలకు సంబంధించి ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాల అధ్యయనానికి మన రాష్ట్రానికి చెందిన అధికారుల బృందాలు ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తున్నాయి. మంత్రివర్గం తుది ఆమోదానికి ముందు ఎక్సైజ్ శాఖ ప్రతిపాదనలను అధ్యయనం చేయడానికి కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు. కొత్త మద్యం విధానంలో రాష్ట్రంలోకి అక్రమ మద్యం రవాణా, గంజాయి, నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం(ఎన్డీపీఎల్) ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయం. ఇప్పటికీ చాలా చోట్ల మద్యం దుకాణాల్లో డిజిటల్ లావాదేవీలు తక్కువగా జరుగుతున్నాయని.. ఇక డిజిటల్ లావాదేవీలు తప్పనిసరని సీఎం చంద్రబాబు స్పష్టీకరణ.

లేపాక్షి భూముల్ని కారుచౌకగా కొట్టేసే కుట్ర

▸▸ బ్యాంకులూ కుమ్మక్కయ్యాయి: నీలాయపాలెం

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నాడు లేపాక్షి భూముల్లో ఈడీ కేసుల్లో ఇరుకున్న జగన్.. 2019లో అధికారంలోకి వచ్చాక ఆ 8,844 ఎకరాల భూములను కారుచౌకగా రూ.500 కోట్లకు కొట్టేయాలని కుట్ర పన్నారని టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. 'లేపాక్షి భూముల్లో 5,811 ఎకరాలు అసైన్డ్, 3,032 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. గతంలో సైన్స్ అండ్ టెక్నాలజీకి ఈ భూములిస్తే, శ్యాంప్రసాద్‌రెడ్డి వాటిని బ్యాంక్‌లో కుదవ పెట్టాడు. ప్రభుత్వ భూమి అని తెలిసినా నాటి బ్యాంక్ అధికారులు అక్రమంగా రూ.వేల కోట్ల రుణాలిచ్చారు. తిరిగి డబ్బులు కట్టకపోవడంతో కుదువ పెట్టిన భూములు ఇవ్వాలంటూ బ్యాంకులు ఒత్తిడి చేసి, ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేశాయి. చెల్లించాల్సిన రూ.వేల కోట్ల బదులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.500 కోట్లు చెల్లిస్తే చాలంటూ బ్యాంకులు నిర్ణయించాయి. వైసీపీ నేతలతో కుమ్మక్కై, జగన్‌రెడ్డి మేనమామ రవీంద్రనాథ్‌రెడ్డికి ఆ భూముల్ని రూ.501 కోట్లకు కట్టబెట్టడానికి యత్నించాయి. రవీంద్రనాథ్‌రెడ్డి కేవలం రూ.50 కోట్లు చెల్లించి మిగిలిన డబ్బులు కట్టలేనంటూ చేతులు ఎత్తేశాడు. అయితే మిగిలిన డబ్బులను కడపకు చెందిన సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి చెల్లిస్తారంటూ బ్యాంకులతో చట్టవిరుద్ధమైన ఒప్పందం చేసుకున్నారు. బ్యాంకులు కూడా అడ్డగోలుగా తలలూపాయి. అసలు ఆ భూమి ఏపీఐఐసీకి చెందినది. ఆ భూములను అలా అమ్మేయడానికి బ్యాంకులకు ఎలాంటి అధికారం లేదు. ఎన్‌ఫోర్స్‌మెంట్, ట్రిబ్యునల్ తీర్పులతో ఆ భూముల అమ్మకానికి అడ్డుకట్టపడింది. వివిధ జాతీయ, ప్రైవేట్ బ్యాంకులు రూ.4 వేల కోట్లు ఇచ్చి, ఎందుకు 90% వద్దనుకుని, 10 శాతాన్నే కోరుకుంటున్నాయి? ఎవరు ఎవరితో మిలాఖత్ అయ్యారు? ఇది డేలైట్ మోసం. మరోవైపు శ్యాంప్రసాద్‌రెడ్డి 2,000 ఎకరాలకుపైగా భూమిని ఢిల్లీకి చెందిన గ్లోబల్ ఎమర్జింగ్ మార్కెట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు రూ.238 కోట్లకు అమ్మకానికి బేరం కుదుర్చుకున్నాడు. రూ.5 కోట్లు అడ్వాన్స్ తీసుకున్నాడు. ఈడీ కేసులు పెట్టడంతో రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. గ్లోబల్ ఎమర్జింగ్ మార్కెట్ ప్రైవేట్ లిమిటెడ్ మళ్లీ తెరపైకి వచ్చింది. లేపాక్షి భూముల కోసం రూ.5 కోట్లు ఇచ్చామని, నేడు వడ్డీతో రూ.28 కోట్లు అయ్యిందని, అందువల్ల ఆ 2,650 ఎకరాలను తమకు ఇచ్చేయాలని డిమాండ్ చేస్తోంది. దీనికోసం ఆ సంస్థ బెంగుళూరు, చెన్నై ట్రిబ్యునళ్లను ఆశ్రయించింది. ఆ ట్రిబ్యునళ్లు అసలు భూములు ఎవరివన్న విషయాల జోలికి పోకుండా.. ఆ సంస్థకు అనుకూలంగా తీర్పులు ఇచ్చాయి. ఇది దారుణం. అయితే ఈ భూములపై రేపోమాపో సుప్రీం కోర్టు తీర్పుకూడా రాబోతోంది. ఒకవేళ సుప్రీం కోర్టు కూడా గ్లోబల్‌కు అనుకూలంగా తీర్పిస్తే.. రూ.25 కోట్లకే 2,650 ఎకరాలు వెళ్లిపోతాయి. అసలు రూ.4 వేల కోట్లపైగా తాకట్టు పెడితే.. బ్యాంకులు రూ.500 కోట్లకు ఎందుకు మిలాఖత్ అయ్యాయో ప్రభుత్వం తేల్చాలి. బ్యాంకులు చేసిన మోసాన్ని బయటపెట్టాలి. లేదా ప్రభుత్వమే బిడ్ వేసి, రూ.500 కోట్లకు లేపాక్షి భూముల్ని ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలి' అని నీలాయపాలెం సూచించారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 660 మండల కేంద్రాల్లో 13,325 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ అందించనున్నట్లు ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ మహమ్మద్ దివాన్ మైదీన్ తెలిపారు. శానిటేషన్, ఘనవ్యర్థాల నిర్వహణ, 2024-25 గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారీ గురించి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

అమరావతి పునరుజ్జీవం

▸▸ 36 కోట్లతో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం

▸▸ అసంపూర్తి నిర్మాణాల సామర్థ్యంపై ఐఐటీ ఇంజనీరింగ్ నిపుణుల పరిశీలన


▸▸ నివేదిక ఆధారంగా నిర్ణయం: నారాయణ



అమరావతిలో చెట్లు, ముళ్ల కంపలను తొలగిస్తున్న దృశ్యం

గుంటూరు (ఆంధ్రజ్యోతి), తుళ్లూరు, ఆగస్టు 7: గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మూడు ముక్కలాటతో రాజధాని రైతులను ఇబ్బందులపాలు చేసిందని పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ అన్నారు. వైసీపీ పాలన వల్లే రాజధాని అమరావతికి ప్రస్తుత దుస్థితి వచ్చిందన్నారు. అమరావతిలో కంపచెట్లు తొలగింపు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. అమరావతిలోని ఎన్‌హెచ్-9 రహదారిని ఆనుకొని, ప్రస్తుత సచివాలయానికి వెనుకభాగాన ఉన్న ప్రాంతంలో శాస్త్రోక్తంగా పూజలు చేసి, టెంకాయ కొట్టి, స్వయంగా ఆయనే పొక్లెయినర్‌ను నడిపి పనులను మొదలుపెట్టారు. రాజధాని పరిధిలోని 23,429 ఎకరాల్లో ఉన్న కంపచెట్లను తొలగించడానికి నెల రోజుల వ్యవధిని నిర్ణయించారు. కంపచెట్ల తొలగింపునకు 36.5 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా మనోనిబ్బరంతో పోరాడిన రైతులు, మహిళలకు అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లపాటు ఎలాంటి పనులు చేయకపోవడంతో అమరావతి నగరమంతా దట్టమైన అడవిలా మారిపోయిందన్నారు. చాలా చోట్ల రోడ్లు తవ్వుకుపోయారని, కిటికీల తలుపులు ఎత్తుకెళ్లారని, చివరికి అమరావతిని అడవిని చేసేశారని వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో ఆయన ఒక భవనంపై నుంచి చూస్తే అమరావతి మొత్తం అడవిలా కనిపించిందని, ప్రభుత్వం నిర్మించిన ఎత్తైన భవనాలను కూడా ఆ చెట్లు కనిపించకుండా కమ్మేశాయని, దీంతో అప్పటికప్పుడు ముఖ్యమంత్రి జంగిల్ క్లియరెన్సుకు ఆదేశాలు ఇచ్చారన్నారు. 30 రోజుల్లో అమరావతిని కంప చెట్ల నుంచి బయటకు తీసుకువస్తామన్నారు. నాడు 38రోజుల్లో 34వేల ఎకరాలు ల్యాండ్ పూలింగ్‌కు రైతులు భూములిచ్చారని మంత్రి గుర్తుచేశారు. మాస్టర్ ప్లాన్ ద్వారా రోడ్లు, భవనాలు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు 41,484 కోట్ల రూపాయలతో పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీసీ) జంగిల్ క్లియరెన్స్ కాంట్రాక్టును పొందిందని మంత్రి తెలిపారు. గడిచిన ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణాల సామర్థ్యంపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ మద్రాసు నిపుణులు అమరావతిలో పర్యటించి నిర్మాణాలను పరిశీలించినట్లు తెలిపారు. వారు ఇచ్చే ప్రాథమిక నివేదిక ఆధారంగా నిర్మాణాలపై నిర్ణయం తీసుకుంటామన్నారు.


జూరాల


శ్రీశైలం


నాగార్జున సాగర్


పులిచింతల


ప్రకాశం బ్యారేజ్

సీమకూ ఎర్ర నీరు!

- గోదావరి-కృష్ణా అనుసంధానంతో కరువు సీమ కళకళలాడాలి: సీఎం
- పోలవరం కుడికాలువ నుంచి సాగర్‌కు
- అక్కడి నుంచి నల్లమల, బనకచర్ల గుండా శ్రీశైలం జలాశయంలోకి ఎత్తిపోత
- తర్వాత పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా హంద్రీ-నీవాకు నీటిని తరలించాలి
- ఈ దిశగా డిజైన్లు రూపొందించండి
- జలవనరుల శాఖకు చంద్రబాబు ఆదేశం
- సోమశిల మీదుగా తరలించే డిజైన్లపై అసంతృప్తి
- వీటితో రైతాంగానికి లాభం లేదని స్పష్టీకరణ

అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధాన ప్రక్రియతో రాయలసీమలోనూ గోదావరి జలాలు పారాలని.. కరువు సీమ సస్యశ్యామలమయ్యేలా డిజైన్లు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుతూ.. రైతులకు మేలు చేసేలా గోదావరి-కృష్ణా అనుసంధాన ప్రక్రియను చేపట్టాలని జల వనరుల శాఖకు సూచించారు. మంగళవారం నాటి సమీక్షలో నదుల అనుసంధాన ప్రక్రియపై చర్చ జరిగింది. గోదావరి జలాలను పోలవరం కుడి కాలువ ద్వారా వైకుంఠపురం బ్యారేజీకి.. అక్కడినుంచి నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా బనకచర్ల వరకూ తీసుకెళ్లి.. అక్కడి నుంచి సోమశిలకు.. అటు నుంచి తెలుగుగంగ కాలువలోకి తరలించాలని జలవనరుల శాఖ రూపొందించిన డిజైన్లపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. బనకచర్ల నుంచి సోమశిలకు తరలించడం వల్ల రాష్ట్రానికి, రైతాంగానికి ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. పోలవరం కుడికాలువ నుంచి నాగార్జున సాగర్ కుడి కాలువకు జలాలను తరలించి.. అక్కడి నుంచి నల్లమల కొండల్లో టన్నెల్ తవ్వి దాని గుండా బనకచర్లకు.. అక్కడి నుంచి శ్రీశైలం జలాశయంలోకి ఎత్తిపోయాలని.. ఆ తర్వాత ఆ నీటిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువ గుండా సీమకు తరలించాలని సూచించారు. దీనివల్ల కరువు ప్రభావిత రాయలసీమ గోదావరి జలాలతో సస్యశ్యామలమవుతుందని చెప్పారు. సాగర్ కుడి ప్రధాన కాలువ కంటే.. శ్రీశైలం జలాశయం ఎత్తులో ఉంటుందని.. అందువల్ల గోదావరి జలాలను కొంత మేర ఎత్తిపోయాల్సి వస్తుందన్నారు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకుని డ్రాయింగ్ తయారు చేయాలని ఆదేశించారు. అలాగే పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి గోదావరి జలాలను తరలిద్దామని చెప్పారు. ఈ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చితే.. రాష్ట్రమంతా గోదావరి జలాలు పారి.. పచ్చటి పొలాలతో సస్యశ్యామలమవుతుందన్నారు. వ్యవసాయ దిగుబడులు భారీగా నమోదవుతాయని.. తద్వారా రాష్ట్రాదాయం కూడా పెరుగుతుందని తెలిపారు. గోదావరి అనుసంధాన ప్రక్రియ పూర్తయితే.. పొరుగు రాష్ట్రాల నీటి అవసరాలపై జల వాణిజ్యం చేయవచ్చని మంత్రి నిమ్మల రామానాయుడు అభిప్రాయపడ్డారు. అయితే రాష్ట్ర ప్రయోజనాలకే ప్రాధాన్యమని.. అనుసంధానంతో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలన్నీ తీరతాయని సీఎం అన్నారు. ఆయన ఆలోచనలను అర్థం చేసుకున్న జలవనరులశాఖ.. ఇప్పుడు ఇందుకు సంబంధించిన మ్యాపులను తెప్పించుకుని.. గోదావరి-కృష్ణా అనుసంధాన ప్రక్రియపై కసరత్తు మొదలుపెట్టింది.


కొత్త బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఆర్టీసీకి 400 కొత్త బస్సులు

- త్వరలో మరో వెయ్యి రాక
- రవాణా శాఖ మంత్రి ఎం.రామ్‌ప్రసాద్ రెడ్డి

విజయవాడ బస్ స్టేషన్, ఆగస్టు 7: ఏపీఎస్‌ఆర్టీసీకి 1400 కొత్త బస్సులు రానున్నాయని, అందులో భాగంగా ప్రస్తుతం 400 బస్సులు వచ్చాయని రవాణాశాఖ మంత్రి ఎం.రామ్‌ప్రసాద్ రెడ్డి తెలిపారు. విజయవాడ డిపో గ్యారేజి ప్రాంగణంలో బుధవారం 14 కొత్త బస్సులను ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌లో భాగంగా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి 800 బస్సులు కేటాయించిందని తెలిపారు. నష్టాల్లో ఉన్నప్పటికీ కార్మికులకు న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. సంస్థ బలోపేతానికి ఉద్యోగులు, కార్మికులు కృషి చేయాలన్నారు.

రుషికొండ నిర్మాణాల్లో అధికార దుర్వినియోగం

- మాజీ సీఎం జగన్, నాటి సీఎస్ జవహర్‌రెడ్డిపై కేసు నమోదుకు ఆదేశాలివ్వండి
- హైకోర్టులో ఆర్‌టీఐ కార్యకర్త పిటిషన్

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): 'పర్యావరణ అనుమతులు లేకుండా విశాఖలోని రుషికొండ పై భవనాలు నిర్మించిన అప్పటి సీఎం జగన్, సీఎస్ జవహర్‌రెడ్డి, మరికొందరు అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. వారిపై కేసు నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వండి' అని కోరుతూ సమాచార హక్కు సంఘం జాతీయ అధ్యక్షుడు టి.గంగాధర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అనుమతులు లేకుండా భవనాలు నిర్మించి రూ.420 కోట్లు దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. అప్పటి ముఖ్యమంత్రి, సీఎస్, మంత్రులు, అధికారులపై మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. కేసు నమోదు చేయాలని కోరుతూ ఎస్పీకి వినతి సమర్పించామన్నారు. ఈ వ్యాజ్యం బుధవారం హైకోర్టు న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తి వద్ద విచారణకు వచ్చింది. వ్యాజ్యంపై తదుపరి విచారణను న్యాయమూర్తి ఈనెల 21కి వాయిదా వేశారు.

జోగి రమేశ్‌ను అదుపులోకి తీసుకోవాలి

- ముందస్తు బెయిల్‌కు ఆయన అనర్హుడు
- హైకోర్టులో పోలీసుల తరఫున వాదనలు





అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఇంటిపై జరిగిన మూకదాడి వెనుక కుట్రకోణం ఉందని, దీనిని వెలికి తీస్తేనే వాస్తవాలు తెలుస్తాయని పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు హైకోర్టుకు తెలిపారు. కుట్ర కోణం తెలియాలంటే మాజీ మంత్రి జోగి రమేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేయాల్సి ఉందన్నారు. పిటిషనర్(జోగి) ప్రోద్బలంతో 30 నుంచి 40 మంది చంద్రబాబు ఇంటి వద్దకు వచ్చి గొడవ చేశారని తెలిపారు. ఆదేసమయంలో పలువురిపై దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. "బయటకు రా! చంపేస్తాం" అంటూ చంద్రబాబును బెదిరిస్తూ నినాదాలు చేశారని వివరించారు. కేసు దర్యాప్తును పిటిషనర్ ప్రభావితం చేశారని తెలిపారు. అప్పట్లో దర్యాప్తు అధికారి నామమాత్రపు సెక్షన్లు పెట్టి, కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారన్నారు. పిటిషనర్, ఆయన అనుచరుల దాడిలో బాధితులపై అట్రాసిటీ కేసులు పెట్టారని తెలిపారు. ప్రస్తుత కేసులో హత్యాయత్నం(సెక్షన్ 307)ను చేర్చారని, ముందస్తు బెయిల్ పొందేందుకు పిటిషనర్ అనర్హుడని పేర్కొన్నారు. కోర్టుకు వాస్తవ వివరాలు వెల్లడించకుండా పిటిషనర్ దాచిపెట్టారన్నారు. వాటిని కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని కోరారు. దీనికి అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్ విచారణను ఈ నెల 13కు వాయిదా వేశారు. టీడీపీ అధినేత నివాసంపై మూకదాడి వ్యవహారంలో తాడేపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ మాజీమంత్రి జోగి రమేశ్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. రాజకీయ దురుద్దేశంతో పిటిషనర్‌పై కేసు నమోదు చేశారని తెలిపారు. గతంలో పోలీసులు సీఆర్‌పీసీ సెక్షన్ 41 కింద నోటీసులు ఇచ్చారన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి పిటిషనర్ చంద్రబాబు నివాసం వద్దకు వెళ్లారని తెలిపారు. కాగా, బుధవారం కోర్టు సమయం ముగియడంతో వాదనల కొనసాగింపు కోసం విచారణను వాయిదా వేశారు.

నేడు భూ ఉపరితలంపై అల్పపీడనం

విశాఖపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కాకుండా భూ ఉపరితలంపై అల్పపీడనాలు ఏర్పడే వాతావరణం నెలకొంది. ఐదు రోజుల క్రితం పశ్చిమబెంగాల్, జార్ఖండ్ పరిసరాల్లో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారి మధ్య, ఉత్తర, వాయవ్య భారతంలో కుంభవృష్టి వర్షాలు కురిశాయి. తాజాగా మరో అల్పపీడనం తూర్పు, మధ్య భారతాల్లో ఏర్పడనుంది. బుధవారం ఉదయానికి పశ్చిమబెంగాల్, జార్ఖండ్ పరిసరాల్లో ఆవరించిన ఉపరితల ఆవర్తనం సాయంత్రానికి జార్ఖండ్, ఉత్తర ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో కేంద్రీకృతమై ఉంది. గురువారం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలపై కొంతవరకు ఉంటుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు మోస్తరుగా కదులుతున్నందున బుధవారం అనేకచోట్ల ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో ఎక్కువచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

కృష్ణమ్మ పరవళ్లు

- నిండుకుండల్లా రాష్ట్రంలోని జలాశయాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఎగువ రాష్ట్రాల నుంచి భారీగా వరద వస్తుండటంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. శ్రీశైలం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకూ రాష్ట్రంలోని జలాశయాలన్నీ నిండుకుండల్లా మారాయి. విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ మొత్తం గేట్లను అధికారులు ఎత్తివేయడంతో సముద్రం వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. పులిచింతల నుంచి 1,41,856 క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజీలోకి వస్తోంది. ఇదికాకుండా పాలేరు నుంచి 65వేలు, కీసర నుంచి 16,236 క్యూసెక్కులు వస్తుండటంతో అధికారులు మంగళవారం అర్ధరాత్రి ప్రకాశం బ్యారేజీ 50 గేట్లను 3 అడుగులు, మిగిలిన 20 గేట్లను 2అడుగుల మేర ఎత్తి 1,37,450 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. పంట కాలువలకు 13,477 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 3,50,730 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో సాగర్ 18 గేట్లను ఎత్తి 2,24,574 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సాగర్ జలాశయ నీటిమట్టం 584.60 అడుగులకు చేరింది. ఇది 296.28 టీఎంసీలకు సమానం. 14 గేట్లను 10 అడుగులు, 4 గేట్లను 5 అడుగుల మేర నీటిని దిగువకు వదులుతున్నారు. సాగర్ నుంచి 2,70,591 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో నమోదైంది. అలాగే, పల్నాడు జిల్లాలోని కేఎల్‌రావు పులిచింతల జలాశయానికి 2,50,518 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా, ప్రస్తుతం 168.86 అడుగుల నీటిమట్టం ఉంది. ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, శ్రీరామ్ తాతాయ్య బుధవారం ఉదయం పులిచింతల 14 గేట్లను మూడు మీటర్ల మేర ఎత్తారు. పులిచింతల నుంచి దిగువకు 2,78,573 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. జలాశయం దిగువ ప్రాంతవాసులను అధికారులు అప్రమత్తం చేశారు. వరద పెరుగుతున్నందున పరివాహక ప్రాంతాలు, లంక గ్రామాల ప్రజలు, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ హెచ్చరించారు. బుధవారం రాత్రి 7గంటలకు సుంకేశుల వద్ద ఇన్‌ఫ్లో 47,600 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 47,235 క్యూసెక్కులు, శ్రీశైలం వద్ద ఇన్‌ఫ్లో 3.32లక్షల క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 4.2లక్షల క్యూసెక్కులు ఉన్నట్టు తెలిపారు.

స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నీటిమట్టం బుధవారం స్వల్పంగా పెరిగింది. ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 6,00,331 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. స్పిల్‌వే ఎగువన 30.670 మీటర్లు, దిగువన 21.770 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

జగన్ అక్రమాస్తుల కేసులో.. ఏమిటీ కాలయాపన?

(మొదటి పేజీ తరువాయి)

మార్గదర్శకాల ప్రకారం విచారణ సాగించాలని ఆదేశించింది. జగన్ అక్రమాస్తుల కేసు విచారణను వేగవంతం చేయాలని, కేసుల ట్రయల్‌ను తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని, జగన్ బెయిల్ రద్దు చేయాలని కోరుతూ టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేయడం తెలిసిందే. వాటిపై ఈ ఏడాది మే 2న సీబీఐ అఫిడవిట్ వేసింది. 'కేసుల్లో నిందితులుగా ఉన్నవారు ఒకరి తర్వాత మరొకరు డిశ్చార్జ్ పిటిషన్లు వేస్తున్నారు. ట్రయల్ సాగకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇప్పటివరకు 39 క్వాష్ పిటిషన్లు, 95డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై తీర్పులు ఇవ్వడానికి ముందే న్యాయాధికారులకు స్థానచలనం కలుగుతోంది. ఈ కేసులో ఉన్న నిందితులంతా శక్తిమంతులే' అని సీబీఐ అందులో పేర్కొంది. దీనిపై బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. బెంచ్ ముందుకు మొదటి కేసుగా జగన్ అక్రమాస్తుల కేసుపైనే విచారణ జరగాల్సి ఉంది. అయితే.. అదనపు సొలిసిటర్ జనరల్ రాజు అందుబాటులో లేకపోవడంతో రెండో కేసు నుంచి విచారణను ప్రారంభించారు. నాలుగో కేసు విచారణ జరుగుతుండగా రాజు వచ్చి జగన్ కేసును ప్రస్తావించగా జస్టిస్ ఖన్నా అసహనం వ్యక్తం చేశారు. పేజీల కొద్దీ అఫిడవిట్ దాఖలు చేశారే తప్ప అందులో విషయమే లేదని, మధ్యాహ్నం 2 గంటలకు విచారణ చేస్తామని స్పష్టం చేశారు. తిరిగి విచారణకు వచ్చినప్పుడు మళ్లీ రాజు అందుబాటులో లేరని సీబీఐ తరఫు న్యాయవాదులు చెప్పడంతో జస్టిస్ ఖన్నా ఆగ్రహం వ్యక్తంచేశారు. సీబీఐ అఫిడవిట్‌లోని అంశాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని తెలిపారు. కోర్టుల ఆదేశాలు తప్పనే సాకుతో కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము కూడా అనేక పిటిషన్లు విచారించి డిశ్చార్జ్ చేస్తున్నామని.. తమకెలాంటి అవరోధాలు ఎదురు కావడం లేదని ధర్మాసనం తెలిపింది. డిశ్చార్జ్ పిటిషన్లకు, కేసు విచారణకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం విచారణ చేపట్టాలని సీబీఐని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబరు 11కు వాయిదా వేసింది.

జగన్‌కు 'జెడ్ ప్లస్' భద్రత కల్పిస్తున్నాం: ఏజీ

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ భద్రతను కుదించలేదని, ఆయనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పిస్తున్నామని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. బులెట్ ప్రూఫ్ వాహనానికి విండ్ షీల్డ్ అమర్చడం పూర్తయ్యేవరకు మరో బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ఈ వ్యవహారంపై పూర్తివివరాలతో కౌంటర్ వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించారు. విచారణను 28కి వాయిదా వేశారు. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఆదేశాలిచ్చారు. సీఎం హోదాలో తనకున్న భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ సీఎం జగన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్. శ్రీరామ్ వాదనలు వినిపించారు. పిటిషనర్‌కు ఇచ్చిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం అద్దంలో పగుళ్లు ఉన్నాయని, వెనుక తలుపు తెరుచుకోవడం లేదని వివరించారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ... మాజీ ప్రధానులకు కల్పిస్తున్న భద్రత మాదిరిగానే మాజీ సీఎంలకు కూడా కల్పించే విషయాన్ని ప్రభుత్వం ఎందుకు పరిశీలించకూడదని ప్రశ్నించారు. ఏజీ దమ్మాలపాటి బదులిస్తూ... తీవ్రవాదుల ముప్పు ఉండటంతో ఎన్ఎస్‌జీతో భద్రత కల్పించారని, మాజీ సీఎంలకు భద్రత కల్పించే విషయంలో హోంశాఖ మార్గదర్శకాలు అనుసరిస్తున్నామని పేర్కొన్నారు. 2024 జూన్ 3నాటి భద్రత కల్పించాలని పిటిషనర్ కోరుతున్నారని, అప్పుడు ఆయన సీఎం అన్నారు. ప్రస్తుతం ఆ హోదాలో లేరని తెలిపారు. జగన్‌కు ఇచ్చిన బులెట్ ప్రూఫ్ వాహనానికి విండ్‌షీల్డ్ మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారని, త్వరలోనే మరమ్మతులు పూర్తిచేస్తారని చెప్పారు. అంతవరకూ జగన్‌కు కొత్త బులెట్ ప్రూఫ్ వాహనం సమకూరుస్తారని వెల్లడించారు. పిటిషనర్ తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో, రిమోట్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు ఉపయోగించే ప్రాంతాల్లో పర్యటించే సమయంలో కాన్వాయ్‌లో జామర్ ఏర్పాటు చేస్తామని, ఆ వివరాలను ఆయన భద్రతా సిబ్బందికి అందిస్తామని అన్నారు. వ్యాజ్యంపై విచారణ ముగిసిన అనంతరం జగన్ తరఫు సీనియర్ న్యాయవాది స్పందిస్తూ... ప్రమాదం ఎప్పుడెలా వస్తుందో ఎవరికీ తెలియదంటూ... బంగ్లాదేశ్‌లో జరిగిన ఘటనను ఉదహరించారు. న్యాయమూర్తి స్పందిస్తూ మన దేశంలో అలాంటి ఘటనలు జరగవని తనకు పూర్తి నమ్మకం ఉందని పేర్కొన్నారు.


హోం మంత్రి అనితతో భేటీ అయిన వివేకానంద రెడ్డి కుమార్తె సునీత

నా తండ్రి కేసులో న్యాయం చేయండి

- కూటమి సర్కారుకు వివేకా కుమార్తె విన్నపం
- హోం మంత్రి అనితను కలిసిన నర్రెడ్డి సునీత


అమరావతి/కడప, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): "నా తండ్రి హత్య కేసులో నాకు న్యాయం జరగలేదు. దోషులకు శిక్ష పడేలా నేను చేస్తున్న న్యాయ పోరాటానికి మీ సహకారం కావాలి. ఒక మహిళా మంత్రిగా నా బాధ అర్థం చేసుకోండి" అంటూ హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను వైఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత కోరారు. అమరావతి సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబును కలిసేందుకు వచ్చిన సునీత.. ఆయన బిజీగా ఉండటంతో హోం మంత్రి అనితను కలిశారు. "మా నాన్న(వివేకా) చాలా మంచి వ్యక్తి. గొడ్డలితో నరికి చంపి గుండెపోటని చిత్రీకరించారు. దోషులకు శిక్ష పడటమే మా నాన్నకు అసలైన నివాళి. నా వేదన అర్థం చేసుకుని న్యాయ పోరాటానికి సహకరించండి" అని సునీత కోరారు. పోలీసులు కేసును నీరుగార్చేలా వ్యవహరించారని, నిందితులను అరెస్టు చేసేందుకు కర్నూలుకు వెళ్లిన సీబీఐ అధికారుల బృందానికి స్థానిక పోలీసులు సహకరించకుండా అప్పటి ప్రభుత్వ పెద్దలు ఆదేశాలు జారీ చేశారని వివరించినట్లు తెలిసింది. ఆమె విన్నపంపై స్పందించిన హోంమంత్రి అనిత.. "కేసు ఇప్పుడు సీబీఐ పరిధిలో ఉంది. మీకు న్యాయం జరిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా అందిస్తాం" అని బదులిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర పోలీసులు హంతకులకు అండగా నిలిచారని, బాధితులకు న్యాయం చెయ్యకపోగా సీబీఐ దర్యాప్తు అధికారులపై కేసులు పెట్టారని సునీత తెలిపారు. అలాంటి పోలీసులపై చర్యలు తీసుకుని భవిష్యత్తులో పోలీసులు ఎవరూ ఇలాంటి అక్రమాలకు పాల్పడకుండా చూడాలని విన్నవించారు. "సాక్షుల్ని బెదిరించారు. నన్ను ఇబ్బంది పెట్టారు. అవమానించారు. కేసులు పెట్టారు. ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేను" అంటూ సునీత ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య కేసులో తప్పు చేసిన పోలీసులతోపాటు హంతకులకు వంత పాడిన వారిపైనా చర్యలు తీసుకుంటామని అనిత స్పష్టం చేశారు.

కేసును తప్పుదోవ పట్టించారు

హోం మంత్రిని కలిసిన తర్వాత వివేకా కుమార్తె సునీత బుధవారం సాయంత్రం కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిశారు. హత్య కేసును తప్పుదోవ పట్టించేందుకు సీబీఐ అధికారులను బెదిరించడం, వారిపై కేసులు పెట్టడం వంటి అంశాలను వివరించినట్లు తెలిసింది. అధికారాన్ని అడ్డంపెట్టుకుని కేసులు, పిటిషన్లు వేస్తూ కేసును నీరు గార్చేందుకు ప్రయత్నించారని వివరించినట్లు సమాచారం. ఐదేళ్ల అధికారంలో ఉన్నది సొంత కుటుంబ సభ్యులే అయినా న్యాయం జరగలేదని అన్నారు. తప్పు చేసిన పోలీసులను వదిలి పెట్టొద్దని ఎస్పీ హర్షవర్ధన్‌రాజును ఆమె కోరినట్లు తెలిసింది.

నేతన్నలకు అండగా ఉంటాం

- చేనేత వస్త్రంపై జీఎస్టీ రద్దు చేయిస్తా
- జాతీయ చేనేత దినోత్సవంలో చంద్రబాబు



అమరావతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల ఆదాయం పెరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నేతన్నల జీవితాల్లో వెలుగులు వచ్చేవరకూ తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికుల కష్టాలు, మార్కెటింగ్‌లో ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. నేతన్నలకు ఏదీ ఇవ్వకుండా అన్నీ చేశానంటూ సాక్షి పత్రిక, టీవీలో 400 కోట్ల ప్రకటనలు ఇచ్చుకున్న జగన్ రెడ్డి, చేనేత రంగంపై 226 కోట్లు అప్పు పెట్టి వెళ్లారని అన్నారు. ఆప్కోలో కొనుగోళ్లు ఆపేశారని, సొంత మగ్గానికి మాత్రమే నేతన్న నేస్తం ఇచ్చి లక్షలాది మందికి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కులవృత్తులే ఆస్తిపాస్తులుగా జీవిస్తున్న వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం ఐదేళ్లలో 1.50 లక్షల కోట్లు ఖర్చు చేయబోతోందన్నారు. బీసీల రక్షణ కోసం తమ ప్రభుత్వం చట్టం తీసుకురాబోతోందని, చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో పోరాటం చేస్తామని తెలిపారు. చేనేతలు అడిగిన దానికన్నా ఎక్కువే ఇవ్వాలని ఉన్నా.. ఖాళీ ఖజానా, పది లక్షల కోట్ల అప్పులు, ఏడాదికి 90 వేల కోట్ల వడ్డీలు తన ముందున్న పెద్ద సవాళ్లన్నారు. 16 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామన్నారు. ఇసుక ఉచితంగా ఇచ్చి భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించామని, మరోవైపు సామాన్యుడు ఇల్లు నిర్మించుకోవడానికి సులభతరం చేశామని చెప్పారు. ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని, పేదోడికి అండగా తెలుగుదేశం పార్టీ, ఎన్డీయే ప్రభుత్వం ఉంటాయని భరోసా ఇచ్చారు.

చేనేతలకు ఆరోగ్య బీమా

'చేనేత వర్గాలకు ఆరోగ్య బీమా చేయిస్తాం. త్రిఫ్టు ఫండ్ ప్రభుత్వ వాటా 8శాతం నుంచి 16 శాతానికి పెంచుతాం. జీఎస్టీ కౌన్సిల్‌తో మాట్లాడి చేనేత వస్త్రంపై పన్ను రద్దు చేయిస్తా. కుదరకపోతే రీయింబర్స్‌మెంట్ ఇస్తా. టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా చేనేతలు ఉన్న ప్రాంతాల్లో పార్టీ పెట్టినప్పటి నుంచి మెజారిటీ వస్తూనే ఉంది. ఇంతలా ఆదరించిన మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుంటా. మీకు ఎంతచేసినా తక్కువే. ఇంట్లో మగ్గం కోసం ఆర్థిక చేయూత ఇస్తాం. ఆన్‌లైన్ వ్యాపారానికి సహకారం అందిస్తాం. ప్రధాని సూర్యఘర్ కింద 200 యూనిట్లు విద్యుత్ సొంతంగా వాడుకునేలా సోలార్ ఏర్పాటు చేయిస్తాం' అని ముఖ్యమంత్రి వరాలు కురిపించారు. ఏడాదికి 60-70 కోట్ల జీఎస్టీ భరించేందుకు మనసు రాని మాజీ ముఖ్యమంత్రి సర్వే రాళ్లపై ఫొటోలకు 700 కోట్లు, సొంత మీడియాకు 400 కోట్లు ఇచ్చుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావ్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప పాల్గొన్నారు.

భువనేశ్వరి కోసం ఉప్పాడ, ధర్మవరం చీరలు

- చేనేత స్టాల్స్‌లో కొన్న చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు తన సతీమణి కోసం షాపింగ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్‌లో నారా భువనేశ్వరి కోసం చీరలు కొనుగోలు చేశారు. చేనేత స్టాళ్లను తిలకిస్తూ ముందుకెళ్లిన ముఖ్యమంత్రి రెండు స్టాల్స్ వెనక్కి వచ్చి 'ఈ చీరలు బాగున్నాయి.. ఎక్కడివి?' అని అడిగారు. ఉప్పాడ హ్యాండ్లూమ్ సొసైటీలో తయారైనవని అక్కడున్న నేత కార్మికుడు మల్లెల నాగేంద్రబాబు చెప్పారు. 'సరే ఆ చీర ఇవ్వు' అంటూ నెమలి రంగు పట్టు చీరను కొనుగోలు చేశారు. ఆ తర్వాత ధర్మవరం పట్టుచీరల స్టాల్‌కు వెళ్లి మరో చీర కొనుగోలు చేశారు. 'నా జీవితంలో ఎప్పుడూ చీరలు కొనలేదు. ఇప్పుడు మన చేనేత కళాకారులు తయారు చేసిన చీరలు చూడగానే ఆకట్టుకున్నాయి. అందుకే మా ఆవిడకు రెండు చీరలు కొనుగోలు చేశా. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు కొనాలి. నెలలో ఒక్క రోజైనా చేనేత వస్త్రాన్ని తప్పక ధరించాలి' అని ముఖ్యమంత్రి అన్నారు.

బటన్‌రెడ్డికి బటన్ నొక్కి బుద్ధి చెప్పారు

- చేనేత దినోత్సవంలో మంత్రి సవిత

బాపట్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి), మంగళగిరి సిటీ: రాష్ట్రాన్ని ఇప్పుడు కాపాడుకోకపోతే భావితరాల భవిష్యత్తుకు తామే ఉరివేసిన వాళ్లమవుతామన్న ఆలోచనతోనే జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా బటన్ నొక్కి ప్రజలు బుద్ధి చెప్పారని చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అన్నారు. బాపట్ల జిల్లా చీరాలలో బుధవారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చీరాల కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరుకావాల్సి ఉందని, అయితే.. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రాలేకపోయారని తెలిపారు. 2014-19 మధ్య చేనేత రంగానికి స్వర్ణయుగం లాంటిదని, గడచిన ఐదేళ్లలో దాచుకోవడం, దోచుకోవడం తప్ప జగన్ ఏమీ చేయలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేనేత కార్మికులను ఆదుకోకపోగా వారి భూములను సైతం లాక్కున్నారని విమర్శించారు. వారు చేసిన భూ కబ్జాలకు ప్రొద్దుటూరులో కుటుంబం మొత్తం ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. గతంలో నూలుపై ఇచ్చిన సబ్సిడీని పునరుద్ధరించడంతో పాటు ఆప్కో ద్వారా రాయితీలు, ఆదరణ పథకాలు, నేత కార్మికులకు పెన్షన్, బీమా సౌకర్యం లాంటివన్నీ అమలు చేస్తామని మంత్రి చెప్పారు.


చీరాలలో నేత కార్మికుడి ఇంట్లోకి వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సవిత

భావోద్వేగానికి లోనైన మంత్రి

చేనేత దినోత్సవంలో మాట్లాడిన మంత్రి సవిత ఓ దశలో భావోద్వేగానికి గురయ్యారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తనకు మంత్రి పదవి ఇచ్చేటప్పుడు.. "నా కుటుంబ సభ్యులైన చేనేతలను మీ చేతిలో పెడుతున్నా" అని మంత్రి లోకేశ్ చెప్పారని పేర్కొంటూ సవిత భావోద్వేగానికి లోనయ్యారు. వైసీపీ అనుకూల పత్రికలో చేనేత రంగంపై బుధవారం ప్రచురితమైన ఓ కథనాన్ని సభలోనే చూపిస్తూ విషపు రాతలపై విరుచుకుపడ్డారు. కాగా, షెడ్యూల్ ప్రకారం చీరాల జాండ్రపేటలోని 3 చేనేత కుటుంబాలను సీఎం చంద్రబాబు కలుసుకోవాల్సి ఉంది. అననుకూల వాతావరణంతో రాలేకపోయారు. ఆ ఇళ్లకు మంత్రి సవిత వెళ్లారు. జాండ్రపేటలోని వెంకటనాగేశ్వరరావు, నాగయ్య, యారంబరావు ఇళ్లకెళ్లి వారి ఇక్కట్లు తెలుసుకున్నారు.

'నేతన్న నేస్తం'లో అక్రమాలు

- మంత్రి సత్యకుమార్

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన చేనేత పరిశ్రమకు కూటమి ప్రభుత్వ హయాంలో పూర్వవైభవం తీసుకువస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో బుధవారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. 'నేతన్న నేస్తం'లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. చేనేత వృత్తితో ఏమాత్రం సంబంధంలేని వైసీపీ కార్యకర్తలకు నేతన్న నేస్తం ఇచ్చారని ఆరోపించారు. వైసీపీ పాలనలో వందలాది మంది చేనేత కార్మికులు హత్యలు, ఆత్మహత్యలు, ఆకలి చావులకు గురయ్యారని ఆరోపించారు. వాటన్నింటినీ వైసీపీ ప్రభుత్వ హత్యలుగానే భావించాల్సి ఉంటుందన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సృజన

సీఎంకు కలెక్టర్ స్వాగతం

కృష్ణలంక: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని మేరీస్ స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక వేడుకల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కలెక్టర్ డాక్టర్ జి.సృజన పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు.



తుమ్మలపల్లిలో ఆదివాసీ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, జేసీ నిధి మీనా

ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్ల పరిశీలన

కృష్ణలంక: ఈనెల 9న ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, అధికారులు హాజరుకానున్న దృష్ట్యా చేయాల్సిన ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, డ్వామా పీడీ, ఇన్‌చార్జి గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి జె.సునీత పరిశీలించారు.



సభలో పాల్గొన్న మనోహర నాయుడు, లక్ష్మయ్య, నారాయణరావు

బుక్ ఫెస్టివల్ వ్యవస్థాపక సభ్యుడికి ఘననివాళి

విజయవాడ కల్చరల్: బుక్ ఫెస్టివల్ వ్యవస్థాపక సభ్యుడు పి.రామకోటేశ్వరరావు సంస్మరణ సభ బుధవారం సాయంత్రం గవర్నరుపేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో జరిగింది. బుక్ ఫెస్టివల్ వ్యవస్థాపకుల్లో ముఖ్యపాత్ర పోషించిన వ్యక్తుల్లో రామకోటేశ్వరరావు ఒకరిని వక్తలు పేర్కొన్నారు. రామకోటేశ్వరరావు ట్రస్టును ఏర్పాటు చేసి సమాజసేవ చేశారని, తర్వాత వారి కుటుంబసభ్యులు సేవలందించాలని కోరారు. విశాలాంధ్ర మనోహరనాయుడు, ప్రజాశక్తి లక్ష్మయ్య, రవి, అశోక్ కుమార్, పల్లవి వెంకట నారాయణ, గోళ్ల నారాయణరావు, ఎమెస్కో లక్ష్మి, అన్నే భాస్కరరావు, కోమటి జయరాం, కుటుంబ సభ్యులు పాల్గొని రామకోటేశ్వరరావుకు నివాళులర్పించారు.



యామిని కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నారాయణరావు, చిట్టిబాబు, బ్రహ్మానందరావు

ఘనంగా యామిని కృష్ణమూర్తి సంస్మరణ సభ

విజయవాడ కల్చరల్: పద్మవిభూషణ్ యామిని కృష్ణమూర్తి సంస్మరణ సభ బుధవారం సాయంత్రం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళావేదిక సత్రంలో నిర్వహించారు. యామిని కృష్ణమూర్తి కూచిపూడి, భరతనాట్యం వంటి రంగాల్లో విశేషమైన ప్రతిభ కలిగిన గొప్ప కళామూర్తి అని, ఆమె మరణం నాట్యరంగానికి తీరని లోటని పోలవరపు కోటేశ్వరరావు, సాహిత్య సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అన్నారు. కర్ణాటక సంగీతంలోనూ రాణించిన ప్రతిభాశాలీ యామిలి కృష్ణమూర్తి అన్నారు. పాడుతూ నాట్యం చేయగలిగిన అరుదైన సంగీత, నాట్య కళాకారిణి అన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, ఆంజనేయరాజు, సంగీత కళాకారుడు, బ్రహ్మానందరావు పాల్గొని యామిని కృష్ణమూర్తికి నివాళులర్పించారు.



స్విమ్మర్లను అభినందిస్తున్న అసోసియేషన్ నేతలు

జాతీయ స్విమ్మింగ్‌లో సమదేవ్, సంపత్‌కు రెండో పతకం

విజయవాడ స్పోర్ట్స్: ఒడిశా రాష్ట్రం కళింగపట్నంలో జరుగుతున్న 40వ సబ్ జూనియర్, 50వ జూనియర్ నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో తీర్ధు సమదేవ్, సంపత్ కుమార్ రెండో పతకంతో బుధవారం సత్తాచాటారు. జూనియర్ విభాగంలోని 1500 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో తీర్ధు సమదేవ్ (ఎన్టీఆర్) 16.06.94 సెకన్లలో ఈది రజతం సాధించగా, ఇదే విభాగంలో జి సంపత్‌కుమార్ యాదవ్ (కృష్ణా) 16.07.06 సెకన్లలో ఈది కాంస్యం వశం చేసుకున్నాడు. మంగళవారం సమదేవ్ కాంస్యం, సంపత్ రజతం సాధించిన విషయం తెల్సిందే. వీరు పతకాలతో సత్తాచాటడంతో రాష్ట్ర ఆక్వాటిక్ అసోసియేషన్ సెక్రటరీ ఏ మోహన్ వెంకటరామ్, అసోసియేషన్ ట్రెజరర్ ఐ రమేష్ అభినందించారు.

నేషనల్ పెంటాథ్లాన్‌కు పీబీ సిద్ధార్థ విద్యార్థి



విజయవాడ స్పోర్ట్స్: మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో ఎంపీఏ ఫస్టియర్ చదువుతున్న జి. మని గంగరామసాయి అనే విద్యార్థి ఉత్తరాఖండ్‌లో ఈ నెల 14 నుంచి 18 వరకు జరిగే 13వ మోడరన్ పెంటాథ్లాన్ నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల కాకినాడలో జరిగిన ఏపీ మోడరన్ పెంటాథ్లాన్‌లో పాల్గొని మెడల్ సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. కళాశాలలో బుధవారం జరిగిన అభినందన సభలో సిద్ధార్థ యాజమాన్యం ప్రెసిడెంట్ డాక్టర్ సీ నాగేశ్వరరావు, సెక్రటరీ పి లక్ష్మణరావు, కన్వీనర్ ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ పోటీలకు రామసాయి ఎంపికవ్వడం ఆనందంగా ఉందన్నారు. అక్కడ కూడా రాణించి పతకం సాధించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, డైరెక్టర్ వి.బాబూరావు, డీన్ రాజేష్, ఫిజికల్ డైరెక్టర్ టీవీబీ కృష్ణారెడ్డి రామసాయికి శుభాకాంక్షలు తెలిపారు.

మల్లవల్లి అభివృద్ధికి త్వరితగతిన చర్యలు

- పరిశ్రమలు, కామర్స్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యువరాజ్

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఆగస్టు 7: రాజధానికి దగ్గరలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అతిపెద్ద పారిశ్రామికవాడ (మల్లవల్లి)ను సీఎం ఆదేశాల మేరకు త్వరగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పరిశ్రమలు, కామర్స్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యువరాజ్ తెలిపారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో బుధవారం మౌలిక సదుపాయాల కల్పనను పరిశీలించేందుకు ఏపీఐఐసీ ఎండీ అభిషేక్ కిషోర్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఫీల్డ్‌మ్యాప్ ఆధారంగా ఏపీఐఐసీ భూముల వివరాలను తెలుసుకుని అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు భూములు పరిశీలిస్తూ సమస్యలను తెలుసుకుంటూ పరిశ్రమలను సందర్శించారు. ఏపీఐఐసీ భూములను కాపాడాల్సిన బాధ్యతలో రెవెన్యూ అధికారులదేనని, సూచిస్తూ సర్వే వివరాలను తెలుసుకున్నారు. వర్షాల నేపథ్యంలో సర్వే కొంత ఆలస్యమవుతోందని ఆర్డీవో పద్మావతి వివరించగా, ఎట్టి పరిస్థితుల్లోను రోజుల వ్యవధిలోనే నష్టపరిహారం, భూసమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారని సమస్యలేమైనా ఉంటే తక్షణం తన దృష్టికి తేవాలన్నారు. స్థానిక పరిశ్రమల యజమానులతో ముఖాముఖీ నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. విద్యుత్, నీరు తదితర మౌలిక సదుపాయాల సమస్యలను అధికారుల దృష్టికి తేవడంతో మంత్రి భరత్ ఆదేశాలతో సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఫుడ్‌పార్క్‌లోని యంత్రాల పనితీరు, కోల్డ్‌స్టోరేజ్ యూనిట్లను తనిఖీ చేశారు. ఐదేళ్లుగా యంత్రాలను నిరుపయోగంగా ఉంచడం వల్ల సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యాయని కాంట్రాక్టర్ తెలపడంతో అసహనం వ్యక్తం చేస్తూ యంత్రాలను తిరిగి పని చేయించేందుకు ఆసక్తి ఉందా లేదా అంటూ ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌కు ఆసక్తి లేకపోతే వేరేవారికివ్వాలని జోనల్ మేనేజర్ సీతారాంకు ఆదేశాలిచ్చారు. గత ప్రభుత్వంలో భూమి విలువ పెంచిన సమస్య, నష్టపరిహారం తీసుకున్న రైతులు అనధికారికంగా భూములను ఆధీనంలో ఉంచుకోవడం, అర్హతగల రైతులకు నష్టపరిహారం చెల్లింపు, ఫుడ్‌పార్క్, తదితర సమస్యలను రోజుల వ్యవధిలోనే పరిష్కరించి రాష్ట్రానికే తలమానికమైన మల్లవల్లి పారిశ్రామికవాడను 6నెలల వ్యవధిలో అభివృద్ధి చేస్తామని కార్యదర్శి డాక్టర్ యువరాజ్ తెలిపారు. తహసీల్దార్ నాగభూషణం, సాయి, రెవెన్యూ సిబ్బంది, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



ఏపీఐఐసీ భూమి వివరాలను ఫీల్డ్‌మ్యాప్‌లో పరిశీలిస్తున్న డాక్టర్ యువరాజ్, ఏపీఐఐసీ ఎండీ అభిషేక్ కిషోర్, జోనల్ మేనేజర్ సీతారాం, ఆర్డీవో పద్మావతి

నేతన్నలను ఆదుకుంటాం: మంత్రి సవిత

పటమట, ఆగస్టు 7: కూటమి ప్రభుత్వ హయాంలో చేనేతకు స్వర్ణయుగమని, నేత కార్మికులకు రాజయోగమేనని చేనేత కార్మికుల కష్టాలపై సీఎం చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందని, వారిని అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నగరంలోని మేరిస్ స్టెల్లా కళాశాల వద్ద బుధవారం చేనేత వాక్‌థాన్ నిర్వహించగా మంత్రి సవిత, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ప్రారంభించారు. చేనేత వస్త్రాలను ధరిద్దాం, చేనేత కళను ప్రోత్సహిద్దామంటూ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ చేనేత కార్మికుల కుటుంబ సభ్యులందరికీ జాతీయ, చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పోగును వస్త్రంగా తయారు చేసి మనిషి మానాన్ని కాపాడుతున్న చేనేత కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. నిర్వీర్యమవుతున్న చేనేతకు మళ్లీ పూర్వ వైభవం తెస్తామని, నేతన్నలను ప్రోత్సహించాలంటే ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధ రించాలని సవిత పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ చేనేత, జౌళి ఔన్నత్యాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ఆదరించాలని కోరారు. రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, కమిషనర్ జి.రేఖారాణి, ఆర్కియాలజీ, మ్యూజియమ్స్ కమిషనర్ జి. వాణిమోహన్, కార్పొరేటర్ దేవినేని అపర్ణ, ఆప్కో ఎండీ పవన్‌కుమార్తి, జాయింట్ డైరెక్టర్లు కన్నబాబు, ఎం.నాగేశ్వరరావు, జిల్లా ఏడీ ఎస్ రఘనందన్, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె. భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



చేనేత వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే రామ్మోహన్



టెన్త్‌లో ప్రతిభ కనబర్చిన బాలికకు మెమెంటో అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

ప్రభుత్వ పాఠశాలల నుంచే ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌లు

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గుణదల, ఆగస్టు 7: విద్య, వైద్యం అందుకోవడానికి పేదరికం అడ్డుకారాదన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నినాదమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రామవరప్పాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రజతోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎంపికైనవారు ఎందరో ఉన్నారని అలాంటి వారిని నేటి బాలబాలికలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మానవతా విలువలు, కుటుంబ విలువలు, సమాజ అవసరాలు అనేవి విద్యార్థి దశనుంచి ఉన్నత చదువులు పూర్తి చేసేంత వరకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే వారికి మాత్రమే తెలుస్తాయన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు కేవలం ఉత్తీర్ణతశాతం పెంపొందించుకోవడానికి మాత్రమే కృషి చేస్తాయని ప్రభుత్వ పాఠశాలలు యువతలో నైపుణ్యతను పెచేందుకు కృషి చేస్తాయన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని, గత విద్యాసంవత్సరంలో టెన్త్‌లో ప్రతిభకనబర్చిన బాలబాలికలకు యార్లగడ్డ మెమెంటోలు అందజేసి అభినందించారు. అనంతరం బాలికలు చేసిన నృత్యప్రదర్శనలు అందరి దృష్టిని ఆకట్టుకున్నాయి. పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ అద్దేపల్లి సాంబశివనాగరాజు (సాంబు), రామవరప్పాడు గ్రామ సర్పంచ్ వరి శ్రీదేవి, జడ్పీటీసీ కె.సువర్ణరాజు, టీడీపీ నేతలు గూడవల్లి నరసయ్య, కొల్లా ఆనంద్ కుమార్, సర్నాల బాలాజీ, బొప్పన హరికృష్ణ, కొండ, గొడ్డళ్ల చిన రామారావు, పట్టపు చంటి పాల్గొన్నారు.

హౌరా ఎక్స్‌ప్రెస్ రైలులో విద్యార్థినిపై లైంగిక వేధింపులు

- నిందితుడిని పోలీసులకు అప్పగించిన ఏఐఎస్ఎఫ్ నేత

రైల్వేస్టేషన్, ఆగస్టు 7: బెంగళూరు నుంచి కోల్‌కతా వెళతున్న హౌరా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న నర్సింగ్ విద్యార్థిని పై ఓ వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో జరిగింది. అదే కోచ్‌లో ఉన్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ నిందితుడిని పట్టుకుని విశాఖపట్నం రైల్వే పోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఓ విద్యార్థిని (23) బెంగుళూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో నర్సింగ్ కోర్సు చదువుతుంది. ఆమె సొంతూరు వెళ్లటానికి హౌరా ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరింది. విశాఖ సమీపంలో అర్ధరాత్రి 2 గంటలకు వాష్‌రూమ్‌కు వెళ్లి వస్తుండగా ఆమెపై లైంగిక వేధింపులకు దిగాడు. బాధితురాలు పెద్దగా కేకలు వేయటంతో తోటి ప్రయాణికులు నిద్ర నుంచి మేల్కొన్నారు. నిందితుడు పారిపోవటానికి ప్రయత్నించగా అదే బోగిలో నగరం నుంచి విజయనగరం వెళుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ నిందితుడిని పట్టుకుని ఆమెకు ధైర్యం చెప్పారు. అనంతరం విశాఖపట్నం రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చి నిందితుడిని పోలీసులకు అప్పగించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్ మాట్లాడుతూ రైల్వే టికెట్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యం వల్లే నిందితుడు జనరల్ టికెట్‌తో రిజర్వేషన్ కోచ్‌లోకి ప్రవేశించాడని, ప్రయాణికులకు భద్రత కల్పించటంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు.



లైంగిక వేధింపులకు గురిచేసిన వ్యక్తి (టీషర్ట్ ధరించి బొద్దుగా ఉన్న వ్యక్తి)ని ప్రశ్నిస్తున్న సాయికుమార్

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

- ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి

చిట్టినగర్, ఆగస్టు 7: పశ్చిమలో క్రీడలు, క్రీడాకారులను ఎప్పుడూ ప్రోత్సహిస్తానని, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారిస్తానని ఎమ్మెల్యే యలమంచిలి సుజనా చౌదరి భరోసా ఇచ్చారు. 46వ డివిజన్ కేఎల్ రావు పార్కులోని రూ.కోటి వ్యయంతో చేపట్టిన ఇండోర్ స్టేడియాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుజనా మాట్లాడుతూ స్టేడియాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, మన క్రీడాకారులు జాతీయస్థాయిలోనే కాక అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో మొదలెట్టిన స్టేడియం తన చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషమన్నారు. కొద్దిసేపు షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులో బ్యాడ్మింటన్ ఆడి అలరించారు. అనంతరం అబ్దుల్‌కలాం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్కులో పనిచేసే సిబ్బందికి దుస్తులను సుజనా పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నాగుల్ మీరా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు గుర్రం కొండ, డివిజన్ అధ్యక్షుడు డీటీ ప్రభుదాస్, బీజేపీ నేతలు శివకుమార్ పట్నాయక్, అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పోతన రమేష్, జగ్గుపిల్ల శ్రీనివాసరావు, బీరం శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియం ప్రారంభించి బ్యాడ్మింటన్ ఆడుతున్న సుజనా చౌదరి

ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం: ఎంఎస్ బేగ్

వన్‌టౌన్/ చిట్టినగర్, ఆగస్టు 7: కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన డివైడర్ కారణంగా ఏర్పడిన ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ అన్నారు. ట్రాఫిక్ సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా బుధవారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాలయాలు, వ్యాపారాలు అన్నింటికీ కూడా నెహ్రూబొమ్మ సెంటర్ కూడలిగా ఉందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ డివైడర్ నిర్మించారని, గణపతిరావు రోడ్డు నుంచి కేటీ రోడ్డు వెళ్లేందుకు టర్నింగ్ తీసుకోవాలంటే డివైడర్ కారణంగా వాహనదారులు ఇబ్బందిపడుతున్నారని ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని చెప్పారు. ఈ సమస్యను నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపచేస్తామన్నారు. ఆయన వెంట పోతిన బేసికంఠేశ్వరరావు, సారిపల్లి రాధాకృష్ణ, గవర సాయిసుధాకర్, బోర కనకారావు, మక్కెన భాస్కర్, భోగవల్లి నాగబాబు, దుర్వేసుల హుస్సేన్, తారిక్ అజీజ్, తుడుము అనిల్, గంటా రాజు, కొల్లి దుర్గారావు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వర దేవస్థానం లైసెన్స్ హక్కుల సీల్డు టెండర్, వేలం

గవర్నర్‌పేట, ఆగస్టు 7: చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో వివిధ లైసెన్స్ హక్కులకు సంబంధించిన సీల్డు టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సీతారామయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయ వంశ పారం పర్య ధర్మకర్తలు, భక్తులు, పాటదారుల సమక్షంలో ఈనెల 14న ఉదయం 11 గంటలకు సీల్డు టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. ఈ నెల 13 మధ్యాహ్నం 2 గంటల వరకు టెండర్ షెడ్యూలు జారీ చేయబడుతుందని, ఈనెల 14న ఉదయం 10 గంటల లోపు టెండర్ బాక్స్‌లో వేయాలని, అనంతరం బాక్స్ తెరవబడుతుందని వివరించారు.



వ్యాపారులకు రూ.10 నాణేలను అందజేస్తున్న కుమార్ విశ్వజిత్

రూ.10నాణెంపై అపోహలు వద్దు

- హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్

విజయవాడ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులిస్తే వ్యాపారులు తీసుకోరు. వ్యాపారులిస్తే వినియోగదారులు తీసుకోరు. బ్యాంకర్లు ఇచ్చినా తీసుకోవడానికి నిరాకరణ. ఇదీ రూ.10 నాణెం దుస్థితి. ఈ పరిస్థితిని మార్చాలని రిజర్వ్ బ్యాంక్ ఇండియా నిర్ణయించింది. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సెక్యూరిటీ కమిటీ సమావేశంలో ఈ నాణేలపై అవగాహన కల్పించారు. ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ కమల్ పట్నాయక్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్, సీఐడీ ఏడీజీ రవిశంకర్ అయన్నార్ పాల్గొన్నారు. కార్పొరేట్ మాల్స్, సూపర్ మార్కెట్లు, రైసుమిల్ ప్రతినిధులను ఈ సమావేశానికి ఆహ్వానించారు. వారికి రూ.10 నాణేలను అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ నాణేలను చలామణిలోకి తీసుకురావడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ పట్నాయక్ చెప్పారు. వ్యాపారులు, వినియోగదారులను ఈ నాణేలను స్వీకరించాలని సూచించారు. ఆర్‌బీఐ మొత్తం 14 డిజైన్లలో రూ.10 నాణేలను విడుదల చేసిందన్నారు. వాటిపై సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ అవుతున్న తప్పుడు వార్తలను విశ్వసించవద్దన్నారు. ఈ నాణేల చలామణిని పెంచడానికి బ్యాంకర్లు నెలలో సెలవు దినాల్లో వ్యాపారులకు, వినియోగదారులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.



ధర్మపథం వేదికపై గాత్రకచేరీ చేస్తున్న హిమబిందు బృందం

ధర్మపథం వేదికపై భక్తిగాన కచేరీ

వన్‌టౌన్, ఆగస్టు 7: ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో ధర్మపథం వేదికపై కడపకు చెందిన జ్ఞానద కల్చరల్ ట్రస్ట్ పి.హిమబిందు బృందం బుధవారం సాయంత్రం భక్తిగాన కచేరిని నిర్వహించారు. మొత్తం 16 కీర్తనలు అమ్మవారిని, శివుడిని, గణపతిని ఉద్దేశించి సాగాయి. రాగ, తాళ, లయబద్ధంగా సాగిన గాత్ర కచేరీ ఆహుతులను ఆకట్టుకుంది.

నిత్యాన్నదాన విభాగానికి గ్రైండర్ కానుక



దుర్గగుడిలో నిత్యాన్నదాన విభాగానికి విద్యాధరపురానికి చెందిన అడ్వకేట్ శ్రీనివాస్ సుమారు రూ.25వేల విలువైన గ్రైండర్‌ను బుధవారం కానుకగా ఇంద్రకీలాద్రిపై నున్న అమ్మవారికి అందజేశారు. నిత్యాన్నదాన విభాగ సూపరిండెంటెంట్ హేమ ద్వారా దేవస్థానానికి గ్రైండర్‌ను అందించారు.

దుర్గగుడి గోపుర స్వర్ణతాపడానికి రూ.3,01,116 విరాళం



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ఆలయ గోపుర స్వర్ణతాపడానికి లంబాడీపేట, కేటీ రోడ్డులోని గాంధీబొమ్మ సెంటర్ ప్రాంతానికి చెందిన బండి లక్ష్మణరావు, కుటుంబ సభ్యులు బుధవారం ఆలయానికి విచ్చేసి అధికారుల ద్వారా డోనర్ సెల్‌లో రూ.3,01,116 విరాళం అందించారు. అమ్మవారి దర్శనానంతరం వీరికి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

వైఎస్ జగన్ తన స్థాయి గుర్తించాలి

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా

విద్యాధరపురం, ఆగస్టు 7: ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్ తన స్థాయి ఏమిటో గుర్తించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా విమర్శించారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష హోదా లేకుండా కేవలం ఎమ్మెల్యేగా ఉన్న జగన్ తనకు సీఎం స్థాయి భద్రత కావాలని కోరటం అతడి పిచ్చి పరాకాష్టకు చేరిందనవచ్చన్నారు. మాజీ సీఎంగా అతడికి ఇవ్వాల్సినంత భద్రత ఇప్పటికే ఉందన్నారు. కోడికత్తి డ్రామాలను చూపించి సీఎం స్థాయి భద్రత కోరితే ఇస్తారా? అని విమర్శించారు. 14ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబుకు ఐదేళ్లలో ఇవ్వాల్సినంత గౌరవం ఇవ్వకపోయినా, జగన్‌కు 11 సీట్లు వచ్చినా చంద్రబాబు అసెంబ్లీలోకి జగన్ కారును అనుమతించారన్నారు. జగన్‌కు ఏదైనా ప్రమాదం పొంచి ఉంటే అది వైసీపీ నేతల వల్లే ఉంటుందన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చంద్రబాబు బందోబస్తుకు కేవలం ఇద్దరు ఎస్‌ఐలను కేటాయించిన దుర్మార్గుడు జగన్ అన్నారు. నైతికత ఉంటే వందల ఎకరాలు దోచుకున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. శాంతి భద్రతలు బాగుంటేనే పెట్టుబడులు వస్తాయన్న ఆకాంక్షతో ఆ మేరకు రాష్ట్రాన్ని చంద్రబాబు ముందుకు నడిపిస్తున్నారన్నారు.

కెనాల్ రోడ్డు పార్కింగ్‌కు నేడు వేలంపాట

- 34 టెండర్ ఫారాలు కొనుగోలు చేసిన కాంట్రాక్టర్లు

వన్‌టౌన్, ఆగస్టు 7: స్థానిక కెనాల్‌రోడ్డు పార్కింగ్ టెండర్‌ను దక్కించుకోవటానికి కాంట్రాక్టర్లు టెండర్ ఫారాలను భారీగా కొనుగోలు చేశారు. టెండర్ ఫారాల కొనుగోలుకు బుధవారం ఆఖరిరోజు కావటంతో కాంట్రాక్టర్లు పెద్దస్థాయిలో సత్యనారాయణపురం సర్కిల్-2 ప్రాంగణంలోని వీఎంసీ ఎస్టేట్ ఆఫీసర్ కార్యాలయంలో టెండర్ ఫారాలను కొనుగోలు చేశారు. దీంతో ఆ కార్యాలయం కిటకిటలాడింది. వీఎంసీ పరిధిలోని కెనాల్ రోడ్డు పార్కింగ్ ప్రదేశానికి గతేడాది వేలంపాట నిర్వహించగా, చిట్టినగర్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ సుమారు రూ.6 లక్షలకు పైగా పాడుకున్నాడు. దుర్గగుడికి కార్లలో వచ్చే భక్తులు, వ్యాపార కేంద్రమైన వన్‌టౌన్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే ఇతర ప్రాంతాలవారు తమ కార్లను కెనాల్ రోడ్డు పార్కింగ్ ప్రదేశంలోనే నిలుపుదల చేయాలి. దీంతో ఆ కాంట్రాక్టర్‌కు లాభాలొచ్చాయని పలువురు కాంట్రాక్టర్ల కన్ను ఈ ప్రదేశంపై పడింది. ఈ ఏడాది జూన్‌లో లీజు కాలం ముగిసినా కొద్దిరోజుల పాటు వాహనదారుల నుంచి రుసుమును కార్పొరేషన్ సిబ్బంది వసూలు చేయగా, తరువాత ప్రైవేటు వ్యక్తులు అనధికారికంగా అధిక రేట్లు వసూలు చేస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమడంతో కమిషనర్ స్పందించి వేలంపాట నిర్వహించాలని ఆదేశించారు. దీంతో వీఎంసీ ఎస్టేట్ ఆఫీసర్ టెండర్లు పిలిచారు. హెచ్చుధర పాడుకున్న కాంట్రాక్టర్‌కు టెండర్‌ను ఖరారు చేయనున్నారు. వైసీపీ, కూటమికి చెందిన పలువురు నేతలు, అనుచరులతో పాటు పలువురు కాంట్రాక్టర్లు బినామీ పేర్లతో టెండర్ ఫారాలు కొనుగోలు చేసినట్టు సమాచారం.

కేంద్ర మంత్రులతో కన్నా లక్ష్మీనారాయణ భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, అశ్విని వైష్ణవ్‌లను టీడీపీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కలిశారు. టీడీపీ పార్లమెంటరీ నాయకుడు లావు శ్రీకృష్ణ దేవరాయలతో కలిసి ఆయన కేంద్ర మంత్రులను కలిశారు. సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించారు. సత్తెనపల్లి-మాచిపాడు ఎల్సీ 40 రైల్వే గేటును మంజూరు చేయాలని కోరారు. సత్తెనపల్లి నుంచి నందిగామ అద్దరోడ్డు వరకు రోడ్డు సేఫ్టీ గ్రాంట్ నుంచి ఎన్ఎస్సీ కెనాల్‌పై 4లైన్ల రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై పరిశోధనలు

» బీఐఎస్‌తో ఎన్‌జీ రంగా అగ్రి వర్సిటీ ఒప్పందం

అమరావతి(ఆంధ్రజ్యోతి), లాంఫాం(తాడికొండ), ఆగస్టు 7: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్)తో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒక అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం గుంటూరు సమీపంలోని లాం వర్సిటీ ప్రధాన కార్యాలయంలో ఉపకులపతి శారద జయలక్ష్మి, బీఐఎస్ విజయవాడ సీనియర్ డైరెక్టర్ ఎంజీ వినోద్ సమక్షంలో ఒప్పందం జరిగింది. ఎంవోయూ ప్రకారం ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రంగా వర్సిటీ పరిశోధనలు నిర్వహించడానికి బీఐఎస్ సహకరించనున్నది. ఇందులో భాగంగా భారతీయ ప్రామాణిక వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలను అభివృద్ధి చేస్తారు. ఆ క్షేత్రాల్లో భారతీయ ప్రమాణాల మేరకు వ్యవసాయ పనిముట్లు, నీరు-పోషకాల యాజమాన్యం, తెగుళ్లపై పురుగు మందుల పిచికారి వంటి వాటిని అందుబాటులో ఉంచుతారు. ఆయా క్షేత్రాల్లో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ, వ్యవసాయ విద్యార్థులకు బోధన అందిస్తారు.

కంటి పరీక్షల్లో విద్యార్థులకు ప్రాధాన్యమివ్వాలి

» 2025 నాటికి అంధత్వ వ్యాప్తిని 0.25%కి తగ్గించాలి

» అంధత్వ నియంత్రణపై ఆరోగ్యశాఖ కమిషనర్ హరికిరణ్

అమరావతి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కంటి పరీక్షలకు ప్రాధాన్యమివ్వాలని ఆరోగ్య శాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశించారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో జాతీయ అంధత్వ, దృష్టిలోప నియంత్రణ కార్యక్రమం అమలు తీరుపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి జరుగుతున్న విద్యార్థుల కంటి పరీక్షల గురించి ఆరా తీశారు. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు కంటి పరీక్షల విషయంలో మరింత శ్రద్ధ కనబర్చాలన్నారు. ఈ నెల 25 నుంచి సెప్టెంబరు 8 వరకు నేత్రదాన పక్షోత్సవాల్ని నిర్వహించాలన్నారు. 2025 నాటికి అంధత్వ వ్యాప్తిని 0.25 శాతానికి తగ్గించాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 లక్షల మందికి కంటి అద్దాలు అందించామని అధికారులు ఆయనకు వివరించారు.

బ్యాంకును మోసం చేసి 22ఏళ్లుగా పరార్!

» తమిళనాడులో చిక్కిన హైదరాబాద్ వాసి

చెన్నై, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఓ ఎస్‌బీఐ బ్రాంచిని రూ.50 లక్షల మేర మోసం చేసి 2002నుంచి తప్పించుకు తిరుగుతున్న చలపతిరావు అనే వ్యక్తిని సీబీఐ అధికారులు తమిళనాడులోని తిరునెల్వేలి జిల్లా నరసింగనల్లూరులో మంగళవారం అరెస్టు చేశారు. నకిలీ పత్రాలతో లోన్ తీసుకుని మోసం చేసినట్లు కేసు నమోదు చేసిన సీబీఐ.. ఆయన కోసం తీవ్రంగా గాలిస్తోంది. చలపతిరావు 'వినీత్ కుమార్'గా పేరు మార్చుకుని 'సేలం'లో ఓ మహిళను వివాహం చేసుకుని అక్కడే జీవిస్తున్నాడు. నరసింగనల్లూరులోని స్నేహితుడి ఇంటికి రాగా సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకుంది.

ప్రైవేటు స్కూళ్లలో పేదవిద్యార్థులకు 25 శాతం సీట్లివ్వండి: కేంద్రం

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూళ్లలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) కింద తప్పనిసరిగా పాటించాల్సిన ఈ నిబంధనను తెలంగాణ, పంజాబ్, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అమలు చేయడంలేదని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి రాజ్యసభలో వెల్లడించారు. బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో భాగంగా కాంగ్రెస్ సభ్యుడు ప్రమోద్ తివారీ అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ మేరకు సమాధానమిచ్చారు. ఇదే అంశంపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కనీసం 12వ తరగతి దాకా తప్పక చదువుకునే అవకాశాన్ని విద్యాహక్కు చట్టం కల్పిస్తుందని, ఆ ఉద్దేశంతోనే ఈ అంశమే ఇందులో పొందుపరిచారని తెలిపారు. దీనిని అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఎక్కువగా ఉంటుందని అన్నారు. కాగా, ప్రైవేటు స్కూళ్లలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్ల అంశంపై కేంద్రంతో సంప్రదింపులు జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు ప్రయత్నించినా స్పందన రాలేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఆర్టీఈ నిబంధన ప్రకారం.. ప్రతి కిలోమీటరుకు ఒక పాఠశాల ఉండాలని, ఈ పరిధిలో ప్రభుత్వ పాఠశాల లేకపోతే ప్రైవేటు స్కూల్‌లో 25 శాతం మంది విద్యార్థులను చేర్చించి. వారి ఫీజును రాష్ట్ర ప్రభుత్వమే ఆయా యాజమాన్యాలకు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. అయితే ఈ మొత్తం ఫీజులో 40 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే, 60 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వం సమగ్ర శిక్షా అభియాన్‌లో భాగంగా భరించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ వాటాను తిరిగి రాష్ట్రానికి చెల్లించే అంశంపై కేంద్రానికి పలుమార్లు లేఖలు రాసినా స్పందించలేదని, 2010 నుంచి అంశంపై చర్చ జరుగుతూనే ఉందని పేర్కొన్నారు. దీనికితోడు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాల్సిన అవసరం లేదన్న అభిప్రాయంతో సర్కారు ఉందని అంటున్నారు.

కుటుంబ వీసాలకు ఆదాయ పరిమితి పెంపు లేదు

» బ్రిటన్ ప్రభుత్వ నిర్ణయం... భారతీయులకు ఊరట

న్యూఢిల్లీ, ఆగస్టు 7: కుటుంబ వీసాలకు కనీస వార్షిక ఆదాయ పరిమితిని పెంచకూడదని బ్రిటన్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఆర్థిక నిబంధనలను ప్రభుత్వం సమీక్షిస్తుంది. మైగ్రేషన్ అడ్వైజరీ కమిటీ(ఎంఏసీ) సమీక్ష పూర్తయ్యేవరకు ఇందులో ఎలాంటి మార్పులు ఉండబోవని ఆ దేశ హోంమంత్రి వైవెట్ కూపర్ ప్రకటించారు. బ్రిటన్‌లో నివసించేవారు కుటుంబ వీసాలు స్పాన్సర్ చేయాలంటే ప్రస్తుతం వారి వార్షికాదాయం కనీసం 29 వేల పౌండ్లు (సుమారు రూ.30,21,174) ఉండాలి. ఈ పరిమితిని పెంచుతూ గత రుషి సునాక్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తుత కీర్ స్టార్మర్ ప్రభుత్వం పక్కన పెట్టింది. ఈ నిర్ణయం బ్రిటన్‌లో నివసిస్తున్న ఎందరో భారతీయులకు ఉపశమనం కలిగించనుంది. గతంలో ఈ పరిమితి 18,600 పౌండ్లు (రూ.19,37,718) ఉండగా వలసలను అడ్డుకోవడంలో భాగంగా దాన్ని ఈ ఏడాది ఏప్రిల్‌లో 29 వేల పౌండ్లకు (55 శాతం) పెంచారు. 2025 నుంచి ఏకంగా 38,700 పౌండ్ల(దాదాపు రూ.41,31,486)కు పెంచాలని గత సునాక్ ప్రభుత్వం నిర్ణయించింది. హోంశాఖ గణాంకాల ప్రకారం 2023లో 5,248 కుటుంబ వీసాలు పొందిన భారతీయులు ఈ కేటగిరీలో అత్యధికంగా వీసాలు పొందిన దేశాల జాబితాలో రెండోస్థానంలో ఉన్నారు. ఈ జాబితాలో పాక్ ముందుండగా, బంగ్లాదేశ్ మూడో స్థానంలో నిలిచింది.

సీట్లున్నాయి.. విద్యార్థులే లేరు



డిగ్రీలో 4.47 లక్షల సీట్లు

» దరఖాస్తు చేసుకున్నవారు 1.67 లక్షలే

» దయనీయంగా మారిన డిగ్రీ కాలేజీలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో సాధారణ డిగ్రీ కోర్సుల పరిస్థితి దిగజారుతోంది. ఏటా అడ్మిషన్లు తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు పెరుగుతున్న కొద్దీ సాధారణ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు పడిపోతున్నాయి. మరోవైపు సీట్ల సంఖ్య భారీగా పెరగడం గమనార్హం. ఈ ఏడాది ఏకంగా లక్ష సీట్లు పెరిగినట్లు ఉన్నత విద్యామండలి తెలిపింది. మరోవైపు కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీల్లో డిగ్రీ కోర్సులు ప్రారంభమయ్యాయి. దాదాపు 30 కాలేజీల్లో బీసీఏ, బీబీఏ కోర్సులకు ప్రభుత్వం అనుమతిచ్చింది. అయితే, అంతకుముందే భారీగా సీట్లు పెరిగిపోయాయి. కానీ, దరఖాస్తుల సంఖ్య మాత్రం అందుబాటులో ఉన్న సీట్లతో పోలిస్తే చాలా తక్కువగా ఉన్నాయి. మొత్తంగా 4.47 లక్ష సీట్లు ఉండగా, వచ్చిన దరఖాస్తులు కేవలం 1.67 లక్షలే. ఈ నెల 10న డిగ్రీ సీట్ల కేటాయింపు జరగనుంది. అప్పుడు వీరిలో ఎంతమందికి సీట్లు వస్తాయి? సీట్లు పొందిన వారిలో ఎంతమంది కోర్సుల్లో చేరారు? అనేది తేలనుంది. మొత్తంగా ఇంజనీరింగ్ సీట్లు ఎక్కువ పుట్టగొడుగుల్లా, డిగ్రీకి ఏటా ఆదరణ తగ్గుతుండడం గమనార్హం. ఈ ఏడాది బీటెక్‌లో తొలి విడతలో 22 వేల అడ్మిషన్లు పెరిగాయి. డిగ్రీలో అడ్మిషన్లు పెంచే ఉద్దేశంతో బీటెక్, డిగ్రీలకు దాదాపుగా ఒకే

> గత రెండేళ్ల నుంచి డిగ్రీ అడ్మిషన్లు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. మొత్తం సీట్లలో సగం కంటే ఎక్కువ మిగిలిపోతున్నాయి. 2022-23 విద్యా సంవత్సరంలో 3,40,953 సీట్లకు గాను 1,46,039 మాత్రమే భర్తీ అయ్యాయి. 2023-24 విద్యా సంవత్సరంలో 3,33,757 సీట్లు అందుబాటులో ఉంటే తొలివిడతలో 1,27,659 సీట్లు భర్తీ కాగా, తదుపరి విడతల్లో సుమారు 1.5 లక్షల సీట్లు భర్తీ అయ్యాయి. సుమారుగా ఏటా 45 శాతం సీట్లకు మించి భర్తీ కావడంలేదంతో సాధారణ డిగ్రీ కోర్సుల పరిస్థితి దయనీయంగా మారింది.

సారి కౌన్సెలింగ్ నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. కానీ, ఉన్నత విద్యాశాఖ నిర్లక్ష్యంతో డిగ్రీ అడ్మిషన్లు పలుమార్లు వాయిదా పడుతూ వచ్చాయి. ఇలా వాయిదా పడటంతో దరఖాస్తుల సంఖ్య పెరిగింది. అయితే, వీరిలో చాలా మంది బీటెక్‌లో చేరారు. దీంతో వారికి సీట్లు కేటాయింపు జరిగినా కోర్సుల్లో చేరలేదు.

గతేడాది వైసీపీ ప్రభుత్వం 'సింగిల్ మేజర్' డిగ్రీ విధానాన్ని ప్రవేశపెట్టింది. విద్యార్థులకు అవగాహన కల్పించకుండా హడావుడిగా దీనిని ప్రారంభించారు. దీంతో చాలా చోట్ల కోర్సులు తగ్గిపోయాయి. సింగిల్ మేజర్ డిగ్రీలో ఒక కోర్సును ప్రారంభించాలంటే ఒకే సబ్జెక్టుకు కనీసం ముగ్గురు లెక్చరర్లు అవసరం అవుతున్నారు. విద్యార్థి మైనర్‌గా ఎంచుకునే సబ్జెక్టుకు మరో అధ్యాపకుడు అవసరం. ఈ క్రమంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు కొన్ని కోర్సులను తొలగించాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీలను చాలావరకు తీసేశారు. ప్రైవేటు కాలేజీలు కూడా లెక్చరర్లు లేరనే కారణంతో కోర్సులను తగ్గించుకున్నాయి. మరోవైపు నాలుగేళ్ల డిగ్రీ కావడంతో విద్యార్థులు బీటెక్‌వైపు మొగ్గు చూపుతున్నారు. కొత్తగా బీసీఏ, బీబీఏ లాంటి కోర్సులకు డిమాండ్ పెరగడంతో ఈ మాత్రం విద్యార్థులైనా డిగ్రీలో చేరుతున్నారు. లేదంటే అడ్మిషన్ల సంఖ్య ఇంకా దారుణంగా ఉండేది.

కాలేజీలు మూసే దుస్థితి

ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ఒకవైపు అడ్మిషన్లు తగ్గిపోతుంటే, కోర్సుల ఫీజులు కూడా చాలా తక్కువగా ఉన్నాయి. డిగ్రీ కాలేజీల్లో సగటు ఫీజు రూ.15 వేలుగా ఉంది. ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 1,100కు పైగా ఉంటే వాటిలో ఫీజు అత్యధికంగా రూ.30 వేలు కేవలం 30 కాలేజీలకే ఖరారు చేశారు. సగానికిపైగా కాలేజీల ఫీజులు కనీస ఫీజు వద్దే ఆగిపోయాయి. ఒకవేళ అడ్మిషన్లు తగ్గినా ఫీజులు మెరుగ్గా ఉంటే కాలేజీలు నడపగలమని, కానీ ఫీజులు, అడ్మిషన్లు రెండూ తక్కువగానే ఉంటే కాలేజీలు ఎలా నడపాలని యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి. అదనంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో డిగ్రీ కోర్సులకు అనుమతి ఇవ్వడం మరింత దెబ్బతీసిందని యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. చాలా చోట్ల డిగ్రీ కాలేజీలు మూతవేసే పరిస్థితి ఏర్పడిందని యాజమాన్యాలు చెబుతున్నాయి.

ఆర్‌డబ్ల్యూఎస్ ఫైల్స్ మాయంపై..

సీఎంవో నుంచి ఆరా!

» ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆర్డీవో, ఎస్ఈ పరిశీలన

» కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు

పలాస, ఆగస్టు 7: శ్రీకాకుళం జిల్లా పలాస ఆర్‌డబ్ల్యూఎస్ పాత కార్యాలయంలోని పత్రాలు దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పత్రాలను భద్రపరచడంలో అధికారులు చిత్తుకాగితాల జాబితాలో చేర్చారు. శిథిలావస్థ పాత కార్యాలయంలోనే విడిచిపెట్టేశారు. చిత్తుకాగితాలు ఏరుకునేవారు. శిథిల భవనంలో కిటికీని తొలగించి, పత్రాలన్నీ మూట కట్టి చెత్త దుకాణంలో రూ.600కు విక్రయించారు. ఈ సంఘటన సోమవారం జరిగింది. మంగళవారం మధ్యాహ్నం సంబంధిత అధికారులు ఓ పనిమీద పాత కార్యాలయ తలుపులు తెరవగా అందులో పత్రాలు కనిపించలేదు. కిటికీ కూడా విరిగ్గొట్టి ఉండటంతో.. సమీప ఎంపీడీవో కార్యాలయం సీసీ ఫుటేజీని పరిశీలించారు. వాటిని ఐదుయం ఫుట్ దొంగలు ఎత్తుకెళ్లి చిత్తుకాగితాలుగా విక్రయించారని ప్రాథమికంగా గుర్తించారు. మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేస్తేసే.. ఈ వ్యవహారం బయటపడింది. ఆర్‌డబ్ల్యూఎస్ పత్రాలు చెత్త దుకాణంలో విక్రయించిన విషయం పత్రికలో రావడంతో సీఎం కార్యాలయం నుంచి వివరాలు కోరారు. దీంతో పలాస ఆర్డీవో భరత్‌నాయక్, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జాన్‌సెనార్ బుధవారం మధ్యాహ్నం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం, చెత్త దుకాణాన్ని పరిశీలించారు. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు ఆదేశించడంతో కాశీబుగ్గ సీఐ విజయానంద్ సంబంధిత పత్రాలన్నీ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసన్న, సిబ్బంది ద్వారా రికార్డులు పరిశీలించగా అవి 1990-2007 సంవత్సరాల మధ్యలో ఉన్న విగా గుర్తించారు.

స్థిరాస్తి విక్రయదారులకు ఊరట

» దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను చెల్లింపు విధానాన్ని ఎంచుకోవచ్చు

» ఫైనాన్స్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 7: రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి మూలధన లాభాల పన్ను విషయంలో కేంద్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. స్థిరాస్తుల (రియల్టీ) అమ్మకంపై వచ్చే లాభాలపై పన్ను చెల్లింపుదారులు నూతన పన్ను రేటును మారడానికి లేదా ప్రత్యామ్నాయం ఆధారితంగా లెక్కించే ఇండెక్సేషన్ ప్రయోజనంతో కూడిన పాత పన్ను విధానం ఎంచుకునేందుకు అవకాశం కల్పించింది. ఈమేరకు బుధవారం ఫైనాన్స్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 2024-25 బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రియల్ ఎస్టేట్ రంగంపై దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్నును 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గిస్తూ ప్రతిపాదన చేశారు. అయితే ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని మాత్రం కల్పించలేదు. ఇదిలా ఉండగా.. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీని తొలగించాలన్న డిమాండ్‌పైనా నిర్మలా సీతారామన్ స్పందించారు. జీఎస్టీ వసూళ్లలో 75 శాతం రాష్ట్రాలకు వెళుతుందన్నారు. ఆరోగ్య బీమా ప్రీమియంపై 18 శాతం జీఎస్టీ వసూలు చేయడానికి ముందు అన్ని రాష్ట్రాలు బీమా ప్రీమియంలపై పన్నును విధించే వారన్నారు. జీఎస్టీని తొలగించాలని, దాన్ని మినహాయించాలని కోరుతూ విపక్షాలు జీఎస్టీలో కలిసి పోయిందని సీతారామన్ చెప్పారు. పెట్టుబడులను ప్రోత్సహించడంతోపాటు మధ్య తరగతికి ప్రయోజనం కల్పించే ఉద్దేశంతో 2024-25 బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసినట్లు ఆమె తెలిపారు.

సామాజిక చైతన్యవేత్త పీవీజీ రాజు: మోదీ

» 'ది లాస్ట్ మహారాజా ఆఫ్ విజయనగరం' పుస్తకాన్ని పీఎంకి ఇచ్చిన ఎంపీ కలిశెట్టి

న్యూఢిల్లీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పూసపాటి విజయరామ గజపతి రాజు(పీవీజీ రాజు) సామాజిక చైతన్య వేత్త అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. పీవీజీ రాజు శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆయన జీవిత చరిత్రను తెలిపే 'ది లాస్ట్ మహారాజా ఆఫ్ విజయనగరం' పుస్తకాన్ని బుధవారం ప్రధాని మోదీకి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అందజేశారు. 'మనసున్న మహారాజు' పేరుతో తెలుగులో రూపొందించిన పుస్తకాన్ని ఆంగ్లంలోకి తర్జుమా చేయించామని ప్రధానికి ఎంపీ వివరించారు. పీవీజీ రాజు జీవితం ఆదర్శనీయమని ప్రధాని



మోదీ బొమ్మతో తయారు చేసిన చేనేత వస్త్రాన్ని ప్రధానికి అందజేస్తున్న ఎంపీ అప్పలనాయుడు

మోదీ కొనియాడారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు ఎలా ఉన్నారు? ఆయన ఆరోగ్యం ఎలా ఉంది? అయిన్ని ప్రత్యేకంగా అడిగానని చెప్పండి. పీఎం చూసుకుని ఒకసారి నన్ను కలవడానికి రమ్మని చెప్పండి' అని మోదీ, ఎంపీకి సూచించారు. కాగా, జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీకి, ఎంపీ కలిశెట్టి వారిపేరిట కానుకను అందించారు. ఎంపీ సూచనమేరకు నియోజకవర్గం పరిధిలోని లావేరు మండలానికి చెందిన బాసిన నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులు 40 రోజులపాటు శ్రమించి మోదీ చిత్రాన్ని నేశారు. ఆ నేత వస్త్రాన్ని ఎంపీ, ప్రధానికి బహూకరించారు. జాతీయ చేనేత దినోత్సవం రోజున దానిని అందుకోవడం ఓ తీయని జ్ఞాపకమన్న మోదీ.. రూపకర్తలు నాగేశ్వరరావు దంపతులను అభినందించినట్లు ఎంపీ చెప్పారు.

30 ఏళ్లలో ఎంత మార్పు!

» ఆ రోజు అధిక సంతానంపై ఆందోళన

» స్థానిక సంస్థల్లో పోటీకి ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉండరాదని నిబంధన

» నేడు తగ్గుతున్న యువతతో అప్రమత్తం

» ఎంతమంది పిల్లలున్నా స్థానికానికి ఓకే

» పరిస్థితులకు అనుగుణంగా సర్కార్ నిర్ణయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మూడు దశాబ్దాల్లోనే ఎంత మార్పు! ఒకప్పుడు అధిక జనాభా ఆందోళన చెందేవారు. ఇప్పుడు తగ్గిపోతున్న జనాభా ముఖ్యంగా యువతపై ఆందోళన చెందుతున్నారు. దేశంలోని మిగతా రాష్ట్రాల మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం జనాభా పెంచే దిశగా అడుగులు వేస్తోంది. స్థానిక సంస్థల్లో పోటీ చేసే వారికి ఇద్దరు బిడ్డల కంటే ఎక్కువ మంది ఉండరాదన్న నిబంధనను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. 1994 తర్వాత ముగ్గురు బిడ్డలుంటే స్థానిక సంస్థల్లో పోటీ చేసే అర్హత కోల్పోయేలా నిబంధనలు ఉండేవి. దీంతో పలువురు యోగ్యత ఉన్నా మేయర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లాంటి పోస్టులు కోల్పోయే పరిస్థితి పలు చోట్ల జరిగింది. వార్డు మెంబర్ నుంచి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వరకు, నగరాల్లో కార్పొరేటర్ నుంచి మేయర్ దాకా ఈ నిబంధనలు పలువురికి ప్రతిబంధకంగా ఉండేవి. తాజాగా కూటమి ప్రభుత్వం బుధవారం కేబినెట్‌లో రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో స్థానికసంస్థల ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక నుంచి ఎంత మంది పిల్లలున్నా స్థానిక సంస్థల్లో పోటీ చేసే అవకాశం ఏర్పడింది.

1990లో ఇదీ పరిస్థితి

1990లో దేశ జనాభా విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో యావత్ భారతదేశం ఆందోళనలో పడింది. అప్పట్లో జనాభా నియంత్రణ కోసం అందుబాటులో ఉన్న అవకాశాలన్నీ ఉపయోగించారు. "మేమిద్దరం.. మాకిద్దరు", "ముగ్గురు వద్దు..ఇద్దరు ముద్దు" అనే నినాదాలతో అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రచారం ఉద్యమం ముమ్మరం చేశాయి. ప్రభుత్వ పథకాల అమల్లో సైతం ఇద్దరు బిడ్డలకు మించి పిల్లలుంటే వారిని అనర్హతగా పేర్కొని జనాభా నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. వివరకు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు, పేదలకు అసైన్డ్ ల్యాండ్ పట్టాలిచ్చేందుకు సైతం ఇద్దరు బిడ్డలకు మించి ఉండరాదన్న నిబంధన పెట్టారు. స్థానిక సంస్థల్లో పోటీ చేయాలన్నా ఇద్దరు బిడ్డలకు మించి ఉండరాదన్న నిబంధనను గ్రామ, పట్టణ స్థానికసంస్థల్లో 1994లో అమలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నిబంధన చట్టాలు చేసి అమలు చేస్తున్నారు. జనాభా పెరగడం వల్ల వచ్చే అనర్థాలను లెక్కకు గట్టినట్లు చెప్పి ప్రచారం చేసేవారు. అయితే కాలం మారే కొద్దీ ఇద్దరు బిడ్డల నినాదం సైతం ఒక్కరే చాలు అనే విధంగా మారింది. ఆ తర్వాత ఇద్దరు ఒక్కరే ముద్దు అంటూ నినాదం ముందుకొచ్చింది. అధిక సంతానం వల్ల వారి పోషణ భారం, చదువు వ్యయం భరించలేమన్న ఆందోళనతో ఒక్క సంతానంతో సరిపెట్టుకున్నవారున్నారు. రాను రాను 30 ఏళ్ల తర్వాత పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు సరికొత్త నినాదం అమల్లోకి వచ్చింది. పిల్లలను ఎక్కువ మందిని కనాలన్న కొత్త నినాదం ప్రపంచ వ్యాప్తంగా వస్తోంది.

తగ్గుతున్న యువత

జనాభాలో వయోవృద్ధుల సంఖ్య పెరగడం, యువత శాతం రాను రాను తగ్గిపోతుండటంతో ఆందోళన ఎక్కువైంది. 2000 సంవత్సరంలో భారతదేశంలో యువత 50 శాతం ఉండగా, దీంతో ఉత్పాదక శక్తి పెరుగుతుందని సంతోషించారు. అందుకే అప్పట్లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థల పతనమైనా భారతదేశంలో చెక్కుచెదరని ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండేది. 30 ఏళ్లలో జనాభా నియంత్రణ అధికంగా పెరగడంతో భవిష్యత్తు ఉత్పాదకశక్తి కోల్పోయే పరిస్థితి ఉంటుందని భావిస్తున్నారు. 50 ఏళ్ల వయసు దాటిన జనాభా ఎక్కువ అవుతుండటంతో ఉత్పాదక శాతం తగ్గిపోతుందన్న భావన మొదలైంది. అందుకే ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా సంతానోత్పత్తి పెంచేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి. భారతదేశం కూడా ఇదే బాటలో ఆలోచించక తప్పని పరిస్థితి వచ్చింది. చంద్రబాబు ఎప్పటి నుంచో యువ జనాభా పెంపుదలకు పర్యవసానాలను ప్రస్తావించారు. గతంలో జనాభా నియంత్రణ కోసం ఎన్ని ప్రచార ఉద్యమాలు చేపట్టామో, రానున్న రోజుల్లో జనాభా పెంచేందుకు అలాంటి ప్రచార ఉద్యమాలు ప్రారంభించాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల్లో ఇద్దరు బిడ్డలకు మించి ఉంటే పోటీ చేసేందుకు అర్హత లేదన్న నిబంధనను తీసివేయాల్సి వస్తుందని పేర్కొన్నారు.



ద్వారకాతిరుమల మండలం బొజుకుంట సచివాలయంపై వైసీపీ జెండా, చిరిగిన టీడీపీ ఫ్లెక్సీ

వైసీపీ నేతల బరితెగింపు

» సచివాలయంపై వైసీపీ జెండా.. టీడీపీ ఫ్లెక్సీ చించివేత

ద్వారకాతిరుమల, ఆగస్టు 7: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం జాజులకుంటలో వైసీపీ నాయకులు బరితెగింపు చర్యలకు పాల్పడుతున్నారు. సచివాలయంపై వైసీపీ జెండాను ఎగరవేయడమే కాకుండా సచివాలయం వద్ద సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే ఫోటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించేశారు. దీనిపై బుధవారం స్థానికుడు గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. కార్యదర్శి పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ సతీశ్ సచివాలయ సిబ్బంది, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.

పాత పింఛను విధానానికి మారే చాన్స్ లేనట్లే

న్యూఢిల్లీ, ఆగస్టు 7: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై ఎన్‌పీఎస్(జాతీయ పింఛను విధానం) నుంచి పాత పింఛను విధానంలోకి మారలేరు. మారేందుకు ఇచ్చిన గడువును పొడిగించే ప్రతిపాదన ఏదీ బుధవారం కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది. లోక్‌సభలో ఓ ప్రశ్నకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2003 డిసెంబరు 22న ఎన్‌పీఎస్‌ను ప్రవేశపెట్టారు. 2004 జనవరి 1 తర్వాత కేంద్ర సర్వీసుల్లో చేరే ఉద్యోగులందరి(సైన్యంలో చేరే వారు మినహా)కి ఎన్‌పీఎస్‌ను తప్పనిసరి చేశారు. కోర్టు తీర్పులను అనుసరించి.. ఎన్‌పీఎస్ నోటిఫికేషన్ విడుదలకు ముందు జారీ అయిన ప్రకటన ద్వారా నియామకాలు పొందిన వారికి పాత పెన్షన్ విధానంలోకి మారే అవకాశం ఇస్తూ 2023 మార్చి 3న నోటిఫికేషన్ జారీ అయింది. ఈ మేరకు 2023 ఆగస్టు 21 వరకు ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

నేడే లోక్‌సభలో వక్ఫ్ బిల్లు

» ప్రవేశపెట్టనున్నట్లు బీఏసీ భేటీలో తెలిపిన సర్కారు.. స్థాయీసంఘం పరిశీలనకు పంపాలన్న విపక్షాలు

» కేంద్ర వక్ఫ్ మండలి, రాష్ట్రాలు, కేంద్రపాలిత బోర్డుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు ముస్లిమేతరులకు చోటు

న్యూఢిల్లీ, ఆగస్టు 7: వక్ఫ్ బోర్డు అధికారాలను పరిమితం చేయడంతోపాటు, ముస్లిం మహిళలను, ముస్లిమేతరులనూ అందులో సభ్యులుగా చేసేలా రూపొందించిన 'ది వక్ఫ్ (సవరణ) బిల్లు'ను గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు మోదీ సర్కారు సిద్ధమైంది. ఈ విషయాన్ని బుధవారం లోక్‌సభ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ(బీఏసీ)కి తెలియజేసింది. అయితే, ఈ బిల్లును పార్లమెంటరీ స్థాయీసంఘం (స్టాండింగ్)పరిశీలనకు పంపాలని బీఏసీ భేటీలో విపక్ష సభ్యులు గౌరవ్ గొగోయ్(కాంగ్రెస్), సుదీప్ బంద్యోపాధ్యాయ(టీఎంసీ) తదితరులు డిమాండ్ చేశారు. అయితే, బిల్లుపై సభ నిర్ణయం మేరకు స్థాయీసంఘానికి పంపాలా వద్దా అనే నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం పేర్కొంది. ఎన్డీయేలో భాగస్వాములుగా ఉన్న కొన్ని పార్టీలు కూడా ఈ బిల్లుపై కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దాదాపు 44 సవరణలతో రూపొందించిన బిల్లును ప్రభుత్వం మంగళవారం రాత్రే లోక్‌సభ సభ్యులకు అందజేసింది.

ఇవీ ప్రతిపాదనలు..

1. వక్ఫ్ చట్టం అమల్లోకి రావడానికి ముందుగానీ, వచ్చిన తర్వాతగానీ.. ఏదైనా ప్రభుత్వ భూమిని వక్ఫ్ భూమిగా గుర్తించినా, ప్రకటించినా.. ఈ బిల్లులో చేసిన ప్రతిపాదన ప్రకారం దాన్ని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరు. అది ఎవరి భూమో తేల్చే అధికారాన్ని కలెక్టర్లకు కట్టబెట్టారు. వారు నిర్ణయం జరిపి నివేదిక ఇచ్చేదాకా అది వక్ఫ్ ఆస్తి కాదు. ఒకవేళ కలెక్టర్ ఆ భూమి ప్రభుత్వానిదే అని నివేదిక ఇస్తే.. ప్రభుత్వం ఆ నివేదికను రెవెన్యూ రికార్డులకు పంపుతుంది. బోర్డు తన రికార్డుల్లో దాన్ని ప్రభుత్వ భూమిగా పేర్కొనాల్సి ఉంటుంది. ఇటు కలెక్టర్ కూడా రెవెన్యూ రికార్డుల్లో దాన్ని ప్రభుత్వ భూమిగా పేర్కొనాలి. ప్రస్తుతం ఉన్న వక్ఫ్ యాక్ట్ 1995 ప్రకారం.. ఆ భూమి ప్రభుత్వానిదా వక్ఫ్ బోర్డుదా అనే విషయాన్ని తేల్చే అధికారం కేవలం వక్ఫ్ ట్రైబ్యునల్‌కు మాత్రమే ఉండేది. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే ఆ అవకాశం ఉండదు.

2. వక్ఫ్ ఆస్తుల వివరాలను బోర్డులు తప్పనిసరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక పోర్టల్‌లో.. ఈ బిల్లు చట్టరూపం దాల్చిన ఆరు నెలల్లోగా నమోదు చేయాల్సి ఉంది.

3. ఇప్పటికే వక్ఫ్ తనదిగా ప్రకటించుకున్న వివాదాస్పద ఆస్తులపై కొత్తగా విచారణ చేయడం తప్పనిసరి. దీనివల్ల యజమానులెవరనే అంశంపై స్పష్టత వస్తుంది.

4. వక్ఫ్‌బోర్డుల పనితీరును సంస్కరించేలా వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 9, సెక్షన్ 14లను సవరించాలని, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో లింగవివక్ష తావు లేకుండా ఉండేందుకు కేంద్ర వక్ఫ్ మండలిలోను, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డుల్లోను ఇద్దరు చొప్పున ముస్లిం మహిళలు తప్పనిసరిగా ఉండాలని ప్రతిపాదించారు. బోర్డుల్లో షియా, సున్నీ, బోహ్రా, అగాఖానీ, ముస్లింల్లో ఇతర వెనుకబడిన వర్గాలవారి నుంచి కనీసం ఒక్కొక్కరికి ప్రాతినిధ్యం కల్పించాలని పేర్కొన్నారు.

5. బోహ్రాలు, అగాఖానీలకు ప్రత్యేకంగా 'బోర్డ్ ఆఫ్ ఔకాఫ్'ను ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదన చేశారు.

వక్ఫ్ అంటే? వక్ఫ్ బోర్డు అంటే?

'ది వక్ఫ్ యాక్ట్, 1995 (2013లో సవరణ)' ప్రకారం.. ఇస్లాం మతాచారాలను, సంప్రదాయాలను పాటించేవారు వరయిన గుర్తించిన ఆధ్యాత్మిక, దాతృత్వ, పవిత్ర కార్యకలాపాల నిమిత్తం తమకున్న స్థిర, చరాస్తులను శాశ్వతంగా అంకితం చేస్తే.. అలాంటి ఆస్తులను 'వక్ఫ్'గా వ్యవహరిస్తారు. వక్ఫ్‌కు బహుమవచనం 'ఔకాఫ్'. అలాంటి ఆస్తులన్నింటినీ నిర్వహించేందుకు ఏర్పాటైనవే వక్ఫ్ బోర్డులు. 1954లో నెహ్రూ ప్రభుత్వం తొలిసారిగా వక్ఫ్ చట్టాన్ని తెచ్చింది. దేశవిభజన జరిగినప్పుడు భారతదేశం నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయిన ముస్లింల ఆస్తులను వక్ఫ్ బోర్డులకు ఇచ్చింది. 1964, 1969, 1984 సంవత్సరాల్లో ఆ చట్టానికి సవరణలు చేశారు. 1995లో పీవీ నరసింహారావు హయాంలో ఆ చట్టం స్థానంలో.. వక్ఫ్ బోర్డులకు మరిన్ని అధికారాలు కట్టబెడుతూ ఒక కొత్త చట్టం తెచ్చారు. 2013లో మన్మోహన్ సింగ్ హయాంలో.. ఒక ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించే హక్కును బోర్డుకు కట్టబెడుతూ సవరణ చేశారు. కాగా.. 1995 వక్ఫ్‌చట్టం ప్రకారం ప్రతి రాష్ట్రంలోను, కేంద్రపాలిత ప్రాంతంలోనూ వక్ఫ్ బోర్డులు ఏర్పాటయ్యాయి. దేశంలో ప్రస్తుతం 30 వక్ఫ్‌బోర్డులున్నాయి. వక్ఫ్ బోర్డులకు దేశవ్యాప్తంగా 9.4 లక్షల ఎకరాల పరిధిలో 8.7 లక్షల ఆస్తులున్నాయి (2009 నాటికి వక్ఫ్ బోర్డుల ఆస్తుల దాదాపు నాలుగు లక్షలే. ఈ దశాబ్దన్నర కాలంలో రెట్టింపు అయ్యాయి). వాటన్నింటి విలువ కలిపి రూ.1.2 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. దేశంలో సాయుధ బలగాలు, రైల్వేస్ తర్వాత.. అత్యధికంగా భూమిని కలిగి ఉన్నది వక్ఫ్ బోర్డులే!

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● గురువారం 8 ఆగస్టు 2024



ఎన్ఎస్‌యూలో పార్ట్ టైం ప్రోగ్రామ్‌లు

తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎన్ఎస్‌యూ-సెంట్రల్ యూనివర్సిటీ)- పార్ట్ టైం ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఆంగ్లం, సంస్కృతం, తెలుగు మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఉదయం, సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు-అర్హత: యోగా థెరపీ అండ్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్, యోగా విజ్ఞాన ప్రోగ్రామ్‌లలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఒక్కోదానిలో 22 సీట్లను ఎన్ఎస్‌యూ అభ్యర్థులకు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లకు దేశవ్యాప్తంగా అభ్యర్థులందరూ పోటీపడవచ్చు. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 40 ఏళ్లు మించకూడదు. ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సంస్కృతం ఒక సబ్జెక్టుగా చదివినవారికి/సంస్కృతంలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. అభ్యర్థులందరూ ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. కర్మకాండలో 33, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌లో 22, వెబ్ టెక్నాలజీలో 22 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. కర్మకాండలో ప్రవేశానికి సంబంధిత డిప్లొమా; నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌కు ఆచార్య లేదా సంస్కృతంలో పీజీ పూర్తిచేసి ఉండాలి. వెబ్ టెక్నాలజీకి ఆచార్య/విద్యార్థి చదువుతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

డిప్లొమా

- ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. గరిష్ఠంగా రెండేళ్లలో పూర్తిచేయాలి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు-అర్హత: టెంపుల్ కల్చర్, యోగా స్పెషలైజేషన్‌లలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఒక్కోదానిలో 22 సీట్లను తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులకు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లకు దేశవ్యాప్తంగా అభ్యర్థులందరూ పోటీపడవచ్చు. టెంపుల్ కల్చర్‌కు ఏదేని డిగ్రీతోపాటు టెంపుల్ కల్చర్‌లో సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసినవారు లేదా ఏదేని పీజీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. యోగాకు ప్రాక్ శాస్త్రీ లేదా ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు. అభ్యర్థుల వయసు 17 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి. కర్మకాండలో 55 సీట్లు, జ్యోతిషం&వాస్తులో 22 సీట్లు ఉన్నాయి. సంబంధిత సర్టిఫికెట్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు లేదా ప్రాక్ శాస్త్రీ ఉత్తీర్ణులు, సంస్కృతం ఒక సబ్జెక్టుగా ఇంటర్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ట్రాన్స్‌లేషన్‌లో 22 సీట్లు ఉన్నాయి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు సంస్కృతంలో ప్రావీణ్యం ఉన్నవారు/ట్రాన్స్‌లేషన్‌లో సర్టిఫికెట్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 20 ఏళ్లు నిండి ఉండాలి. యోగా ప్రోగ్రామ్‌నకు ఉదయం, సాయంత్రం ఆరు నుంచి ఏడు వరకు; మిగిలినవాటికి సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది వరకు తరగతులు ఉంటాయి.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

- ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. గరిష్ఠంగా రెండేళ్లలో పూర్తిచేయవచ్చు. వారానికి మూడు రోజులు సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు తరగతులు ఉంటాయి. ఆంగ్లం, సంస్కృతం, తెలుగు మాధ్యమాల్లో బోధిస్తారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు-అర్హత: టెంపుల్ కల్చర్ ప్రోగ్రామ్‌లో 44 సీట్లు ఉన్నాయి. వీటిలో 22 సీట్లను టీటీడీ ఉద్యోగులకు ప్రత్యేకించారు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. కర్మకాండ ప్రోగ్రామ్‌లో 44 సీట్లు ఉన్నాయి. పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంస్కృతంలో పరిజ్ఞానం ఉన్నవారు అర్హులు. జ్యోతిషం, ట్రాన్స్‌లేషన్, మ్యూజిక్(ఓకల్), డ్యాన్స్(భరతనాట్యం), సితార్ ప్రోగ్రామ్‌లలో ఒక్కోదానిలో 22 సీట్లు; కమ్యూనికేటివ్ అండ్ ఫంక్షనల్ శాంస్క్రిట్‌లో 55 సీట్లు ఉన్నాయి. పదోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** www.nsktu.ac.in, nsktuadmission.samarth.edu.in

బిట్స్ పిలాని హైదరాబాద్‌లో రీసెర్చ్ ఎక్సలెన్స్ సెంటర్

బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్) హైదరాబాద్ క్యాంపస్‌లో కొత్తగా జాతీయ భద్రతకు సంబంధించిన రీసెర్చ్ ఎక్సలెన్స్ సెంటర్ ప్రారంభం అయింది. దేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం ద్వారా జాతీయ భద్రతలో స్వావలంబన సాధించే దిశగా డీఆర్‌డీవో, ఇస్రో, డీఏఐ, త్రివిధ దళాలు, పారామిలిటరీ దళాలు, పోలీస్, రక్షణ శాఖకు చెందిన సంస్థలతో కలిసి ఈ సెంటర్ క్రియాశీల పాత్ర పోషించనుంది. ఇందులో భాగంగా మూడు దశల్లో శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణ హైబ్రిడ్ విధానం(ఆన్‌లైన్/ఆఫ్‌లైన్)లో ఉంటుంది. మొదటి దశలో భాగంగా జాతీయ భద్రత విభాగంలోని వారికి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తారు. రెండో దశలో సర్వీస్ పర్సనల్స్‌కి ప్రాక్టికల్ సొల్యూషన్స్‌పై పరిశోధన కార్యక్రమాలు ఉంటాయి. మూడోదశలో భాగంగా రక్షణ, అంతరిక్ష, వ్యూహాత్మక విభాగాల్లో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తూ నూతన ఆవిష్కరణకు అవకాశం కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ జీ.సతీష్‌రెడ్డి, డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బీహెచ్‌వీఎస్.నారాయణమూర్తి, బిట్స్ పిలాని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.రాంగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌జీ రంగా వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)- బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ మెరిట్ ఆధారంగా లాంలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కాలేజీకి ఐకార్ గుర్తింపు ఉంది. మొత్తం 83 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. గ్రామీణ అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంపీసీ/ఎంబైపీసీ గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

- మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(హోం సైన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థుల కోసం పది శాతం సూపర్ న్యూమరరీ సీట్లు(ఎనిమిది సీట్లు) ప్రత్యేకించారు. గ్రామీణ అభ్యర్థులకు కేటాయించిన సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే ఒకటోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు కనీసం నాలుగేళ్లు గ్రామ పాఠశాలల్లో చదివి ఉండాలి. సంబంధిత ధ్రువపత్రాన్ని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 13
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు - 522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

రైట్ టు బి ఫర్గాటెన్ గోప్యత హక్కు!

మనసుకు అయ్యే గాయాన్ని మాన్పే శక్తి కాలానికి ఉందంటారు. అయితే ఆ గాయాన్ని పదేపదే జ్ఞప్తికి తెస్తుంటే? ఒకవేళ చేయని నేరానికి బలైనవారిని, ఆ నేరం వారు చేయలేదని రుజువైనప్పటికీ ఒకప్పుడు నేరారోపణ చేయబడ్డాడని నిరంతరం ప్రచారం చేస్తుంటే? సదరు వ్యక్తులకు ఉన్న వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యత స్వేచ్ఛను ఉల్లంఘించినట్లు కాదా?



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఇదే అంశం ఇటీవల ఒక కేసు రూపంలో సుప్రీంకోర్టు ముందుకు వచ్చింది. గతంలో లైంగికదాడి, మోసం కేసులో ఒక వ్యక్తిని దిగువ కోర్టు నేరస్థునిగా పేర్కొంటూ తీర్పునిచ్చింది. అయితే తదనంతర కాలంలో అతన్ని ఎగువకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. కానీ లీగల్ సెర్చ్ పోర్టల్ 'ఇండియన్ ఖానూన్'లో దిగువకోర్టు ఇచ్చిన తీర్పు వివరాలు ప్రకటితమవుతుండటంతో సదరు వ్యక్తి దరఖాస్తు చేసుకున్న విదేశీ పౌరసత్వ అప్పీలును తిరస్కరించారు. ఈ ప్రకారం అతడు చేయని నేరానికి మళ్లీ మళ్లీ శిక్షించబడుతున్నట్లే. అదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఆ వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించి రైట్ టు బి ఫర్గాటెన్(మరచిపోవు హక్కు)ను అభ్యర్థించాడు. ఇండియన్ ఖానూన్ పోర్టల్ నుంచి తనకు సంబంధించిన తప్పుడు సమాచారాన్ని తొలగించమని ఆదేశించాల్సిందిగా కోరాడు. ఈ నేపథ్యంలో మద్రాసు హైకోర్టు ఇండియన్ ఖానూన్ సంస్థను సదరు వ్యక్తికి సంబంధించిన సమాచారాన్ని తొలగించమని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. ఇండియన్ ఖానూన్ పోర్టల్ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది.

ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అధ్యక్షతన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ కేసును విచారణకు స్వీకరించడంతో 'రైట్ టు బి ఫర్గాటెన్' అనే హక్కుకు సంబంధించి కొన్ని నిర్ధారణలు వెలువడనున్నాయి. అసలు రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కు అవుతుందా? ఒకవేళ అయితే, అది రాజ్యాంగం ప్రసాదించిన ఇతర ప్రాథమిక హక్కులతో ఏవిధమైన సంబంధం కలిగి ఉంటుంది? అనే అంశాలను దేశ అత్యున్నత న్యాయస్థానం పరిశీలించనుంది.

ఈ తరుణంలో అసలు 'రైట్ టు బి ఫర్గాటెన్' అంటే ఏమిటి? ఎవరికి వర్తిస్తుంది? భారతదేశంలో దానికి గల చట్ట, న్యాయపరమైన పునాదులేవి? సదరు హక్కు లాభ - నష్టాలేమిటి? అనే అంశాలను పరిశీలిద్దాం.

● 'రైట్ టు బి ఫర్గాటెన్' అంటే?

అనవసరమైన లేదా అసందర్భమైన తన వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగ సామాజిక వేదికల నుంచి అంటే ఇంటర్నెట్, సెర్చ్ ఇంజన్లు, డేటాబేస్‌లు, వెబ్‌సైట్లు, ఇతరత్రా ఏదైనా సమాచార మాధ్యమాల నుంచి తీసివేయించడానికి ఒక వ్యక్తికి గల హక్కునే రైట్ టు బి ఫర్గాటెన్ లేదా రైట్ టు బి ఎరేజర్ అంటారు.

ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని ఎటువంటి ఆవశ్యకత, చట్టపర అవసరం లేనప్పటికీ, అందరికీ బహిరంగంగా ఆ సమాచారాన్ని అందుబాటులో ఉంచి, అతని గోప్యతా హక్కును ఉల్లంఘించినప్పుడు ఒక వ్యక్తి రైట్ టు బి ఫర్గాటెన్(రీ) ఎరేజర్‌ను ఆశ్రయించే వీలుంది.

భారతదేశంలో ఈ హక్కుకు ఇతిమిద్ధ రూపం లేనప్పటికీ, యురోపియన్ యూనియన్ దేశాల్లో వారు తీసుకువచ్చిన 'జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్(జీడీపీఆర్)' ఈ హక్కును యూరప్ ప్రజలకు అందిస్తోంది. అయితే భారతదేశంలో కూడా కొన్ని కోర్టు తీర్పుల్లో, హక్కుల్లో, చట్టాలు, బిల్లుల్లో ఈ హక్కు ప్రతిఫలిస్తోంది.

● భారతదేశంలో ప్రస్తావనలు

రైట్ టు బి ఫర్గాటెన్ అనే హక్కును, భారత రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కుల్లోని, జీవించే హక్కు(ప్రకరణ 21)లో అంతర్భాగమైన గోప్యతాహక్కు పరిధిలోకి వచ్చే అంశంగా 'కె.ఎస్.పుట్టస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసు (2017) తీర్పులో ప్రస్తావించింది. అంతేకాక కొన్ని హైకోర్టులు(ఢిల్లీ, కర్ణాటక) కూడా వివిధ కేసుల్లో ఇంచుమించు ఇదేవిధమైన తీర్పులు ఇచ్చి ఉన్నప్పటికీ, సుప్రీంకోర్టు కె.ఎస్.పుట్టస్వామి కేసు తీర్పులో ఇచ్చిన ప్రాథమిక నియమావళి రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక ప్రాతిపదికను ఏర్పర్చింది. న్యాయవ్యవస్థకు ఒక మార్గదర్శనం చేసింది.

ఇక చట్టాలపరంగా తీసుకుంటే 'డిజిటల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ (2023)'లో రైట్ టు బి ఫర్గాటెన్‌కు ఒక చట్ట ప్రాతిపదిక కనిపిస్తుంది. వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని డిజిటల్ స్పేస్‌లో వారు నియంత్రించుకోగల సౌలభ్య అంశం ఈ చట్టంలో ఉంది. ఏ వ్యక్తి గురించిన వ్యక్తిగత సమాచారం డిజిటల్ స్పేస్‌లో అతడి/ఆమె వ్యక్తిగత గోప్యతకు, ప్రతిష్ఠకు, భద్రతకు నష్టం కలిగించేదిగా ఉన్నప్పుడు దానిని తొలగించమని డేటా నిర్వాహకులను కోరవచ్చు. వారు తొలగించని పక్షంలో రెగ్యులేటరీ అథారిటీ(లేదా) న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. అంతేకాక ప్రతిపాదిత పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు (2019)లో కూడా రైట్ టు బి ఫర్గాటెన్ గురించిన ప్రతిపాదన ఉంది.

● పరిమితులు

సుప్రీంకోర్టు నిర్దేశనల ప్రకారం, ఒక వ్యక్తి వ్యక్తిగత సమాచారం ఎటువంటి చట్టపరమైన ఆవశ్యకతను కలిగి లేనప్పుడు, అవసరత, సంబంధం కానీ ఇతరత్రా లేనప్పుడు, అసత్యమైనప్పుడు దానిని తొలగించుకునే హక్కు ను సదరు వ్యక్తి పొందుతాడు.

అయితే భావవ్యక్తీకరణ హక్కుతో ముడిపడినప్పుడు, చట్టపరమైన అవసరాలు గల సమాచారమైనప్పుడు, ప్రజా ప్రయోజనాల సంబంధితమైనప్పుడు రైట్ టు బి ఫర్గాటెన్ వర్తించదని కూడా విస్పష్టం చేయడం జరిగింది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

లాభ-నష్టాలు

ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించినట్లు రైట్ టు ప్రైవసీ(గోప్యతా హక్కు) అనేది రైట్ టు ఇన్ఫర్మేషన్(సమాచార హక్కు)తో సమన్వయం కావాలి. జ్యుడీషియల్ రికార్డుల్లో పారదర్శకత ఉండాలి. అయితే ఇలాంటి సమన్వయం, పారదర్శకత సాధించడం కత్తి మీద సామే. కానీ వ్యక్తి శ్రేయస్సు దృష్ట్యా రైట్ టు బి ఫర్గాటెన్ ఎంత ఆవశ్యకమో, సమాచార స్వేచ్ఛ కూడా అంతే అవసరమనే వాద ప్రతివాదనలు కొన్ని లాభ-నష్టాలను బేరీజు వేస్తున్నాయి.

లాభాలు


- ★ నిరపరాధులు తమ గౌరవాన్ని కాపాడుకోవడానికి వీలవుతుంది.
- ★ సమాచారం తీవ్రంగా దుర్వినియోగం అవుతూ, అసత్యాలు, పాక్షిక సత్యాలు (ఉదా: ఫేక్ న్యూస్, రివేంజ్ పోర్న్, మార్ఫ్‌డ్ కంటెంట్) ప్రచారమవుతున్న నేటి డిజిటల్ యుగంలో రైట్ టు బి ఫర్గాటెన్ వంటి హక్కులు వ్యక్తి గౌరవాన్ని, గోప్యతను, ప్రతిష్ఠను రక్షిస్తాయి.
- ★ వ్యక్తిగత భద్రత, స్వేచ్ఛపరంగా అనవసర సమాచారం అందరికీ సులువుగా అందుబాటులో లేకుండా, మోసాలు, ఐడెంటిటీ తెఫ్ట్ వంటి వాటికి గురవకుండా రక్షణ లభిస్తుంది.
- ★ తమ వ్యక్తిగత అంశాలకు సంబంధించి నిజాలు, తాజా పరిణామాలు వ్యక్తులు ప్రకటించడానికి, తద్వారా వారి భావప్రకటన స్వేచ్ఛ పరిరక్షించడానికి, వ్యక్తిగత నష్టాలు నివారించడానికి, ప్రజలు తప్పుడు వార్తలతో ప్రభావం కాకుండా ఉండటానికి కూడా అవకాశం ఉంటుంది.

నష్టాలు

- ★ రైట్ టు బి ఫర్గాటెన్ ఒక ప్రాథమిక హక్కుగా లభిస్తు, తరచూ మరికొన్ని చట్టబద్ధ/ ప్రాథమిక హక్కులైన సమాచార హక్కు, భావప్రకటన స్వేచ్ఛ, పరిశోధన, పాత్రికేయ స్వేచ్ఛలతో సంఘర్షణ ఏర్పడుతుంది.
- ★ సాంకేతికంగా డిజిటల్ సంస్థలకు ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. భారీఎత్తున సమాచారం నిరంతరం తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడి ప్రత్యేక యంత్రాంగం, సాంకేతికతల ఆవశ్యకత ఏర్పడుతుంది.
- ★ సెర్చ్ ఇంజన్లు ఇచ్చే సమాచారం విపరీతంగా కుంచించబడుతుంది. ఒక అంశంతో అనేక ఉప అంశాలు ముడిపడి ఉన్నప్పుడు వ్యక్తిగత స్వేచ్ఛ/ రైట్ టు బి ఫర్గాటెన్ హక్కు కారణంగా అవి తొలగించాల్సి వస్తే సమాచారం అతుకుల బొంతగా తయారవుతుంది. సమాచారంలో నిరాటంకత లోపిస్తుంది.
- ★ బ్లాక్‌చైన్ టెక్నాలజీ వంటి అనేక అధునాతన సాంకేతికతల నేపథ్యంలో సమాచారాన్ని పూర్తిగా తొలగించడం, పునరావృతం కాకుండా చూడటం దుర్లభం.

ఇలాంటి వాదోపవాదాల/ లాభ-నష్టాల నేపథ్యంలో ప్రస్తుతం రైట్ టు బి ఫర్గాటెన్ అనేది ప్రాథమిక హక్కుల పరిధిలోకి వస్తుందా? ఒక హక్కుగా స్థిరీకరించి ప్రజలకు అందుతుందా అనే అంశాలతోపాటు ఇతర ప్రాథమిక హక్కుల పరిధిలోకి వెళ్లి సంఘర్షణ ఏర్పడినప్పుడు ఏమి చేయాలనే అంశాలు సుప్రీంకోర్టు పరిశీలనార్థం ఉన్న ఇండియన్ ఖానూన్ కేసు సముఖంగా తేలాల్సిందే. అయితే ప్రాథమిక హక్కుల పరిధి పెరుగుతున్న కొద్దీ వాటి మధ్య సంఘర్షణల విస్తృతి కూడా పెరుగుతుండటం గమనార్హం. ఇలాంటి సంఘర్షణలు నివారించాలంటే ప్రత్యేక చట్టాలు పట్టాలకెక్కాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.


లిటిల్స్




ప్రతిఫలాపేక్ష

ఒక రాజ్యంలో వేదమిత్రుడనే కవి ఉండేవాడు. అతను గొప్ప కవిత్వం రాసేవాడు, మంచి పండితుడు కూడా, కానీ అతను చాలా పేదవాడు. ఒకరోజు భట్టు అనే అతని స్నేహితుడు 'వేద మిత్రా.. నీ కవిత్వం అద్భుతంగా ఉంది. నువ్వు దీన్ని ఈ దేశపు రాజు గారికి వినిపిస్తే, నీకు పేదరికం అన్న మాటే తెలియదు' అన్నాడు. ఆ మాటలు విన్న వేద మిత్రుడు రాజుగారిని దర్శనం చేసుకుని, తన కవిత్వం వినిపించాడు. దానికి రాజుగారు మెచ్చి ఎన్నో బహుమానాలు ఇవ్వడమే కాకుండా, తన ఆస్థానంలో ఉద్యోగం కూడా ఇచ్చాడు. అలా కొన్నాళ్లు గడిచిన తర్వాత తనకు రాజాశ్రయం కోరమని సలహా ఇచ్చిన భట్టును కలిసి వేద మిత్రుడు ఇలా అన్నాడు 'మిత్రమా.. నేను రాజుగారి కొలువులో చేరిన తర్వాత ఇంతకుముందులాగా కవిత్వం రాయలేక పోతున్నాను అంటున్నారు. నాకు కూడా అలాగే అనిపిస్తోంది. ఎందుకంటావు? అని అడిగాడు. దానికి భట్టు 'వేద మిత్రా.. రాజు గారి వద్ద ఉద్యోగం రాక ముందు నువ్వు విలువైన బహుమానాలు కోసం లేదా ఒకరి మెప్పు కోసం కవిత్వం రాయలేదు. నీ కవిత్వాన్ని సరస్వతీ దేవిని ధ్యానించి దేవికి పూజలాగా భావించి రాశావు. కానీ ఇప్పుడు నీ దృష్టి అంతా ఎలాంటి కవిత్వం రాస్తే రాజుగారు ఎంత గొప్ప బహుమానాలు ఇస్తారా అనే దాని మీదే ఉంది. చేసే పని నిరంతరం ప్రతిఫలం ఆశించి చేస్తూ ఉంటే దాని నాణ్యత తగ్గిపోతుంది' అని చెప్పాడు. ఆ తర్వాత కొద్ది రోజులకే వేద మిత్రుడు మరలా మునుపటిలాగా సరస్వతీ దేవిని ధ్యానిస్తూ మంచి కవిత్వం రాశాడు.

సరైన నీడ ఏది?



10 తేడాలను కనుక్కోండి



ఎన్ని ఆవులు, ఎద్దులు ఉన్నాయి?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 378

			5		
6				3	
	2			4	1
1	6			2	
	5				4
		6			

సుడోకు - 377 సమాధానం

1	4	3	2
3	2	4	1
4	1	2	3
2	3	1	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.